
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 198
మంగళవారం 8-10-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



ఇంగ్లండ్‌దే పైచేయి
మహిళల టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం - 16లో



గన్స్ - స్టాక్స్!
యుద్ధాల్లో మార్కెట్ క్రాష్‌లపై ఆందోళన వద్దు... నిపుణుల అభిప్రాయం - 17లో



పరస్పర దాడులు
గాజాపై ఇజ్రాయెల్ దాడులకు ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం పశ్చిమ ఆసియా దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లింది.
- వివరాలు 6లో ▶



ఆదుకునేందుకు మేమున్నాం
తమకు అత్యంత సమీప పొరుగు దేశమైన మాల్దీవులకు ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రధాని మోదీ తెలిపారు.
- వివరాలు 6లో ▶



దారుణం చేసింది ఒక్కడే!
కోల్‌కతాలోని ఓ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై రేప్, హత్యకు పాల్పడింది ఒక్క నిందితుడేనని సీబీఐ పేర్కొంది.
- వివరాలు 6లో ▶



ఢిల్లీలో సబ్సిడీ రేటుకే..
పెరిగిన టమాటా ధరల నుంచి సామాన్యులకు ఉపశమనం కల్పిస్తూ కేంద్రం ఢిల్లీలో సబ్సిడీపై కిలో రూ. 65కే విక్రయిస్తోంది.
- వివరాలు 6లో ▶

బుల్డోజర్లకు బ్రేక్!

ఇప్పట్లో నిర్మాణాల కూల్చివేతలు వద్దని ప్రభుత్వ నిర్ణయం

- వ్యవస్థను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసుకోవడంపై హైడ్రా దృష్టి
- ఆలోగా చెరువుల సర్వే పూర్తి చేయాలని సర్కారు ఆదేశం
- సుమారు మూడు నెలల పాటు ఈ కసరత్తు కొనసాగే చాన్స్



సాక్షి, హైదరాబాద్: వరుసగా అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో కలకలం రేపిన 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పా న్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)'కు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇటీవలి పరిణామాలు, సంస్థాగత లోపా లు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభు త్వం.. కనీసం 3 నెలలపాటు కూల్చివేతల జోలికి వెళ్లవద్దని సూచించింది. దీనితో హైడ్రా తమ విభాగం అంతర్గత నిర్మాణంపై దృష్టి పెట్టనుంది. మరోవైపు హెచ్ఎండీఏ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు చెరువులు, కుంటలపై విస్తృత సర్వే చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఏర్పడటానికి ముందు నుంచే కూల్చివేతలతో..
చెరువుల ఆక్రమణల తొలగింపు కోసం హైడ్రా ఏర్పడటానికి ముందే.. జీహెచ్ఎంసీ అధీనంలో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, 'విజిలెన్స్ అండ్ డిజాస్టర్స్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం)'రూపంలో కూల్చివేతలు ప్రారంభించారు. జూన్ 27న ఫిల్మ్‌నగర్ కో-ఆపరేటివ్ సొసైటీలో తొలి ఆపరేషన్ చేపట్టారు. నార్నే గోకుల్ ఆక్రమించిన లోటస్ పాండ్‌లోని 0.16 ఎకరాలకు విముక్తి కల్పించారు. తర్వాత ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి, ఓఆర్ఆర్ వరకు పరిధిని కల్పిస్తూ జూలై 19న ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి దాదాపు 20 చోట్ల అక్రమ నిర్మాణాలను తొలగించారు. 50 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి, మిగతా 2వ పేజీలో ▶


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

ఆ ఆక్రమణలపైనే ఫోకస్

మూసీ నది గర్భంలోని నిర్మాణాలనే తొలగిస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి

- బఫర్ జోన్‌లో ఉన్న వారి జోలికి వెళ్లడం లేదు...
- మూసీ పరిరక్షణ, చెరువుల ఆక్రమణలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- గత పదేళ్లలో పూర్తిగా 44, పాక్షికంగా 127 చెరువులు కబ్జా... ఇప్పటికైనా చెరువులను కాపాడకపోతే అవి కనిపించవు... మూసీపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి
- ప్రాజెక్టుకు టెండర్లే పిలవలేదు.. రూ. లక్షన్నర కోట్ల లెక్క ఎలా వచ్చింది?...
- బాధితులకు ఎలా న్యాయం చేయాలో సలహాలు ఇవ్వండి.. రాజకీయాలు వద్దని హితవు

2లో


సోమవారం ఢిల్లీలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సులో కేంద్ర మంత్రులు అమిత్ షా, నడ్డా, నిత్యానంద్ రాయ్‌లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర రాష్ట్రాల సీఎంలు

మానవ హక్కుల్ని కాలరాశారు

ఉల్లంఘనల్లో నక్సల్స్ టాప్

- రెండేళ్లలో నక్సల్స్‌ను రూపుమాపుతాం
- పోలీసు శాఖ సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రల పనితీరు అద్భుతం
- వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

- వివరాలు 6లో

"నక్సల్స్‌తో పోరాటం తుది అంకానికి చేరుకుంది. అందరి సహకారంతో 2026 మార్చికల్లా నక్సల్స్‌ను రూపుమాపుతాం. దీంతో దశాబ్దాల సమస్యకు ముగింపు పలుకుతాం. మావోయిస్టుల ప్రభావిత గిరిజన, ఆదివాసీ ప్రాంతాలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందిస్తూనే మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై దృష్టి పెట్టినప్పుడు నక్సలిజాన్ని అడ్డుకోగలం.
- అమిత్ షా

రూ.11,713.49 కోట్లు ఇవ్వండి

- వరదల నేపథ్యంలో మౌలిక వసతుల పునరుద్ధరణకు సత్వరమే విడుదల చేయండి
- పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించండి
- ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలను తిరిగి వామపక్ష తీవ్రవాద ప్రభావిత జాబితాలో చేర్చండి... అమిత్ షాకు సీఎం రేవంత్ వినతి

2లో

న్యూస్‌రీల్

మూసీ మూటల లెక్కలు చెప్పేందుకే ఢిల్లీకి రేవంత్



మూసీ ప్రాజెక్టు మూటల లెక్కలు చెప్పేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హస్తిన పర్యటనలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పేదల గూడు చెదరగొట్టేందుకు ఢిల్లీలో తన బాస్‌లతో మంతనాలు చేస్తున్నారని మండిపడ్డారు.
- వివరాలు 2లో ▶

రుణమాఫీపై మోదీకి అబద్ధాలతో లేఖ



'పంటరుణాల మాఫీపై ప్రధాని మోదీకి వాస్తవాలు దాచి లేఖ రాయడం దేశ ప్రజలను మోసం చేయడం కాదా?'అని సీఎం రేవంత్‌రెడ్డిని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.
- వివరాలు 8లో ▶

సొత్తు సర్కార్‌ది.. సొమ్ము సొసైటీకి!



అత్యంత ఖరీదైన భూముల అక్రమాలకు జూబ్లీహిల్స్ వేదికగా మారింది. దీని వెనుక జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ కీలకపాత్ర పోషిస్తోంది. సొసైటీకి సంబంధంలేని ప్రభుత్వ భూములను కూడా తన ఖాతాలో వేసుకొని అమ్మేసుకుంటోంది.
- వివరాలు 5లో ▶

ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జున్




తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) చైర్మన్‌గా డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నియామకం ఫైలుపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతకం చేశారు.
- వివరాలు 7లో ▶

ఆ కేటాయింపుల్లో జోక్యం చేసుకోలేం


పారిశ్రామిక, ఐటీ అభివృద్ధికే ప్రభుత్వ ప్రోత్సాహకాలు

- పనులు ప్రారంభించని ఇందూ టెక్ జోన్, బ్రాహ్మణి.. స్టార్‌గేజ్, అనంత టెక్నాలజీ, జేటీ హోల్డింగ్స్‌లకు భూ కేటాయింపు రద్దు చేసి స్వాధీనం చేసుకోవాలి
- 2001–2006 మధ్య 4,156 ఎకరాల భూ కేటాయింపులు
- వేలం లేకుండా, కారు చౌకగా ఇచ్చారని 2007లో పిటిషన్
- 17 ఏళ్లకుపైగా సుదీర్ఘ విచారణ జరిపిన హైకోర్టు
- 62 కంపెనీలు, పిటిషన్ల వాదనలు విన్న ధర్మాసనం



ఎట్టకేలకు తుదితీర్పు వెల్లడించిన సీజే బెంచ్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో 2001 నుంచి 2006 మధ్య పరిశ్రమలకు జరిగిన భూ కేటాయింపుల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహా వివిధ పరిశ్రమల అభివృద్ధికే సర్కార్ రాయితీ, ప్రోత్సాహకాలు కల్పించిందని స్పష్టం చేసింది. అయితే భూ కేటాయింపు జరిగినా, ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణం, కార్యకలాపాలు ప్రారంభించని ఇందూ టెక్ జోన్, బ్రాహ్మణి, స్టార్‌గేజ్, అనంత టెక్నాలజీ, జేటీ హోల్డింగ్స్.. కంపెనీల నుంచి దాదాపు 850 ఎకరాలను నాలుగు నెలల్లోగా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుదీర్ఘ విచారణ అనంతరం సీజే ధర్మాసనం తీర్పు ఇస్తూ వాదనలను ముగించింది. ఎలాంటి టెండర్లు, ప్రకటనలు లేకుండా పలు కంపెనీలకు ప్రభుత్వం భూ కేటాయింపు జరిపిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన ఛత్రి స్వచ్ఛంద సంస్థతోపాటు మరో ఇద్దరు హైకోర్టులో 2007లో పిటిషన్ దాఖలు చేశారు. గత పదేళ్లలో జరిపిన భూ కేటాయింపులపై సమీక్ష జరిపి మార్కెట్ విలువ ప్రకారం వసూలు చేయాలని, కార్యకలాపాలు ప్రారంభించని కంపెనీల నుంచి భూమి వెనక్కి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. లీజు/అమ్మకం జరిపే ముందు టెండర్లు పిలిచిన తర్వాతే కేటాయింపులు చేసేలా ఆదేశాలు మిగతా 8వ పేజీలో ▶



3.35 లక్షల ర్యాంకుకూ ఎంబీబీఎస్ కన్వీనర్ సీటు

రెండో విడత కౌన్సెలింగ్‌లో బీసీ ఏ కేటగిరీకి చెందిన విద్యార్థికి అధిక ర్యాంకుకు ప్రైవేట్ కాలేజీలో సీటు

- ఎస్సీ కేటగిరీలోనూ గరిష్ఠంగా 3.11 లక్షల ర్యాంకుకు... జనరల్ కేటగిరీలో గరిష్ఠంగా 1.94 లక్షల ర్యాంకుకు సీటు
- రెండు విడతల కౌన్సెలింగ్‌లలో 5,653 సీట్ల కేటాయింపు
- మొదటి విడత కౌన్సెలింగ్‌తో పోలిస్తే రెండో విడత కౌన్సెలింగ్‌లో అధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీట్లు

- వివరాలు 7లో

జన్యు నియంత్రణ గుట్టువిప్పిన శోధనకు...


గ్యారీ రువ్‌కున్

వైద్య నోబెల్

మైక్రో ఆర్ఎన్ఏను కనిపెట్టిన ఇద్దరు అమెరికా శాస్త్రవేత్తలు ఆంబ్రోస్, రువ్‌కున్‌లకు సంయుక్తంగా పురస్కారం


విక్టర్ ఆంబ్రోస్

వారి పరిశోధన జన్యు నియంత్రణకు సరికొత్త సూత్రాన్నే వెలుగులోకి తెచ్చిందంటూ నోబెల్ కమిటీ ప్రశంస... కేన్సర్ చికిత్సల్లో విప్లవాత్మక మార్పులకు అవకాశం 6లో

తుది దశకు 'ఎకో టూరిజం'

ఫైనల్ డ్రాఫ్ట్‌కు ఆమోదం... సీఎం పరిశీలన తర్వాతే అమలులోకి..

వారసత్వ, సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ఎకో విలేజ్‌ల ఏర్పాటు
జీవ వైవిధ్యాన్ని కాపాడుతూనే ప్రకృతి, సహజ సంపదకు హాని కలగకుండా చర్యలు
ప్రజలు, ప్రకృతికి మధ్య ఉన్న సంబంధాలకూ ప్రాధాన్యం



సాక్షి, హైదరాబాద్: జీవ వైవిధ్యంతో అలరారుతున్న తెలంగాణను 'ఎకో టూరిజం సెంటర్'గా మలిచేలా కార్యాచరణ ప్రణాళికలు తుదిదశకు చేరుకున్నాయి. పర్యావరణ హితంగా, ప్రకృతి, సహజ సంపదకు హాని కలగకుండా చూస్తూనే, ప్రజలు, ప్రకృతికి మధ్య ఉన్న సంబంధాలు తెగిపోకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. పలు గ్రామాలను 'ఎకో విలేజ్ లుగా'తీర్చిదిద్దడంతోపాటు వారసత్వ, సాంస్కృతిక పరమైన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎక్కడికక్కడ ఆయా ఎకో టూరిజం సెంటర్లలో స్థానిక గిరిజనులు, ఇతర ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలు, వంటకాలు, ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను భాగం చేస్తూ ప్రకృతి పర్యాటకానికి తుదిమెరుగులు దిద్దుతున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఎకో టూరిజం స్పాట్లను గుర్తించి, వాటి ప్రాధాన్యం, ప్రత్యేకతలను అర్థవంతంగా చెప్పడంతోపాటు ఆన్‌లైన్‌లో పర్యాటకులను మిగతా 7వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఇంత బాగా వంట వచ్చినా పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు ఏంటో సార్!

'రీజనల్' చుట్టూ సెజ్‌లు!

రింగ్ రోడ్డును ఆదాయ వనరుగా మార్చుకునే దిశగా ప్రభుత్వ అడుగులు

- ఇందుకోసం భారీగా భూమిని సేకరించే యోచన
- ప్రస్తుతం రోడ్డు కోసమే 2,400 హెక్టార్లు అవసరం
- సెజ్‌ల కోసం మరింతగా సేకరించాల్సిన పరిస్థితి
- అలైన్‌మెంట్ మార్పు నేపథ్యంలో ప్రతిపాదనలు
- సాధ్యాసాధ్యాలపై అధికారుల అధ్యయనం



సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగ్ రోడ్డును ఆదాయ వనరుగా మార్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిని గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేగా నిర్మించనుండటంతో.. ఈ రోడ్డు ఉండే చాలా ప్రాంతాలు కొత్తరూపు సంతరించుకోనున్నాయి. అక్కడి భూములకు డిమాండ్ పెరుగుతుంది, రోడ్డు సదుపాయం వల్ల పరిశ్రమల స్థాపనకూ వీలవుతుంది. అలాంటి చోట్ల 'స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్)'లను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. తద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు మార్గం సుగమం అవుతుందని.. అదే సమయంలో సెజ్‌లలో కంపెనీలకు భూములు కేటాయించటం ద్వారా ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందని భావిస్తోంది. ఇది సాకారం కావాలంటే.. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ ఖరారయ్యే ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టాల్సి ఉండనుంది. ఈ మేరకు ల్యాండ్ పూలింగ్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిసింది.

గతంలోనే ప్రతిపాదనలున్నా..
హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల నిడివితో నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్).. నగర రూపురేఖలను మార్చేసింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనలకు అనుగుణంగా 2006లో ఓఆర్ఆర్ నిర్మాణానికి నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ శంకుస్థాపన చేశారు. ఆరేళ్ల తర్వాత దశలవారీగా అది అందుబాటులోకి వచ్చింది. ఓఆర్ఆర్‌ను ఆనుకుని ఉన్న మిగతా 7వ పేజీలో ▶

అంత భూసేకరణ సాధ్యమేనా?

రీజనల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి 2 వేల హెక్టార్ల భూమి అవసరమవుతోంది. దానికంటే దక్షిణ రింగ్ దాదాపు 50 కిలోమీటర్ల నిడివి ఎక్కువ ఉండే అవకాశం కనిపిస్తోంది. అంటే సుమారు 2,400 హెక్టార్లకుపైగా భూమి రోడ్డు నిర్మాణానికే కావాలి. ఈ భూముల సేకరణ ఎలాగన్నది చర్చనీయాంశంగా మారుతోంది. ఇప్పటికే రీజనల్ ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అలాంటిది రోడ్డు కోస మే కాకుండా అదనంగా భూమిని సేకరించడం ఎంతవరకు సాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో మల్లన్నసాగర్, ఇతర ప్రాజెక్టులకు భూములిచ్చేందుకు రైతులు ఇష్టపడక న్యాయ పోరాటం చేశారు. ఇప్పుడు రీజనల్ రింగ్ విషయంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని చర్చ జరుగుతోంది. అయితే ఇప్పుడు కాకుంటే.. రీజనల్ రోడ్డు వెంట భవిష్యత్తులో భూమిని సమీకరించడం సాధ్య మయ్యే పనికాదని.. ఇప్పుడే ముందుకెళ్తే ప్రయోజనమని అధికారవర్గాలు చెబుతు న్నాయి.



సింగరేణి బహుముఖ విస్తరణ

- గ్రీన్ ఎనర్జీ, లిథియం, ఇతర ఖనిజ రంగాలకు విస్తరణ
- సింగరేణి ప్రాంత ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు
- అత్యాధునిక వైద్య సేవల కోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు
- సింగరేణి ఉద్యోగులకు రూ.796 కోట్ల లాభాల వాటా పంపిణీలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

8లో

ఆ ఆక్రమణలపైనే ఫోకస్

మూసీ నది గర్భంలోని నిర్మాణాలనే తొలగిస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మూసీ పరిరక్షణ, చెరువుల ఆక్రమణలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

అవేమీ మా సొంత ఆస్తులు కాదు..

➤ హైదరాబాద్ నగరంలో కబ్జాకు గురైన చెరువులన్నీ సీఎం రేవంత్‌రెడ్డికో, నాకో చెందిన ఆస్తులు కాదు. అవి నగర ప్రజల ఆస్తులు. వాటిని భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఎజెండా. కబ్జాలు ఇదే రీతిన కొనసాగితే భవిష్యత్తులో చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందన్న భయంతోనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

లక్షన్నర కోట్ల లెక్క ఎక్కడిది?

➤ మూసీ నది పునరుజ్జీవనం పనులపై స్టడీ కోసం మాత్రమే టెండర్లు పిలిచాం. నది ప్రక్షాళన ప్రాజెక్టు ఇంకా మొదటి దశలోనే ఉంది. అలాంటిది మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు రూ.1.50 లక్షల కోట్లు వ్యయం అవుతుందని ఎలా నిర్ధారిస్తారు. అవాస్తవ ఆరోపణలు ఎందుకు చేస్తున్నారు.

సాక్షి, హైదరాబాద్: మూసీ నదిని పునరుజ్జీవింపజేయడానికి, చెరువులను కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని.. ప్రజలకు మేలు చేయాలన్నదే తమ ప్రభుత్వ ఎజెండా అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎవరికీ నష్టం కలిగించే పని చేయదు, చేయబోదని పేర్కొన్నారు. ప్రస్తుతం మూసీ నది గర్భం లోపలి ఆక్రమణలపైనే దృష్టి పెట్టామని.. బఫర్ జోన్ జోలికి వెళ్లడం లేదని వివరించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోతున్న వారిని గాలికి వదిలేయబోమని, బాధితులకు ఏ సాయం చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, గత పదేళ్లలో వాటి ఆక్రమణలు, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు తదితర అంశాలపై సోమవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. చెరువుల కబ్జాలకు సంబంధించిన శాటిలైట్ చిత్రాలను ప్రదర్శించారు. పలు దేశాల్లోని ముఖ్య నగరాల్లో నదులను సుందరీకరించుకున్న తీరును వివరించారు. సమావేశంలో భట్టి చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణ ఏర్పాటైన తర్వాత హైదరాబాద్ నగరంలో చెరువుల కబ్జా కొనసాగింది. పూర్తిగా 44 చెరువులు, పాక్షికంగా 127 చెరువులు కబ్జా అయ్యాయి. హైదరాబాద్ నగరం అంటేనే రాక్స్ (కొండలు), పార్క్స్, లేక్స్.. అవే భాగ్యనగరానికి చాలా శోభను తెచ్చాయి. కాలక్రమేణా కొండలు (రాక్స్) కనబడకుండా పోతున్నాయి. పార్కులు కబ్జాలకు గురవుతున్నాయి. చెరువులు కూడా కబ్జాలతో కనుమరుగు అవుతున్నాయి. భారీ వర్షాలు, వరదలతో హైదరాబాద్ నగరానికి ముప్పు ఏర్పడే పరిస్థితి వచ్చింది.

కాపాడాల్సిన బాధ్యత మాది

ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న చెరువులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని, మూసీని ప్రక్షాళన చేస్తామని గత ప్రభుత్వాలు ఘనంగా చెప్పి.. ఏమీ చేయలేకపోయాయి. ఎన్నో దేశాల్లోని ముఖ్య నగరాల్లో నదులను సుందరీకరించుకున్నారు. హైదరాబాద్‌ను కూడా తీర్చిదిద్ది ప్రపంచాన్ని ఆకర్షించేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచన. అన్యాక్రాంతం అవుతున్న చెరువులను కాపాడాల్సిన బాధ్యత సీఎం రేవంత్, నాతోపాటు అందరిపైనా ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు చెరువులు ఆక్రమణలకు గురికాకుండా కఠినంగా వ్యవహరిస్తామని చెప్పింది వాస్తవం కాదా?

బాధితులకు అండగా ఉంటాం

రాష్ట్ర ప్రభుత్వం ఎవరికీ నష్టం కలిగించే కార్యక్రమం చేయదు, చేయబోదు. ఎవరి ఇల్లూ కూల్చాలని ప్రభుత్వం అనుకోదు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఇల్లు కోల్పోతున్న వారిని గాలికి వదిలేయం. ఏ సాయం చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇళ్లు తొలగించిన బాధితులకు వేరేచోట ఇళ్లు ఇస్తున్నాం. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే బాధితులకు అక్కడే ఇల్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. గుడిసెలు వేసుకుని బతుకుతున్న వారిని కూడా మా ప్రభుత్వం ఆదుకుంటుంది. మూసీ బాధితుల ఆస్తులకు విలువ లెక్కకట్టి చెల్లిస్తాం. వారి కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు..''అని భట్టి వెల్లడించారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. పారదర్శకంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై కొందరు ప్రతిపక్ష నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం ఆలోచన ప్రజలకు మంచి చేయాలనే తప్ప మరొకటి లేదు. ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే భవిష్యత్ తరాలకు నష్టం చేసిన వారవుతారు. నిర్మాణాత్మక సూచనలు, సలహాలు ఇవ్వాలి. అందుకు మా ద్వారాలు తెరిచే ఉంటాయని అన్ని రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నాను. మేమేమీ గడీలలో లేము. త్వరలోనే అన్ని పార్టీల నాయకులకు నేనే స్వయంగా లేఖలు రాసి అభిప్రాయాలు తెలుసుకుంటా. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా ఎదగాలని ప్రతిపక్షాలకు ఉందా? లేదా? అన్నది బహిర్గతం చేయాలి. కొందరు సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు.



భట్టి ప్రజెంటేషన్‌లో చూపిన ఓ చెరువు ఆక్రమణల తీరు

ఓఆర్ఆర్ లోపల చెరువుల ఆక్రమణలపై భట్టి చెప్పిన లెక్క..

2014కు ముందు..

920 తెలంగాణ ఏర్పడే నాటికి మొత్తం చెరువులు..	**225** పూర్తిగా ఆక్రమణకు గురైన చెరువులు..
499 ఎలాంటి ఆక్రమణలు లేని చెరువులు..	**196** కొంత మేర ఆక్రమణకు గురైనవి..


2014 నుంచి 2023 వరకు..

20 ముందు ఎలాంటి ఆక్రమణలు లేకుండా ఈ పదేళ్లలోనే పూర్తిగా ఆక్రమణకు గురైనవి..	**24** గతంలో పాక్షికంగా ఆక్రమణకు గురై, ఈ పదేళ్లలో పూర్తిగా మాయమైనవి..
127 గతంలో పాక్షికంగా ఆక్రమణకు గురై, మరింత ఆక్రమణలు పెరిగినవి	

క్లుప్తంగా...

నాగార్జున పరువు నష్టం కేసు విచారణ

నేడు నాగ్, సాక్షుల స్టేట్‌మెంట్ల నమోదు



సిటీ కోర్టులు (హైదరాబాద్): మంత్రి కొండా సురేఖపై సినీ హీరో నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ నాంపల్లి కోర్టులో జరిగింది. హీరో నాగచైతన్య – సమంత విడాకుల అంశంపై మంత్రి కొండా సురేఖ చేసిన అసంబద్ధ వ్యాఖ్యలతో తమ కుటుంబ పరువు పోయిందని ఆమెపై హీరో నాగార్జున పరువు నష్టం కేసు దాఖలు చేయడం తెలిసిందే. కేసు విచారణ సోమవారం నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టులో జరిగింది. నాగార్జున తరఫున న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు వినిపించారు. నాగార్జునతో పాటు సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేయాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మంత్రి కొండా సురేఖ తరఫున టీపీసీసీ లీగల్ సెల్ న్యాయవాది తిరుపతి వర్మ హాజరయ్యారు. దీనిపై విచారణ చేపట్టిన జడ్జి ఎస్.శ్రీదేవి.. పిటిషనర్ నాగార్జునతో పాటు సాక్షుల వాంగ్మూలాల నమోదుకు వారిని కోర్టులో హాజరుపరచాలని పేర్కొంటూ విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

ఢిల్లీకి మూటలు పంపడంలో రేవంత్ బిజీ: బాల్క సుమన్



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగుల నోట్లో కాంగ్రెస్ ప్రభుత్వం మట్టికొడుతోందని, ఢిల్లీకి మూటలు పంపడంలో సీఎం రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. సీఎం అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో సోమవారం బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామనే ప్రకటన హామీలకు పరిమితమైందన్నారు. నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన బాలికలకు ఎలక్ట్రిక్ స్కూటీలు, జాబ్ క్యాలెండర్ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని చెప్పారు. రైతులందరికీ రుణమాఫీ జరిగినట్లు రేవంత్ అబద్ధాలు ఆడుతున్నాడని ఆరోపించారు.

అధికారంలో ఉన్నప్పుడు బాల్క సుమన్ ప్రశ్నించలేదేం?

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ యువత ఓడించి ఇంట్లో కూర్చోబెట్టినా బీఆర్ఎస్ నేతలకు సిగ్గు రాలేదని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. ఉద్యోగాలు భర్తీ చేయనందునే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులు కేసీఆర్‌పై తిరుగుబాటు చేశారని అన్నారు. సోమవారం సీఎల్పీ మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అధికారంలో ఉన్న పదేళ్ల పాటు ఉద్యోగాల గురించి ప్రశ్నించని బాల్క సుమన్ ఇప్పుడు కేసీఆర్, కేటీఆర్‌లు రాసిచ్చిన అబద్ధాల స్క్రిప్టును చదువుతున్నాడని, సీఎం రేవంత్‌ను విమర్శిస్తున్నారని అన్నారు. సీఎంపై సుమన్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే బడితె పూజ ఖాయమని చెప్పారు.

చర్చకు సిద్ధమా సుమన్?: చనగాని

ఏ ప్రభుత్వ హయాంలో ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో చర్చించేందుకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సిద్ధమేనా అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ప్రశ్నించారు. పదేళ్ల పాటు తెలంగాణ యువతను మోసం చేసిన బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ప్రశ్నించే అర్హత లేదని అన్నారు. బీఆర్ఎస్ నేతలు చెప్పే పిట్టకథలను నిరుద్యోగులు నమ్మరని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.

బుల్డోజర్లకు బ్రేక్!

▶ మొదటి పేజీ తరువాయి

చెరువులను పరిరక్షించారు.

విరామానికి కారణాలెన్నో..

హైడ్రా ప్రభావంతో రాష్ట్రంలో, ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతింది. ఇళ్లు, స్థలాల క్రయవిక్రయాలు పడిపోయాయి. మరో వైపు అమీన్‌పూర్‌లో హైడ్రా కూల్చివేతల వ్యవహారంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే సమయంలో మూసీ సుందరీకరణ ప్రాజెక్టు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. నది వెంట ఇళ్ల సర్వే, ఖాళీ చేయించడం, కూల్చివేయడం వంటి చర్యలు చేపట్టింది. మూసీ ప్రాజెక్టుతో హైడ్రాకు సంబంధం లేకపోయినా.. రెండింటి కూల్చివేతలపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. ఈ కారణాల నేపథ్యంలో ప్రభుత్వం హైడ్రా కూల్చివేతలకు తాత్కాలికంగా బ్రేక్ వేసింది.

'హైడ్రా'వ్యవస్థ నిర్మాణంపై ఫోకస్

కనీసం మూడు నెలల పాటు హైడ్రా ఆపరేషన్లు నిలిపివేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ సమయంలో హైడ్రాకు సంబంధించిన పలు అంశాలను చక్కదిద్దనున్నట్టు సమాచారం. ప్రస్తుతం హైడ్రాకు పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. ఇటీవలే వివిధ విభాగాల నుంచి 169 మందిని డిప్యూటేషన్‌పై నియమించారు. కానీ పోలీసు విభాగం నుంచి వచ్చిన 20 మంది మినహా మరే ఇతర విభాగాల సిబ్బంది హైడ్రా విధుల్లో చేరలేదు. మరోవైపు హైడ్రాలో చేరేందుకు ఆసక్తి చూపుతూ కొందరు ఉద్యోగులు దరఖాస్తు పెట్టుకున్నారు. అయితే వారిని రిలీవ్ చేయడానికి పలువురు శాఖాధిపతులు విముఖత చూపుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం హైడ్రా వినియోగిస్తున్న కార్యాలయంతోపాటు సిబ్బందిలో దాదాపు అంతా జీహెచ్‌ఎంసీకి సంబంధించిన వారే. ఈ విషయంలో అటు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు, ఇటు హైడ్రాకు మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి సంస్థాగత అంశాలు, సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టనున్నారు.

జల వనరుల 'లెక్క'తేల్చేలా..

జల వనరుల పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా హైడ్రాను ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం చెబుతోంది. తొలిదశలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలకు సంబంధించిన ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)లో ఉన్న ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ చేపట్టడానికి ముందు ఆయా చెరువులు, వాటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నోటిఫై చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తికాకపోవడాన్ని ఇటీవల న్యాయస్థానం సైతం ప్రశ్నించింది. దీనికోసం రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాలతోపాటు హెచ్‌ఎండీఏ ఉమ్మడిగా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. తొలుత ప్రాథమిక, ఆపై తుది నోటిఫికేషన్లు జారీ చేయాలి. హెచ్‌ఎండీఏ లెక్కల ప్రకారం హైదరాబాద్‌తోపాటు శివారు జిల్లాల్లో కలిపి 2,688 జలవనరులు ఉన్నాయి. వీటిలో 2,364 ప్రిలిమినరీ నోటిఫికేషన్ స్థితి దాటగా, 324 మాత్రమే తుది నోటిఫికేషన్ దాకా వెళ్లాయి. 95 చెరువులకు హైడ్రా ఏర్పడిన తర్వాతే ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ క్రమంలో వచ్చే మూడు నెలల్లో అన్ని చెరువుల సర్వే పూర్తి చేసి, తుది నోటిఫికేషన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మూసీ లెక్కలు చెప్పేందుకే ఢిల్లీకి రేవంత్: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: మూసీ ప్రాజెక్టు మూటల లెక్కలు చెప్పేందుకే సీఎం రేవంత్‌రెడ్డి హస్తిన పర్యటనలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పేదల గూడు చెదరగొట్టేందుకు ఢిల్లీలో తన బాస్‌లతో మంతనాలు చేస్తున్నారని మండిపడ్డారు. పదినెలల పాలనలో 23మార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రాష్ట్రానికి తెచ్చిన నిధులు, చేసిన మేలు ఏమిటో చెప్పాలన్నారు. ఈ మేరకు సోమవారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. అత్యధిక పర్యాయాలు ఢిల్లీకి వెళ్లిన సీఎంగా రేవంత్ రికార్డు సృష్టిస్తున్నారని అన్నారు.

సీటు కాపాడుకునేందుకే: అధిష్టానం మెప్పు కోసం తరచూ ఢిల్లీకి వెళుతున్న సీఎం రేవంత్ తన బాస్‌లకు జై కొట్టి సీటును కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నాడని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ పాలనపై కాంగ్రెస్ అధిష్టానం సంతృప్తిగా లేనందునే పదేపదే ఢిల్లీకి పిలిచి ఆయనకు చివాట్లు పెడుతోందన్నారు. సీఎం ఢిల్లీ పర్యటన తీరు చూస్తే ఐదేళ్లలో ఆయన 125 మార్లు ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే ఢిల్లీకి గులాంగిరీ తప్పదని గతంలో తాము చెప్పిందే వాస్తవమవుతోందన్నారు.

నిధులు తెస్తానంటూ మోసగిస్తున్నాడు: కేంద్రంలోని పెద్దలను ఒప్పించి రాష్ట్రానికి నిధులు తెస్తానంటూ నమ్మబలుకుతున్న రేవంత్ ఇప్పటి వరకు రాష్ట్రానికి తెచ్చిన నిధుల లెక్క తేల్చాలన్నారు. కేంద్ర బడ్జెట్‌తోపాటు ఇటీవల వరద సాయంలో తెలంగాణకు కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని చెప్పారు.

2008 బీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కమిషనర్‌కు టీఎస్‌టీటీఎఫ్ వినతి

సాక్షి, హైదరాబాద్: జీవో 28 వల్ల నష్టపోయిన డీఎస్సీ- 2008, బీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని టీఎస్‌టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ విద్యాశాఖను డిమాండ్ చేశారు. బాధిత అభ్యర్థులతో కలిసి ఆయన సోమవారం పాఠశాల విద్య కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డిని కలిసి సమస్య వివరించారు. ఉమ్మడి ఖమ్మం సహా పలు జిల్లాల్లో డీఈవోలో ప్రకటించిన డీఎస్సీ 2008 జాబితాలో జీఓ 161 ప్రకారం డ్యూయల్ పోస్టులో ఎంపికైన రెగ్యులర్ టీచర్ ఉద్యోగం చేస్తున్న వారి పేర్లను తొలగించకుండ పాత జాబితానే ప్రకటించారని కమిషనర్ దృష్టికి తెచ్చారు.

రూ.11,713.49 కోట్లు ఇవ్వండి

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతు పనులకు రూ.11,713.49 కోట్ల నిధులు సత్వరమే విడుదల చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో సీఎం సోమవారం భేటీ అయ్యారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలు తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపాయని సీఎం తెలిపారు. మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతు పనులను తాము వెంటనే చేపట్టామని వివరించారు. ఆయా పనులకు తక్షణమే రూ.5,438 కోట్లు విడుదల చేయాలని సెప్టెంబరు రెండో తేదీన తాను లేఖ రాసిన విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ గుర్తు చేశారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఎస్‌డీఆర్‌ఎఫ్ మొదటి, రెండో విడతల కింద తెలంగాణకు రూ.416.80 కోట్లను కేంద్రం విడుదల చేసిందని సీఎం కేంద్రమంత్రికి తెలిపారు. పునరుద్ధరణ, మరమ్మతు పనులకు విడుదల చేసే నిధులను గతంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ పనులకు సంబంధించిన నిధులు ఉపయోగానికి ముడిపెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు సంబంధించిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరంలోనే వ్యయం చేస్తామని అమిత్‌షాకు రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఆ మూడు జిల్లాలను ఎల్‌డబ్ల్యూఈలో కొనసాగించాలి

ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలను ఎల్‌డబ్ల్యూఈ(వామపక్ష తీవ్రవాద ప్రభావిత) లో తిరిగి చేర్చాలని అమిత్ షాను రేవంత్ కోరారు. అంతర్గత భద్రతను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామాల్లో సీఆర్పీఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా రిక్రూట్ అయిన పోలీసు సిబ్బందికి గ్రేహౌండ్స్ ద్వారా తీవ్రవాద వ్యతిరేక వ్యూహాల్లో (ఏఈటీ) శిక్షణ ఇస్తున్నామని, 2024–25 సంవత్సరంలో ఈ రకమైన శిక్షణకు అదనపు బడ్జెట్ రూ.25.59 కోట్లు అవసరమని, ఆ మొత్తాన్ని విడుదల చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.

➤ పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని అమిత్‌షాను రేవంత్ కోరారు. ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, షెడ్యూల్ పరిధిలోని సంస్థల వివాదం సామరస్య పూర్వక పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పునర్విభజన చట్టంలో ఎక్కడా పేర్కొని ఆస్తులు, సంస్థలను ఏపీ క్లెయిమ్ చేసుకుంటున్నందున, వాటిలో తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

➤ రాష్ట్ర పునర్విభజన సమయంలో తెలంగాణకు కేవలం 76 మంది ఐపీఎస్ అధికారులను మాత్రమే కేటాయించారని, అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



సోమవారం ఢిల్లీలో హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చండి

కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్‌ను (సీఎస్ఎంపీ) అమృత్ 2.0లో చేర్చాలని లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అమిత్‌షాతో భేటీ అనంతరం సీఎం కేంద్రమంత్రి ఖట్టర్‌ను కలిశారు. హైదరాబాద్‌లో పురాతన మురుగుశుద్ధి వ్యవస్థనే ఉందని, అది ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా లేదని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. నగరంతో పాటు సమీప మున్సిపాలిటీల్లో 100 శాతం ద్రవ వ్యర్థాల శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని రేవంత్..ఖట్టర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తోపాటు సమీప 27 పురపాలక సంఘాలతో కలిపి 7,444 కి.మీ.మేర రూ.17,212.69 కోట్లతో సీఎస్ఎంపీకి డీపీఆర్ రూపొందించినట్లు ఖట్టర్‌కు సీఎం తెలిపారు. ఆ డీపీఆర్‌ను కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ అందజేశారు.

- మురుగు మూసీలో చేరకుండా ఉండేందుకు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో డీపీఆర్ రూపొందించామంటూ దానిని ఖట్టర్‌కు రేవంత్ సమర్పించారు.

మెట్రో రెండో దశకు మద్దతు ఇవ్వండి: హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి డీపీఆర్‌లు పూర్తయినట్టు ఖట్టర్‌కు సీఎం రేవంత్ తెలిపారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 వ్యయం అవుతుందని అంచనా వేశామని, దీనిని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం 50:50 రేషియోలో జాయింట్ వెంచర్‌గా చేపట్టాలని భావిస్తున్నట్టు సీఎం తెలిపారు. సీఎం వెంట ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్, వంశీకృష్ణ, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

45 ఏళ్ల డేటాతో ఎఫ్‌టీఎల్ లెక్క

గరిష్టంగా జలాలు విస్తరించే ప్రాంతాన్నీ తేల్చేందుకు ఏర్పాట్లు

ఇందుకోసం ఎన్ఆర్ఎస్‌సీ సహా వివిధ ఏజెన్సీల నుంచి డేటా సేకరణ

లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు

భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా పకడ్బందీ చర్యలు

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో చెరువులకు సంబంధించిన పూర్తిస్థాయి నీటి నిల్వ మట్టం (ఫుల్ ట్యాంక్ లెవల్ -ఎఫ్‌టీఎల్)ను గుర్తించడంతోపాటు గరిష్టంగా జలాలు విస్తరించే ప్రాంతం (మాగ్జిమమ్ వాటర్ స్ప్రెడ్ ఏరియా-ఎండబ్ల్యూఎస్ఏ)ను తేల్చడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం 'లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ)'శాస్త్రీయ విధానాన్ని అనుసరించేందుకు సిద్ధమైంది. ఎల్‌పీసీ చైర్మన్‌గా ఉన్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో దీనిపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నీటిపారుదల, రెవెన్యూ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్‌సీ), స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, సర్వే ఆఫ్ ఇండియా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఎన్ని చెరువులు ఉన్నాయి? ఎంత మేర ఆక్రమణలకు గురయ్యాయనే లెక్కలను శాస్త్రీయంగా తేల్చాలని రంగనాథ్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఆయా చెరువులకు గతంలో నిర్ధారించిన ఎఫ్‌టీఎల్ పక్కాగా లేకున్నా, సహేతుకమైన అభ్యంతరాలు వ్యక్తమైనా.. సమీక్షించి, సవరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల ఆక్రమణలపై 2018లో కాగ్ ఇచ్చిన నివేదికను పరిశీలించాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు రంగనాథ్ స్పష్టం చేశారు.

45 ఏళ్ల లెక్కలను తీసుకుని..

ఇక చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, వాటర్ స్ప్రెడ్ ఏరియాను గుర్తించడానికి 45 ఏళ్ల కాలాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. 1979 నుంచి ఆయా జల వనరులకు సంబంధించిన విలేజ్ మ్యాప్స్, భూ వినియోగం సర్వే నంబర్లతో సహా సమాచారం ఇచ్చే కాడాస్ట్రల్ మ్యాప్‌లను క్రోడీకరించి ఖరారు చేయనున్నారు. హిమాయత్‌సాగర్‌లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల గుర్తింపుతో ఈ విధానం ప్రారంభించి మిగతా వాటికీ వర్తింపజేయనున్నారు.



గట్టి నిఘా పెట్టేలా చర్యలు

చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, ప్రజావసరాలకు నిర్దేశించిన ప్రాంతాలు ఆక్రమణలకు గురికాకుండా నిరంతరం నిఘా పెట్టేందుకు హైడ్రా చర్యలు తీసుకోనుంది. ఆయా ప్రాంతాలను జియో ఫెన్సింగ్, ట్యాగింగ్ చేయడంతో పాటు ప్రత్యేక యాప్‌ను వినియోగంలోకి తీసుకురానున్నారు. దీని ద్వారా ఎక్కడ, ఎలాంటి ఆక్రమణలు జరుగుతున్నా తక్షణమే ఆ సమాచారం హైడ్రాకు చేరేలా ఏర్పాటు చేస్తున్నారు. ఈ యాప్ ద్వారానే ప్రజలు సమాచారం తెలుసుకోవడంతో పాటు ఫిర్యాదు చేయడానికీ ఆస్కారం ఏర్పడుతుంది. క్షేత్రస్థాయిలో అధికారులు చేపట్టే పరిశీలనలు, వాటి ఫలితాలతోపాటు తీసుకున్న చర్యలను ఇందులో నమోదు చేస్తారు. ఆక్రమణలకు గురైన చెరువులను పరిరక్షించడమే కాకుండా, పూర్వవైభవం తీసుకురావడంపైనా హైడ్రా అధికారులు దృష్టి పెడుతున్నారు. కూల్చివేతలకు సంబంధించిన వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తొలి విడతగా సున్నం చెరువు, అప్పా చెరువు, ఎర్రకుంట, కూకట్‌పల్లి నల్లచెరువుతో ఈ పనులు ప్రారంభించాలని కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. చెరువుల పరిరక్షణ కోసం ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రైతుల్లో అసంతృప్తి ఉంటే మాకు తెలిసేది కదా?

మేం నిత్యం వారిమధ్యే తిరుగుతున్నాం.. రైతు రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం

రుణమాఫీ పూర్తి కాగానే రైతు భరోసా ఇస్తాం: మంత్రి తుమ్మల

గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి హాజరు

సాక్షి, హైదరాబాద్: తాము నిత్యం రైతుల మధ్యలోనే తిరుగుతున్నామని, రుణమాఫీ గురించి ప్రభుత్వంపై రైతుల్లో అసంతృప్తి ఉంటే.. ఆ సెగ తమకు తగిలేది కదా? అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశంలో ఇంత పెద్ద ఎత్తున రైతు రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఎక్కడైనా ఉంటే చూపించాలని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన గాంధీ భవన్‌లో జరిగిన 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముందు, ఆ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం పోయిన బాధ ఓ పార్టీకి ఉంటే, అధికారంలోకి రావాలనే బాధ మరో పార్టీకి ఉందని ఎద్దేవా చేశారు. 'తెలంగాణలో జరిగిన రైతు రుణమాఫీ ప్రధాని మోదీకి కనిపించడం లేదా? రూ.18 వేల కోట్ల మేర మాఫీ చేసిన విషయం రాష్ట్రంలోని బీజేపీ నేతలకు కనిపించడం లేదా? బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ చేశారా?'అని తుమ్మల ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ కావాలనే విష ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఇప్పటివరకు 22 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామని, మరో 20 లక్షల మందికి చేయాల్సి ఉందని, వారికి కూడా మాఫీ చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాగానే రైతు భరోసా అందిస్తామని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఒక అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టారని, ఓ వైపు ప్రజావాణిలో ప్రభుత్వం పక్షాన ప్రజల నుంచి విజ్ఞప్తులు తీసుకుంటున్నామని, మరోవైపు పార్టీ పక్షాన కూడా గాంధీభవన్‌లో వినతులు తీసుకోవడం సంతోషించదగిన విషయమని అన్నారు. ప్రజలకు మరింత చేరువయి వారి సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.



గాంధీభవన్ లో మంత్రి తుమ్మలతో తమ సమస్యలను చెప్పుకుంటున్న ప్రజలు..

95 అర్జీల స్వీకరణ

కాగా, సోమవారం ప్రజల నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 95 అర్జీలను స్వీకరించారు. ఇందులో భూ సమస్యలు, ఉద్యోగాలు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లతో పాటు వ్యక్తిగత సమస్యలపై వినతిపత్రాలు వచ్చాయని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. తక్షణ పరిష్కారానికి వీలున్న కొన్ని సమస్యలపై వెంటనే ఆయా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి మంత్రి పరిష్కరించారని ఆ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ.వినోద్ రెడ్డి, సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



పాత స్నేహితులు ఉండటంలోని ఒక వరం ఏమిటంటే, నువ్వు వాళ్ల దగ్గర మూర్ఖుడిగా ఉన్నా చెల్లిపోతుంది.
- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
మంగళవారం, 8 అక్టోబర్ 2024

ఆకాశంలో సగానికి అన్యాయమా!


దేశం మొత్తాన్ని కుదిపేసిన 'నిర్భయ' ఉదంతం తర్వాత నాటి కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ జేఎస్ వర్మ కమిటీ వైవాహిక బంధంలో జరిగే అత్యాచారం (మారిటల్ రేప్) గురించి ప్రస్తావించి దాన్ని నేరంగా గుర్తించాలని సిఫార్సు చేసినప్పుడు 'మర్యాదస్తులు' నొచ్చుకున్నారు. ఆ చర్య వివాహ బంధాన్ని విచ్ఛిన్నం చేయదా... వారి పిల్లల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చదా అని చాలామంది ప్రశ్నించారు. ఈ అంశంపై అంతకు చాన్నాళ్ల ముందే వివిధ స్థాయిల్లో చర్చ జరుగుతూనే ఉంది. తాజాగా ఆ విషయమై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ముందు దాఖలు చేసిన అఫిడవిట్ మళ్లీ దాన్ని ఎజెండాలో తెచ్చింది. దాంపత్య జీవితంలో ఉండే లైంగిక సంబంధం పరస్పర అన్యోన్యత ఆధారంగా ఏర్పడుతుందనీ, దాన్ని కేవలం 'సమ్మతి' అనే పదంలో కుదించటం అసాధ్యమనీ అఫిడవిట్ అంటున్నది. గతంలోని భారత శిక్షాస్మృతి (ఐపీసీ) అయినా, దాని స్థానంలో అమల్లోకొచ్చిన భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) అయినా దాంపత్య జీవితంలో జరిగే అత్యాచారానికి మినహాయింపునిచ్చాయి. అత్యాచారానికి ఎలాంటి శిక్ష విధించాలో ఐపీసీ సెక్షన్ 375 నిర్దేశిస్తూ ఈ నేరానికి పాల్పడే భర్తకు మినహాయింపునిచ్చింది. బీఎన్ఎస్ఎస్‌లో ఈ సెక్షన్ 63గా మారింది. మినహాయింపు కూడా యథాతథంగా కొనసాగింది. భార్య వయస్సు 18 యేళ్లు దాటిన పక్షంలో భర్త జరిపే అత్యాచారానికి మినహాయింపు ఉంటుందని చట్టం చెబుతోంది. ఈ మినహాయింపును రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటిస్తే మొత్తం వివాహ వ్యవస్థపైనే అది తీవ్ర ప్రభావం చూపగలదని కేంద్ర ప్రభుత్వ అఫిడవిట్ హెచ్చరిస్తోంది. చట్టంలో ఉన్న మినహాయింపు అత్యాచారం చేయటానికి భర్తకిచ్చే లైసెన్సు కాదంటూనే ఆ అంశాన్ని చట్టంవైపుగా కాక సామాజిక కోణం నుంచి చూడాలని అభిప్రాయపడింది. సంబంధిత పక్షాలన్నిటితో, రాష్ట్రాలతో చర్చించాక చట్టసభ తీసుకోవాల్సిన నిర్ణయం గనుక న్యాయస్థానం జోక్యం చేసుకోరాదని తెలిపింది.

భార్య సమ్మతికి రక్షణ కల్పించేందుకు ఇప్పుడున్న చట్టాల్లో ఏర్పాట్లున్నాయనీ, గృహ హింస చట్టంవంటివి రక్షణగా నిలుస్తాయనీ చెప్పింది. నేరం ఒకటే అయినప్పుడు దాన్ని వేర్వేరు చోట్ల వేర్వేరు రకాలుగా ఎలా పరిగణిస్తారు? హత్య జరిగితే అది చోటుచేసుకున్న ప్రాంతాన్ని బట్టి దాన్ని హత్యాయత్నంగా అనుకోగలమా? పరిచితుడో, అపరిచితుడో మహిళపై అత్యాచారం చేస్తే దానికి శిక్ష ఉన్నప్పుడు... భర్త అదే పనిచేసినప్పుడు మినహాయింపు ఇవ్వటం ఏ రకంగా న్యాయం? 2022లో ఢిల్లీ హైకోర్టులో మారిటల్ రేప్‌పై పిటిషన్ దాఖలైనప్పుడు ఇద్దరు సభ్యుల ధర్మాసనంలో ఒకరు మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించాలని అభిప్రాయపడితే, అది సరికాదని మరో న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అనంతరం కర్ణాటక, గుజరాత్ హైకోర్టులు రెండూ మారిటల్ రేప్‌ను నేరంగా గుర్తించాల్సిందేనని తీర్పులు వెలువరించాయి.

మన పౌరులైనా, విదేశీ పౌరులైనా చట్టం ముందు అందరూ సమానులనీ, అందరికీ సమానమైన రక్షణ లభిస్తుందనీ రాజ్యాంగంలోని 14వ అధికరణ చెబుతోంది. భర్త చేసే అత్యాచారం నేరంగా పరిగణించకూడదని మినహాయింపునివ్వటం వివాహ బంధంలోని మహిళకు ఈ అధికరణ వర్తించబోదని చెప్పటం కాదా? కానీ కేంద్రం అలా అనుకోవటం లేదు. ఇది పెళ్లయితే స్త్రీ తన హక్కును కోల్పోతుందని పరోక్షంగా చెప్పటం కాదా? మన దేశంలో వివాహ వ్యవస్థను ఎంతో పవిత్రమైనదిగా పరిగణిస్తారన్న అఫిడవిట్ అభిప్రాయంతో విభేదించనవసరం లేదు. అలాగే వివాహ వ్యవస్థకుండే బహుముఖ పార్శ్వాల్లో భార్యాభర్తల లైంగిక సంబంధం ఒకటి మాత్రమేనని చేసిన వాదననూ తప్పుబట్టనవసరం లేదు. కానీ సామాజిక విశ్వాసాలకూ, రాజ్యాంగ విలువలకూ మధ్య వైరుధ్యం ఏర్పడినప్పుడు ఒక గణతంత్ర రాజ్యం రాజ్యాంగ విలువలకు మాత్రమే ప్రాధాన్యమివ్వాలి. దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. దాదాపు అన్ని సమాజాల్లోనూ భిన్న ఆధిపత్య ధోరణులు అల్లుకుపోయి వుంటాయి. పితృస్వామిక సమాజాల్లో స్త్రీలపై ఆధిపత్యం సాధించటానికి పురుషుడి చేతిలో అత్యాచారం ఒక ఆయుధం. దీన్ని చాలా ముందుగా గుర్తించబట్టే సోవియెట్ యూనియన్ 1926లో మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణిస్తూ చట్టం తీసుకొచ్చింది. ఆ తర్వాత 1950లో జెకోస్లోవేకియా, 1969లో పోలెండ్ ఈ మాదిరి చట్టాలు చేశాయి. ఇవన్నీ అప్పటికి సోషలిస్టు రాజ్యాలు. ప్రస్తుతం దాదాపు 150 దేశాలు మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణిస్తున్నాయి. భార్య లైంగిక స్వయంప్రతిపత్తిని భర్త అయినా సరే దెబ్బతీయరాదనీ, అది నేరపూరిత చర్య అవుతుందనీ ఈ చట్టాలు భావిస్తున్నాయి. సకల ప్రజాస్వామ్య దేశాలకూ భారత్ తల్లిలాంటిదని చెప్పుకుంటున్న మనం మాత్రం మారిటల్ రేప్ విషయంలో ఇంకా తడబాటు ప్రదర్శించటం సబబేనా?

దాంపత్య జీవనంలో భర్తలు సాగించే హింసను మన దగ్గర మహిళలు మౌనంగా భరిస్తున్నారు. భరించ శక్యం కాని స్థితి ఏర్పడినప్పుడు మాత్రమే బయటికొస్తున్నారు. భర్త లైంగిక నేరానికి పాల్పడుతున్నాడని వారిలో అతి కొద్దిమంది మాత్రమే వెల్లడిస్తున్నారు. స్నేహ అనే స్వచ్ఛంద సంస్థ డేటా ప్రకారం ముంబైలోని ధారవిలో ఈ సంస్థ ముందు 3,878 ఫిర్యాదులు దాఖలుకాగా అందులో 52.11 శాతం లైంగిక హింసకు సంబంధించినవే. 19.33 శాతంమంది తమ భర్త తమపై పదే పదే అత్యాచారానికి పాల్పడుతున్నాడని తెలిపారని ఆ సంస్థ అంటున్నది. భార్య అభీష్టాన్ని బేఖాతరు చేయటం నేరమన్న స్పృహ పురుషుడిలో కలగాలంటే మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించటం ఒక్కటే మార్గం. ఇందుకు భిన్నంగా ఆలోచించటం జనాభాలో సగానికి అన్యాయం చేయటమే.

నిజాయితీయే రక్ష



జ్యోతిర్మయం


అబూ హనీఫా ఓ వృద్ధ పేద చేనేత కార్మికుడు. నూలుతో వస్త్రాలు నేచి వాటిని వీధుల్లో తిరుగుతూ విక్రయిస్తాడు. ఒక రోజు ఎడారి మార్గంలో మరో ఇద్దరు స్నేహితులతో కాలి నడకన ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యంలో ఓ చోట ఒకతను ఖర్జూర పండ్లు అమ్ముతున్నాడు. ఒక కాసుకి పది పండ్లు కొనుక్కొని ముందుకు కదిలాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత నీటి కొలను కనిపించింది. అక్కడ ఖర్జూరాలు తినడానికి ఉపక్రమించారు మిత్రులు. హనీఫ్ తన పొట్లం విప్పాడు. అందులో పదకొండు ఉన్నాయి.

అమ్మిన వ్యాపారి పొరపాటున ఒకటెక్కువ ఇచ్చాడని అనుకున్నాడా పెద్దాయన. అది అతనికి నష్టం కదా. అందుకే వెనక్కు వెళ్ళి వ్యాపారికి ఆ పండు ఇచ్చేయ్యాలనుకున్నాడు. ఆయన మిత్రులు అతిగా ఆలోచించవద్దని వారించారు. అయినా, వ్యాపారికి ఆ అదనపు పండు తిరిగిచ్చేశాడు. అప్పుడా వ్యాపారి 'అయ్యా, ఆ అదనపు పండుని నేను తెలియకుండా ఇవ్వలేదు. మిమ్మల్ని చూడగానే మీమీద మర్యాద పుట్టుకొచ్చింది' అన్నాడు.

కానీ పెద్దాయన ఒప్పుకోలేదు. అదనపు ఖర్జూరాన్ని ఇచ్చి మనసులోని భారాన్ని తీర్చుకున్నాడు. ఇక మళ్లీ ముందుకు ప్రయాణం సాగించడం కష్టమని భావించి ఆ రోజుకు అక్కడే విశ్రమించాడు హనీఫ్. ఆయనతో కలిసి ప్రయాణం చేసిన ఇద్దరు స్నేహితులూ ముందుకు ప్రయాణించి ఒక ఇసుక తుఫానులో చిక్కుకున్నారు. నీతి, ధర్మాలను మనం రక్షిస్తే అవి మనల్ని కాపాడుతాయనే భారతీయుల నమ్మకం ఈ సందర్భంగా స్ఫురణకు వస్తుంది.

– యామిజాల జగదీశ్

యెల్లో జ్యోతి... ఇదేం పైత్యం?



ఇలాంటి స్క్రీన్ షాట్‌తోనే సాక్షిపై ఏబీఎన్ అసత్య ప్రచారం చేస్తోంది.



గూగుల్‌లో ఈనాడు ట్యాగుతో వెతికితే ఆంధ్రజ్యోతి కింద ఈనాడు కనిపిస్తున్న దృశ్యం.

చంద్రబాబు భజన చేస్తూ... వార్తలను, వాస్తవాలను వక్రీకరిస్తూ పబ్బం గడుపుకొంటున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మరోసారి తన వంకర బుద్ధిని బయటపెట్టుకుంది. టీడీపీ సేవలో తరిస్తూ సాక్షి మీడియాపై పడి ఏడ్చే ఆ పత్రిక, టీవీ యాజమాన్యం డిజిటల్ మీడియాపై కనీస అవగాహన లేకుండా 'సాక్షి'కి వ్యతిరేకంగా వార్తలను వండి వార్చుతోంది. వ్యూస్‌ను, ట్రాఫిక్‌ను పెంచుకొనేందుకు 'సాక్షి' కుట్ర పన్నిందనీ... సాక్షి వెబ్‌సైట్ వార్తల్లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ట్యాగ్‌లైన్ వాడుతున్నారనీ ఎల్లో పత్రికలో తప్పుడు వార్తను ప్రచురించడమే కాకుండా... రెండు రోజులపాటు ఏబీఎన్ చానల్‌లో అర్థంపర్థం లేని చర్చలను నడిపించింది. డిజిటల్ జర్నలిజంలో ట్యాగ్ లైన్స్ ఎందుకు వాడతారు? ఏ సందర్భంలో ఎలాంటి ట్యాగ్ లైన్స్ వాడతారు? అసలు గూగుల్ ఎనలటిక్స్, వెబ్‌సైట్ మెట్రిక్స్ ఎలా పనిచేస్తాయన్న పరిజ్ఞానం లేకుండా 'సాక్షి'పై విషం చిమ్మే ప్రయత్నం మొదలుపెట్టింది.

ఎవరైనా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి పేరుతో వార్తలను సెర్చ్ చేయాలనుకుంటే వాళ్లకు సాక్షి వార్తలు కనిపించేలా సాక్షి డాట్ కామ్‌లో ఏర్పాటు చేసుకున్నారంటూ బుర్ర తక్కువ వాదనను తెరపైకి తెచ్చింది ఎల్లో మీడియా. ఇలా చేయడం ద్వారా ఏబీఎన్ ట్రాఫిక్ మొత్తం 'సాక్షి'కి వచ్చేస్తుందట. ఇంతకంటే అవగాహనా రాహిత్యం ఇంకేమైనా ఉంటుందా? వినేవాళ్లు ఉంటే పచ్చ పత్రికలు, చానళ్లు ఏదైనా చెబుతాయనడానికి ఇదే పెద్ద ఉదాహరణ. వాస్తవానికి సాక్షి డాట్ కామ్ వెబ్ ట్రాఫిక్ ఎప్పుడూ ఆంధ్రజ్యోతికి అందనంత ఎత్తులో ఉంటుంది. ప్రజల ముందు వార్తలతోపాటు వాస్తవాలను మాత్రమే అందించే సాక్షి డాట్ కామ్‌కు ఉన్న ఆదరణ ఆంధ్రజ్యోతికి ఎప్పుడూ లేదు. వెబ్‌సైట్ ఎనలటిక్స్‌ను బేరీజు వేసుకుంటే ఆ అంకెలే చెబుతాయి సాక్షి స్థాయి ఏమిటో. అలాంటిది పచ్చ పత్రిక నుంచి వెబ్ ట్రాఫిక్‌ను డైవర్ట్ చేసుకొనేందుకు కుట్రలు చేయాల్సిన ఖర్మ సాక్షి మీడియాకు లేనేలేదు. అసలు టెక్నికల్‌గా, లాజికల్‌గా చూసుకున్నా అలా జరిగే అవకాశాలు ఏమాత్రం లేవు. సాధారణంగా ఏదైనా న్యూస్ ఆర్టికల్ పబ్లిష్ చేయాల్సి వస్తే ఆ వార్తకు సంబంధించిన వ్యక్తులు, వ్యవస్థల పేర్లను ట్యాగ్ లైన్స్‌గా జత చేస్తారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చేసే రాజకీయ విష ప్రచారానికి కౌంటర్‌గా సాక్షి డాట్ కామ్‌లో ఏదైనా వార్తను ప్రచురిస్తే ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ట్యాగ్‌ను కచ్చితంగా ఉపయోగిస్తారు. ఇలా చేయడం అనైతికం, కుట్ర అని ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి అనిపిస్తే... డిజిటల్ మీడియా గురించి వాళ్లకు ఓనమాలు కూడా తెలియవనే అనుకోవాలి. ఒక పత్రిక లేదా సంస్థ ఇతర పత్రికలు, సంస్థలకు చెందిన పేర్లు, ట్యాగ్‌లను సహజంగా ఉపయోగించదు అన్నది నిజమేగానీ... ఆ పత్రికా సంస్థకు సంబంధించిన వార్తను ప్రజలకు చేర్చాలనుకున్నప్పుడు ఆ పేర్లు లేకుండా... వాటిని ట్యాగ్ లైన్స్‌లో పెట్టకుండా ఎలా పబ్లిష్ చేస్తారో ఏబీఎన్‌మేధావులకే తెలియాలి.

ఏ మీడియా సంస్థలు ఎవరి ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయో పాఠకులకు, వీక్షకులకు తెలియనిది కాదు. ఎల్లో మీడియా చేస్తున్న రాజకీయ కుట్రలను ఎప్పటికప్పుడు సాక్షి మీడియా ప్రజల ముందుంచుతోంది. అందులో భాగంగా ఏబీఎన్ మాత్రమే కాదు... ఏ ఇతర మీడియా సంస్థ అవాస్తవాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం చేసినా వాటిని ఖండిస్తూ పాఠకులకు, వీక్షకులకు నిజం చెప్పడంలో 'సాక్షి' ముందుంటుంది. ప్రజల్లో విశ్వసనీయత ఉంది కాబట్టే ఆంధ్రజ్యోతి కంటే సాక్షి డాట్ కామ్ డిజిటల్ రేటింగ్స్‌లో ముందుంది. కేవలం సాక్షి మీడియాపై బురద జల్లడమే పనిగా పెట్టుకొని ఆంధ్రజ్యోతి చేసే తప్పుడు ప్రచారాలను ఎవరూ విశ్వసించరు.

– వర్ధెల్లి మురళి
ఎడిటర్, సాక్షి

కోవిడ్‌ను మించే భూతం... భూతాపం

విశ్లేషణ



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

రెండేళ్ల పాటు కరోనా వైరస్ ప్రపంచ మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేసింది. కోవిడ్ కల్లోలం సృష్టించిన నష్టం ఈ శతాబ్దంలోనే కాక, మానవ చరిత్రలోనే ఓ పెనువిషాదం. ఆ పీడకల నుంచి తేరుకొని ఆర్థిక స్థిరత్వం దిశగా అడుగులు వేస్తున్న ప్రపంచానికి మరో పెద్ద సవాలు... 'గ్లోబల్ వార్మింగ్'. ఫలితంగా తీవ్రమైన ఎండలు, అంతలోనే వరదలు... మానవాళిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పెరిగే భూతాపం వ్యవసాయ రంగానికి ప్రథమ శత్రువు. వాతావరణ మార్పుల వల్ల ఒక్క భారతదేశంలోనే వ్యవసాయ దిగుబడుల్లో ప్రతి యేటా రమారమి 30% క్షీణత నమోదవుతోంది. వాతావరణం మార్పులతో ఎదురవుతున్న సవాళ్లను ధీటుగా ఎదుర్కొని స్థిరత్వం వైపు ముందుకు సాగాలంటే... అందుకు అనుగుణమైన విధానాలను ప్రభుత్వాలు అనుసరించాలి.

భూతాపం వల్ల సప్త సముద్రాలు వేడెక్కిపోతున్నాయి. మంచు పర్వతాలు కరిగిపోతున్నాయి. 1950 నాటికి హిమాలయాలపై ఘనీభవించిన మంచు నేటికి చాలావరకు కనుమరుగైంది. అంటార్కిటికా సముద్రంలోని మంచు పరిణామం కనిష్ఠ స్థాయికి పడిపోయింది. భారత్‌తో సహా అనేక దేశాలలో శీతాకాలం క్రమంగా ఎండా కాలంగా మారిపోతోంది. మరికొన్ని చోట్ల సముద్ర మట్టాలు పెరిగి సముద్రాలు ముందుకు చొచ్చుకొచ్చి అనేక ద్వీపాలను కబళించి వేస్తున్నాయి.

వాతావరణ మార్పుల వల్ల మన దేశంలో అధికంగా నష్టపోతున్న రంగాలలో వ్యవసాయం, ఆరోగ్యం ముఖ్యమైనవి. ఒకవైపు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుదలతో ఐటీ, ఎలక్ట్రానిక్స్ వంటి కొన్ని రంగాలు అభివృద్ధిలో అనూహ్యంగా ముందంజ వేస్తుండగా... మరో వైపు నిలకడైన వాతావరణ పరిస్థితులు లేక వ్యవసాయం, తదితర ఉత్పత్తి రంగాలలో భారీ క్షీణత కనిపిస్తోంది. ఈ వైరుధ్యం ప్రజల మధ్య అనేక అసమానతలకు దారితీస్తోంది.

భారీ వర్షాలు, వరదలతో పేదల ఇళ్లు నేలమట్టం అవుతున్నాయి. ఎలాంటి మౌలిక వసతులకు నోచుకోకుండా లోతట్టు ప్రాంతాల్లో నివసించే పేదల జీవితాలు గాల్లో దీపంలా మారాయి. నివాసం ఉన్న చోట బతికే పరిస్థితి లేకపోవడం వల్ల మనుషులు వలసలు పోవాల్సిన దుస్థితి అనేక దేశాలలో నెలకొంది. మరోవైపు ఉష్ణోగ్రత పెరుగుదల, భారీ వర్షాల వల్ల అపసవ్య దిశలో సముద్రపు నీరు పొంగి పంట పొలాల్లోకి, నదీసంగమాల వద్ద నదుల్లోకి ప్రవహిస్తోంది.

వాతావణ మార్పుల వల్ల జీవ వైవిధ్యం పూర్తిగా గాడి తప్పింది. మారిన వాతావరణ పరిస్థితులకు అలవాటు పడలేక మనుషులతోపాటు మొక్కలు, జంతుజాలానికి తీవ్రమైన హాని కలుగుతోంది. అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సంఘం తాజా నివేదిక ప్రకారం, సుమారు 10 లక్షల వృక్ష, జంతుజాతులు అంతరించే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. గత 400 ఏళ్లల్లో 680 వెన్నెముక గలిగిన జాతులు నశించగా, కేవలం గత 2 దశాబ్దాలలోనే అంతకు రెట్టింపు జాతులు నశించాయి. కాలుష్యం, భూవినియోగంలో మార్పులు, వాతావరణంలో చోటుచేసుకుంటున్న అనూహ్య తేడాలు ఇందుకు కారణంగా శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. భూతాపం, కాలుష్యం కారణంగా మనుషులలో వయస్సుతో సంబంధం లేకుండా అనేక రుగ్మతలు కనపడుతున్నాయి. కేవలం శ్వాస కోశ సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులతోనే ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా 87 లక్షల ప్రజలు చనిపోతున్నారు. కాలుష్యం వల్ల అప్పుడే పుట్టిన పసికందులకు కూడా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

ఒకప్పుడు అగ్ని పర్వతాలు బద్దలు కావడం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆ తర్వాత పారిశ్రామిక విప్లవం వచ్చాక... బొగ్గు, చమురు, గ్యాస్ వంటి శిలాజల ఇంధనాలను మండించడం ఎక్కువయ్యాక వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్, ఇంకా గ్రీన్ హౌజ్ వాయువుల కారణంగా కేవలం 150 సంవత్సరాలలో 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ మేర భూతాపం పెరిగింది. సహజ వాయువు వెలికితీత, దాని వాడకం వల్ల బయటపడే మీథేన్ కారణంగా మరో 1 డిగ్రీ సెంటిగ్రేడ్ వేడిమి పెరిగే అవకాశం ఏర్పడింది.



పెరిగే భూతాపం వ్యవసాయ రంగానికి ప్రథమ శత్రువు. అధిక వర్షాలు, వరదల వల్ల చేతికొచ్చిన పంటల్లో ఉత్పత్తి తగ్గిపోతోంది. ఆహార భద్రతకు అన్ని చోట్లా ప్రమాదం ఏర్పడింది. ఫలితంగా, వ్యవసాయరంగంపై ఆధారపడిన రైతాంగం, అనుబంధ రంగాల కార్మికులకు ఆదాయాలు పడిపోయాయి. ఇప్పటికీ 60% ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవాలంటే, అత్యవసర పర్యావరణ కార్యాచరణతో ముందుకు సాగవలసిందే! రుతుపవనాల గమనం, వాతావరణ వైవిధ్యం ఆధారంగా దేశాన్ని 7 జోన్లుగా వర్గీకరించుకొని అందుకు అనుగుణంగా పంటల సాగును నిర్వహిస్తూ వస్తున్న మన దేశంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతాంగానికి కోలుకోలేని దెబ్బ తగులుతోంది. పంటలు పుష్పించే కాలంలో విపరీతమైన ఎండలు కాయడం వల్ల విత్తనాలు బలహీనపడుతున్నాయి. ఇది దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఒక అంచనా ప్రకారం వాతావరణ మార్పుల వల్ల ఒక్క భారతదేశంలోనే వ్యవసాయ దిగుబడుల్లో ప్రతియేటా రమారమి 30% క్షీణత నమోదవుతోంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల ధాన్యం, గోధుమ, పప్పుధాన్యాల్లో ఉండే ప్రొటీన్లు నశిస్తున్నాయి. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తుల్లో పోషకాలు తగ్గిపోతున్నాయి. మరోవైపు అధిక ఉష్ణోగ్రతల కారణంగా దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడి పశువులకు అవసరమైన గ్రాసం అందడం లేదు. దాంతో, పశువుల ఎదుగుదల తగ్గి మాంసం ఉత్పత్తి పడిపోతోంది. పశువుల పునరుత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపడమేకాక పాల దిగుబడి గణనీయంగా తగ్గింది. అధిక వర్షాలు, వరదల వల్ల కోళ్లు, గొర్రెలు, ఇతర పశువులు పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి.

ఈ యేడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే తెలుగు రాష్ట్రాల్లో రెండు పర్యాయాలు కురిసిన భారీ వర్షాలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేశాయి. అధిక వర్షాలు, వరదల వల్ల పంట నష్టాలు జరుగుతున్నప్పుడు రైతాంగానికి ప్రభుత్వపరంగా అందుతున్న సాయం అరకొరగానే ఉంటోంది. వాతావరణ మార్పులను ముందుగానే అంచనా వేయలేని నేపథ్యంలో... పంటవేసి నష్టపోయే కంటే, పంట వేయకపోతేనే తక్కువ నష్టం అనే భావన చాలా ప్రాంతాల్లోని రైతాంగంలో బలంగా నాటుకుపోయింది. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో రైతులు క్రాప్ హాలీడే పాటిస్తున్నారు. ఇందువల్ల దేశ ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది.

భూతాపం తగ్గించడానికి ప్రపంచ దేశాలు ఇప్పటికే అనేక సదస్సులు నిర్వహించాయి, డిక్లరేషన్లపై సంతకాలు చేసి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రియో ఒప్పందం, కోపెన్‌హెగన్ సదస్సు, క్యోటో ఒప్పందం, కాప్ 21 పారిస్ ఒప్పందం... ఇలా అనేక విస్తృత వేదికలపై ప్రపంచ దేశాలు భూతాపం తగ్గించడానికి చేసిన ఉమ్మడి ప్రమాణాలు కాగితాలకే పరిమితం కావడం వల్ల ప్రపంచం ప్రమాదంలో పడింది.

అయితే, కొన్ని దేశాలు మాత్రం క్లీన్ ఎనర్జీ (స్వచ్ఛమైన ఇంధనం) వాడకం దిశగా ముందుకు సాగడం కొంతలో కొంత ఊరట. శిలాజ ఇంధనాల వాడకాన్ని పక్కనపెట్టి, సున్నా కాలుష్యం వెదజల్లే (నెట్ జీరో ఎమిషన్) టెక్నాలజీల వైపు పరుగులుపెడుతున్నాయి. ఎలక్ట్రిక్, బ్యాటరీ వాహనాల వినియోగాన్ని పెంచడం; మొక్కజొన్న, మరికొన్ని రకాల ఉత్పత్తుల నుంచి ఇంధనాన్ని తయారీ చేయడం; గాలి మరలు, సోలార్ ప్యానళ్ల నుంచి విద్యుత్ తయారు చేయడం మొదలైన కార్యక్రమాలను పెద్దఎత్తున చేపడుతున్నాయి. కొన్ని దేశాలు బయోఎనర్జీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ కాలుష్యాన్ని తగ్గిస్తున్నాయి. భారత్‌లో కూడా ఎలక్ట్రిక్, బ్యాటరీ వాహనాల వాడకం మొదలైనప్పటికీ వాటి సంఖ్య స్వల్పం. అలాగే, సోలార్ ఎనర్జీని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని రాయితీలు ప్రకటించింది.

వాతావరణం మార్పులతో ఎదురవుతున్న సవాళ్లను ధీటుగా ఎదుర్కొని స్థిరత్వం వైపు ముందుకు సాగాలంటే... అందుకు అనుగుణమైన విధానాలను ప్రభుత్వాలు అనుసరించాలి. జీవ వైవిధ్యాన్ని కాపాడుకునే విధంగా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలి. పౌర సమాజంలో చైతన్యాన్ని పెంచాలి. ముఖ్యంగా, ఈ అంశంపై వివిధ రాజకీయ పక్షాలలో ఏకాభిప్రాయం, మద్దతు అవసరం. అంతిమంగా పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టినట్లయితేనే ఫలితాలు అందుతాయి. లేకుంటే... కరోనాను మించిన భూతం అయిన భూతాపం వల్ల మరిన్ని కష్టాలు వెంటాడుతూనే ఉంటాయి.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నివాళి



అక్టోబర్ 7న ఇజ్రాయెల్ మీద హమాస్ చేసిన దాడిని ప్రపంచ వ్యాప్తంగా నాయకులు, సెలబ్రిటీలు, మేధావులు, సామాన్యులు అందరూ ఖండించారు. ఇప్పటివరకూ ఖండనకు గురికానిది ఏడాది పొడవునా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండే. మరణించిన పాలస్తీనియన్లు అందరికీ నివాళి.

– అర్నేసా బుల్యూస్మిక్ కుస్తూరా, సామూహిక హత్యాకాండల పరిశోధకురాలు

మద్దతివ్వాలి!



ఇప్పుడు హమాస్ విశ్వాస ఘాతుకానికి ముస్లిం దేశాలు మద్దతిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి చార్టర్ ప్రకారం ఇది అంగీకారయోగ్యం కాదు. ఒక వేళ ఐరాస తీర్మానం లేకుండా ముస్లిం దేశాలు ఇజ్రాయెల్ మీద దాడికి దిగితే, తన 12 లక్షల సైన్యంతోఇండియా క్షేత్రస్థాయిలో ఇజ్రాయెల్‌కు మద్దతివ్వాలి.

– సుబ్రహ్మణ్య స్వామి, కేంద్ర మాజీ మంత్రి

సాయం కోసం...



మాల్దీవుల ఇస్లామిస్టు అనుకూల అధ్యక్షుడు ముయిజ్జూ ఇండియా పట్ల తన మనసు మార్చుకున్నారని కొందరు వాదిస్తున్నారు. నిజం కాదు. అప్పుల వాయిదా చెల్లించలేక ఇండియాను డబ్బు అడుగుతున్నారు (బెయిల్ అవుట్). కాకపోతే చైనా, అంతర్జాతీయ ద్రవ్య నిధి రుణాల్లా ఈ సాయానికి ఖండితమైన షరతులు ఉండవు.

– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

మాటలెందుకు?



దేవుడు మనకు రెండు చెవులు, ఒక నోరు ఇవ్వడానికి ఒక కారణం ఉంది. ఎక్కువ వినమని! వాగ్యుద్ధాలకు ఎవరూ దిగకూడదు. ప్రత్యేకించి మనది లిస్టెడ్ కంపెనీ అయినప్పుడు (ట్విట్టర్‌లో 'ఓలా' సీఈఓ మాటల వల్ల ఆ కంపెనీ షేర్లు పడిపోయిన నేపథ్యంలో.)

– సుహేల్ సేఠ్, నటుడు

ఇంకా ఎండలు!



అక్టోబర్ నెలలో ఉన్నాం. అయినా ఇరవై నాలుగు గంటలూ ఎయిర్‌కండీషన్ నడపాల్సిన పరిస్థితి.

– జాఫర్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

పక్కదారి పట్టించడానికే...

రాజ్యాంగం ప్రకారం ఎన్నికల్లో గెలిచి ప్రధాని, సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రి వంటి పదవుల్లో ఉన్నవారు ఒక మతాన్ని లేక వర్గాన్ని నెత్తిమీద పెట్టుకోవడం దేనికి సంకేతం? ప్రభుత్వాలే ఒక మతాన్ని వెనకేసుకురావడం అనేది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రజాసమస్యలను తుంగలో తొక్కి ఏ కాస్త అవకాశం ఉన్నా హిందూ మతాన్ని భుజానికెత్తుకుని తాము మాత్రమే మెజారిటీ మతమైన హిందూ పరిరక్షకులమనే కలర్ ఇస్తున్నారు. తిరుపతి లడ్డు కల్తీ జరిగిందని చెబుతూ రాష్ట్రప్రభుత్వం పెద్దలు వేసిన పిల్లి మొగ్గలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు కొత్తగా సనాతన ధర్మాన్ని రక్షించే బృహత్తర బాధ్యత తమదే అంటున్నారు. హిందువులను రెచ్చగొడుతూ 'హిందువులారా, సనాతన ధర్మ రక్షకులారా కదిలి రండి' అంటూ పిలుపునివ్వడం పాలక స్థానంలో ఉన్నవారు చేయాల్సిన పని కాదు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంటే ఒక అడుగు ముందుకేసి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తాను సనాతన ధర్మం పరిరక్షణకే పుట్టినట్టు ప్రవర్తించడం విడ్డూరంగా ఉంది. తాను ఒక ఉప ముఖ్యమంత్రి అనే సంగతి మర్చిపోయి మత రక్షకుడిగా తనను తాను ప్రకటించుకుంటూ... 'సనాతన ధర్మం కోసం చావడానికైనా సిద్ధం. నేను ఈ రోజు సనాతన ధర్మ వ్యతిరేకులతో గొడవ పెట్టుకోవడానికి వచ్చాను' అంటూ బహిరంగంగా సెక్యులరిస్టులపై మాటల దాడి చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌లు లక్ష్యంగా చేసిన విమర్శలు చూస్తే... ఎవరో ఇతర మతాలవారు హిందువులపై యుద్ధం చేయ డానికి వస్తున్నట్లూ, ఆ యుద్ధానికి సిద్ధంగా ఉండండన్నట్లూ ఉంది.

బీజేపీ విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేస్తుంటే దాని అడ్డుకుని వేలాది కార్మికుల జీవితాలను, అత్యున్నత ప్రభుత్వ రంగ సంస్థను కాపాడవలసిందిపోయి ఈ ఊక దంపుడు ఉపన్యాసాలు ఏమిటి? దేశంలో హిందువులు అంటే చిన్న చూపు అనీ, హిందూ దేవుళ్ళపై, హిందువులపై, పవిత్రమైన ఆవుపై నిత్యం దాడి చేస్తూ సనాతన ధర్మాన్ని అంతం చేయాలని చూస్తున్న క్రమంలో మోదీ వచ్చి మళ్లీ హిందూ మతానికి, సనాతన ధర్మానికి జీవం పోశారని ఆకాశానికి ఎత్తుతున్నారు పవన్. మన దేశం ఎందుకు హిందూ దేశంగా ఉండకూడదు అని కొత్తరాగాలు ఎత్తుకోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

ఎవరికోసం, దేనికోసం సనాతన ధర్మ రక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని కోరు తున్నారు? దళిత, బహుజన ప్రజలమీద, స్త్రీలమీద జరుగుతున్న అనేక రూపాల్లోని దాడుల నుంచి రక్షించడానికి ఎన్ని బోర్డులు ఉండాలి? ఉన్న రాజ్యాంగబద్ధ సంస్థలే సరిగా పనిచేయడం లేదుకదా! సమస్యలను పక్కదారి పట్టించడానికి మతవిశ్వాసాలను రెచ్చగొట్టే పనికి స్వస్తి పలికి వాస్తవిక దృక్పథంతో ప్రభుత్వ పెద్దలు పని చేయాలి.

– డా॥ మండ్ల రవి
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.పంచమి ఉ.6.57 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.12.57 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి రా.10.37 నుండి 11.25 వరకు, **అమృతఘడియలు:** ప.3.33 నుండి 5.23 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 5.42.

క్లుప్తంగా...

13న అలయ్ బలయ్

- ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- గౌరవ అతిథులుగా సీఎంలు రేవంత్, చంద్రబాబు, మాజీ సీఎం జగన్‌కు ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: దత్తన్న అలయ్ బలయ్ దసరా సమ్మేళనం – 2024 కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు బండారు విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరవుతారని తెలిపారు. గౌరవ అతిథులుగా తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిలను ఆహ్వానించామని తెలిపారు. అలయ్ బలయ్ దోస్తీతో తెలంగాణ రుచుల మధ్య శమీ వృక్షాన్ని కొలుచుకుందామని కోరారు.

పేద విద్యార్థులకు అండగా జీఆర్‌టీ జ్యువెలర్స్



ప్రసిద్ధ ఆభరణాల బ్రాండ్ జీఆర్‌టీ జ్యువెలర్స్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాల ద్వారా విద్యారంగానికి తన వంతు మద్దతును అందిస్తోందని జీఆర్‌టీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ అనంత పద్మనాభన్ చెప్పారు. దీనిలో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన అర్హులైన 264 మంది విద్యార్థులకు సంస్థ రూ.1.37 కోట్ల స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసింది. ఈ స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల ఉన్నత విద్యకు ఉపయోగపడుతుందని ఆనంద్ అనంత పద్మనాభన్ చెప్పారు. చెన్నై అశోక్‌నగర్‌లోని జీఆర్‌టీ మహాలక్ష్మి విద్యాలయంలో విద్య, సాధికారిత విలువలను పెంపొందించే కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. విద్య వ్యక్తులనే కాకుండా సమాజాన్ని కూడా బాగుచేస్తుందని, అర్హులైన పేద విద్యార్థులకు సాయం చేయడం అదృష్టంగా భావిస్తున్నామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ రాధాకృష్ణన్ అన్నారు. జీఆర్‌టీ జ్యువెలర్స్ దక్షిణ భారత్‌లోనే కాకుండా సింగపూర్‌లోనూ ప్రసిద్ధి పొందింది. ఈ సంస్థ బంగారం, వజ్రాలు, ప్లాటినంతో కూడిన ఆభరణాలను అందిస్తోందని వారు చెప్పారు.



లలితా మహాత్రిపుర సుందరీదేవిగా వరంగల్ శ్రీ భద్రకాళి




స్కందమాతగా అలంపూర్ జోగులాంబ



స్కందమాతగా నిర్మల్ జిల్లా బాసర అమ్మవారు

సొత్తు సర్కార్‌ది.. సొమ్ము సొసైటీకి!

- జూబ్లీహిల్స్ సొసైటీ పరిధిలో సర్కారు భూములు అన్యాక్రాంతం
- చట్టవిరుద్ధంగా పలువురికి విక్రయించిన పాలకవర్గం
- విక్రయించిన స్థలాల రిజిస్ట్రేషన్ విలువ రూ.76 కోట్లు
- బహిరంగ మార్కెట్ విలువ రూ.300 కోట్లపైనే..
- రిజిస్ట్రేషన్ విలువ మేరకు సొమ్ము సొసైటీ ఖాతాలో జమ
- మిగతా సొమ్ము కొందరు పాలకవర్గం ముఖ్యుల జేబుల్లోకి వెళ్లిందనే ఆరోపణలు
- రెండు ప్లాట్లకు సంబంధించి ఇప్పటికే ఫిర్యాదులు
- ఈ వ్యవహారంపై సీఎం విచారణ జరిపించాలనే డిమాండ్లు



FINDINGS:

At the outset it is evident that among the excess land registrations done by the present Committee, registration executed towards Sri.K.Chiranjeevi, Plot No:303 for an extra extent of 595 sq.yds vide Doc.No:2940/2022 executed on 20.04.2022 and clearly established that it is not extra land or stray bit that impact land outside the registered lay out of Jubilee Hills Coop. House Building Society approved by the GHMC (In the year 1991).

నటుడు చిరంజీవి ప్లాట్ వివాదంపై అధికారి ఇచ్చిన నివేదిక

సాక్షి, హైదరాబాద్: పేదలు గజం భూమి ఆక్రమించినా ప్రతాపం చూపించే అధికారులు.. పెద్దలు ఎకరాలకు ఎకరాలు కబ్జా చేసినా నోరెత్తరనే విమర్శ ఎప్పటినుంచో ఉన్నదే. అంతేకాదు అక్రమాలకు కాసింత 'సహకార'మూ అందిస్తారన్నదీ బహిరంగ రహస్యమే. అలాంటి అత్యంత ఖరీదైన అక్రమాలకు హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న జూబ్లీహిల్స్ ప్రాంతం వేదిగా మారింది. ఇష్టారాజ్యంగా ఆక్రమణలు చేసి అమ్ముకున్నా అడిగే నాథుడు లేడు. పట్టించుకోవాల్సిన సహకార శాఖ, జీహెచ్ఎంసీ అధికారులు అందినకాడికి దండుకుని అనుమతులు ఇచ్చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువైన వేల గజాల భూమిని అందరూ అందినకాడికి పంచుకున్నారు. దీని వెనుక జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీది కీలక పాత్ర. సొసైటీకి సంబంధం లేని ప్రభుత్వ భూములను కూడా తన ఖాతాలో వేసుకుని, అమ్మేసుకోవడం.. సీఎం వంటివారూ సభ్యులుగా ఉన్న సొసైటీలో ఇన్ని అక్రమాలు, అవకతవకలు జరగడం.. చర్చనీయాంశంగా మారింది.

అందినకాడికి దండుకునేందుకు..

ఏదైనా సొసైటీకి భూకేటాయింపు జరిపినప్పుడు పక్కనే కొంత ప్రభుత్వ భూమి కూడా ఉండే అవకాశం ఉంటుంది. దీన్ని జూబ్లీహిల్స్ సొసైటీ అక్రమాలకు వినియోగించుకోవడం మొదలుపెట్టింది. అప్పటికే సభ్యులు పొందిన ప్లాట్లకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలను సొసైటీవే అని చెప్పి రిజిస్ట్రేషన్ చేస్తూ.. అధికారికంగా సొసైటీకి.. అనధికారికంగా కొందరు పాలక మండలి సభ్యుల జేబుల్లోకి కోట్ల రూపాయలు జమకావడం గమనార్హం. ఇలా అక్రమంగా సేల్‌డీడ్ చేసిన 396, 397 నంబర్ ప్లాట్లపై ఫిర్యాదులు కూడా అందాయి. వాటిపై విచారణ చేపట్టిన జీహెచ్ఎంసీ పరిధిలోని 'డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్' ఆ సేల్‌డీడ్‌లను రద్దు చేయాలని 2023 అక్టోబర్ 6న సబ్ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. పేద, మధ్య తరగతి వారిపై చర్యలు తీసుకోవడంలో ఉత్సాహం ప్రదర్శించే అధికారులు.. అంగబలం, అర్థ బలం ఉన్నవారి విషయంలో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొందరు అధికారుల చేతికి ముడుపులు అందడమే దీనికి కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సినీ నటుడు చిరంజీవి ప్లాటుపైనా వివాదం

సినీ నటుడు చిరంజీవికి సంబంధించి ప్లాట్ విషయంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని న్యాయస్థానం స్టే కూడా ఇచ్చింది. ఈ క్రమంలో ఏం జరిగిందో, ఏమోగానీ పిటిషన్లు వేసిన వారు ఉపసంహరించుకున్నారు. కానీ కొందరు సభ్యులు ఈ వ్యవహారంపై సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారి చిరంజీవికి 2022 ఏప్రిల్ 20న రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్ నంబర్ 303ఎన్ 595 గజాల స్థలం విషయంలో అక్రమాలు జరిగాయని తేల్చారు. ఈ మేరకు సెప్టెంబర్ 3న ఉన్నతాధికారులకు విచారణ నివేదిక అందజేశారు. ఆ సేల్‌డీడ్ రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశిస్తూ, సహకార సొసైటీ చట్టం–1964లోని సెక్షన్ 83బీ ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కూడా పేర్కొన్నారు. కానీ ఏం చర్యలు తీసుకున్నారన్నది తెలియదు. ఇది పలు అనుమానాలకు తావిస్తోంది. ఇలా ఒకట్రెండు కాదు పదుల సంఖ్యలో ప్రభుత్వ భూములను అక్రమంగా విక్రయించినట్టు సమాచారం.

సీఎం విచారణ జరిపించాలనే డిమాండ్

సొసైటీ పాలకవర్గం ఈ స్థలాలను రిజిస్ట్రేషన్ విలువ మేరకు విక్రయించినట్టుగా చూపి, ఆ మేరకు రూ.వంద కోట్లకుపైగా సొసైటీ ఖాతాలో జమ చేసింది. నిజానికి బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ అంతకు నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటుంది. అంటే భారీ మొత్తానికే స్థలాలను విక్రయించినా.. కేవలం రిజిస్ట్రేషన్ విలువను సొసైటీ ఖాతాలో జమ చేశారని, మిగతా సొమ్మును పాలకవర్గం ముఖ్యులు, అధికారులు పంచుకున్నారనేది స్పష్టవుతోందని సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇందులో వందల కోట్లు కొందరి జేబుల్లోకి వెళ్లాయని పేర్కొంటున్నారు. ప్రభుత్వ స్థలాలను విక్రయించడం ద్వారా సొసైటీ ఖాతాకు చేరిన మొత్తాన్ని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని.. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన స్థలాల సేల్‌డీడ్‌లను రద్దు చేసి, స్వాధీనం చేసుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి. ఈ సొసైటీలో సభ్యుడిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి.. దీనిపై పూర్తి విచారణకు ఆదేశించాలని సభ్యులు కోరుతున్నారు. దీనిపై త్వరలో సీఎంను, మంత్రులను కలసి ఫిర్యాదు చేయనున్నట్టు వారు చెప్తున్నారు.

సొసైటీ భూమాయలో బహిర్గతమైన కొన్ని అక్రమాలివీ..

ప్లాట్ నంబర్	ఏరియా	రిజిస్ట్రేషన్ విలువ (రూ.కోట్లలో)
396	845 గజాలు	25.35
397	461 గజాలు	13.83
265/1	353 గజాలు	10.59
882ఏ	298 గజాలు	8.94
303ఎ	595 గజాలు	17.85
మొత్తం	-	76.56

(సొసైటీ పాలకవర్గం విక్రయించిన ఈ ప్లాట్ల విలువ బహిరంగ మార్కెట్లో రూ.300 కోట్లకుపైనే ఉంటుంది. ఇందులో రిజిస్ట్రేషన్ విలువను అధికారికంగా చూపించి, మిగతా సొమ్మును వెనకేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విక్రయించిన వాటిలో ఇవి కొన్ని మాత్రమేనని, పక్కాగా దర్యాప్తు చేస్తే ఇలాంటి ప్లాట్లు చాలా బహిర్గతం అవుతాయని సొసైటీ సభ్యులు పేర్కొంటున్నారు)

లండన్‌లో చేనేత బతుకమ్మ సంబరాలు



లండన్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రాయికల్(జగిత్యాల): తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్ (టాక్) ఆధ్వర్యంలో సోమవా రం లండన్‌లో చేనేత బతుకమ్మ, దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. లండన్‌లోని తెలంగాణ ప్రాంతానికి చెందిన రెండు వేలమంది హాజరయ్యారు. మహిళలు చేనేత దుస్తులు ధరించి.. వివిధ రకాల పూలతో తయారుచేసిన బతుకమ్మను ఆడిటోరియానికి తీసుకొచ్చి ఆడిపాడారు. ముఖ్య అతిథులుగా అక్కడి హౌన్స్లో మేయర్ కారెన్స్మీత్, మాజీ ఎంపీ వీరేంద్ర శర్మ, భారత హైకమిషన్ ప్రతినిధి అజయ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు కుర్మాచలం అనిల్, కౌన్సిలర్లు ప్రీతమ్‌గ్రేవాల్, అజ్మీర్ గ్రేవాల్, ప్రభాకర్ ఖాజా, టాక్ అధ్యక్షుడు కడుదల రత్నాకర్, ఉపాధ్యక్షురాలు సుష్మణరెడ్డి, చిలుమల సత్యమూర్తి, ప్రధాన కార్యదర్శి బుడగం సురేశ్ పాల్గొన్నారు.

సహకార శాఖ గెజిటెడ్ అధికారుల సంఘ కార్యవర్గం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సహకార శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా అన్నమనేని జగన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా దేవునూరి భీంరాజ్ నియమితులయ్యారు. అసోసియేట్ అధ్యక్షునిగా కె.నాగార్జున, కోశాధికారిగా గంధం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా బొక్క సంజీవరెడ్డి నియమితులయ్యారు. నూతన కమిటీ సభ్యులు సోమవారం టీజీవో భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. ఉద్యోగుల సర్వీసు సంబంధిత అంశాలతో పాటు సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వానికి తగు సూచనలు చేస్తామన్నారు.

కర్ణాటక బస్సు ఢీకొని నలుగురి మృతి

- మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు



వినయ్‌కుమార్



రేణుక



జగన్నాథం



సిద్రాం

న్యాల్‌కల్(జహీరాబాద్): కర్ణాటక బస్సు ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని గణేశ్‌పూర్ గ్రామ శివారులో సోమవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన గునెల్లి సిద్రాం (70), అతని అల్లుడు బిరాదర్ జగన్నాథం (40), కూతురు రేణుక (34), మనుమడు వినయ్‌కుమార్ (14) సోమవారం మోటారు సైకిల్‌పై పొలానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో బీదర్–జహీరాబాద్ రోడ్డుపై జహీరాబాద్ నుంచి బీదర్ వైపు వేగంగా వెళ్తున్న ఔరాద్ డిపో బస్సు మోటారు సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటారు సైకిల్‌పై వెళ్తున్న వారు చెల్లాచెదురుగా పడిపోయారు. సిద్రాం అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్ర గాయాలైన జగన్నాథం, రేణుక, వినయ్‌కుమార్‌లను సమీపంలోని బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే వీరంతా మృతి చెందారు. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. సంఘటన స్థలాన్ని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ హన్మంత్ పరిశీలించారు.

గత పదేళ్లలో తెలంగాణకు 1.5 లక్షల గృహాలే: చామల



సాక్షి, న్యూఢిల్లీ: గత పదేళ్లలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా తెలంగాణకు కేవలం 1.58 లక్షల ఇళ్లను మాత్రమే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకోలేక రాష్ట్రానికి కేటాయించిన గృహాల కోసం పోరాడటంలో విఫలమయ్యిందని విమర్శించారు. కాగా ఇప్పుడు రాష్ట్రంలో దాదాపు 33.88 లక్షల గృహాలు అవసరం ఉన్నాయని అన్నారు. వచ్చే ఐదేళ్లలో 1 కోటి గృహాలను నిర్మించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రణాళికల్లో తెలంగాణకు కనీసం 6 లక్షల గృహాలను కేటాయించాలని చామల కోరారు. సోమవారం ఢిల్లీలో జరిగిన గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చామల రాష్ట్ర అవసరాలను చర్చించారు.

యాదాద్రికి ఇద్దరు డీఎంహెచ్‌వోలా?

- 'సాక్షి'కథనానికి వివరణ

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లాకు ఇద్దరు డీఎంహెచ్‌వోలు ఉన్నారా... వైద్య, ఆరోగ్యశాఖ ఇచ్చిన వివరణ లేఖను చూస్తే అలాగే అనుకోవాల్సి వస్తుంది. ఈ నెల నాలుగో తేదీన 'సాక్షి'మెయిన్ పేజీలో 'డీఎంహెచ్‌వోలే మింగేశారా?'శీర్షికన ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం నుంచి వివరణ ఇచ్చారు. అందులో యాదాద్రి జిల్లాకు చెందిన డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద పేరుతో వచ్చిన వివరణ కాపీని జత చేశారు. ఆ వివరణలో డాక్టర్ పాపారావు యాదాద్రి నుంచి బదిలీపై రంగారెడ్డి జిల్లాకు వెళ్లారని, అయితే ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం నుంచి ఉత్తర్వులు రాకపోవడం వల్ల ఆయనే జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్నారని ఆమె అందులో పేర్కొన్నారు. పైగా డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద తన లెటర్ హెడ్‌పైనే ఇలా రాయడం గమనార్హం. అక్కడకు బదిలీపై వెళ్లిన అధికారి ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా ఉంటే, ఆమె లెటర్ హెడ్‌పై డీఎంహెచ్‌వో అని ఎందుకు ఉందనేది ప్రశ్న? డాక్టర్ పాపారావు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వర్తించి, ఈ ఏడాది జూలైలో జరిగిన సాధారణ బదిలీల్లో ఆయన రంగారెడ్డి జిల్లాకి వెళ్లారని ఆమె పేర్కొన్నారు. కాగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని 99 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్వహణకు రూ. 50 వేల చొప్పున రూ. 49.50 లక్షలు వచ్చాయన్నారు. కానీ ఇప్పటివరకు 15 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు చెందినవారు బ్యాంకు ఖాతాలు తెరవలేదన్నారు. దీంతో ఆ మొత్తం బడ్జెట్ జిల్లా అకౌంట్‌లోనే ఉన్నాయని చెప్పారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో కంటి వెలుగు క్యాంపు నిర్వహణకు రూ. 17.72 లక్షలు జిల్లా ట్రెజరీ కార్యాలయం ద్వారా చెల్లించాల్సిందిగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. టోకెన్ నంబర్లు తయారు చేసి జిల్లా ట్రెజరీ కార్యాలయానికి సమర్పించామని, కానీ ఆ టోకెన్ నంబర్లను ట్రెజరీ కార్యాలయం తిరస్కరించిందని చెప్పారు. కంటి వెలుగు బడ్జెట్ ఇప్పటికి రాష్ట్ర ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉందని ఆమె పేర్కొన్నారు.

- బీసీ, ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1502.83 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కోర్సులకు వేరు వేరుగా నిధులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఆర్థిక సాయం

- పథకం అమలు మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 2023 డిసెంబర్ 7 తర్వాత మరణించిన కార్మికుల కుటుంబాలకు వర్తింపు

సాక్షి, హైదరాబాద్: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడ మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. ఈ పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి విడుదల చేశారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, కతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాలకు వలస వెళ్లి అక్కడ వివిధ కారణాలతో మరణించిన వారి కుటుంబాన్ని ఆదుకునే క్రమంలో ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. గతేడాది డిసెంబర్ 7వ తేదీ తరువాత మరణించిన కార్మికుల కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేయనుంది. ఈ పథకం అమలు బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. పథకం కింద వచ్చిన దరఖాస్తులు పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాత బాధిత కుటుంబానికి రూ.5లక్షలు సాయం అందించాలని సూచిస్తూ ఇందుకు సంబంధించి ప్రత్యేక పద్దును కేటాయిస్తున్నట్లు తెలిపింది. ఈ ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు డీబీటీ పద్ధతిలో ఇవ్వాలని వివరించింది.

అర్హతలు: గల్ఫ్ దేశంలో మరణించిన కార్మికుడి భార్య, తల్లిదండ్రులు, పిల్లలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశించిన ఏడు దేశాల్లో మాత్రమే 2023 సంవత్సరం డిసెంబర్ 7వ తేదీ తర్వాత మరణించిన కార్మికుడి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుంది.

కావాల్సిన ధ్రువపత్రాలు: గల్ఫ్ కార్మికుడి మరణ ధ్రువీకరణ పత్రం, రద్దు చేయబడిన పాస్‌పోర్టు, నిర్దేశించిన ఏడు దేశాల్లో పనిచేస్తున్నట్లు ఆధారం, దరఖాస్తుదారుడి బ్యాంకు ఖాతా వివరాలు

దరఖాస్తు ప్రక్రియ: మరణించిన గల్ఫ్ కార్మికుడి కుటుంబ సభ్యులు పూర్తిస్థాయి ధ్రువపత్రాలను నేరుగా సంబంధిత జిల్లా కలెక్టరేట్లో సమర్పించాలి. దరఖాస్తు పరిశీలన, విచారణ ప్రక్రియ కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

ఆమోదించే విధానం: కార్మికుడి కుటుంబ సభ్యుల నుంచి వచ్చిన దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత జిల్లా కలెక్టర్ ఆమోదించి రూ.5 లక్షలు విడుదల చేయాలి. విడుదల చేసిన నిధులను నేరుగా బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలి.

చెల్లింపు విధానం: జిల్లా కలెక్టర్ ఆమోదంతో విడుదల చేసిన రూ.5 లక్షల సాయాన్ని బాధితుడి కుటుంబ సభ్యుడి ఖాతాకు చెల్లిస్తారు. ఈ సమయంలో దరఖాస్తుదారుడి బ్యాంకు ఖాతా యాక్టివ్‌లో ఉండాలి.

కాలపరిమితి: కార్మికుడు మృతి చెందిన రోజు/భౌతికకాయం ఇంటికి చేరిన ఆర్నెళ్లలోపు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలి. అలా వచ్చిన దరఖాస్తును జిల్లా కలెక్టర్ వీలైనంత త్వరగా పరిశీలించి సాయాన్ని అందించాలి.

జన్యు నియంత్రణ గుట్టువిప్పిన శాస్త్రవేత్తలకు

వైద్య నోబెల్

ఆంబ్రోస్, రువ్‌కున్‌లకు సంయుక్తంగా పురస్కారం

- మైక్రో ఆర్ఎన్ఏను కనిపెట్టిన అమెరికా శాస్త్రవేత్తలు
- క్యాన్సర్ తదితర చికిత్సల్లో విప్లవాత్మక మార్పులు!



గ్యారీ రువ్‌కున్   విక్టర్ ఆంబ్రోస్

స్టాక్‌హోం: అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ పురస్కారాల సందడి మొదలైంది. 2024కు వైద్యశాస్త్రంలో నోబెల్ అవార్డును స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ మెడికల్ వర్సిటీ సోమవారం ప్రకటించింది. జన్యు నియంత్రణకు సంబంధించిన మౌలిక వ్యవస్థ అయిన మైక్రో ఆర్ఎన్ఏను కనిపెట్టిన అమెరికా శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్‌కున్‌లను నోబెల్ వరించింది. జన్యువులను, జీవక్రమాన్ని మైక్రో ఆర్ఎన్ఏ ఎలా ప్రభావితం చేస్తుంది, మొత్తంగా మనుషులతో పాటు ఇతర జీవజాలాన్ని ఎలా నియంత్రిస్తుందన్న అంశాలను వారి సంచలనాత్మక పరిశోధన లోతుగా పరిశోధించింది. జన్యు నియంత్రణకు సంబంధించి ఏకంగా సరికొత్త సూత్రాన్నే ఇది వెలుగులోకి తెచ్చిందంటూ నోబెల్ కమిటీ ప్రశంసించింది. జీవుల ఎదుగుదల, పనితీరుకు సంబంధించిన మౌలికాంశాలను మరింత లోతుగా అర్థం చేసుకునేందుకు వీలు కల్పిస్తుందని పేర్కొంది. ఈ పరిశోధన ఫలితాలు క్యాన్సర్ చికిత్సలో కొత్త ద్వారాలను తెరిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్టు లండన్ ఇంపీరియల్ కాలేజీలో మాలిక్యులార్ అంకాలజీ లెక్చరర్ డాక్టర్ క్లెయిరీ ఫ్లెచర్ వెల్లడించారు. చర్మ క్యాన్సర్ చికిత్సలో వీటి పనితీరుపై ఇప్పటికే క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నట్టు ఆమె తెలిపారు. ''ఈ పరిశోధనల ద్వారా జన్యువుల ప్రవర్తనను నియంత్రించేందుకు కొత్త మార్గం తెరుచుకుంది. తద్వారా పలు రకాల వ్యాధుల తీరుతెన్నులను ఎప్పటికప్పుడు కనిపెట్టడంతో పాటు చికిత్సకు కూడా వీలు కలుగుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న థెరపీల్లో చాలావరకు కణజాలంలోని ప్రొటీన్లను లక్ష్యంగా చేసుకున్నవే. అలాగాక మైక్రో ఆర్ఎన్ఏ స్థాయిలో జోక్యం చేసుకోగలిగితే జన్యువులను నేరుగా నియంత్రించవచ్చు. తద్వారా ప్రభావవంతమైన ఔషధాల అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకుంటాయి'' అని వివరించారు. ఆంబ్రోస్ ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ మెడికల్ స్కూల్‌లో నాచురల్ సైన్స్ ప్రొఫెసర్. రువ్‌కున్ హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో జెనెటిక్స్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. బహుమతితో పాటు వారికి 10 లక్షల డాలర్ల నగదు పురస్కారం అందనుంది. నోబెల్ పురస్కారాల ప్రకటన అక్టోబర్ 14 దాకా కొనసాగనుంది. మంగళవారం ఫిజిక్స్, బుధవారం కెమిస్ట్రీ, గురువారం సాహిత్య నోబెల్ అవార్డులను ప్రకటిస్తారు. అక్టోబర్ 14న ఆర్థిక శాస్త్రంలో నోబెల్ ప్రకటన ఉంటుంది. విజేతలకు డిసెంబర్ 10న పురస్కారాలను ప్రదానం చేస్తారు.

ఏమిటీ మైక్రో ఆర్ఎన్ఏ?

ఆంబ్రోస్, రువ్‌కున్ కనిపెట్టిన ఈ మైక్రో ఆర్ఎన్ఏను సూక్ష్మ జన్యుపదార్థ సమూహంగా చెప్పవచ్చు. కణజాల స్థాయిలో జన్యువుల పనితీరును నియంత్రించడంలో, మార్చడంలో దీనిది కీలక పాత్ర. ఒకవిధంగా ఇది కణజాల స్విచ్చుగా పని చేస్తుంది. కణాలన్నింట్లోనూ ఉండేది ఒకలాంటి క్రోమోజోములే. అయినప్పటికీ జీవుల్లో నరాలుగా, కండరాలుగా వేటికవే ప్రత్యేక లక్షణాలతో ఈ కణాలు అభివృద్ధి చెందుతాయి. జీవ వికాసానికి అత్యంత కీలకమైన ఈ తేడాలకు జన్యు నియంత్రణే కారకంగా నిలుస్తుంది. డీఎన్ఏ నుంచి ఆర్ఎన్ఏకు వెళ్లే జన్యు సమాచారం రూపంలో ఈ నియంత్రణ జరుగుతుందని ఆంబ్రోస్, రువ్‌కున్ కనిపెట్టారు. ఈ సూక్ష్మ ఆర్ఎన్ఏ తాలూకు సంతులనంలో తేడాలే క్యాన్సర్ తదితర వ్యాధులకు కారణమని తేలింది. ''కొన్ని కణాల్లో నిర్దిష్ట జన్యువు, లేదా జన్యువులు మరీ ఎక్కువగా పని చేయడమో, ఉత్పరివర్తనం చెందడమో వ్యాధిగా పరిణమిస్తుంది. సదరు జన్యు కార్యకలాపాన్ని మార్చగలిగే మైక్రో ఆర్ఎన్ఏను ఎంపిక చేసుకోవడం ద్వారా వ్యాధిగ్రస్త కణాల్లో ఉత్పరివర్తనాలను అరికట్టవచ్చు. మరోలా చెప్పాలంటే వ్యాధిని రూపుమాపవచ్చు'' అని డాక్టర్ ఫ్లెచర్ వివరించారు. ఈ కోణంలో సూక్ష్మ ఆర్ఎన్ఏ ఉనికిని కనిపెట్టిన ఆంబ్రోస్, రువ్‌కున్ ఆవిష్కరణకు ఎనలేని ప్రాధాన్యముందన్నారు.

ఏ కష్టమొచ్చినా మేమున్నాం

- మాల్దీవులకు భరోసా ఇచ్చిన ప్రధాని మోదీ
- ఆ దేశాధ్యక్షుడితో కలిసి మాల్దీవుల్లో రూపే కార్డు సేవల ప్రారంభం
- రూ. 3,360 కోట్ల ఆర్థికసాయం



సోమవారం ఢిల్లీలో మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జుతో మోదీ

న్యూఢిల్లీ: చైనా పంచన చేరి భారత్‌పై ద్వేషం పెంచుకున్న మాల్దీవులు ఇప్పుడు మళ్లీ భారత్‌తో మైత్రి బంధం బలోపేతానికి ముందడుగు వేసింది. పెట్టుబడులు, పర్యాటకం ద్వారా తమ ఆర్థికాభివృద్ధికి తోడ్పాడాలని స్నేహహస్తం అందించింది. నాలుగు నెలల వ్యవధిలోనే మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారత్‌లో రెండోసారి పర్యటించడం ఈ పెనుమార్పుకు అద్దం పడుతోంది. స్నేహహస్తం అందించిన ఏ దేశానికైనా సాదర స్వాగతం పలికే భారత్ మరోసారి తన స్నేహశీలతను చాటుకుంది. వేల కోట్ల రూపాయల ఆర్థికసాయం అందిస్తూనే మాల్దీవుల్లో సోమవారం రూపే కార్డు సేవలను ప్రారంభించింది. మాల్దీవుల్లో ఎయిర్‌పోర్టుల అభివృద్ధి ప్రాజెక్ట్, ఇరుదేశాల మధ్య మరింత అనుసంధానత, పర్యాటకం వృద్ధి కోసం భారత ప్రధాని మోదీ, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు సమాలోచనలు జరిపారు. సోమవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్ వీరి ద్వైపాక్షిక భేటీకి వేదికైంది. తొలుత రాష్ట్రపతి భవన్‌లో ముయిజ్జుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వాగతం పలికారు. తర్వాత మోదీ, ముయిజ్జు ద్వైపాక్షిక చర్చలు జరిపాక ఇద్దరూ సంయుక్త ప్రకటన విడుదలచేశారు. మాల్దీవులకు దాదాపు రూ.3,360 కోట్ల ఆర్థికసాయం ప్రకటించారు.

సాయం చేసేందుకు సదా సిద్ధం

'' మాల్దీవులు మాకు అత్యంత సమీప పొరుగు దేశం. భారత పొరుగుదేశాల విధానం, సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ది రీజియన్(సాగర్) దార్శనికతలో మాల్దీవులు మాకు అత్యంత ప్రధానం. మాల్దీవులపై భారత్ ఎల్లప్పుడూ స్నేహభావాన్నే వెదజల్లింది. గతంలో ఎప్పుడు కష్టమొచ్చినా మొట్టమొదట ఆదుకునేందుకు భారతే ముందుకొచ్చింది. కోవిడ్ సంక్షోభకాలంలోనూ ఆదుకున్నాం. పొరుగుదేశంగా అన్ని బాధ్యతల్ని నెరవేర్చాం. ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు మేమున్నాం'' అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా మాల్దీవుల్లో రూపే కార్డ్ సర్వీసులను మోదీ, ముయిజ్జులు వర్చువల్‌గా ప్రారంభించారు.

700 ఇళ్ల అప్పగింత

రూ.3,000 కోట్ల విలువైన దిగుమతులను స్థానిక కరెన్సీల్లో చెల్లించేలా ఇరుదేశాలు ఒక అంగీకారానికి వచ్చాయి. హనీమధో ఎయిర్‌పోర్ట్‌లో నూతన రన్‌వేనూ ప్రారంభించారు. హల్‌హమేల్‌లో నిర్మించిన 700 ఇళ్లను భారత్ మాల్దీవులకు అప్పగించింది. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న మాల్దీవుల్లో పోర్టులు, రోడ్ల నెట్‌వర్క్, పాఠశాలలు, గృహ ప్రాజెక్టుల్లో సాయపడేందుకు భారత్ అంగీకారం తెలిపింది.

థాంక్యూ మోదీజీ: ముయిజ్జు

ఆర్థిక సాయం ప్రకటించిన భారత్‌కు మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు కృతజ్ఞతలు తెలిపారు. '' కష్టకాలంలో కీలక భాగస్వామిగా భారత్ మమ్మల్ని ఆదుకుంటోంది. పర్యాటకం అభివృద్ధికి భారత్ సాయపడాలి. ఎందుకంటే మాల్దీవుల్లో పర్యాటకానికి భారతే ప్రధాన వనరు. పెద్ద ఎత్తున భారతీయులు మా దేశంలో పర్యటించాలి'' అని ముయిజ్జు అన్నారు. ఈ సందర్భంగా తమ దేశంలో పర్యటించాలని ప్రధాని మోదీని ముయిజ్జు కోరారు. మంగళవారం ఆగ్రా, ముంబైలో, బుధవారం బెంగళూరులో ముయిజ్జు పర్యటిస్తారు.



వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా

మానవ హక్కుల్ని కాలరాశారు

- ఉల్లంఘనల్లో నక్సల్స్ టాప్
- రెండేళ్లలో నక్సల్స్‌ను రూపుమాపుతాం
- తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రల పనితీరు అద్భుతం
- వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సుల్లో అమిత్ షా వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో మానవహక్కుల్ని నక్సల్స్ దారుణంగా ఉల్లంఘిస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆరోపించారు. 2026 మార్చికల్లా నక్సల్స్‌ను అంతంచేస్తామని ప్రకటించారు. నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా పరిస్థితిపై సమీక్ష, నక్సల్స్ ఏరివేతకు ఉమ్మడి వ్యూహం, నక్సల్స్ ప్రభావిత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, అందుకు కేంద్రం సాయం తదితర అంశాలపై సోమవారం అమిత్ షా నేతృత్వంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, జార్ఖండ్, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్య కార్యదర్శులు, డీజీపీలు, కేంద్ర మంత్రులు, కేంద్ర సాయుధ బలగాల, ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ''దేశంలో గిరిజనులుసహా 8 కోట్ల మంది ప్రజలకు అభివృద్ధి, కనీస సంక్షేమ అవకాశాలు దక్కకుండా నక్సల్స్ దారుణంగా మానవహక్కుల్ని ఉల్లంఘిస్తున్నారు. అటవీ, మారుమూల ప్రాంతాలకు విద్య, ఆరోగ్యం, అనుసంధానత, బ్యాంకింగ్, పోస్టల్ సేవలు అందకుండా అడ్డుకుంటున్నారు. అభివృద్ధికి అవరోధంగా తయారయ్యారు'' అని అమిత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''భద్రతాబలగాలు గతంలో రక్షణాత్మక ధోరణిని అవలంబించేవి. ఇప్పుడు దీటుగా సమాధానమిస్తున్నాయి. ఇటీవలికాలంలో బలగాలు ఘన విజయాలను సాధించాయి'' అని ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్‌ను అమిత్ షా పరోక్షంగా ప్రస్తావించారు. '' నక్సల్స్‌తో పోరాటం తుది అంకానికి చేరుకుంది. అందరి సహకారంతో 2026 మార్చికల్లా నక్సల్స్‌ను రూపుమాపుతాం. దీంతో దశాబ్దాల సమస్యకు ముగింపు పలుకుతాం. మావోయిస్టుల ప్రభావిత గిరిజన, ఆదివాసీ ప్రాంతాలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందిస్తూనే మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై దృష్టి పెట్టినప్పుడు నక్సలిజాన్ని అడ్డుకోగలం. పోలీస్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర పనితీరు అద్భుతం. ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేయడంలో గ్రేహౌండ్స్ పైచేయి సాధించింది. 2022 ఏడాదిలో గత 30 ఏళ్లలో ఎన్నడూలేనంతగా వామపక్ష ప్రభావిత హింసకారణంగా మరణాలు వందలోపునకు దిగొచ్చాయి. ఇప్పటిదాకా ఈశాన్య రాష్ట్రాలు, కశ్మీర్, వామపక్ష ప్రభావిత ప్రాంతాల నుంచి 13,000 మంది హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. ఇకనైనా నక్సల్స్ ఆయుధాలు వీడాలి'' అని అమిత్ షా పిలుపునిచ్చారు.

ఛత్తీస్‌గఢ్ విజయం స్ఫూర్తిదాయకం


''ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అన్ని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో కొత్త అభివృద్ధి ప్రచారాన్ని ప్రారంభించింది. ఇది రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలను గిరిజనులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఛత్తీస్‌గఢ్‌లో ఈఏడాది జనవరి నుంచి ఇప్పటిదాకా 237 మంది నక్సలైట్లు చనిపోయారు. 812 మంది అరెస్టయ్యారు. 723 మంది నక్సలైట్లు లొంగిపోయారు'' అని వివరించారు.

తగ్గిన హింసాత్మక ఘటనలు

''ఇటీవలికాలంలో నక్సల్స్ హింసాత్మక ఘటనలు గణనీయంగా తగ్గాయి. నక్సల్స్ హింస ఘటనలు 16,463 నుంచి 7,700కి దిగొచ్చాయి. పౌరులు, భద్రతా సిబ్బంది మరణాలు 70శాతం తగ్గాయి. హింస బారినపడిన జిల్లాల సంఖ్య 96 నుంచి 16కు తగ్గింది. తమ పరిధిలో హింసాత్మక ఘటనలు జరుగుతున్న పోలీసు స్టేషన్ల సంఖ్య 465 నుంచి 171కి తగ్గింది. ఇది కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి ప్రయత్నాల ఫలితం. నక్సలిజం రూపుమాపేందుకు తీసుకునే చర్యల పురోగతిని సీఎంలు నెలకోసారి సమీక్షించాలి. డీజీపీలు ప్రతి 15 రోజులకే సమీక్ష జరపాలి'' అని అమిత్ సూచించారు.

నేను బాగానే ఉన్నా


అనారోగ్యం బారిన పడ్డారన్న వార్తలపై స్పందించిన రతన్ టాటా



న్యూఢిల్లీ: దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ సంస్థ గౌరవ చైర్మన్ రతన్ టాటా ఆరోగ్యంపై వెల్లువెత్తిన వదంతులపై ఆయనే స్వయంగా సమాధానమిచ్చారు. రక్తపోటు తగ్గడంతో సోమవారం తెల్లవారుజామున ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రికి రతన్ టాటా వెళ్లారు. దీంతో 86 ఏళ్ల రతన్ ఆయన ఆరోగ్యం బాగోలేదని, ఐసీయూలో చేరారని జాతీయ మీడియాలో వెంటనే కథనాలు వెలువడ్డాయి. వీటిపై ఆయన తన సామాజిక మాధ్యమం ఖాతా 'ఎక్స్'లో స్పందించారు. '' నా ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వృద్ధాప్యంతో తలెత్తిన అనారోగ్య సమస్యల కారణంగా చెకప్ కోసం ఆస్పత్రికి వెళ్లా. నేను బాగానే ఉన్నా. మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదు'' అని ఆయన స్పష్టంచేశారు. టాటా సన్స్‌కు 1991 మార్చి నుంచి 2012 డిసెంబర్ 28దాకా రతన్ చైర్మన్‌గా కొనసాగారు. 1991లో రూ.10వేల కోట్ల టర్నోవర్ ఉన్న సంస్థను మహా సామ్రాజ్యంగా విస్తరించారు. ఈయన సారథ్యంలో 2011–12 ఆర్థికసంవత్సరం నాటికే 100.09 బిలియన్ డాలర్ల రెవెన్యూ సాధించే స్థాయికి సంస్థ ఎదిగింది. టెట్లీ, కోరస్, జాగ్వార్ ల్యాండ్‌రోవర్ ఇలా భిన్నరంగాల పలు దిగ్గజ అంతర్జాతీయ సంస్థలను టేకోవర్ చేశారు. వ్యాపారాలను విస్తరించడంతో ఇప్పుడు సంస్థ ఆదాయంలో సగభాగం విదేశాల నుంచే వస్తోంది.

ప్రజా సేవలో 23 ఏళ్లు

'వికసిత్ భారత్'లక్ష్యం కోసం కృషి చేస్తానన్న మోదీ



న్యూఢిల్లీ: వికసిత్ భారత్ లక్ష్యం సాకారమయ్యే వరకు మరింత దీక్షతో, అవిశ్రాంతంగా కృషి చేస్తానని ప్రధాని మోదీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఎంతో సాధించినా చేయాల్సింది ఇంకా చాలా ఉందన్నారు. గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా ప్రజా ప్రస్థానంలో సోమవారంతో 23 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న మోదీ సోమవారం ఈ మేరకు 'ఎక్స్'లో పలు పోస్టులు పెట్టారు. ప్రభుత్వాధిపతిగా తనకు బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, 23 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న మోదీని బీజేపీ ప్రశంసల్లో ముంచెత్తింది. 'ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా జీవితానికి నేటితో 23 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రజా సేవ ప్రయాణం ఒక వ్యక్తి తన జీవితాంతం దేశం, ప్రజల సంక్షేమం కోసం ఎలా అంకితం చేయగలడనే అపూర్వ అంకితభావానికి, సజీవ చిహ్నం'అని హోం మంత్రి అమిత్ షా 'ఎక్స్'లో పేర్కొన్నారు. 2001 అక్టోబర్ 7న మోదీ మొట్టమొదటిసారిగా గుజరాత్ సీఎంగా ప్రమాణం చేశారు. 2014లో ప్రధానిగా పగ్గాలు చేపట్టక మునుపు సీఎం పోస్టులో 13 ఏళ్లపాటు కొనసాగారు. ఈ ఏడాది జూన్‌లో మూడో విడత ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

ఢిల్లీలో సబ్సిడీ రేటుకే

కేజీ టమాటా రూ.65కే విక్రయాలు ప్రారంభించిన కేంద్రం



సాక్షి, న్యూఢిల్లీ: టమాటాలను అధిక ధరలకు విక్రయిస్తూ సామాన్యుల జేబుకు చిల్లు పెడుతున్న దళారుల ధరల దోపిడీ నుంచి సామాన్యులకు కాస్తంత ఉపశమనం కల్పించే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఢిల్లీ సహా జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్)లో సబ్సిడీ ధరకే కేజీ రూ.65కు టమాటాలు విక్రయిస్తోంది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే సోమవారం ఢిల్లీలో మొబైల్ వ్యాన్లను జెండా ఊపి ప్రారంభించారు. మరో నాలుగు రోజుల్లో ధరలు తగ్గుముఖం పడతాయని నిధి ఖరే చెప్పారు. నేషనల్ కోఆపరేటివ్ కన్జూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్సీసీఎఫ్) కు చెందిన వ్యాన్‌లో ఢిల్లీసహా శివారులోని 56 ప్రాంతాల్లో రూ.65కే టమాటాలు విక్రయిస్తున్నారు. టమాటా పండించే ప్రధాన రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఇటీవల తుపాన్లు, వరదల కారణంగా టమాటా దిగుబడి బాగా తగ్గింది. దీంతో దళారులు ఒక్కసారిగా టమాటా రేటు పెంచేశారు. ప్రస్తుతం ఢిల్లీసహా రాజధాని శివారు ప్రాంతాల్లో కిలో టమాటా ధర రూ.100 నుంచి రూ.120 పలుకుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలకు నేరుగా హోల్‌సేల్ మార్కెట్‌ల నుంచి కొనుగోలు చేసి టమాటా కిలో రూ.65కే అందించాలని కేంద్రం నిర్ణయించడం తెల్సిందే.

కరాచీ ఎయిర్‌పోర్టు వద్ద పేలుడు

ఇద్దరు చైనీయులు మృతి ● 8 మందికి గాయాలు

● తమదే బాధ్యతన్న బలూచ్ లిబరేషన్ ఆర్మీ



కరాచీ ఎయిర్ పోర్ట్ వద్ద తగలబడుతున్న కార్లు

కరాచీ: పాకిస్తాన్‌లో కరాచీ విమానాశ్రయం వద్ద ఆదివారం రాత్రి సంభవించిన భారీ పేలుడులో ఇద్దరు చైనీయులు ప్రాణాలు కోల్పోయారు. పాక్, చైనాలకు చెందిన మరో 8 మంది సిబ్బంది గాయపడ్డారు. బాధితుల్లో చైనా కాన్వాయ్‌కి భద్రత కల్పిస్తున్న పాక్ అధికారులున్నట్లు మీడియా తెలిపింది. అయితే, ఈ ఘటనలో చనిపోయిన, గాయ పడిన పాకిస్తాన్ జాతీయుల వివరాలను ప్రభుత్వం వెల్లడించలేదు. ఘటనా ప్రాంతంలో దట్టంగా కమ్ముకున్న పొగలు, మంటల్లో కార్లు తగులబడుతున్న దృశ్యాలను స్థానిక మీడియా ప్రసారం చేసింది. కాగా, ఘటనకు తమదే బాధ్యతని బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించుకుంది. ఉగ్రవాదులు ఆ ప్రాంతంలోకి ఎలా చొరబడ్డారన్న విషయమై భద్రతాధికారులు దర్యాప్తు చేపట్టారు. ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన చైనా ఇంజినీర్లు, వ్యాపారుల కాన్వాయ్ లక్ష్యంగా తమ ఆత్మాహుతి సభ్యుడు దాడికి పాల్పడినట్లు వెల్లడించింది. చైనా–పాకిస్తాన్ జాయింట్ వెంచర్‌లో కొనసాగుతున్న పవర్ ప్రాజెక్టు చైనా సిబ్బంది దాడికి గురయ్యారని ఇస్లామాబాద్‌లోని చైనా ఎంబసీ తెలిపింది. చైనా, రష్యాలు ఏర్పాటు చేసిన షాంఘై సహకార సంస్థ(ఎస్సీవో) శిఖరాగ్రం మరో వారం రోజుల్లో పాక్‌లో జరగనుండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

జైలుకు ఈశ్వరన్

బాబు 'అమరావతి పార్టనర్'కు అవినీతి కేసులో ఏడాది శిక్ష



సింగపూర్: అవినీతి కేసులో దోషిగా రుజువైన సింగపూర్ మాజీ మంత్రి, ఏపీ సీఎం చంద్రబాబు 'అమరావతి పార్ట్‌నర్' ఎస్.ఈశ్వరన్ (62) సోమవారం జైలుకు వెళ్లారు. మంత్రిగా ఇద్దరు వ్యాపారవేత్తల నుంచి ఏడేళ్ల కాలంలో ఆయన 3.12 లక్షల డాలర్ల విలువైన అక్రమ కానుకలు స్వీకరించడం నిజమేనని కోర్టు తేల్చడం, ఏడాది జైలు శిక్ష విధిస్తూ గత గురువారం తీర్పు వెలువరించడం తెలిసిందే. ఇప్పటికే నేరాన్ని అంగీకరించిన ఈశ్వరన్ కోర్టు తీర్పుపై అపీలుకు వెళ్లకుండా శిక్ష అనుభవించేందుకే మొగ్గు చూపారు. ''నా చర్యలకు పూర్తి బాధ్యత వహిస్తున్నా. సింగపూర్‌వాసులందరికీ బేషరతుగా క్షమాపణలు చెబుతున్నా'' అంటూ సోమవారం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. అనంతరం శిక్ష అనుభవించేందుకు జైలుకు వెళ్లారు. ఏపీలో రాజధాని అమరావతి పేరిట 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో జరిగిన భూ దోపిడీలో ఈశ్వరన్ కూడా కీలక పాత్రధారి అన్నది తెలిసిందే.

యుద్ధానికి ఏడాది పూర్తయిన వేళ...

పరస్పర దాడులు

హైఫాపై హెజ్‌బొల్లా క్షిపణుల వర్షం

- బీరూట్‌పై ఇజ్రాయెల్ ప్రతి దాడులు
- 10 మంది అగ్నిమాపక సిబ్బంది బలి
- ఇంకా శిథిలాల కిందే చాలామంది
- గాజాలో 20 మందికి పైగా మృతి

రెయిమ్ (ఇజ్రాయెల్)/బీరూట్: గాజాపై ఇజ్రాయెల్ దాడులకు ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం పశ్చిమాసియా దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లింది. ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా నిప్పుల వర్షం కురిపించింది. టెల్ అవీవ్‌తో పాటు పోర్ట్ సిటీ హైఫాపై తెల్లవారుజామున ఫాది 1 క్షిపణులు ప్రయోగించింది. తమపైకి 130కి పైగా క్షిపణులు దూసుకొచ్చినట్టు ఇజ్రాయెల్ పేర్కొంది. ''వాటిలో ఐదు మా భూభాగాన్ని తాకాయి. రోడ్లు, రెస్టారెంట్లు, ఇళ్లను ధ్వంసం చేశాయి'' అని సైన్యం ధ్రువీకరించింది. పది మందికి పైగా గాయపడ్డట్టు పేర్కొంది. అటు హమాస్ కూడా ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు ప్రయోగించింది. దాంతో గాజా సరిహద్దు సమీప ప్రాంతాల్లోనే గాక టెల్ అవీవ్‌లో కూడా సైరన్ల మోత మోగింది. జనమంతా సురక్షిత ప్రదేశాలకు పరుగులు తీశారు. దాంతో అటు లెబనాన్, ఇటు గాజాపై ఇజ్రాయెల్ మరింతగా విరుచుకుపడింది. బీరూట్‌తో పాటు దక్షిణ లెబనాన్‌లోని బరాచిత్‌పై భారీగా వైమానిక దాడులు చేసింది. బీరూట్‌లో పలుచోట్ల ఇళ్లు, నివాస సముదాయాలు నేలమట్టమయ్యాయి. జనం కకావికలై పరుగులు తీశారు. దాంతో విమానాశ్రయం తదితర ప్రాంతాలు శ్మశానాన్ని తలపిస్తున్నాయి. బరాచిత్‌లో సహాయ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్న 10 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది వైమానిక దాడులకు బలైనట్టు లెబనాన్ ప్రకటించింది. భవనాల శిథిలాల కింద చాలామంది చిక్కుకున్నారని, మృతుల సంఖ్య భారీగా పెరగవచ్చని పేర్కొంది. దక్షిణ లెబనాన్‌లో మరో 100 గ్రామాలను ఖాళీ చేయాల్సిందిగా స్థానికులను తాజాగా హెచ్చరించింది. సరిహద్దుల వద్ద సైనిక మోహరింపులను భారీగా పెంచుతోంది. గాజాలో జాబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ సైన్యం బాంబులతో విరుచుకుపడింది. దాంతో 9 మంది బాలలతోపాటు మొత్తం 20 మంది దాకా మరణించారు. ఖాన్ యూనిస్ ప్రాంతాన్ని తక్షణమే ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిందిగా సైన్యం హెచ్చరికలు జారీ చేసింది.

మేం విఫలమైన రోజు

ఏడాది కింద హమాస్ ముష్కరులు సరిహద్దుల గుండా చొరబడి తమపై చేసిన పాశవిక దాడిని ఇజ్రాయెలీలు భారమైన హృదయాలతో గుర్తు చేసుకున్నారు. దేశమంతటా ప్రదర్శనలు చేశారు. టెల్ అవీవ్‌లో హైవేను దిగ్బంధించారు. ''ప్రజల ప్రాణాల పరిరక్షణలో మేం విఫలమైన రోజిది'' అంటూ ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ హెర్జ్ హలేవీ ఆవేదన వెళ్లగక్కారు.



సోమవారం బీరూట్‌పై ఇజ్రాయెల్ దాడులు



ఖాన్ యూనిస్‌లో మంటలార్పుతున్న సిబ్బంది

ఇరాన్ భూగర్భ అణుపరీక్షలు?

ఆ భూకంపం వాటి ఫలితమేనా?

టెహ్రాన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను ఇరాన్ మరింత పరాకాష్టకు తీసుకెళ్తోందా? అందులో భాగంగా తాజాగా అణు పరీక్షలు నిర్వహించిందా? అక్టోబర్ 5న శనివారం రాత్రి ఇరాన్, ఇజ్రాయెల్ భూభాగాల్లో దాదాపుగా ఒకే సమయంలో సంభవించిన భూకంపం ఈ అనుమానాలకు తావిస్తోంది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 10:45 ప్రాంతంలో ఇరాన్‌లోని అరదాన్ నగర సమీపంలో సంభవించిన ఈ భూకంప తీవ్రత 4.5గా నమోదైంది. అక్కడికి 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో కూడా ప్రకంపనలు చోటుచేసుకున్నట్టు అమెరికా భూభౌతిక సర్వే విభాగం ధ్రువీకరించింది. తర్వాత కొద్ది నిమిషాలకే ఇజ్రాయెల్‌లోనూ ప్రకంపనలు కన్పించాయి. ఇది భూకంపం కాదని, కచ్చితంగా భూగర్భ అణు పరీక్షల పర్యవసానమేనని విశ్లేషణలు వెల్లువెత్తుతున్నాయి. భూకంపం సంభవించింది అణు ప్లాంట్‌కు అతి సమీపంలోనే అంటూ వస్తున్న వార్తలు ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. భూకంప కేంద్రం ఉపరితలానికి కేవలం 10 కి.మీ. లోపల ఉండటం చూస్తుంటే భూగర్భ అణు పరీక్షలు జరిగి ఉంటాయని అంటున్నారు.

కశ్మీర్, హరియాణాల్లో

నేడే ఓట్ల లెక్కింపు

చండీగఢ్: హరియాణా, జమ్మూకశ్మీర్‌ల్లో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మొదలయ్యే ఈ ప్రక్రియ కోసం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల రక్షణ వ్యవస్థ ఉంటుందని తెలిపింది. జమ్మూకశ్మీర్‌లో మొత్తం మూడు విడతలుగా, హరియాణాలో ఈనెల 5న ఒకే విడతలో పోలింగ్ జరగడం తెలిసిందే.

దారుణం చేసింది

సంజయ్ ఒక్కడే !

చార్జ్‌షీట్‌లో పేర్కొన్న సీబీఐ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతాలో ఆర్‌జీ కర్ వైద్యకళాశాలలో జూనియర్ వైద్యురాలిపై రేప్, హత్య ఘటనలో పౌర వలంటీర్ సంజయ్ రాయ్ ఒక్కడే నిందితుడని సీబీఐ పేర్కొంది. గతంలో భావించినట్లుగా సామూహిక అత్యాచారం జరగలేదంటూ కోల్‌కతాలోని సెల్దా ప్రత్యేక కోర్టులో సోమవారం తొలి చార్జ్‌షీట్ దాఖలుచేసింది. రాత్రి డ్యూటీ ముగించుకుని ఆస్పత్రి సెమినార్ రూమ్‌లో నిద్రిస్తున్న వైద్యురాలిని రాయ్ రేప్‌చేసి పాశవికంగా హత్య చేసినట్టు పేర్కొంది. ఆగస్ట్ 9 తెల్లవారుజామున 4 గంటలకు సంజయ్ సెమినార్ రూమ్‌లోకి వెళ్తున్నట్లు సీసీటీవీలో రికార్డయింది. గదిలో అతని బ్లూటూత్ లభించడంతో పోలీసులు అతడిని ఆగస్ట్ 19న అరెస్ట్‌చేశారు. విచారణలో సంజయ్ నేరాన్ని అంగీకరించిన సంగతి తెలిసందే.

3.35 లక్షల ర్యాంకుకు ఎంబీబీఎస్ కన్వీనర్ సీటు

రెండో విడత కౌన్సెలింగ్‌లో 'బీసీ ఏ'కి చెందిన విద్యార్థికి అధిక ర్యాంకుకు ప్రైవేట్ కాలేజీలో సీటు

- ఎస్సీ కేటగిరీలోనూ గరిష్టంగా 3.11 లక్షల ర్యాంకుకు.. జనరల్ కేటగిరీలో గరిష్టంగా 1.94 లక్షల ర్యాంకుకు
- మొత్తం రెండు విడతల కౌన్సెలింగ్‌లలో 5,653 సీట్ల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధిక ర్యాంకులు వచ్చిన వారికి కూడా ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాలో సీట్లు దక్కుతున్నాయి. కన్వీనర్ కోటా రెండోవిడత కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించిన వారి వివరాలను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం ప్రకటించింది. ఈసారి బీసీ ఏ కేటగిరీలో గరిష్టంగా 3.35 లక్షల నీట్ ర్యాంకు సాధించిన విద్యార్థికి ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటా సీటు లభించింది. ఇంత పెద్ద ర్యాంకుకు సీటు రావడం రాష్ట్ర చరిత్రలో ఇదే మొదటిసారి అని కాళోజీ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి మరో ప్రైవేట్ కాలేజీలోని కన్వీనర్ కోటా సీటు లభించింది. ఎస్టీ కేటగిరీలో 2.89 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి సీటు లభించింది. బీసీ బీలో 2.27 లక్షలు, బీసీ సీలో 3.14 లక్షలు, బీసీ డీలో 2.13 లక్షలు, బీసీ ఈలో 2.24 లక్షల గరిష్ట ర్యాంకులు సాధించిన వారికి సీట్లు లభించాయి. ఇక ఓపెన్ కేటగిరీలో 1.94 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి సీటు లభించింది. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో గరిష్టంగా 1.74 లక్షల ర్యాంకు సాధించిన విద్యార్థికి సీటు రావడం గమనార్హం. మొదటి విడత కౌన్సెలింగ్‌తో పోలిస్తే, రెండో విడత కౌన్సెలింగ్‌లో అధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీట్లు లభించడం విశేషం. మొదటి విడతలో సీట్లు పొందిన అనేక మంది విద్యార్థులు జాతీయస్థాయిలోనూ ఎయిమ్స్ వంటి మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించడంతో వాటిల్లో చేరి ఉండొచ్చని అంచనా. దీంతో చాలా వరకు గరిష్ట ర్యాంకులకు రెండో విడతలో సీట్లు లభించాయి.

సీట్ల భర్తీ ఇలా....

రాష్ట్రంలో 60 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 5,653 కన్వీనర్ సీట్లు ఉండగా, మొదటి విడతలో 4,282 మందికి కన్వీనర్ కోటా సీట్లు కేటాయించారు. అందులో చేరగా మిగిలిన సీట్లకు, మొదటి విడత కౌన్సెలింగ్‌లో కేటాయించని దివ్యాంగులు తదితర సీట్లను రెండో విడత కౌన్సెలింగ్‌లో కేటాయించారు. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లన్నీ తెలంగాణ విద్యార్థులకే కేటాయిస్తుండటం, ఈ ఏడాది కొత్తగా 8 మెడికల్ కాలేజీలు అదనంగా రావడం... వాటిల్లో 400 ఎంబీబీఎస్ సీట్లు పెరగడంతో విద్యార్థులకు అవకాశాలు మరింత పెరిగాయి. దీంతో అధిక ర్యాంకు సాధించిన విద్యార్థులూ ఎంబీబీఎస్‌లో సీట్లు దక్కించుకున్నారు. ప్రభుత్వకాలేజీల్లోని అన్ని సీట్లు, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లల్లో 15 శాతం అఖిల భారత కోటా కింద భర్తీ చేస్తారు. వాటిల్లో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలితే తిరిగి వాటిని మన రాష్ట్రానికే ఇస్తారు. రెండో విడత జాబితాలో సీట్లు పొందిన విద్యార్థులకు ఆరు రోజులపాటు చేరేందుకు అవకాశం కల్పించారు. మొదటి విడతలో సీట్లు పొందినవారు కూడా తాము చేరిన కాలేజీ కంటే మరో మంచి కాలేజీలో సీట్ల కోసం ప్రయత్నించారు. దీంతో రెండో విడతలోనూ చాలామంది ఇతర కాలేజీల్లో సీట్లు పొందారు. దీంతో వారు మొదటి విడత సీటు పొందిన కాలేజీలో చేరినందున అక్కడ సర్టిఫికెట్లు తెచ్చుకోవడానికి సమయం అవసరమైనందున రెండో విడత ఎక్కువ రోజులు చేరేందుకు అవకాశం కల్పించినట్టు కాళోజీ వర్గాలు తెలిపాయి. అనంతరం సీట్లు మిగిలితే మూడు, నాలుగో విడత కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తారు.

కొండ పోచమ్మ సాగర్‌పై విజిలెన్స్ విచారణ

నీటిపారుదల శాఖలో పత్రాల కోసం సోదాలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కొండ పోచమ్మసాగర్ రిజర్వాయర్ నిర్మాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దర్యాప్తు చేపట్టింది. ఈ రిజర్వాయర్ నిర్మాణంలో అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు సోమవారం జలసౌధలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ప్యాకేజీ-14లోని కొండపోచమ్మసాగర్‌కు నీటిని తరలించే గ్రావిటీ కెనాల్, రెండు దశల పంప్‌హౌస్‌ల నిర్మాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ జరుపుతోంది. వీటికి సంబంధించి ఉన్నతస్థాయి (హైపవర్) కమిటీ నిర్ణయాలు, స్థల తనిఖీ నివేదిక, సమీక్షా సమావేశాల పత్రాలు, స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ సమావేశాల మినిట్స్ పత్రాలు, నిర్మాణ వ్యయానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన పరిపాలనా పరమైన అనుమతులు, వీటి నిర్మాణంతో ముడిపడిన ఉత్తరప్రత్యుత్తరాలు, 2008 నుంచి ఇప్పటిదాకా జరిగిన కాగ్ ఆడిట్ నివేదికలను సోదాలో తనిఖీ చేసి అధికారులు కొన్ని పత్రాలను వెంట తీసుకెళ్లారు.

మేడిగడ్డపై విచారణకు హాజరైన ఈఎన్సీ..

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ పిల్లర్లు కుంగడానికి గల కారణాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం నీటిపారుదల శాఖ ఈఎన్సీ(ఓ అండ్‌ఎం) బి.నాగేంద్రరావును విచారించారు. బరాజ్ నిర్వహణలో లోపాలు, వైఫల్యాలపై ఆయనను ప్రశ్నించినట్టు తెలిసింది. కాగా, 2019 జూన్‌లో బరాజ్ ప్రారంభం కాగా, 2021 దాకా డిఫెక్ట్ లయబిలిటీ కాలంలో ఉందని, ఆ తర్వాత మూడేళ్లపాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ చూసే బాధ్యత నిర్మాణ సంస్థదేనని ఆయన బదులిచ్చినట్లు సమాచారం. కాగా, మంగళవారం సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) మాజీ చీఫ్ ఇంజనీర్ (సీఈ) టి.శ్రీనివాస్, డైరెక్టర్ వర్క్ అకౌంట్స్ డైరెక్టర్ వి. ఫణిభూషణ్ శర్మను విజిలెన్స్ విచారించనుంది.

'గురుకులాల్లో పది పాసైతే నేరుగా ఇంటర్‌లోకి'



సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులకు నేరుగా ఇంటర్‌లో ప్రవేశాలు కల్పించనున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందన్నారు. ఇప్పటివరకు ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష నిర్వహించేవారమని, ఇకపై గురుకులంలో పదోతరగతి చదివి ఉత్తీర్ణత సాధిస్తే ఇంటర్‌లో ప్రవేశం కల్పించనున్నట్లు వివరించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కుమురం భీమ్ ఆదివాసీభవన్‌లో జరిగిన బీసీ సంక్షేమ శాఖ విస్తృతస్థాయి అధికారుల సమావేశం లో మంత్రి పొన్నం అధికారులకు పలు సూచనలు చేశారు. గురుకుల విద్యార్థులకు 8వ తరగతి నుంచే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, రెడ్‌క్రాస్‌లకు సంబంధించిన అంశాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి గురుకుల పాఠశాలలో ఎంసెట్, నీట్ కోచింగ్ ఇవ్వాలని సూచించారు. గురుకులాల్లోని సమస్యల పరిష్కారానికి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నుంచి నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 15–31 తేదీల మధ్య పేరెంట్, టీచర్ మీటింగ్ తప్పకుండా నిర్వహించాలన్నారు. గురుకుల అద్దె బకాయిల్లో 50 శాతం వారం రోజుల్లోగా చెల్లిస్తామని తెలిపారు. సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి గురుకులంలో బాక్స్ ఏర్పాటు చేసి పరిశీలించాలని ఆర్జీఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నతాధికారులు బాల మాయాదేవి, బి.సైదులు, మల్లయ్య భట్టు, ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈఆర్‌సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జున్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) చైర్మన్‌గా డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నియామకం ఫైలుపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం చేశారు. త్వరలోనే ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని వనపర్తికి చెందిన నాగార్జున్ స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్, ఆర్ఎల్డీ కాలేజీలో బీఎస్సీ చదివారు. తర్వాత గుల్బర్గాలోని ఎస్ఎస్ఎల్ కాలేజీలో లా డిగ్రీ అభ్యసించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం చేశారు. అమెరికాలో కూడా న్యాయశాస్త్రంలో పలు కోర్సులు అభ్యసించారు. 1986లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని, 1991 మే 1న జూనియర్ సివిల్ జడ్జీగా ఎంపికయ్యారు. 2004లో సీనియర్ సివిల్ జడ్జీగా పదోన్నతి పొందారు. 2019 సెప్టెంబర్ 17న కామారెడ్డి జిల్లా జడ్జీగా కూడా విధులు నిర్వర్తించారు. 2022 అక్టోబర్ 18న హైకోర్టు జడ్జీగా పదోన్నతి పొందారు. అనంతరం 2023 ఏప్రిల్ 6న మద్రాసు హైకోర్టుకు బదిలీ అనంతరం అక్కడే పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఈఆర్సీ చైర్మన్‌గా పనిచేస్తున్న తన్నీరు శ్రీరంగారావుతో పాటు ఇద్దరు సభ్యుల పదవీ కాలం ఈనెల 29తో ముగియనుంది. దీంతో ఆ రోజు సాయంత్రం కొత్త చైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్ బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలిలో డిస్కంలు 2024–25 ఆర్థిక సంవత్సరానికి దాఖలు చేసిన ఏఆర్ఆర్, వీలింగ్ చార్జీలు, టారిఫ్ ప్రతిపాదనలపై విచారణ జరుగుతోంది. ప్రస్తుత కమిటీ ఈనెల 24న చివరి బహిరంగ విచారణ జరపనుంది.

'రీజనల్' చుట్టూ సెజ్‌లు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాంతాల్లో మంచి పురోగతి మొదలైంది. డిమాండ్ పెరిగింది. కానీ ఆ రోడ్డును ఆనుకుని ప్రభుత్వానికి కొత్తగా భూవనరులేవీ సమకూరకపోవడంతో.. అదనపు ఆదాయమేదీ రాలేదు. భవిష్యత్తులో ట్రిపుల్ ఆర్ కూడా ఓఆర్ఆర్ తరహాలోనే ఆయా ప్రాంతాలకు కొత్త రూపును ఇవ్వడం ఖాయమేనని నిపుణులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఔటర్ నిర్మాణ సమయంలో ప్రభుత్వం సొంతంగా ల్యాండ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసుకోకపోవటం వంటి పొరపాటును ఇప్పుడు చేయవద్దని.. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భూమిని సేకరించి పెట్టుకోవాలని నిపుణులు ప్రభుత్వానికి సూచిస్తున్నారు.

అలైన్‌మెంట్ మార్పు నేపథ్యంలో.. : రీజనల్ రింగురోడ్డులో దక్షిణ భాగాన్ని సొంతంగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైన విషయం తెలిసిందే. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) గతంలో రూపొందించిన అలైన్‌మెంట్‌ను కాదని.. కొత్త అలైన్‌మెంట్‌ను రూపొందిస్తోంది. భూసేకరణ వ్యయంలో 50శాతం భరించటం మినహా మొత్తం నిర్మాణ వ్యయాన్ని కేంద్రమే భరించే అవకాశాన్ని కూడా కాదనుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ సాహసానికి సిద్ధమవుతోంది. ఈ క్రమంలో రింగ్‌రోడ్డును ఆదాయ వనరుగా మార్చుకునే అంశంపై దృష్టి పడింది.

బీ ఫార్మసీ, ఫార్మా-డీ కోర్సులకు కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయో టెక్నాలజీ, బయో మెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన విడుదల చేశారు. తొలిదశ కౌన్సెలింగ్‌లో ఆన్‌లైన్ పేమెంట్, స్లాట్ బుకింగ్, సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఈనెల 19 నుంచి 22వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో ఫైల్ చేయాలని, సర్టిఫికెట్ల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకున్న వారు ఈనెల 21-23 వరకు, సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత ఆప్షన్స్ ఇచ్చుకోవాలి. ఈనెల 21 నుంచి ప్రారంభించి ఆప్షన్స్ ఫ్రీజింగ్ తేదీని 25వ తేదీగా నిర్ణయించారు. ఈనెల 28న సీట్లు కేటాయిస్తారు. ఈనెల 28 నుంచి 30 వరకు ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ వెబ్‌సైట్ ద్వారా చేయాలి.ఆఖరి దశకు సంబంధించి నవంబర్ 4న ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఐదో తేదీన సర్టిఫికెట్ల తనిఖీ, ఆప్షన్స్‌ను ఐదు, ఆరు తేదీల్లో చేసుకోవచ్చు. 6వ తేదీన ఆప్షన్స్‌ను ఫ్రీజ్ చేస్తారు. సీట్ల కేటాయింపు 9వ తేదీన ఉంటుంది. 9 నుంచి 11 వ తేదీ వరకు ఫీజు చెల్లింపు, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. ఇంకా సీట్లు మిగిలితే నవంబర్ 12న స్పాట్ ప్రవేశాలు నిర్వహిస్తారు. కాగా ఈనెల 8 నుంచి http://tgeapcetb.nic.in వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నారు.

తుది దశకు 'ఎకో టూరిజం'

▶ మొదటి పేజీ తరువాయి

ఆకర్షించేందుకు వీలుగా వెబ్‌సైట్లు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మొత్తంగా తెలంగాణ ఎకో టూరిజాన్ని ఓ బ్రాండ్‌గా నిలిపేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, ఇతర ప్రదేశాల్లోనూ ఎకో టూరిజాన్ని ప్రమోట్ చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఎకో టూరిజం ప్రదేశాలను స్టడీ టూర్ కేంద్రాలుగా అభివృద్ధి చేయడంతోపాటు ఉద్యాన వనాలు, పాల ఉత్పత్తులు వంటి వాటిపై ఆధారపడి జీవించే వారికి వీటిని ఉపాధి కేంద్రాలుగా మలిచే దిశగా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఎకో టూరిజం ప్రాజెక్టులపై అటవీశాఖాపరంగా ముసాయిదా విధానం సిద్ధం కాగా, సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలన తర్వాత ప్రభుత్వపరంగా ఈ ప్రణాళికకు తుదిరూపు ఇస్తారు. ఈ మేరకు ఇటీవల ఎకో టూరిజం కన్సల్టేటివ్ కమిటీ చైర్మన్ హోదాలో అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఫైనల్ డ్రాఫ్ట్‌నకు ఆమోదం తెలిపారు. తుది అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు.

తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నోడల్ ఏజెన్సీ

ఎకో టూరిజం పాలసీ అమలుకు తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఈ కార్పొరేషన్ ద్వారానే ఎకో టూరిజం ప్రాజెక్టులను అమలు చేస్తారు. ఎకో టూరిజం ప్రాజెక్టుల ఆమోదానికి ఎకో టూరిజం ప్రాజెక్టు స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేస్తారు. ఎకో టూరిజం కేంద్రాల అభివృద్ధికి ఇతర నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వ నిధులు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్), ఇతర నిధులను సమీకరించాలని అటవీశాఖ భావిస్తోంది. మొత్తంగా ఎకో టూరిజం కేంద్రాల నిర్వహణ అనేది పూర్తిస్థాయిలో ప్రభుత్వపరంగా అటవీశాఖ ద్వారానే నిర్వహించకుండా, ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇస్తే మరింత పకడ్బందీగా అమలు చేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ దిశగా అటవీశాఖ పరంగా ఆయా అంశాలను పరిశీలించనున్నట్టు తెలుస్తోంది. అయితే ప్రకృతి సమతుల్యతకు ఏమాత్రం విఘాతం కలగకుండా ఎకో టూరిజం ప్రాజెక్టులు చేపట్టడమనేది కొంత కత్తిమీద సాము లాంటిదేనని పర్యావరణ వేత్తలు, ప్రకృతి ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. ఎకో టూరిజం పేరుతో అటవీ ప్రాంతాల్లోని జీవజాలం, వైవిధ్యానికి ఇబ్బందికరంగా మారకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని సూచిస్తున్నారు.

సింగరేణి బహుముఖ విస్తరణ...



ప్రజాభవన్ లో సింగరేణి కార్మికులకు 796 కోట్ల రూపాయల బోనస్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రులు పొంగులేటి , శ్రీధర్ బాబు. ఎమ్మెల్యేలు, వివేక్ వెంకటస్వామి, కూనంనేని సాంబశివరావు, గడ్డం వినోద్ , మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్. ప్రేమ్ సాగర్ రావు, తదితరులు.

- గ్రీన్ ఎనర్జీ, లిథియం, ఇతర ఖనిజాల రంగాలకు విస్తరణ
- సింగరేణి ప్రాంత ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు
- అత్యాధునిక వైద్య సేవలకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు
- సింగరేణి ఉద్యోగులకు రూ.796 కోట్ల లాభాల వాటా పంపిణీలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్

సింగరేణి సాధిస్తున్న లాభాల్లో కొంత పక్కనపెట్టి కంపెనీ భవిష్యత్, బహుముఖ వ్యాపార విస్తరణకు ఖర్చు చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. సింగరేణి సంస్థ మనుగడ కోసం విదేశీ కంపెనీల భాగస్వామ్యంతో లిథియం వంటి ఇతర పరిశ్రమలలోకి అడుగుపెట్టబోతోందని, థర్మల్, సోలార్ విద్యుత్ ప్లాంట్లతో పాటు ఇతర గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తులను చేపట్టనుందని వివరించారు. ప్రజాభవన్‌లో సోమవారం ఆయన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెక్కులను పంపిణీ చేశారు. వచ్చిన లాభాల్లో కొంత శాతం కొత్త గనులు ప్రారంభించడానికి, కొత్త వ్యాపారాలు చేపట్టడానికి వినియోగిస్తున్నామన్నారు. సింగరేణి కార్మికులకు లాభాల వాటా కింద సగటున ఒక్కో కార్మికుడికి 1.90 లక్షల చొప్పున రూ.796 కోట్లు, దీపావళి బోనస్ కింద ఒక్కో కార్మికుడికి రూ.93,750 చొప్పున రూ.375 కోట్లు, దసరా అడ్వాన్స్ కింద ఒక్కో కార్మికుడికి రూ.25 వేల చొప్పున రూ.90 కోట్లు మొత్తం కలిపి ఈ నెలలో రూ.1,261 కోట్లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈనెల 3న పండుగ అడ్వాన్స్ చెల్లించినట్టు పేర్కొన్నారు. దీపావళి బోనస్ కూడా పండుగకు ముందే సింగరేణి చెల్లిస్తుందని తెలిపారు. రానున్న కాలంలో బొగ్గు నిల్వలు తగ్గుతాయని, థర్మల్ విద్యుత్ కేంద్రాలపై ఆంక్షలు పెరిగే అవకాశం ఉందని, సింగరేణి బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించుకుంటేనే మరింత ఎక్కువ లాభాలు, అభివృద్ధిని సాధించగలదన్నారు. దసరాకు ముందు 11న అన్ని గనుల్లో కంపెనీ ఖర్చుతో పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేసి కార్మికులకు వాస్తవ పరిస్థితుల్ని, ఉత్పత్తి వ్యయం తగ్గింపు, భవిష్యత్ వ్యాపార విస్తరణ చర్యలను దృశ్య రూపంలో వివరించాలని అధికారులకు తెలిపారు.

ఒక్క గని కూడా పోనీయం

సింగరేణి నుంచి ఒక్క గని కూడా ఇతరులకు పోకుండా చూసే బాధ్యత ఈ ప్రభుత్వానిదే అని భట్టి విక్రమార్క ప్రకటించారు. త్వరలో సింగరేణి వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పబోతున్నామని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

రిటైర్డ్ కార్మికుల వైద్య సేవల పరిమితి రూ.10 లక్షలకు పెంపు

రిటైర్డ్ కార్మికులకు వైద్య సేవల పరిమితిని రూ.8 లక్షల నుంచి 10 లక్షలకు పెంచుతున్నట్టు భట్టి ప్రకటించారు. వారికి సొంత గృహాలకు స్థలాలు కేటాయింపుపై త్వరలో వివరాలు సేకరించి చర్చిస్తామన్నారు. రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంపుదలపై కూడా ఆలోచించి, తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సింగరేణి ప్రాంతంలో హైదరాబాద్ తరహా అత్యుత్తమస్థాయి విద్యను అందించే పాఠశాలలు ఏర్పాటు చేయాలని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేసి కార్మికులకే కాక ఇతరులకు కూడా విద్య, వైద్య సేవలు అందించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సింగరేణి సంస్థలో రూ.కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని తమ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేశామని, ఇక ముందు కూడా కార్మిక సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఎమ్మెల్యేలు కూనంనేని, గడ్డం వినోద్, గడ్డం వివేక్, ప్రేంసాగర్‌రావు, రాజ్‌ఠాకూర్, కనకయ్య, రాగమయి, గండ్ర సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఏడేళ్లలో 27 వేల మెగావాట్ల అవసరాలు: భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాబోయే ఏడేళ్లకు సరిపడా విద్యుత్ సరఫరా చేయడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రానున్న ఏడేళ్లలో విద్యుత్ గరిష్ట వినియోగం 27 వేల మెగావాట్లకు చేరే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం సచివాలయంలో ట్రాన్స్‌కో సంస్థను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం 15,700 మెగావాట్ల విద్యుత్తు పీక్ డిమాండ్ ఉందని, రాబోయే ఏడు సంవత్సరాల్లో 27 వేల మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ఆ అంచనాకు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ట్రాన్స్‌కో రాష్ట్రవ్యాప్తంగా అందిస్తున్న విద్యుత్ సరఫరా, సబ్‌స్టేషన్ల నిర్మాణం తదితర అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్ వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంసెక్రటరీ కృష్ణ భాస్కర్, జేఎండీ శ్రీనివాసరావు, డైరెక్టర్లు జి.నర్సింగరావు, జె.సూర్య ప్రకాశ్, బి.నర్సింగరావు పాల్గొన్నారు.

రుణమాఫీపై మోదీకి అబద్ధాలతో లేఖ



సాక్షి, హైదరాబాద్: 'పంటరుణాల మాఫీపై ప్రధాని మోదీకి వాస్తవాలు దాచి లేఖ రాయడం దేశ ప్రజలను మోసం చేయడం కాదా?'అని సీఎం రేవంత్ రెడ్డిని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మేలు చేసేందుకు ప్రధానికి అబద్ధాలతో రాసిన ఆ లేఖపై సీఎంతో బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఈ చర్చకు వేదిక, తేదీని సీఎం ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. 'రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ చెప్పిందేంటి?, చేసిందేంటి? వాస్తవాలపై చర్చకు సిద్ధం కావాలి'అని సవాల్ విసిరారు. బహిరంగ చర్చకు సుముఖంగా లేకపోతే రుణమాఫీతో పాటు రైతులకిచ్చిన హామీలపై చర్చకు వెంటనే అసెంబ్లీని సమావేశ పరచాలని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎంకు రాసిన బహిరంగ లేఖను మీడియాకు విడుదలచేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2023 డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షల వరకున్న పంట రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ వాస్తవం కాదా? అని నిలదీశారు. అయితే ఆరు నెలలు గడిచినా రుణమాఫీ హామీ ముందుకు పడకపోవడంతో, రైతుల్లో కాంగ్రెస్ పట్ల ఏర్పడిన ఆగ్రహం లోకసభ ఎన్నికల ఫలితాలపై పడుతుందని రేవంత్‌రెడ్డి గ్రహించారన్నారు. దీంతో ఆగస్టు 15 కల్లా రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామంటూ కనిపించిన దేవుళ్లందరిపైనా ఒట్టు పెట్టి మరీ హామీ ఇచ్చిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ప్రధాని మోదీ మహారాష్ట్ర సభలో చెబుతూ.. రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని ప్రస్తావించారన్నారు. ప్రధాని వ్యాఖ్యలు ఎన్నికల్లో మహారాష్ట్ర రైతులను ప్రభావితం చేస్తాయన్న కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాలతో రేవంత్‌రెడ్డి అబద్ధాలు వల్లెవేశారన్నారు. ప్రధానికి రాసిన లేఖ దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడం, మోసపూరితమేనని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో మహేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పలు ప్రశ్నలను సంధించారు.

ఇది ప్రజలను మోసం చేయడం కాదా?

- ఈ లేఖపై బహిరంగచర్చకు సిద్ధమా?
- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బహిరంగలేఖ

కొన్ని ప్రశ్నలు..

◆ రూ.2 లక్షల్లోపు రుణాల మాఫీకి అవసరమయ్యే నిధుల మొత్తం రూ.49,500 కోట్లు .. అని స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్బీసీ) మొదట్లోనే చెప్పింది వాస్తవం కాదా?

◆ రుణమాఫీకి రూ.40 వేల కోట్లు ఖర్చవుతాయని మే 1న గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తల భేటీలో సీఎం మాట్లాడింది వాస్తవం కాదా?

◆ ఆ తర్వాత జరిగిన కేబినెట్ భేటీలో రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమని నిర్ణయించింది వాస్తవం కాదా?

◆ అయితే బడ్జెట్లో రుణమాఫీకి కేటాయించింది రూ.26 వేల కోట్లు మాత్రమే అన్నది నిజం కాదా?

◆ తీరా జూలై 18 నుంచి ఆగస్టు 15 వరకు కేవలం రూ.17,869 కోట్లు మాత్రమే మాఫీ చేసింది వాస్తవం కాదా?

ఆ కేటాయింపుల్లో జోక్యం చేసుకోలేం

▶ మొదటి పేజీ తరువాయి

జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై 17 ఏళ్లకుపైగా విచారణ కొనసాగగా.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే.శ్రీనివాస్‌రావు ధర్మాసనం తాజాగా 72 పేజీల తీర్పు వెలువరించింది.

వేలాది మందికి ఉద్యోగావకాశాలు..

'పిటిషనర్ వాదనల మేరకు.. సహజ వనరులైన భూమి, గాలి, నీరు అత్యధిక ప్రజాప్రయోజనాలకు వినియోగించాలి. రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాల కల్పనకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) ఏర్పాటైంది. 2001 నుంచి 2006 మధ్య నామినేషన్ ప్రాతిపదికన టెండర్లు లేకుండా 4,156.81 ఎకరాలను కార్పొరేషన్ పలు కంపెనీలకు కేటాయించింది. అభివృద్ధి ముసుగులో వేల ఎకరాలను ప్రభుత్వం ప్రైవేట్‌కు కారుచౌకగా కేటాయించింది. ప్రభుత్వ వాదన మేరకు.. రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడానికి భూ కేటాయింపులు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో హైదరాబాద్‌లోనూ పరిశ్రమల ఏర్పాటుకు సహకరించి ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐటీ రంగ అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థిక ప్రగతి పెంపొందించడానికి ప్రభుత్వం పలు విధానాలను రూపొందించింది. ఈ కేటాయింపులు చేసిన ఏడాది తర్వాత పిటిషన్ దాఖలు చేశారు. విచారణలో ఉండగా, అనేక పరిశ్రమలు కార్యకలాపాలను ప్రారంభించాయి. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. ఆ భూమికి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం సొమ్ము వసూలు చేయాలని ఆదేశిస్తే.. అది ప్రభుత్వ విధాన నిర్ణయాలకు విరుద్ధం అవుతుంది. ఈ దశలో జోక్యం చేసుకొని ఎలాంటి ఆదేశాలు ఇచ్చినా, అన్ని కంపెనీలపైనే కాదు దానిపై ఆధారపడిన వారిపైనా ప్రభావం చూపుతుంది. ఇప్పుడు భూ కేటాయింపుపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేం. అయితే, భూ కేటాయింపులు జరిగినా ఇప్పటివరకు కార్యకలాపాలు ప్రారంభించని ఐదు కంపెనీల నుంచి దాదాపు 840 ఎకరాలను అధికారులు నాలుగు నెలల్లో వెనక్కి తీసుకోవాలి'అని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పరిశ్రమల అభివృద్ధికి ఏపీఐఐసీ...

'పారిశ్రామిక అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం 1973, సెప్టెంబర్ 26న ఏపీఐఐసీని ఏర్పాటు చేసింది. ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో భాగంగా పరిశ్రమలను ఆకర్షించడమే రాష్ట్ర ప్రభుత్వ విధానంలోని ప్రధాన ఉద్దేశం. అయితే, ప్రభుత్వ ఆస్తుల కేటాయింపు విషయంలో విధానం పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఉండాలి (ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వెలువరించిన పలు తీర్పులను ధర్మాసనం ప్రస్తావించింది). భూకేటాయింపులకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేస్తూ 2000, మే 25న జీవో 3 విడుదల చేసినట్టు ప్రభుత్వం పేర్కొంది. ఐటీ రంగానికి ప్రోత్సాహకాలు కల్పించడంలో అర్హతలు, విధివిధానాలు, దరఖాస్తులు, వాటి పరిశీలనా విధానం, షరతులు తదితరాలతో ప్రభుత్వ విధానానికి రూపకల్పన జరిగిందని చెప్పింది. రాష్ట్రంలో ఐటీ రంగం 2004-05లో 64.05 వృద్ధి సాధించగా, జాతీయ సగటు 34 శాతమే. 2007-08లో పరిశ్రమల ఎగుమతి రూ.8,270 కోట్లతో 41 శాతం ఉండగా జాతీయ సగటు 33.88 మాత్రమే.. ఐటీ రంగానికి సంబంధించి 1997 నుంచి 2007-08 దాకా 1,584 యూనిట్లు ఏర్పాటు కాగా, రూ.26,122 కోట్ల ఎగుమతులు, రూ.10,101 కోట్ల పెట్టుబడులు, 2.39 లక్షల ఉద్యోగాలు కల్పించినట్టు పేర్కొంది. 2002-05, 2005-10 మధ్య ఐటీ పాలసీ కారణంగా హైటెక్ సిటీ, సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు మాదాపూర్‌లో, బహుళ జాతీయ సంస్థలు, మైక్రో సాఫ్ట్, సీఏ, కాన్సో, యూబీఎస్, ఫ్రాంక్లిన్ అండ్ టెంపుల్టన్, విప్రో, హనీవెల్, అమెజాన్, తదితర బహుళజాతి కంపెనీలు ఏర్పాటయ్యాయి. రూ. వందల కోట్ల పెట్టుబడులతో వేలమందికి ఉద్యోగాలు, ఉపాధి లభించింది'అని పేర్కొంది.

భూ కేటాయింపుల్లో వివక్ష లేదు..

'భూకేటాయింపుల్లో దురుద్దేశాలు, వివక్ష ఉన్నట్టు పిటిషనర్ చెప్పలేదు. ఇవి లేకుండా ప్రభుత్వ నిర్ణయాలు ఏకపక్షమని చెప్పలేం. ఈ కారణంగా పారిశ్రామిక అభివృద్ధికి రాయితీ మీద భూకేటాయింపులో ప్రభుత్వ విధానంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ భూకేటాయింపులపై చర్యలు తీసుకోంటోంది. భూకేటాయింపులకు సంబంధించి ప్రభుత్వ విధానాల్లో జోక్యం చేసుకోలేం అంటూ పిటిషన్‌లో విచారణ ముగిస్తున్నాం'అని స్పష్టం చేసింది.



ఏసీబీ వలలో మేడ్చల్ ఏఎస్ఐ

స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.2 లక్షలు డిమాండ్ చేసిన మేడ్చల్ ఏఎస్ఐ మధుసూదన్‌ను ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. -10లో



నైట్ ప్లే స్టేషన్స్..

రాత్రి వేళల్లో స్నేహితులతో కలిసి నెట్స్‌లో క్రికెట్, వాలీబాల్, స్నూకర్, టెన్నిస్ వంటి ఆటలు ఆడేందుకు 'నైట్ ప్లే స్టేషన్స్' పేరిట నగరవాసులకు సాకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. -సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన గాలులతో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది.

వందేభారత్ రైలుకు బాంబు బెదిరింపు

ఆకతాయి ఫోన్..అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతున్న వందే భారత్ రైలులో బాంబు ఉందంటూ ఒక ఆకతాయి చేసిన ఫోన్ కాల్‌తో పోలీసులు ఉరుకులు పరుగులు తీశారు. సంఘటనకు సంబధించి పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం గోదావరిఖనికి చెందిన మధుసూదన్ (26) కొండాపూర్‌లో నివాసం ఉంటూ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఈయన సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు బయలుదేరుతున్న వందేభారత్ రైల్లో బాంబు ఉందంటూ 100కు డయల్ చేశాడు. దీంతో ముందే బాంబు బూచిగా గుర్తించిన పోలీసులు నిందితుడి సెల్ నంబర్ ఆధారంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచే ఫోన్ చేసినట్లు గుర్తించారు. వెంటనే నిందితున్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి విచారిస్తున్నారు.





ఆడుదాం దాండియా

బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ రిక్రియేషన్ సెంటర్‌లో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దాండియా వేడుకలు వైభవంగా జరిగాయి. క్లబ్ మహిళా సభ్యులు పెద్ద ఎత్తున దాండియా వేడుకలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. - బంజారాహిల్స్

ఆలస్యంగా ఎంఎంటీఎస్ రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ యార్డులో కొనసాగుతున్న పనుల దృష్ట్యా పలు ఎంఎంటీఎస్ రైళ్లను ఆలస్యంగా నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్–ఫలక్‌నుమా మధ్య నడిచే ఎంఎంటీఎస్ సర్వీసును రద్దు చేయనున్నారు. అలాగే మేడ్చల్–ఉందానగర్, సికింద్రాబాద్–ఉందానగర్ మధ్య నడిచే సర్వీసులు అరగంట నుంచి 75 నిమిషాల వరకు ఆలస్యంగా నడుస్తాయి.

ఢీకొట్టి.. దూసుకెళ్లి

- రెండు ప్రాణాలను బలిగొన్న లారీడ్రైవర్ నిర్లక్ష్యం
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



శ్రవణ్‌కుమార్, మదీనా బాషా (ఫైల్)

మీర్‌పేట: ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. ఉద్యోగానికి వెళ్తూ ఒకరు, విధులు ముగించుకుని ఇంటికి వెళ్తూ లిఫ్ట్ అడిగిన మరొకరు మృత్యు ఒడికి చేరారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మీర్‌పేట టీకేఆర్ కళాశాల వద్ద నివసించే మదీనా బాషా (42) ఉప్పల్ ఫీర్జాదిగూడలోని టీజీ ఆర్టీసీ వర్క్‌షాపులో అసిస్టెంట్ ఇంజినీర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 7.30 గంటలకు తన ద్విచక్ర వాహనంపై ఉద్యోగానికి వెళ్తుండగా నందనవనంలో నివసిస్తూ టీకేఆర్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న అన్నోజు శ్రవణ్‌కుమార్ (40) లిఫ్ట్ అడిగాడు. ఇద్దరూ కలిసి వాహనంపై టీకేఆర్ కళాశాల నుంచి నందనవనం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో తిరుపతి రేణిగుంట నుంచి దుంగల లోడ్‌తో వచ్చిన లారీ (ఏపీ 20టీబీ 1299) రాఘవేంద్ర వే బ్రిడ్జి వద్ద వెయిట్ చేసుకుని తిరిగి వెళ్తోంది. నందనవనం శ్మశానవాటిక వద్దకు రాగానే లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపి ద్విచక్ర వాహనంపై ముందు వెళ్తున్న బాషా, శ్రవణ్‌కుమార్‌ను ఢీకొట్టి వారిపై నుంచి దూసుకెళ్లాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రవణ్‌కుమార్ భార్య అనూరాధ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు బాషా, శ్రవణ్‌కుమార్‌కు ఇద్దరు, ఇద్దరు పిల్లలు ఉన్నారని సీఐ తెలిపారు.

స్పీడ్ పెరిగింది..

కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంపై సర్వే

- వాటర్ లైన్ల మళ్లింపు... చెట్ల లెక్కింపు
- రంగంలోకి జలమండలి, యూబీడీ అధికారులు
- మరో రెండు రోజుల్లో తేలనున్న తొలగించబోయే చెట్ల లెక్క



బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ జంక్షన్ల పైప్‌లైన్ల మ్యాప్‌లను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

బంజారాహిల్స్: ట్రాఫిక్ కష్టాలు లేకుండా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ మీదుగా హైటెక్‌సిటీ, గచ్చిబౌలి వైపు రయ్ రయ్‌మంటూ వాహనాలు దూసుకెళ్లేందుకే ప్రభుత్వం ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు పచ్చజెండా ఊపిని విషయం విదితమే. ఇప్పటికే ఎక్కడెక్కడ అండర్‌పాస్ స్టార్ట్ అవుతుంది. ఎక్కడి నుంచి ఫ్లై ఓవర్ నిర్మిస్తున్నారు అనే విషయాలపై ప్రాజెక్ట్స్ అధికారులు భారీ మ్యాప్‌లు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఆ మ్యాప్‌ల ఆధారంగా ఇప్పుడు జలమండలి, అర్బన్ బయోడైవర్సిటీ, జీహెచ్ఎంసీ అధికారులు సర్వేలు చేస్తున్నారు. జలమండలి, యూబీడీ అధికారులు సర్వే పూర్తయిన తర్వాత పనులు ఎప్పుడు మొదలవుతాయనే విషయంలో ఓ క్లారిటీ రానుంది. ఇక్కడ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ కష్టాలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లు అవుతుంది.

ఆరు జంక్షన్లలో పైప్‌లైన్లపై...

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 మీదుగా సాగే ఈ అండర్‌పాస్‌లు, ఫ్లై ఓవర్లు నిర్మించే ప్రాంతాల్లో ఇప్పటికే భారీ మంచినీటి పైప్‌లైన్లతో పాటు మరికొన్ని చోట్ల సీవరేజి లైన్లు ఉన్నాయి. కేబీఆర్ పార్కు చుట్టూ వచ్చే ఆరు జంక్షన్లలో ఎక్కడెక్కడ ఏఏ లైన్లు ఉన్నాయో వాటిని సర్వే చేసే పనిలో జలమండలి జీఎం హరి శంకర్ ఆయా సెక్షన్ల మేనేజర్లు, ఇంజినీర్లతో సమీక్షిస్తున్నారు. ఈ జంక్షన్ల ప్రాంతంలో 1200, 1000, 900 ఎంఎం ఎంఎస్ వ్యాసార్థంలో భారీ మంచినీటి పైప్‌లైన్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని ఆయా జంక్షన్ల నుంచి పక్కకు తప్పించేందుకు తగు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీనికి తోడు వెంకటగిరి నుంచి తట్టికాన వాటర్ సెక్షన్‌కు నీళ్లు పంపింగ్ చేసే భారీ పైప్‌లైన్ వ్యవస్థ కూడా ఇక్కడ ఉంది. మ్యాప్‌ల ఆధారంగా ఇక్కడున్న మంచినీటి భారీ లైన్లు ఏ విధంగా ఎటు వైపు మారిస్తే బాగుంటుంది అనే అంశంపై ఇప్పటికే అధికారులు పలుమార్లు క్షేత్ర స్థాయిలో సైతం పర్యటించి నివేదికలను ఉన్నతాధికారులకు అందించారు. ఉన్నతాధికారుల నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తే పనులు మొదలు పెట్టే అవకాశం ఉంది.

మరో రెండు రోజుల్లో తేలనున్న చెట్ల లెక్క

ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించే మార్గాల్లో రోడ్లకు రెండువైపులతో పాటు రోడ్డు మధ్యలో ఉన్న సెంట్రల్ మీడియన్‌లో ఉన్న చెట్లు దాదాపుగా తొలగించే అవకాశం ఉంది. అయితే ఎన్ని చెట్లు తొలగిస్తారు అనే అంశంలో ఇంకా క్లారిటీ రాలేదు. గత నాలుగు రోజులుగా యూబీడీ అధికారులు రోడ్లకు రెండువైపులా ఉన్న చెట్లతో పాటు సెంట్రల్ మీడియన్‌లో ఉన్న చెట్లను గుర్తించి వాటికి మార్కింగ్ వేస్తున్నారు. టీవీ9 వైపు నుంచి కేబీఆర్ పార్కు వైపు, కేన్సర్ ఆస్పత్రి వైపు, కేన్సర్ ఆస్పత్రి నుంచి అగ్రసేన్ చౌరస్తా వైపు, విరించి ఆస్పత్రి నుంచి అగ్రసేన్ చౌరస్తా వరకు, అగ్రసేన్ చౌరస్తా నుంచి సీవీఆర్ న్యూస్ జంక్షన్ వరకు, కేబీఆర్ పార్కు జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్ నెం 45 వైపు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి చిరంజీవి బ్లడ్ బ్యాంకు వైపు, జూబ్లీహిల్స్ చెక్ పోస్టు నుంచి పంజగుట్ట వైపు రోడ్డుకు రెండువైపులా, సెంట్రల్ మీడియన్‌లో ఉన్న చెట్లను అధికారులు గుర్తిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఎన్ని చెట్లు రోడ్డు నిర్మాణంలో పోవడానికి అవకాశం ఉందనే విషయం తేలుతుంది.



బంజారాహిల్స్ రోడ్ నెం.12లో చెట్టుకు మార్కింగ్ వేస్తున్న యూబీడీ సిబ్బంది

కూల్చివేతలకు బ్రేక్!

మూసీ బాధితులకు పునరావాసం, పరిహారం తర్వాతే ముందడుగు

- పరీవాహకంలో అతికష్టం మీద సగం ఇళ్లకే ఆర్‌బీ మార్క్
- ఖాళీ అయిన ఇళ్ల కూల్చివేత సైతం అంతంతే..
- అందుబాటులోఉన్న డబుల్ ఇళ్ల కేటాయింపు పూర్తి
- మిగతా వారి పరిస్థితేంటని అధికారుల తర్జనభర్జన
- మూసీ నిర్వాసితుల నుంచి తీవ్ర వ్యతిరేకత



సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహకం పరిధిలోని నివాసాల కూల్చివేతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. మూసీ ప్రక్షాళనలో భాగంగా నదీగర్భం, బఫర్ జోన్‌లో గుర్తించిన నివాసాలకు పునరావాసం, పరిహారం అంశాలు తేల్చాకే కట్టడాల తొలగింపునకు ముందడుగు వేయాలని సర్కారు పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు అందడటంతో రెవెన్యూ యంత్రాంగం వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నదీ గర్భంలో సైతం రెడ్ మార్కింగ్ నిలిచిపోగా, నివాసాలు ఖాళీ చేసి డబుల్ బెడ్ రూమ్‌లకు తరలిన కుటుంబాల ఇళ్లను సైతం కొన్నింటిని మాత్రమే కూలీలతో కూల్చివేశారు. మిగతా కూల్చివేత పెండింగ్‌లో పడింది. కొన్ని ఉమ్మడి కుటుంబాలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించినా..వెళ్లని పరిస్థితి నెలకొంది. ఇళ్ల కూల్చివేతలపై మూసీ పరీవాహకం పరిధిలోని నివాసితుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండడంతో అధికారులు ముందుకు వెళ్లేందుకు సాహసించడం లేదు. సర్కారు మాత్రం మూసీ ప్రక్షాళన తప్పనిసరి అని పేర్కొంటున్నా... నివాసితులకు పునరావాసం, పరిహారం ప్రధాన సమస్యగా తయారైంది.

ఆదిలోనే హంసపాదు

మూసీ ప్రక్షాళనకు ఆదిలోనే హంసపాదు ఎదురైందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నదీ పరీవాహకం పరిధిలో సర్వే ద్వారా గుర్తించిన నివాసాలపై రెడ్‌మార్కింగ్ వేసేందుకు అధికార యంత్రాంగం చేసిన ప్రయత్నం బెడిసి కొట్టినట్లయింది. నివాసితుల నుంచి త్రీవ వ్యతిరేకత ఎదురుకాగా, సగం ఇళ్లకు మాత్రమే రెడ్ మార్క్ వేసి వెనుకకు తగ్గక తప్పలేదు. మరోవైపు నివాసితులకు ప్రతిపక్ష పార్టీల మద్దతు పెరగడంతో వారు సైతం ఆందోళనలను ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో నదీగర్భంలో రెడ్ మార్క్ వేసిన గృహాల జోలికి సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాస్తవంగా పరీవాహక పరిధిలో 12,184 పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని రెండుగా వర్గీకరించి నదీ గర్భం, బఫర్ జోన్లుగా విభజించారు. నదీగర్భంలో 2,166 నిర్మాణాలు ఉండగా, అందులో 288 భారీ నిర్మాణాలున్నాయి. నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల వరకు గల బఫర్‌జోన్ పరిధిలో 7,851 ఆక్రమణలు, ఇందులో 1032 బడా నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారు. మిగతా పరిధిలో 3004 అక్రమ కట్టడాలున్నట్లు బయటపడింది.

పునరావాసంపై అయోమయం

మూసీ నదీ గర్భంలోని నివాసితులు పునరావాసం సమస్యగా తయారైంది. అధికార లెక్కల ప్రకారం 2166 డబుల్ బెడ్‌రూమ్‌లు అవసరం ఉంటుంది. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 1595, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో 239, రంగారెడ్డి జిల్లా పరిధిలో 332 కుటుంబాలను పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని 14 డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో మొత్తం మీద ఖాళీగా ఉన్న గృహాలు 500కు పైగా కూడా లేనట్లు తెలుస్తోంది. నివాసాలు ఖాళీ చేసిన సుమారు 10 శాతం కుటుంబాలకు పునరావాసం కల్పించగలిగారు. సైదాబాద్, హిమాయత్‌నగర్, నాంపల్లి మండలాల్లోని వివిధ బస్తీలు, కాలనీలకు చెందిన 193 మందిని మలక్‌పేటలోని పిల్లిగుడిసెలు, జియా గూడ, ప్రతాపసింగారం, జంగంమెట్‌లోని రెండు పడకల గృహసముదాయానికి తరలించారు. మిగతా వారికి పునరావాసంపై ఎలా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

విద్యుదాఘాతానికి ఇద్దరి బలి

- మరో నలుగురికి గాయాలు
- కండ్లకోయలోని హెచ్‌యూఎల్ కంపెనీలో ఘటన



మృతి చెందిన గుడుబైటా, పురో మంఝీ

మేడ్చల్ రూరల్: బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికులు ఇద్దరు విద్యుదాఘాతానికి బలయ్యారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కండ్లకోయలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక హిందుస్థాన్ యూనీలివర్(హెచ్‌యూఎల్) లిమిటెడ్ కంపెనీ గత కొద్ది రోజుల క్రితం ఇక్కడ నుండి ఇతర ప్రాంతానికి తరలివెళ్లింది. దీంతో కంపెనీలో ఉన్న సామాగ్రి తరలింపు పనులు చేపట్టారు. బీహార్ రాష్ట్రానికి చెందిన గుడుబైటా (26), పురో మంఝీ(25) మరికొందరు కార్మికులు మేడ్చల్ ప్రాంతానికి వలసవచ్చి ఓ కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వీరిద్దరితోపాటు చోటా పాశ్వాన్, కరం కుమార్, లకిందర్ కుమార్, మరో కార్మికుడు మొత్తం ఆరుగురు కలిసి కంపెనీలో ఉన్న పొడవాటి ఇనుప నిచ్చెనను తీసుకెళ్తుండగా మెయిన్‌గేట్ సమీపంలో పై భాగంలో ఉన్న 11 కె.వి విద్యుత్ వైర్లను చూసుకోకపోవడంతో ఇనుప నిచ్చెనకు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో నిచ్చెనను పట్టుకున్న వారందరూ విద్యుదాఘాతానికి లోనయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం సమీపంలో ఉన్న సీఎంఆర్ ఆస్పత్రికి తరలించగా తీవ్రంగా గాయపడ్డ గుడుబైటా, పురో మంఝీలు చికిత్స పొందుతూ మరణించారు. మిగతా నలుగురు గాయాలతో చికిత్స పొందుతున్నారు. ప్రమాద స్థలిని, క్షతగాత్రులను మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ప్రమాదంలో మరణించిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

కమిషనరే రావాలి!

జీహెచ్ఎంసీ ప్రజావాణి రసాభాస

- కార్యక్రమానికి హాజరుకాని పలువురు అధికారులు
- ఆగ్రహించిన ఫిర్యాదు దారులు



మధ్యాహ్నం వరకు ఇద్దరు అధికారులే ఉండగా ఫిర్యాదులిచ్చేందుకు రాని జనం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమం రసాభాసగా మారింది. ఉదయం పది గంటలకే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అధికారులు ఫిర్యాదులు స్వీకరించాల్సి ఉండగా, వివిధ విభాగాల అధికారులు కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇతర పనుల వల్ల కమిషనర్ రాకపోవడంతో పాటు ఇతర విభాగాల అధికారులు సైతం గైర్హాజరయ్యారు. కేవలం ఇద్దరు అధికారులు మాత్రమే కార్యక్రమంలో కనిపించారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు కమిషనర్ రాకకోసం వేచి చూశారు. కమిషనర్ వస్తేనే తమ గోడు వినే అవకాశం ఉందని చాలా మంది అక్కడే పడిగాపులుకాశారు. చివరకు మధ్యాహ్నం దాదాపు 12 గంటలకు కమిషనర్ ఆమ్రపాలి కార్యక్రమానికి హాజరు కావడంతో, విషయం తెలిసి ఇతర విభాగాల అధికారులు అక్కడకు చేరుకున్నారు. ప్రజలు తమ ఫిర్యాదులు ఇచ్చేందుకు పోటీ పడ్డారు. ఎన్ని పర్యాయాలు తిరిగినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ కొందరు కన్నీళ్లపర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలో కార్యక్రమం రసాభాసగా మారింది.

మొక్కుబడి తంతు..

ప్రతి సోమవారం ప్రజావాణి మొక్కుబడి తంతుగా మారింది. గతంలో అందిన ప్రతి ఫిర్యాదును వివరాలతో సహ సాయంత్రానికి పత్రికలకు విడుదల చేసేవారు. ప్రస్తుతం అలాంటి వివరాలేవీ లేకుండా కేవలం సంఖ్య చెప్పి సరిపుచ్చుతున్నారు. అంతేకాదు..క్రితం వారం అందిన ఫిర్యాదులకు సంబంధించి యాక్షన్ టేకెన్ రిపోర్టులు(ఏటీఆర్) కూడా వెల్లడించేవారు. ప్రజల ఫిర్యాదులు పరిష్కరించడమే కాక, పరిష్కారం కాని పక్షంలో ఎందుకు కావడంలేదో ప్రజలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని కమిషనర్ పలు పర్యాయాలు ఆదేశించినప్పటికీ, ప్రస్తుతం అధికారులు పట్టించుకోవడం లేదు. అన్ని విభాగాల అధికారులు కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, కేవలం కొన్ని విభాగాల వారు మాత్రమే వస్తున్నారు. తప్పదన్నట్లుగా ఏదో మొక్కుబడి తంతుగా కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు.



కమిషనర్ వచ్చాక ఫిర్యాదులిచ్చేందుకు ఎగబడ్డ ప్రజలు

'ఆన్‌లైన్' సేల్స్ అదుర్స్!

గ్రేటర్ వాసుల్లో మారుతున్న షాపింగ్ ట్రెండ్



- ఆన్‌లైన్ కొనుగోళ్ల వైపే మొగ్గు
- పిండి వంటల నుంచి వస్త్రాలు, బంగారు ఆభరణాలు సైతం..
- 'టై అప్'లతో కొత్త ట్రెండ్‌కు ఈ-కామర్స్ సంస్థల శ్రీకారం

సాక్షి సిటీబ్యూరో: పండుగ షాపింగ్‌కు గ్రేటర్ ప్రజలు ఆన్‌లైన్ వైపే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. పూజా సామాగ్రి, పిండి వంటకాలు మొదలు కొని బంగారు ఆభరణాలు, నూతన వస్త్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు అన్నీ ఆన్‌లైనే కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు ఈ-కామర్స్ సంస్థలు సైతం దసరా, దీపావళి నేపథ్యంలో పలు ఆఫర్లు ప్రకటించారు. ఫెస్టివల్ సేల్స్ పేరిటి హంగామా చేస్తున్నాయి. దీంతో వినియోగదారుల్లో ఆసక్తి పెరిగింది. ఇటీవలి కాలంలో డెలివరీ టైమింగ్‌లో కూడా ఆయా సంస్థలు గణనీయమైన స్పీడ్ పెంచాయి. ఆర్డర్ ఇచ్చిన గంట నుంచి మూడు గంటల్లోనే వస్తువులను డెలివరీ చేస్తున్నాయి. దీంతో కూడా మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేయడం కంటే ఇంట్లో ఉండే షాపింగ్ చేయడానికి నగర ప్రజలు ఎక్కువ మొగ్గుచూపుతున్నారు.

హడావుడి చేసినా..

ఇక షాపింగ్ మాల్స్, వస్త్ర, బంగారు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల షాపుల నిర్వాహకులు కూడా ఫెస్టివల్ ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు. స్టాక్ క్లియరెన్స్ సేల్స్ పేరిట హడావుడి చేస్తున్నా అంతగా ఫలితం కన్పించడం లేదు. గత రెండేళ్లు ఆన్‌లైన్ సేల్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. పండుగకు గతంలో మాదిరిగా కుటుంబ సమేతంగా వెళ్లి షాపింగ్ చేయడం లేదు. ఎవరికి నచ్చిన దుస్తులు, గ్రోసరీ, ఎలక్ట్రానిక్, ఫుట్‌వేర్ ఇలా..ఏది కావాలన్నా ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా కొంటున్నారు. మరోవైపు ఇంటి వద్దకే అన్ని వస్తువుల డోర్ డెలివరీ చాన్స్ ఉండడంతో ఎక్కువ మంది ఆన్‌లైన్‌కే వైపు మొగ్గు చూపుతున్నారు. ట్రాఫిక్ సమస్యలు ఉండవని, సమయం ఆదా అవుతోందని కొందరంటున్నారు.

ఈ-కామర్స్ సైట్లతో టై అప్

నగరంలో గిరాకీ లేక డీలా పడ్డ షోరూమ్‌లు, షాపుల నిర్వాహకులతో ఈ- కామర్స్ సంస్థలు సంప్రదింపులు జరిపి వారితో టై అప్ అవుతున్నాయి. ఎమ్మార్పీ కంటే 15 నుంచి 50 శాతం వరకు ఆఫర్‌తో సేల్ చేసేలా అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. ఏటా నిర్వహించే ఫెస్టివల్ క్లియరెన్స్ సేల్స్ తరహాలోనే ఉన్న స్టాక్‌ను ఆన్‌లైన్‌లో అమ్మేలా వ్యాపారులు ప్లాన్ చేశారు. ఇప్పటికే బ్రాండెడ్ షోరూమ్‌లకు సొంత వెబ్ సైట్లు ఉన్నా వాటి ద్వారా సేల్స్ తక్కువగానే ఉంటున్నాయి. ఏటా ఒక్కో షోరూమ్ ఆన్‌లైన్ బిజినెస్ రూ.4 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు మాత్రమే ఉంటోంది. దీంతో డిస్కౌంట్ ఆఫర్లతో ఆన్‌లైన్ కస్టమర్లను ఎట్రాక్ట్ చేసేందుకు ప్లాన్ చేశారు. చిన్న, పెద్ద వ్యాపారులను డిజిటల్ మార్కెట్‌లోకి తీసుకొచ్చేలా ఈ-కామర్స్ సంస్థలు కూడా అఫిలియేటివ్, సెల్లర్ బిజినెస్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఇది ఆయా షాపుల నిర్వాహకులకు కొంత ఊరటనిస్తోంది. తగ్గిన గిరాకీని ఇక్కడ కవర్ చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

■ **Vijay Marie School of Nursing** Khairatabad, Hyderabad: Applications are invited from Intermediate passed Female Candidates to General Nursing & Midwifery Course for 2024-2025. Prescribed Application forms may be obtained from Nursing School Office from 9.00 A.M. to 5.00 P.M. Ph No.8523060581 [H-796642]

Real Estate

FLAT FOR SALE

■ **HMDA & RERA Approved** Gated Community Villas at Ankusapur near Ghatkesar ORR to 6 km only 140 Sqyds 2BHK 60 Lakhs Limited offer for 1st 10 Villas Ph: 9494292749 [SCA24000364]

PLOT FOR SALE

■ గజము 2500/- మాత్రమే విజయవాడ హైవే, నార్కట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, కాటేజీ మరియు 30 పండ్ల మొక్కలు 30 ఎర్రచందనం మొక్కలతో 1210 గజాలు (10 గుంటలు) ప్లాట్ అమ్మబడును. సంప్ర॥ పి.వి.రావు. 9390261598 [HA-1154]

■ శ్రీశైలం హైవే తలకొండపల్లి మండలం, తలకొండపల్లి గ్రామం, రంగారెడ్డి జిల్లా 8 ఎకరాల భూమి అమ్మకానికి కలదు. ఫోన్ : 7416571239 [HA-1600]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [800515]

BUSINESS OFFER

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న. మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9398709618 [H-796641]

■ **Data editing software projects** are available for outsourcing to companies with minimum 5 computers.contact 9652438681 [HA-15265]

PERSONAL CARE

■ సన్‌రైస్ హోంకేర్ 24/7 వృద్ధులు, పేషెంట్స్, బేబీకేర్, ఇంటి / వంట చేయుటకు కేర్‌టేకర్స్‌ని మీ ఇంటి వద్దకే పంపబడును. ఫోన్: 8801821210 [HA-15244]

CHANGE OF NAME

■ **I, Janga Malyadri S/o, Poli Reddy** R/o Plot No 174 & 175 Phase 1 Vijayapuri Colony Vanastalipuram Hyderabad 500070 have changed my name to Janga Malyadri Reddy for all purposes. [DA-12108]

■ **I, Kulprit Kour W/o. Ravi Raj** Singh, R/o. 303, Pavani Laxmi Nivas, Madhapur, Hyderabad. Changed my name as Kulprit Kaur vide affidavit dated 18-Sep-2024 sworn before notary B. Agaiah, GOMS No. 1972/121 [HA-04996]

■ **I, Kalyani Vadlamani W/o** Vadlamani Narayana Chary R/o P.no178, MIreddy Rangareddy Nagar, Thorrur Village Abdullapurmet, Before Marriage My Name BALA KALYANI ADIPUDI & After My Marriage Name Changed as KALYANI VADLAMANI Both Names Are Same Person [SCA24000359]

■ **I, VENKATA AGASTYAVADHANULU KUPPA** S/o VENKATESHWARLU KUPPA, R/o H.No: 1-9-278/5/2/1/1/A1, Naga Nilayam, Balaji Nagar, Adikmet, Hyderabad- 44 Telangana., hereby state that the name recorded in my SSC Certificate is KUPPAK V A AVADHANLU K VENKATESHWARLU. My actual and correct name as per Aadhaar card is VENKATA AGASTYAVADHANULU KUPPA. Hence both names are one and same). [J-24294]

■ **I, LAXMI PRIYA BANDARU, W/o.** Mahender Kumar Madasu, R/o. Plot No: 61,62, Flat : 502, Santosh Residency, Madhura Nagar, Hyd-500038, Telangana. Have changed my name as LAXMI PRIYA MADASU. [HA-16402]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467038, 9391039990, 8074327715 [H-778850]

TOURS & TRAVELS

■ **SVS** టూర్స్ శ్రీలంక, కాశీ, నేపాల్, భూటాన్, గుజరాత్, ఉజ్జయిని, ఒరిస్సా, అస్సాం చార్‌ధామ్, వైష్ణవి దేవి. TN 9030123243, 7386579123 [SCA24000329]

Wanted

■ మారుతి **Desire** కార్ నడుపుటకు అనుభవం గల కార్ డ్రైవర్ కావలెను. అమీన్‌పూర్, కృష్ణారెడ్డిపేట్ ఏరియాల వారు సంప్రదించండి: 9985249352 [HA-14725]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185467]

■ విజయవాడలో పేషెంట్‌లని, పెద్దవారిని వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు నర్సులు (ANM, GNM) హాస్పిటల్స్‌లో పనిచేసిన ఆయాలు, హోమ్‌కేర్‌లో అనుభవమున్న కేర్ టేకర్స్ కావలెను. జీతం 16K-26K కాల్ / వాట్సప్ ✆ 91608 35559, 98850 25559 [B-264]

■ **Req Home Appliance Field** Repair Technicians 25nos Female System Operators 4nos Field Sales Exe 4Nos Sal+Fuel+Ince 9059223423 [HA-05000]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎంఐఎం X కాంగ్రెస్

రోడ్డు పనుల పరిశీలనతో తలెత్తిన వివాదం

- పోలీసుల ఎదుటే ఎంఐఎం, కాంగ్రెస్ నేతల ఘర్షణ
- పోలీసులకు ఇరు వర్గాల ఫిర్యాదు
- పరిస్థితిని సమీక్షించిన సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్



వాగ్వాదం చేసుకుంటున్న ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్

విజయనగర్‌కాలనీ: రోడ్డు పనుల పరిశీలన ఉద్రిక్తతలకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం హుమయూనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయనగర్‌కాలనీ ఇందిరానగర్‌లో కొద్ది రోజుల క్రితం జీహెచ్ఎంసీ రోడ్డు పనులు చేపట్టింది. అయితే పనుల్లో జాప్యం కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కొందరు స్థానిక నేతలు సమస్యను కాంగ్రెస్ నాయకులు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఫిరోజ్‌ఖాన్ దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్డు పనుల్లో జాప్యం కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఫిరోజ్‌ఖాన్ పార్టీ నేతలతో కలిసి సోమవారం సాయంత్రం ఇందిరానగర్ బస్తీలోని రోడ్డు నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చారు. ఈ విషయం తెలియడంతో అనుచరులతో కలిసి అక్కడికి వచ్చిన నాంపల్లి ఎమ్మెల్యే మజీద్ హుస్సేన్ ఫిరోజ్‌ఖాన్, అతడి అనుచరులతో వాగ్వాదానికి దిగారు. ఫిరోజ్‌ఖాన్‌ను సైతం పనులు ఎలా పరిశీలిస్తావంటూ నిలదీయడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పర దాడులకు దిగారు. సమాచారం అందుకున్న హుమాయున్‌నగర్, ఆసిఫ్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల ఎదుటే వారు ఘర్షణ పడుతుండటంతో అతి కష్టం మీద ఇరు వర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. సౌత్‌వెస్ట్‌జోన్ డీసీపీ చంద్రమోహన్, ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్‌కుమార్ సిబ్బందితో కలిసి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఇరు వర్గాల నేతలు హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

22 కిలోల గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: దూల్‌పేట్‌లోని కిషోర్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి 22.9 కిలోల గంజాయిని పట్టుకున్నారు. నిందితుడితో పాటు, అతడి భార్య జ్యోతి బాయిని అరెస్ట్ చేశారు.ఈ ఉదంతంలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న లడ్డు సింగ్, సాగర్ సింగ్, వైష్ణవి సింగ్, పేపర్ వినోద్ సింగ్ అనే వ్యక్తులు పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. పురానాపూల్, జియాగూడ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 1.56 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అభిషేక్ సింగ్, సుభాష్ సింగ్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మూడు మొబైల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కొనుగోలు చేస్తున్న 37 మంది వ్యక్తులను కూడా ఈ కేసులో నిందితులుగా చేర్చారు.

నా మధ్యంతర బెయిల్ రద్దు చేయండి

కోర్టులో జానీ మాస్టర్ మెమో దాఖలు

రంగారెడ్డి కోర్టులు: లైంగికదాడి ఆరోపణల నేపథ్యంలో నృత్య దర్శకుడు జానీ మాస్టర్ చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. తనకు ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డు వచ్చిందని, అవార్డు అందుకునేందుకు ఢిల్లీ వెళ్లాల్సి ఉన్నందున ఈ నెల 6నుంచి 10 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గత సోమవారం రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టు కమ్ 9వ అదనపు జిల్లా కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న కోర్టు గత గురువారం జానీ మాస్టర్‌కు ఈ నెల 6నుండి 9వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చూస్తూ తీర్పు ఇచ్చింది. కాగా జానీ మాస్టర్ అందుకోబోయే పురస్కారాన్ని రద్దు చేసినట్లు తెలియడంతో ఆయన తనకు మంజూరైన మధ్యంతర బెయిల్‌ను వినియోగించుకోబోనని కోర్టులో మెమో దాఖలు చేశాడు. ఇదిలా ఉండగా జానీ మాస్టర్ సాధారణ బెయిల్ పిటిషన్ బుధవారానికి వాయిదా పడింది.

ఏసీబీ వలలో మేడ్చల్ ఏఎస్ఐ

- స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ. 2 లక్షలు డిమాండ్
- రూ. 50 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు



ఏఎస్ఐ మధుసూదన్‌రావు

మేడ్చల్‌రూరల్: స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ. 2 లక్షలు డిమాండ్ చేసిన ఏఎస్ఐని ఏసీబీ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్‌కు చెందిన శర్మ మేడ్చల్ మండలం, గౌడవెల్లి గ్రామ పరిధిలోని సాకేత్ ప్రణమ్‌లో విల్లా కొనుగోలు చేశాడు. అందులో ఇంటీరియర్ పనుల కోసం సరూర్‌నగర్‌కు చెందిన విశ్వనాథ్‌తో రూ.8 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.4 లక్షలు చెల్లించాడు. సగం పనులు పూర్తి చేసిన విశ్వనాథ్ మిగిలిన డబ్బులు ఇవ్వాలని కోరగా, అందుకు శర్మ నిరాకరించడంతో విశ్వనాథ్ పనులు నిలిపివేశాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో శర్మ రెండు నెలల క్రితం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో విశ్వనాథ్‌పై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నార్సింగిలో అతడిని అదుపులోకి తీసుకుని మేడ్చల్ పీఎస్‌కు తీసుకువచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఏఎస్ఐ మధుసూదన్ స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు, ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు విశ్వనాథ్‌ను రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. అందులో భాగంగా మొదట రూ.10 వేలు తీసుకున్నాడు. మిగతా మొత్తాన్ని విడతల వారీగా ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ నెల 5న రూ.50 వేలు తీసుకురావాలని ఏఎస్ఐ ఫోన్ చేయడంతో విశ్వనాథ్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు సోమవారం స్టేషన్‌కు వచ్చి డబ్బులు ఇస్తానని ఏఎస్ఐకి చెప్పాడు. పథకం ప్రకారం మాటు వేసిన ఏసీబీ అధికారులు సోమవారం విశ్వనాథ్ ఏఎస్ఐ మధుసూదన్‌రావుకు స్టేషన్ ఆవరణ వెనుక నగదు అందజేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన అధికారులు ఏఎస్ఐని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ విషయంలో ఇతర అధికారుల ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దమ్మ గుడి ట్రాఫిక్ సమస్యపై పోలీసుల పరిశీలన

- సమస్యపై పలు కోణాల్లో వివరాల సేకరణ
- సమస్య పరిష్కారానికి త్వరలోనే సమీక్ష


పరిస్థితిని పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

బంజారాహిల్స్: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయానికి భక్తులు వేలసంఖ్యలో విచ్చేస్తుండగా ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా పెద్దమ్మ గుడి చుట్టుపక్కల రహదారులన్నీ ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. పెద్దమ్మ గుడి యాజమాన్యం నిర్వాహకాన్ని జూబ్లీహిల్స్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయం లేక చేతులెత్తేస్తున్న వైనాన్ని సోషల్ మీడియాలో వాహనదారులు తీవ్ర విమర్శలు గుప్పించారు. మీడియాలోనూ ట్రాఫిక్ జాంపై పరిస్థితిని కళ్లకు కట్టారు. దీంతో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లు సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36తోపాటు పెద్దమ్మ గుడి పరిసరాల్లో ట్రాఫిక్‌ను పరిశీలించారు. అధికారుల పర్యటనలోనూ ట్రాఫిక్ రద్దీ కనిపించింది. పెద్దమ్మ గుడిలో వాహనాల పార్కింగ్‌కు సరిపడా స్థలం ఉందో లేదో పరిశీలించారు. గుడిలో పార్కింగ్‌కు ఫీజు వసూలు చేస్తున్నట్లుగా గుర్తించారు. ఎక్కడా లేనివిధంగా పెద్దమ్మ గుడిలోనే పార్కింగ్ ఫీజు వసూలు చేయడాన్ని గుర్తించిన అధికారులు నిర్వాహకుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను పెద్దమ్మ గుడికి కొంత చెల్లించి చెల్లించి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లుగా నిర్వాహకుడు తెలిపాడు. గుడిలో వాహనాలు పార్కింగ్ చేస్తే ఫీజు వసూలు చేస్తారనే ఉద్దేశంతోనే చాలామంది వాహనదారులు రోడ్డుకు రెండువైపులా వాహనాలు పార్కింగ్ చేసి వెళ్తున్నారు. దీని వల్లనే ట్రాఫిక్‌జాం అవుతున్నట్లుగా పరిశీలనలో తేలింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతామని, ట్రాఫిక్ స్తంభించడానికి గల కారణాలపై కొన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు. వచ్చే ఐదు రోజులపాటు భక్తుల రద్దీ ఇంకా పెరిగే అవకాశం ఉండడంతో ట్రాఫిక్‌ను ఎలా నియంత్రించాలనే దానిపై సమీక్ష జరుపుతామని వారు తెలిపారు.

57 రోజులపాటు విశ్వశాంతి మహాయాగం


మహాయాగం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలోనే మొదటిసారి 57 రోజులపాటు నిర్విరామముగా 'శ్రీ మహా నారాయణ దివ్య రుద్ర సహిత శత సహస్ర చండీ విశ్వశాంతి మహాయాగం' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అయోధ్య, శ్రీ కంచి కామాక్షి పీఠం కంచి, చిన్మయి సేవా ట్రస్ట్ విజయనగరం సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 2వ తేదీ నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు మోక్షపురి అయోధ్యలో ఈ యాగం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎల్.వీ.సుబ్రమణ్యం, ఆధ్యాత్మికవేత్త సత్యమూర్తి, కార్యక్రమ చీఫ్ కో ఆర్డినెటర్ డి.ఎస్.ఎన్.మూర్తి, కంచి మఠం ప్రతినిధి జి.వెంకటేశ్వర రాజులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 57 రోజులు పరతీ రోజు 900 మంది రుత్వికులు, వేదపండితులతో ఈ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవుల నైతిక పతనం, పర్యావరణ, సామాజిక సమస్యలు ఎక్కువగా ఎదుర్కొంటున్న తరుణంలో ఈశ్వరుని కృపకోసం, అమ్మవారి దివ్యానుగ్రహం కోసం కలియుగ చరిత్రలోనే మొదటిసారిగా రుద్ర సహిత శత సహస్ర చండీ మహాయాగం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రతీ రోజు 48 మంది దంపతులు హోమం పూజా కార్యక్రమంలో పాల్గొంటారని, ఈ మహా కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఎలా అయోధ్యకు వెళ్లాలో తెలియని వారు 7780252277 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కోర్టు ఆర్డర్ తెచ్చాం... మా పిల్లల్ని మాకివ్వండి!

మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యాలయం వద్ద పెంపుడు తల్లిదండ్రుల ఆందోళన



వెంగళరావునగర్ : కోర్టు ఆర్డర్ తెచ్చాం మా పిల్లలను మాకు ఇప్పించండంటూ పలువురు తల్లిదండ్రులు మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యాలయం వద్ద తమ గోడు వెళ్ళగక్కారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈ ఏడాది మే నెలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చిన్నారులను విక్రయించే రాకెట్‌ను పోలీసులు గుర్తించి నిందితులను అదుపులోనికి తీసుకున్నారు. ఈ క్రమంలోనే అనాథలను వివిధ ప్రాంతాల్లో ఉన్న శిశువిహార్‌కు అప్పగించారు. మధురానగర్‌లోని మహిళా శిశుసంక్షేమశాఖ కార్యాలయంలో ఉన్న శిశువిహార్‌కు సైతం పది మంది చిన్నారులను తీసుకువచ్చారు. ఈ సమయంలో పలువురు పెంపుడు తల్లిదండ్రులు వచ్చి తమకు తమ పిల్లలను అప్పగించాలని వేడుకున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేయడం నేరమని, చిన్నారులను అప్పగించేది లేదని ఆ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ వెల్లడించారు. దీంతో ఉసూరుమంటూ తల్లిదండ్రులు వెళ్ళడం జరిగింది. అయితే మళ్లీ సోమవారం సాయంత్రం దాదాపు పదిమంది వరకు పెంపుడు తల్లిదండ్రులు వివిధ ప్రాంతాల నుంచి స్టేట్‌హోంకు చేరుకున్నారు. తమ పెంపుడు పిల్లలను తమకు అప్పగించాలని హైకోర్ట్ ఆర్డర్ జారీ చేసిందని, తమ వద్ద ఆ కాపీలు ఉన్నాయని తెలిపారు. అయితే శిశువిహార్ అధికారులు మాత్రం అందుకు అంగీకరించలేదు. తమ కార్యాలయానికి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని, ఉత్తర్వులు అందిన తర్వాతనే అప్పగించడం జరుగుతుందని ఖరాఖండీగా చెప్పారు. దీంతో చిన్నారుల కోసం వచ్చిన తల్లిదండ్రులకు, అధికారులకు కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. విషయం తెలుసుకున్న మధురానగర్ పోలీసులు స్టేట్‌హోంకు చేరుకుని పెంపుడు తల్లిదండ్రులకు నచ్చచెప్పి పంపించారు.

కేర్ ఆస్పత్రిలో గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం


శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన కేర్ ఆస్పత్రి వైద్య బృందం

బంజారాహిల్స్: ఎడమ జఠరిక పనిచేయకపోవడంతో తలెత్తిన గుండె వైఫల్యంతో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న 39 ఏళ్ళ మహిళా రోగికి బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి వైద్య బృందం విజయవంతంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించి రోగి ప్రాణాలను కాపాడారు. కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజిత్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం... తీవ్రమైన హృద్రోగ సమస్యతో బాధపడుతున్న రోగికి గతంలోనే ఆటోమేటిక్ ఇంప్లాంటబుల్ కార్డియోవర్టర్ డిఫిబ్రిలేటర్ (ఏఐసీడీ) అమర్చారు. అయితే గుండె వైఫల్యం, వెంట్రిక్యులర్ టాకికార్డియో తదితర అనారోగ్య సమస్యలతో రోగి పలుమార్లు ఐసీయూలో వైద్య చికిత్స పొందుతూ వచ్చారు. ఆక్సిజన్‌తో సహా మిల్రినోన్ థెరపీ సహా సమగ్రమైన వైద్య నిర్వహణ ఉన్నప్పటికీ రోగిలో అనారోగ్య లక్షణాలు కొనసాగాయి. దీంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అతినిద్ర తదితర లక్షణాలతో రోగి ఆరోగ్యం క్షీణించింది. ఈ క్రమంలో రోగి కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నగేష్, వారి వైద్య బృందాన్ని సంప్రదించగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించి గుండె మార్పిడి చేయాలని నిర్ధారించారు. దీంతో రోగి జీవన్‌ధాన్‌లో నమోదు చేసుకున్నారు. ఐదు నెలల నిరీక్షణ అనంతరం దాత గుండె ఆస్పత్రికి చేరుకున్న అనంతరం వైద్యులు గుండె మార్పిడిని విజయవంతంగా పూర్తి చేశారు.

జన్మభూమి రుణం తీర్చుకుంటాం

కాచిగూడ: గత 60 సంవత్సరాల క్రితం పాఖాల గ్రామాన్ని వదిలి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఇక్కడే ఉద్యోగాలు చేస్తూ, ఉపాధి పొందుతూ జీవిస్తున్నామని, జన్మనిచ్చిన జన్మభూమి రుణం తీర్చుకునేందుకు పాఖాల గ్రామ అభివృద్ధికి, అక్కడి ప్రజల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని 'పాఖాల అలయ్ బలయ్' ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జనగామ జిల్లా, కొడకండ్ల మండలం, పాఖాల గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో నివాసముంటున్న గ్రామస్తులు 'పాఖాల అలయ్ బలయ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఖాల అలయ్ బలయ్ ప్రతినిధులు జిలుకర రవికుమార్, డాక్టర్ బి.విద్యాకుమార్, వి.సోమయ్య, బొట్టు మంచి సుధాకర్, గోలి ప్రకాష్, బుర్కా చంద్రమౌళి జక్కుల జీవరత్నం, పానుగంటి లక్ష్మయ్య, ఎల్లయ్య, తారా, సోమశేఖర్, స్వామిదాస్, నాగార్జున తదితరులు పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో విద్యా, వైద్యం అందరికి అందే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.


శ్రీనగర్‌కాలనీలో..


దైవసన్నిధానంలో..


ఫిలింనగర్ మాగంటి కాలనీలో..


బంజారాహిల్స్‌లో..


సీతారామ స్వామి ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో నవరాత్రోత్సవాలు

- లలితాదేవీగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- కొనసాగుతున్న ప్రత్యేక పూజలు.. అన్నదానాలు


ఇందిరానగర్‌లో..


వెంగళరావు నగర్‌లో..


జీటీఎస్ టెంపుల్‌లో..

పెద్దమ్మతల్లి ఆలయానికి భారీగా భక్తులు



బంజారాహిల్స్: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి సోమవారం లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చెరుకుగడ, విల్లు, పాశాంకుశాలను ధరించిన అమ్మవారు కోరిన కోర్కెలు తీరుస్తుందని భక్తుల విశ్వాసం. లలితా దేవి విద్యాస్వరూపిణిగా, మాంగళ్య సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. కాగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.


జ్ఞానిజైల్‌సింగ్ నగర్‌లో..

బంజారాహిల్స్: దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు పలు ఆలయాలు, ఆయా మండపాల వద్ద వేడుకగా జరుగుతున్నాయి. సోమవారం ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్ నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక జూబ్లీహిల్స్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, ఓబీసీ అధ్యక్షుడు జెర్పెటి అశోక్ కుమార్, పద్మ, ప్రభావతి, కుర్మయ్య, అంజి, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ కాలనీ భ్రమరాంబికా దేవి అమ్మవారు లలితా దేవిగా, ఫిలింనగర్ దైవసన్నిదానం అమ్మవారు లలితా దేవిగా, మాగంటి కాలనీ విజయ కనక దుర్గా దేవి అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇందిరానగర్ బస్తీలో జై భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా మండపాలు, ఆలయాల వద్ద సామూహిక కుంకుమార్చన పూజలు వైభవంగా జరిగాయి.

అర్ధరాత్రి తరువాత టిఫిన్ సెంటర్ నిర్వహణ

నిర్వాహకుడికి రెండు రోజుల జైలు శిక్ష

పంజగుట్ట: సమయపాలన లేకుండా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న నిర్వాహకునికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పంజగుట్ట కూడలిలోని క్లాసిక్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు అబ్దుల్ మొసబ్ బాబా అను మతించిన సమయం దాటి అర్ధరాత్రి కూడా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. దీంతో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని సోమవారం న్యాయస్థానం ముందు హాజరుపరచగా బాబాకు న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించింది. ఈ మేరకు పోలీసులు బాబాను రిమాండ్‌కు తరలించారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

వెంగళరావునగర్: భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివసించే సి.నరేష్ సుతారీ పని చేస్తుంటాడు. గత మూడేళ్ళ కిందట లత అనే యువతిని పెళ్ళి చేసుకున్నాడు. వారికి ఏడాదిన్న బాబు ఉన్నాడు. ఈ క్రమంలో ఈనెల 6వ తేదీన నరేష్, లతలకు గొడవ జరగ్గా ఆమె ఉప్పుగూడలో ఉంటున్న అతడి సోదరుడు రమేష్ ఇంటికి వెళ్లింది. ఈ విషయాన్ని రహమత్‌నగర్‌లో ఉంటున్న నరేష్ బాబాయి వీరేష్‌కు రమేష్ ఫోన్ చేసి నరేష్ మద్యం సేవించి లతతో గొడవ పడగా ఆమె బాబుతో కలిసి తన వద్దకు వచ్చిందని చెప్పాడు. అంతేకాకుండా రోజూ మద్యం తాగి లతతో గొడవ పడుతున్నాడని తెలిపాడు. దీంతో వీరేష్ విషయాన్ని తెలుసుకునేందుకు నరేష్ ఇంటికి వెళ్ళి తలుపు కొట్టగా తీయలేదు. దీంతో కిటికీలో నుంచి చూడగా నరేష్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి నరేష్‌ను కిందకి దించగా అప్పటికే నరేష్ మృతి చెందాడు. మృతుడి బాబాయి వీరేష్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు వేర్వేరు కార్యాలయాల్లో చోరీ

వెంగళరావునగర్ : రెండు వేర్వేరు కార్యాలయాల్లో చోరీ జరిగిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్పిఆర్‌హిల్స్ ఇందిరానగర్‌లో నివాసం ఉండే బి.బలరామ్ ప్రసాద్ మధురానగర్‌లో సినిమా ఇండస్ట్రీ ప్రొడక్షన్ కార్యాలయం నిర్వహిస్తున్నాడు. ఈనెల 5వ తేదీ రాత్రి తాళం వేసి వెళ్ళి ఉదయం వచ్చి చూడగా తాళం పగలకొట్టి ఉంది. లోపలకు వెళ్ళి పరిశీలించగా తన ల్యాప్‌టాప్ మాయమైంది. విషయాన్ని ఇంటి ఓనర్ రాకేష్‌కు తెలియజేసి పరిసరాలను పరిశీలించగా పక్కనే ఉన్న స్టూడియో తలుపులు కూడా పగలకొట్టి ఉన్నాయి. స్టూడియో నిర్వాహకుడిని పిలిపించి పరిశీలించగా అతని పాత కెమెరాతో పాటుగా రూ. 80వేల నగదు మాయమైంది. దీంతో బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌పాత్ ఉన్నా.. రోడ్డుపైనే నడక!

- పిచ్చిమొక్కలు.. మట్టిదిబ్బలతో ఫుట్‌పాత్‌లు..!
- పట్టించుకోని అధికారులు


పెద్దమ్మ గుడి రోడ్డులో పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలతో ఫుట్‌పాత్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36 నుంచి పెద్దమ్మగుడికి వెళ్లే రోడ్డులో రోడ్డుకు ఒకవైపు లక్షలాది రూపాయలు వెచ్చించి ఫుట్‌పాత్‌ను నిర్మించడమే కాకుండా ఆక్రమణలకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ ఫుట్‌పాత్‌లను అధికారులు వాటి నిర్వహణ మాత్రం గాలికొదిలేశారు. దీంతో ఈ ఫుట్‌పాత్‌పై గడ్డి, పిచ్చిమొక్కలు, బురద, మట్టి, రాళ్లతో కలిసి చిన్నపాటి డంపింగ్‌గా మారిపోయింది. నిత్యం వేలాది మంది పెద్దమ్మ గుడికి వచ్చే భక్తులు ఫుట్‌పాత్ అపరిశుభ్రంగా ఉండడంతో ఫుట్‌పాత్‌లపై నడవలేక రోడ్డుపైనే నడుస్తున్నారు. ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తీసుకురావడంలో ట్రాఫిక్ పోలీసులు కూడా చేతులెత్తేశారు. సీఎం నివాసానికి సమీపంలోనే ఇటీవల కోట్ల రూపాయలు వెచ్చించి ఫుట్‌పాత్‌లు బాగు చేసిన అధికారులు సమీపంలో ఉన్న పెద్దమ్మ గుడి ఫుట్‌పాత్‌లు మాత్రం నిర్మించినా ఉపయోగంలోకి తీసుకురావడం లేదు. జీహెచ్‌ఎంసీ అధ్వాన పనితీరుకు పెద్దమ్మ గుడి రోడ్డు అద్దంపడుతోంది. నిత్యం ఈ ప్రాంతంలో పర్యటించే ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, అధికారులు ఇలాంటి దుస్థితిపై దృష్టిపెట్టడం లేదు. పెద్దమ్మ గుడి యాజమాన్యం నిర్వాహం కూడా ఈ రోడ్డులో అడుగడుగునా కనిపిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

లిబర్టీ: రాజ్యాంగం ప్రకారం ఎస్సీ వర్గీకరణ చెల్లదని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ స్పష్టం చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ వాదనను స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. మాల మహానా డు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. స్వార్థ ప్రయోజనాల కోసం సంఘాన్ని వాడుకుంటూ ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడం చెల్లదని ఏబీసీడీగా వర్గీకరణ చేయడం రా జ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ ఎలా చేస్తారని ఆయన నిలదీశారు. సుప్రీంకోర్టు సాకుతో మందకృష్ణ మాదిగ ప్రభుత్వాలను బెదిరిస్తూ ముఖ్యమంత్రి, మంత్రులను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో బతుకమ్మ వేడుకలు




బతుకమ్మ వేడుకల్లో ఫౌండేషన్ మహిళా ప్రతినిధులు.

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని వాసవి బంధన్ గ్లోబల్ ఫౌండేషన్ (విబిజిఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలతో బంగారు బతుకమ్మను అత్యంత సుందరంగా పది అడుగుల ఎత్తులో తీర్చిదిద్దిన తీరు అందరిని ఆకర్షించింది. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఎం. రాము గుప్తా, టీఎస్‌వీ ప్రసాద్, మడిపడిగె రాజుగుప్తా, ఎం. సత్యవతి ప్రసన్న, నీలా విజయలక్ష్మీ, కలకొండ వాసంతి గుప్త, ఇల్లూరి కావ్య గుప్తా, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆప్ కార్యాలయంలో

లిబర్టీ: లిబర్టీ ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆప్ మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి యమునాగౌడ్, ఆప్ డాక్టర్స్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి తీసుకువచ్చి ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు.


బతుకమ్మ సంబరాల్లో నాయకులు, మహిళలు

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు



ఫిలింనగర్: సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీకి చెందిన ఎస్.నరేష్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రిలో చేరాడు. మొత్తం రూ.3.75 లక్షల వరకు బిల్లు కాగా బాధితులు ఎమ్మెల్యే కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో దానం ఆసుపత్రి యాజమాన్యాన్ని రూ.1.75 లక్షలు డిస్కౌంట్ ఇవ్వాల్సిందిగా కోరగా ఆస్పత్రి యాజమాన్యం ఆ మేరకు అంగీకరించింది. మిగతా బిల్లు చెల్లింపు విషయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా ఎమ్మెల్యే చొరవ చూపి రూ.60 వేలు మంజూరు చేయించారు. ఈ చెక్కును సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, యాదగిరి, దామోదర్, బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలో వేంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఆలయ అర్చకులు, భక్తులు ఊరేగించారు. స్వామివారి వాహన సేవల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి వేకువ జామునే అభిషేకం, అర్చన, సుప్రభాత సేవ, సుదర్శన హోమం అనంతరం పల్లకీ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈవో శ్రీనివాస శర్మ, అర్చకులు శశికుమారాచార్యులు, శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాజకీయ నాటకాలు మానుకోవాలి

లిబర్టీ: తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రివర్గ సభ్యులు స్వార్థ రాజకీయాల కోసం రాజకీయ నాటకాలు ఆడుతున్నారని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలి తెలుగుదేశం ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వెంపర్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీపై బురద జల్లుతుందని విమర్శించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లడ్డూ పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలు, శాసన సభ్యులు, రాజకీయ నాయకులు డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం తయారు చేసే లడ్డూలో కల్తీ జరిగిందని పేరుతో ప్రధాన రాజకీయ పక్ష నాయకులపై మాజీ ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం అధికారం ఉన్న నేపథ్యంలో ఎలాంటి లోపాలు జరగలేదని ఏదో ఒక రాజకీయ ప్రయోజనం కోసం తిరుమల తిరుపతి లడ్డూను వాడుకోవడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అశ్లీల వీడియోలు పోస్టు

డైరెక్టర్ ఫిర్యాదు..వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: అశ్లీల వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేయడమే కాకుండా అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సినీ దర్శకుడు, నిర్మాత షేక్ నాగుల్ షరీఫ్ పాన్ ఇండియా సినిమాను నిర్మించేందుకు సాగర్ సొసైటీలో కార్యాలయం తెరిచి నటీనటుల కోసం ఆడిషన్స్ సైతం మొదలు పెట్టారు. అంతే కాకుండా సినీ ప్రొడక్షన్లకు సంబంధించి ఇన్‌స్టా పేజీను అందుబాటులోకి తీసుకువచ్చాడు. ఈ పేజీ అడ్మిన్ బాధ్యతలను తన వద్ద పనిచేస్తున్న టి సృజన్‌కు అప్పగించాడు. కానీ సృజన్ ఇన్‌స్టా ద్వారా కొంత మందిని రకరకాలుగా వేధించడం మొదలు పెట్టాడు. విషయం తెలిసిన నాగుల్ అతన్ని విధుల్లో నుంచి తొలగించాడు. ఈ నెల 6న సృజన్ కార్యాలయానికి వచ్చి నాగుల్‌ను కలిసి తిరిగి ఉద్యోగం ఇవ్వాలని కోరాడు. దీనికి నాగుల్ ఒప్పుకోలేదు. దీంతో సృజన్ సినీ ప్రొడక్షన్‌కు చెందిన ఇన్‌స్టా పేజీలో సినిమాకు సంబంధించిన విషయాలు తొలగించి అశ్లీల వీడియోలు, ఫొటోలను అప్‌లోడ్ చేశాడు. అంతటితో ఆగకుండా ఆ చిత్రాలను కొంత మంది మహిళలకు పంపించాడు. విషయం తెలుసుకున్న షేక్ నాగుల్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీ చెట్టు కొట్టేసి..!

- వ్యాపారానికి అడ్డొస్తుందని చెట్టును నరికేసిన వ్యాపారి
- పట్టించుకోని అధికారులు


గత నెల 22వ తేదీన బిల్డింగ్ ముందున్న భారీ చెట్టు


మోడుగా మారిన తరువాత

బంజారాహిల్స్: ఒక వైపు ప్రభుత్వం మొక్కలు పెంచాలి, పచ్చదనాన్ని కాపాడాలని పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తుంటే కొంత మంది ఇవేమీ పట్టనట్లుగా ఏళ్ల క్రితం ప్రభుత్వం నాటిన భారీ చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని కేబీఆర్ పార్కు ఎదురుగా ఓ భారీ చెట్టును కొట్టేసినా ఇంత వరకు అధికారులు ఏ మాత్రం అటు వైపుగా చూడకపోవడం గమనార్హం. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లో గత నెల 22వ తేదీన ఫెమినా ఫ్లాంట్ స్టూడియో, సికర క్లినిక్స్ పేరుతో ఓ సెంటర్‌ను తెరిచారు. ఈ సెంటర్‌కు అడ్డుగా 30 సంవత్సరాల నాటి భారీ చెట్టు అడ్డొస్తుందని గ్రహించిన సదరు వ్యాపారి రాత్రికి రాత్రే ఈ చెట్టును మోడుగా మార్చేశాడు. దీంతో తన వ్యాపారం కోసం ఇంత పెద్ద చెట్టును ఎలా కొట్టేస్తారంటూ ప్రకృతి ప్రేమికులు మండిపడుతున్నారు. ఈ మేరకు కేబీఆర్ పార్కు వాకర్లతోపాటు కొంతమంది ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

సాక్షి మంగళవారం । 8 । అక్టోబర్ । 2024

కొత్త పైప్‌లైన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

• క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎండీ అశోక్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: సీవరేజీ పాత పైపులు ఉన్న స్థానంలో కొత్త పైప్‌లైన్లు వేసేందుకు పరిశీలిస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి వెల్లడించారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో నివారణకు చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం ఎర్రగడ్డ, హైమవతినగర్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన అక్కడ కొనసాగుతున్న పనులను పరిశీలించారు. కార్మికులతో మాట్లాడి పరిస్థితి ఆరా తీశారు. పురాతన పైప్‌లైన్‌కు తాత్కాలిక మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కారంగా కొత్త పైపులైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో 1979 సమయంలో నిర్మించిన సీవరేజ్ లైన్ తరచూ పొంగి పారుతోందని గుర్తించారు. మరోవైపు మురుగు మొత్తం ఒకే పైపులైన్‌కు అనుసంధానం కావడంతో ఒత్తిడి పెరిగి.. మెయిన్ రోడ్‌పై మురుగు చేరుతున్నట్లు గుర్తించారు. సీవరేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం కొత్త పైపులైన్ నిర్మాణ కోసం ప్రతిపాదనల సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు.

గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్ 2024

• ప్రకటించిన ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్



సాక్షి, సిటీబ్యూరో: దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ కొత్త ప్రమోషనల్ స్కీమ్ 'గో ఫర్ ఫ్రీడమ్ గోల్డ్ ఆఫర్ 2024' ప్రకటించింది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచే అమల్లోకి వచ్చిన ఈ ఆఫర్ వచ్చేనెల 14వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. ఇందులో పాల్గొనే వినియోగదారులు ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ఒక లీటర్ పౌచ్‌లను రెండు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వాటితో పాటు అందించే కార్డ్‌ను స్క్రాచ్ చేసిన కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ మైక్రోసైట్‌లో వినియోగదారు పేరు, నగరం, రాష్ట్రం, మొబైల్ నంబర్ తెలపాలి. మొబైల్‌కు పంపే ఓటీపీ ద్వారా వినియోగదారుల వివరాలు ధ్రువీకరిస్తారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈ ఆఫర్ అమలులో ఉంటుంది. ఆఫర్‌లో భాగంగా ప్రతిరోజూ వందమంది లక్కీ కస్టమర్లు 1 గ్రాము బంగారం నాణెం పొందుతారని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. విజేతల పేర్లు సంస్థ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయబడతాయని పేర్కొంది. ఈ ప్రమోషనల్ స్కీమ్ ముగిసేనాటికి ఐదుగురు అదృష్టవంతులైన విజేతలకు 50గ్రాముల బంగారు నాణేలు, 10 మంది విజేతలు 10 గ్రాముల బంగారు నాణేలు అందుకుంటారని జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ఎ, డి విటమిన్లతో సమృద్ధి చేయబడిందని పేర్కొన్నారు.

హెచ్‌ఎండీఏలో బతుకమ్మ వేడుకలు



అమీర్‌పేట్‌లోని స్వర్ణజయంతి కాంప్లెక్స్ హెచ్‌ఎండీఏ కార్యాలయం వద్ద సోమవారం బతుకమ్మ వేడుక ఘనంగా జరిగింది. హెచ్‌ఎండీఏలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులు, అధికారులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

చిత్ర బృందాన్ని అభినందించిన బండి సంజయ్

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక అంశాలే ఇతివృత్తంగా రూపుదిద్దుకుంటున్న నూతన చిత్ర బృందాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అభినందించారు. కె.కె.పిక్చర్స్ బ్యానర్‌లో కాశెట్టి కుమార్ నిర్మాతగా యం.వీ.సతీష్ కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిశారు. ఈ సందర్భంగా దర్శకుడు నిజజీవిత ఘటనలు, వాస్తవిక అంశాలపై తాను చేసిన పరిశోధన గురించి ఆయనకు వివరించారు. చిత్ర విశేషాలు తెలుసుకున్న ఆయన వారిని అభినందించారు. నిర్మాత డా.కాశెట్టి కుమార్, దర్శకుడు యం.వీ.సతీష్‌కుమార్, మీసాల చంద్రయ్య, బలమూరి సత్యనారాయణ, నటుడు అంతన్నాగారి రాజేందర్, శిఖ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నయా లుక్

సిటీ రైల్వేస్టేషన్లకు ఆధునిక హంగులు

కెఫెటేరియాలు, విశ్రాంతి గదులు, ఫుట్‌పాత్‌లు

హైదరాబాద్ కల్చర్ ఉట్టిపడేలా అభివృద్ధి

అమృత్ భారత్ పథకం కింద 4 స్టేషన్ల రీడెవలప్‌మెంట్



బేగంపేట్ రైల్వే స్టేషన్

సాక్షి, సిటీబ్యూరో: సిటీ రైల్వేస్టేషన్లు ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. హైదరాబాద్ సంస్కృతి ప్రతిబింబించే విధంగా రైల్వే స్టేషన్ల రీడెవలప్‌మెంట్‌కు దక్షిణ మధ్య రైల్వే పనులు మొదలు పెట్టింది. కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమృత్‌భారత్ పథకం కింద నగరంలోని బేగంపేట్, ఉందానగర్, మేడ్చల్, యాకుత్‌పురా స్టేషన్లను అందంగా, ఆహ్లాదం ఉట్టిపడేవిధంగా అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం బేగంపేట్ రీడెవలప్‌మెంట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మరో ఆరు నెలల్లో పూర్తిగా కొత్తదనంతో అందమైన బేగంపేట్ స్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. దశలవారీగా మిగతా మూడు స్టేషన్ల అభివృద్ధి పనులను కూడా పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అమృత్ భారత్ పథకం కింద తెలంగాణలో మొత్తం 16 స్టేషన్లను ఎంపిక చేశారు. నగరంలోని 26 స్టేషన్ల నుంచి ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వాటిలో బేగంపేట్, లింగంపల్లి, హైటెక్‌సిటీ, ఫలక్‌నుమా, ఉందానగర్, మేడ్చల్ స్టేషన్ల నుంచి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. లింగంపల్లి, బేగంపేట్, హైటెక్‌సిటీ స్టేషన్ల నుంచి కొన్ని దూరప్రాంతాల రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పించారు. ఈ స్టేషన్లలో ప్రతిరోజూ సుమారు 10 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. లింగంపల్లి స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌ల ఎత్తు పెంచడంతో పాటు ప్రయాణికులకు సదుపాయాలను అభివృద్ధి చేశారు.

రైల్వేస్టేషన్లకు మాస్టర్‌ప్లాన్

అమృత్‌భారత్ పథకం కింద ఎంపికైన నాలుగు స్టేషన్లకు ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ప్రత్యేకమైన విజన్‌తో స్టేషన్ల అభివృద్ధి జరగనుంది. రాబోయే నాలుగైదు దశాబ్దాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని స్టేషన్ల విస్తరణకు చర్యలు చేపట్టారు. మొత్తం నాలుగు స్టేషన్లకు రూ.65 కోట్లకు పైగా నిధులను కేటాయించగా, అందులో బేగంపేట్ స్టేషన్ కోసమే రూ.26.49 కోట్లు వెచ్చించి పనులు చేపట్టారు. రూ.12.37 కోట్లతో ఉందానగర్, రూ.8.37 కోట్లతో మేడ్చల్, మరో రూ.15.31 కోట్లతో యాకుత్‌పురా స్టేషన్ల అభివృద్ధి జరగనుంది. ఈ నిధులతో అవసరమైన చోట కొత్త భవనాలను నిర్మించడంతో పాటు పాత భవనాల్లో అదనపు సదుపాయాలను కల్పిస్తారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, విశాలమైన ఫుట్‌పాత్‌లు, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించిన ప్రయాణికుడికి ఒక కొత్త అనుభూతి కలుగుతుంది. ఆధునిక సదుపాయాలు లభిస్తాయి.



వస్తు విక్రయ కేంద్రాలు

కేవలం రైళ్ల రాకపోకలే లక్ష్యంగా కాకుండా సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని షాపింగ్ కేంద్రాలు, కెఫెటేరియాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం 18 బోగీలు ఉన్న రైళ్లు ఆగేందుకు మాత్రమే అనువైన ప్లాట్‌ఫామ్‌లు ఉండగా, అమృత్‌భారత్ స్టేషన్‌లలో హైలెవల్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయనున్నారు. 24 బోగీలు ఉన్న రైళ్లు కూడా ఈ స్టేషన్లలో ఆగేందుకు అవకాశం ఉంటుంది. వాహనాల పార్కింగ్, కాలిబాటలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక టాయిలెట్లు, వివిధ కేటగిరీలకు చెందిన విశ్రాంతి గదులు అభివృద్ధి చేయనున్నారు. అలాగే ఈ స్టేషన్లలో 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' కింద ప్రయాణికులకు అవసరమైన వస్తు విక్రయ కేంద్రాలను కూడా అందుబాటులోకి తెస్తారు.



అందమైన ల్యాండ్‌స్కేప్‌లు..

స్టేషన్ల చుట్టూ అందుబాటులో ఉన్న స్థలంలో వివిధ రకాల పూలమొక్కలు, గ్రీనరీతో అందమైన ల్యాండ్‌స్కేప్‌లను కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పచ్చదనం కనువిందుచేసే విధంగా, పర్యావరణ హితంగా అమృత్‌భారత్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు సౌరవిద్యుత్ పలకలను ఏర్పాటు చేస్తారు. అలాగే నీటి నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. మహిళల కోసం ప్రత్యేక విశ్రాంతి గదులను కూడా ఏర్పాటు చేయనున్నారు. అన్ని అమృత్ భారత్ స్టేషన్లలో ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరో ప్లాట్‌ఫామ్‌కు వెళ్లేందుకు లిఫ్టులు, ఎస్కలేటర్లతో పాటు కాలినడకన వెళ్లేందుకు ఎఫ్‌ఓబీలను కూడా అందుబాటులోకి తెస్తారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని శిల్పారామంలో దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి కూచిపూడి, కథక్ నృత్య ప్రదర్శనలు ఉంటాయి.
- గో ధ్వజ్ స్థాపన భారత్ యాత్ర – 2024లో భాగంగా పరమపూజ్య జగద్గురు శంకరాచార్య స్వామి శ్రీఅవిముక్తేశ్వరానంద సరస్వతి సమక్షంలో కార్యక్రమాన్ని మధ్యాహ్నం 12 గంటలకు రవీంద్రభారతిలో నిర్వహిస్తారు.
- సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 47వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరుగుతుంది.
- మూసీ నది సుందరీకరణ కోసం పేదల ఇళ్లను తొలగించొద్దంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

స్వార్థం కోసమే కులాన్ని వాడుకుంటున్న నేతలు

• మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య



కొండ దేవయ్య

కాచిగూడ: కొంత మంది నేతలు తమ స్వార్థం కోసం కులాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయంగా ఎదగాలని చూస్తున్నారని, ఎదిగిన తర్వాత కులాన్ని పక్కన పెడుతున్నారని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ గూడలో సోమవారం ఆయన మాట్లాడారు. మున్నూరు కాపుల సమస్యల పరిష్కారం కోసం, కులం అభివృద్ధి కోసం నేతలు పట్టించుకోవడం లేదని అన్నారు. ఎవరి స్వార్థం వారు చూసుకోవడంతోనే మున్నూరు కాపులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనుకబడిపోతున్నారని ఆయన అన్నారు. మున్నూరు కాపులకు కోకాపేటలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలం కేటాయించినా ఇప్పటి వరకు అక్కడ మున్నూరుకాపుల ఆత్మగౌరవ భవన నిర్మాణం పనులు ప్రారంభం కాలేదన్నారు. ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ట్రస్ట్ రద్దు చేయాలని అన్నారు. రాజకీయాలకతీతంగా కుల పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు కుల అభివృద్ధి సంక్షేమం కోసం, మున్నూరు కాపుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

మానసిక వేదనతో బాలిక ఆత్మహత్య

అల్వాల్: ప్రేమించాలంటూ వేధిస్తుండటంతో మానసిక వేదనకు గురైన బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లోతుకుంటలో నివసించే ఓ బాలిక పదో తరగతి చదువుతోంది. స్థానికంగా ఉండే వ్యక్తి(30) బ్యాండ్ వాయిస్తుంటాడు. అతడికి ఇది వరకు వివాహం అయ్యింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. తనను ప్రేమించాలంటూ కొంతకాలంగా అతడు బాలిక వెంటపడుతున్నాడు. దీంతో అతడి వేధింపులు భరించలేక ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ధర్నా

కవాడిగూడ: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ పోస్టుల్లో 1,179 ఉర్దూ మీడియం బ్యాక్‌లాగ్ పోస్టులకు కేవలం 516 ఉర్దూ మీడియం ఉపాధ్యాయులను మాత్రమే భర్తీ చేయడంతో మిగతా 663 ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోతున్నాయని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి ఫరాజ్ అహ్మద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్‌లో ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 2012 డీఎస్సీ నుంచి బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోయిన పోస్టులను జనరల్ కేటగిరిగా మార్చి ఖాళీగా ఉన్న అన్ని ఉర్దూ మీడియంలో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని ఆయన అన్నారు. ఉర్దూ ఉపాధ్యాయ పోస్టుల ను ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులతో భర్తీ చేయడంతో ఉర్దూ మీడియం విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఉర్దూ మీడియం ఉపాధ్యాయ బ్యాక్‌లాగ్ పోస్టులను ఉర్దూ ట్రైన్డ్ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్‌మోహిజ్, మహ్మద్ ఫైజల్ ఖాన్, అబ్దుల్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాపార్కులో ధర్నా చేస్తున్న ఉర్దూ ట్రైన్డ్ టీచర్ అభ్యర్థులు

భూవైజ్ఞానిక శాస్త్రవేత్తల శిక్షణ ప్రారంభం



ట్రైనీ జియోలజిస్టులతో రిటైర్డ్ డీజీ కుటుంబరావు, డీడీజీ మాథ్యూ జోసెఫ్

మనూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐటీఐ)లో 48వ బ్యాచ్ జియాలజిస్టులు, అసిస్టెంట్ ఇంజినీర్ల ఓరియెంటేషన్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ డా.ఎన్.కుటుంబరావు, జీఎస్ఐటీఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాథ్యూ జోసెఫ్, చీఫ్ ఇంజినీర్ అజయ్ అగర్వాల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీజీ కుటుంబరావు మాట్లాడుతూ జీఎస్ఐ అత్యుత్తమ జియో సైన్స్ ఆర్గనైజేషన్ అని, గొప్ప సంస్థలో భాగమైనందుకు గర్వపడాలన్నారు. శిక్షణ పొందిన వారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా దేశంలో ఏ ప్రాంతంలోనైనా విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. డీడీజీ మాథ్యూ జోసెఫ్ మాట్లాడుతూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో నూతనంగా రిక్రూట్ ఐనా 171 జియోలజిస్టులు, ఐదుగురు అసిస్టెంట్ ఇంజినీర్లు శిక్షణలో పాల్గొంటున్నారని తెలిపారు. శిక్షణ సంస్థలో ఉన్న అనుభవజ్ఞులైన అధ్యాపకుల నైపుణ్యాన్ని ఉపయోగించుకుని తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.

వాటర్ బోర్డులో అంతర్గత సంస్కరణలు!

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి పాలనపరమైన అంతర్గత సంస్కరణలు చేపట్టింది. రేషనలైజేషన్‌లో భాగంగా సర్కిల్, డివిజన్, సెక్షన్లల్లో చేర్పులు, మార్పులతో కుదించింది. పలువురికి పదోన్నతులు, బదిలీలు చేసింది. అర్హత ఉన్నవారికి మేనేజర్లుగా పదోన్నతి కల్పించింది. కొందరిని తాత్కాలిక పద్ధతిలో తీసుకునేందుకు సిద్ధమైంది. కొన్ని విభాగాల్లో ప్రక్షాళన చేపట్టింది.

మేనేజరు పోస్టులు ఖాళీ

వాటర్ బోర్డుకు మేనేజర్ల కొరత వెంటాడుతోంది. సుమారు 330 మేనేజర్ల పోస్టులకు 135 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం డిప్యూటేషన్లపై మేనేజర్లుగా పనిచేస్తున్న 35 మంది ఇంజినీర్లు హౌసింగ్ బోర్డుకు వెనక్కి వెళ్తుండటంతో ఖాళీలు మరింత పెరిగాయి. దీంతో నాలుగేళ్ల క్రితం డిపార్ట్‌మెంట్ పరీక్ష రాసి అర్హత సాధించిన సుమారు 22 మంది టెక్నికల్ గ్రేడ్–2, జేటీఓ, ఏటీఓలకు మేనేజర్లుగా పదోన్నతులు కల్పించారు. వారికి మంగళవారం పోస్టింగ్ ఇవ్వనున్నారు. మిగిలిన ఖాళీగా ఉన్న మేనేజర్ పోస్టులు భర్తీ అయ్యే వరకు తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకునేందుకు సిద్ధమైంది.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

• సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఆర్.కరుమలయన్

కవాడిగూడ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆర్టీసీ కార్మికులు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఐక్యంగా పోరాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఆర్.కరుమలయన్ పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సోమవారం ఆర్టీసీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్ మాట్లాడారు. ఆర్టీసీ పీఎఫ్ ట్రస్టులకు బోర్డ్ ఆఫ్ ట్రస్టీలను వెంటనే నియమించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో హయ్యర్ పెన్షన్‌కు డబ్బులు చెల్లించి తిరస్కరించబడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆర్టీసీ కార్మికులకు వడ్డీతో సహా చెల్లించడంతో పాటు వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ తేదీలను బట్టి డిమాండ్ నోటీసులు జారీ చేయాలన్నారు. డిమాండ్ నోటీసులకు డబ్బులు చెల్లించిన పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ తక్షణమే మంజూరు చేసి నిధులు విడుదల చేయాలన్నారు. ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.భూపాల్, ఎస్‌డబ్ల్యూఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ రావు, నాయకులు అయ్యప్పరెడ్డి, రవీందర్‌రెడ్డితో పాటు ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళాకారుడే సీఎం కావడం మన అదృష్టం

హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: కళాకారుడే సీఎం కావడం మన అదృష్టమని హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం 10 ఎకరాల స్థలాన్ని కేటాయించిన సందర్భంగా హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ ఏర్పాటైనప్పటి నుంచి 3 ఎకరాలల్లోనే ఉంది. ఇక్కడ ఫైన్ ఆర్ట్స్‌లో చదువుకున్న వారు ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. అలాంటి యూనివర్సిటీ విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డి 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడం శుభపరిణామం అన్నారు. ఆయన స్వతహాగా కళాకారుడు కావడంతో మన కష్టాలు ఆయనకు తెలుసని పేర్కొన్నారు. మాజీ ఎంపీ దయాకర్ మాట్లాడుతూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి స్థలం కేటాయించినందుకు కొందరు రాజకీయం చేయాలని చూస్తున్నారు. 80 ఏళ్ల క్రితం ఎలా ఉన్నామో.. ఈ రోజు అలాగే ఉండాలని కోరుకుందామా? అని ప్రశ్నించారు. అందరం కలిసి పనిచేసుకుందామని తెలిపారు. గత ప్రభుత్వాలు కళాకారులను ప్రోత్సహించిన దాఖలాలు లేవని తెలిపారు. కళాకారుల వల్లే చరిత్ర సజీవంగా ఉంటుందని వివరించారు. ఈ యూనివర్సిటీ భావితరాల తెలంగాణ చరిత్ర, వాస్తు, శిల్ప, కళా రంగాలకు పునాదిగా నిలుస్తుందన్నారు. 64 రకాల కళాకారులు కలిసి ఉంటేనే కలదు సుఖం అన్నారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ దశరథరెడ్డి, పూర్వపు విద్యార్థులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

మియాపూర్: ద్విచక్రవాహనంపై వేగంగా ప్రయాణిస్తూ లారీని ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభిగ్రామానికి చెందిన పొట్ల ఉమేష్(21) ఇంజినీరింగ్ పూర్తి కావడంతో చిక్కడిపల్లిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నాడు. కర్నూల్ యమ్మిగనూర్‌కు చెందిన తుంబలం జయప్రకాష్(22) కూకట్‌పల్లిలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. వీరిద్దరూ స్నేహితులు. సోమవారం తెల్లవారుజామున చందానగర్ నుంచి మియాపూర్ మీదుగా కూకట్‌పల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డు వద్ద సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్లారు. ఈ క్రమంలో బాచుపల్లి వైపు వెళ్తున్న కంటెయినర్ లారీని వేగంగా ఢీకొట్టారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్‌ఐటీలో ముగిసిన 'వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్



సమ్మిట్‌లో సాంకేతిక నిపుణులు, డెవలపర్లు తదితరులు

రాయదుర్గం: ఇండిక్ మీడియా వికీ డెవలపర్స్ యూజర్ గ్రూప్, వికీమీడియా ఫౌండేషన్ సహకారంతో గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో నిర్వహించిన వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్–2024 ముగిసింది. ఒక రోజు హ్యాకథాన్‌లో దేశం నలుమూలల నుంచి 130 మంది సాంకేతిక నిపుణులు, డెవలపర్లు, వికీమీడియా ప్రాజెక్టుల స్వచ్ఛంద సహకారులు పాల్గొన్నారు. ఓపెన్ సోర్స్ టెక్నాలజీ, వికీ మీడియా ప్రాజెక్టులలో తాజా పోకడలు, ఆవిష్కరణల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీలోని లాంగ్వేజ్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ వాసుదేవవర్మ మాట్లాడుతూ ఈ ఏడాది సమ్మిట్ వికీమీడియా ప్రాజెక్టులు, కమ్యూనిటీలలో టెక్నికల్ ఔట్రీచ్ ప్రోగ్రామ్‌ల ద్వారా లింగ అంతరాన్ని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని గుర్తు చేశారు. వికీమీడియా ఉద్యమం ద్వారా ఊహించిన విధంగా ఉచిత జ్ఞానం కోసం మిషన్‌ను నెరవేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా మామిడి, వికీమీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్‌। మంగళవారం।
8। అక్టోబర్‌। 2024

సమయంతో పాటు పరుగులు తీసే జీవితాలు.. ఐదు, ఆరు అంకెల జీతాలు.. నిత్యం పని ఒత్తిడి.. శారీరక వ్యాయామం అంతంతమాత్రమే.. ఇది సగటు నగర ఉద్యోగి పరిస్థితి. ఈ క్రమంలోనే ఒత్తిడి నుంచి బయటపడేందుకు చాలా మంది యువత క్రీడలపై ఆసక్తి చూపిస్తున్నారు. పనిచేసే సంస్థలో రోజువారీ విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాక రాత్రి పూట స్నేహితులతో కలసి నెట్స్‌లో క్రికెట్, వాలీబాల్, స్నూకర్, టెన్నిస్ వంటి ఆటలు ఆడేందుకు ఇష్టపడుతున్నారు. ఫలితంగా స్ట్రెస్ మర్చిపోయి శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉంటున్నామంటున్నారు. కొన్ని రకాల క్రీడల్లో టోర్నమెంట్‌లు, ఈవెంట్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనికి తగ్గట్టే గంటల లెక్కన అద్దె వసూలు చేస్తున్నారు నిర్వాహకులు. గంటకు సుమారు రూ.1000 నుంచి రూ.1500 వరకూ అద్దె ఉంటుంది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యాపార సంస్థలు రూపాంతరం చెందుతున్నాయి. క్రీడలతో పాటు ఆహారం, మ్యూజిక్, లైవ్ బ్యాండ్, ఫైర్ క్యాంప్ వంటి ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రాంగణంలోకి అడుగుపెట్టాక అన్ని ఒత్తిడులూ మర్చిపోయి హాయిగా ఉండాలన్నదే తమ లక్ష్యమంటున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



ఫరెవర్ న్యూతో త్రిప్తి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఫ్యాషన్ ప్రియులకు చిరపరిచితమైన మెల్‌బోర్న్‌కు చెందిన ప్రీమియం మహిళల ఫ్యాషన్ బ్రాండ్ ఫర్ఎవర్ న్యూ బాలీవుడ్ నటి త్రిప్తి డిమ్రీని తమ కొత్త గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ఈ విషయాన్ని బ్రాండ్ నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. భారత్, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా, యూరప్‌తో సహా ప్రధాన మార్కెట్‌లలో తమ బ్రాండ్‌కు త్రిప్తి ప్రాతినిధ్యం వహించనుందని, తమ ఆటమ్ వింటర్ కలెక్షన్‌ను ఆమె విడుదల చేస్తారని వివరించారు. ఆమెతో తమ భాగస్వామ్యం ఫ్యాషన్ ప్రియులకు తమను మరింత చేరువ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వండర్‌లాలో స్ట్రీట్ ఫెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ అమ్యూజ్‌మెంట్ పార్క్ వండర్‌లా హైదరాబాద్ పార్క్ దసరా పండుగను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు, ఆఫర్లను అందిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. పండుగ వేడుకల్లో భాగంగా దసరా రోజున ప్రత్యేక డీజే సంగీతం, బతుకమ్మ ఉత్సవాలు, దసరా నేపథ్యంతో ఊరేగింపు, వేవ్ పూల్ దగ్గర వెరైటీ గేమ్స్ వంటివి అలరిస్తాయని, అలాగే రోజు మొత్తం వీనుల విందు చేసే స్ట్రీట్ మ్యూజిక్, స్ట్రీట్ ఫుడ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని వివరించారు. సందర్శకుల కోసం ఈ నెలాఖరు వరకూ ఆన్‌లైన్ టిక్కెట్ల కొనుగోలుపై రెండు తీసుకుంటే ఒకటి ఉచితం ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.





సమయం దొరికినప్పుడే ఆడేద్దామంటున్న నగర వాసులు

ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు ఆసక్తి





నైట్ ప్లే స్టేషన్స్..

ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులకు అనుకూలంగా..

ప్రైవేట్ ప్లే జోన్స్‌లో గంటల లెక్కన అద్దె వసూలు

ఇటు వ్యాయామం.. అటు ఒత్తిడి దూరం

సాధారణంగా వారం పాటు ఉద్యోగాలతో బిజీగా ఉండేవారంతా వారాంతంలో మాత్రం ఈవెంట్స్‌కు ప్లాన్ చేసుకుంటున్నారు. దీంతో ప్లే స్టేషన్లకు డిమాండ్ పెరుగుతోంది. ప్రధానంగా క్రికెట్‌కు అత్యంత ఆదరణ కనిపిస్తోంది. వాలీబాల్, టెన్నిస్, స్నూకర్, వంటివాటికి డిమాండ్ ఉంది. ఆరు నుంచి 12 మంది వరకూ ఒక్కో టీంగా ఏర్పడి టోర్నమెంట్‌లు ఇక్కడే ఆడేస్తున్నారు.

అందుబాటులో ప్రైవేట్ స్పోర్ట్స్ కోర్ట్స్

గతంలో టోర్నమెంట్ అంటే గ్రౌండ్, ఇతర ఏర్పాట్లు మనమే చూసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో తమకు నచ్చిన నెట్ ప్లే స్టేషన్‌లో ఈ సమయం నుంచి ఇంత వరకూ మాకు గ్రౌండ్ కావాలని ముందుగా మాట్లాడుకోవడం, ఆపై అవసరమైన ఆహారం, తాగు నీరు, ఇతరత్రా అన్నీ సరఫరా చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. అన్నీ సమయానికి అక్కడకు చేరుతున్నాయి. ఇంకేముంది అంతా హ్యాపీ. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 1 గంట వరకూ ఇవి అందుబాటులో ఉంటున్నాయి. కనీసం ఒక గంట నుంచి గరిష్ఠంగా రోజు ముగిసే వరకు అద్దెకు తీసుకోవచ్చు. సమయాన్ని బట్టి ధర ఉంటుంది.

సమయాన్ని బట్టి పేమెంట్...





రీ ఫ్రెష్ అయిపోతాం..



ఉద్యోగ రీత్యా ఉదయం గ్రూప్ వర్క్, టార్గెట్లు, అచీవ్‌మెంట్ అంటూ నిత్యం ఒకరకమైన ఒత్తిడి ఉంటుంది. వారంలో కనీసం ఒకటి రెండు రోజులైనా ఇలా వచ్చి క్రికెట్ ఆడితే కష్టమంతా మర్చిపోతాం. ఒక్కసారిగా రీ ఫ్రెష్ ఐపోతాం. ఇక్కడ ఖర్చుపెట్టేది తక్కువే అయినా స్నేహితులతో కలసి గడిపిన జ్ఞాపకాలు చిరకాలం గుర్తుండిపోతాయి. ఒకరితో ఒకరికి మంచి బాండింగ్ ఏర్పడుతుంది. అంతకంటే ఇంకా ఏం అవసరం లేదు అనిపిస్తుంది.

- జిషన్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, మాదాపూర్

ప్రతి వారం వస్తాం..



వాలీబాల్ ఆడటం ఇష్టం. ఎక్కడో దూరం వెళ్లి స్థలం వెతుక్కుని, నెట్ సెట్ చేసుకుని, అవసరమైన నీరు, ఆహారం అన్నింటినీ తీసుకెళ్లే కంటే దగ్గరలో ఉంటే మేలని అనుకున్నాం. సాయంత్రం బిజినెస్ కార్యకలాపాలు ముగించుకుని, ఇంటికెళ్లి ఫ్రెష్ అప్ అయిన తరువాత, రాత్రి డిన్నర్‌కు ప్లాన్ చేసుకుంటాం. స్నేహితులంతా కలసి రెండు టీంలుగా ఏర్పడి అక్కడే ఒక గంట వాలీబాల్ ఆడి, భోజనం చేసి తిరిగి ఇంటికి వెళ్లిపోతాం. గడిచిన రెండేళ్లుగా దీన్ని కొనసాగిస్తున్నాం. దీని వల్ల మాకు తెలియకుండానే వ్యాయామం చేస్తున్నాం. ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి.

- రాజేష్, వ్యాపారి, జూబ్లీహిల్స్

కార్పొరేట్ బుకింగ్స్ ఎక్కువ..



ఫుడ్ కోర్టుతో పాటు క్రికెట్, వాలీబాల్ కోర్టులను సుమారు 2017 నుంచి నిర్వహిస్తున్నాము. సాధారణంగా వారాంతాల్లో బుకింగ్స్‌కు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఎక్కువగా కార్పొరేట్ ఆఫీస్ సిబ్బంది బుక్ చేసుకుంటారు. ఇక్కడే క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లు, పెయింటింగ్ వంటి ఈవెంట్స్ నిర్వహిస్తారు. అదే కాకుండా కొంత మంది రెగ్యులర్‌గా వచ్చేవాళ్లు ఉంటారు. ఫుడ్ కోర్టుకి నెట్ ప్లే కోర్టు కొంత సాయంగా ఉంటుందని భావిస్తున్నాం.

- బాలాజీ, రెట్రో డ్రైవ్ ఇన్ నిర్వాహకులు, అయ్యప్పసొసైటీ

లేబుల్స్ స్పేస్‌లో పటోలా ప్రదర్శన



వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన డాక్టర్ సుధా జైన్

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని రోడ్ నెంబర్-1 వేదికగా లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో కొలువుదీరిన డీ సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శనను మిస్ ఇండియా ఆసియా పసిఫిక్ డాక్టర్ సుధా జైన్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విభిన్నమైన హ్యాండ్లూమ్ చీరలతో పాటు పటోలా ఆర్ట్ చీరలు, పటోలా హ్యాండ్లూమ్, సిల్క్ వస్త్ర ఉత్పత్తులను ఒకే వేదికలో ప్రదర్శించడం అభినందనీయమని సుధా జైన్ తెలిపారు. నేటి తరం ఫ్యాషన్ ప్రియులకు చేనేతకారుల నుంచి నేరుగా వినియోగదారునికి ఉత్పత్తులను అందించేందుకు ఏర్పాటైన ఈ ప్రదర్శనను ప్రతి ఒక్కరూ సందర్శించాలని ఆమె సూచించారు. డీ సన్స్ పటోలా ఆర్ట్స్ ఎక్స్‌పో నిర్వాహకుడు భవిన్ మక్వానా మాట్లాడుతూ నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాజ్‌కోట, పటోలా దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగిల్ పటోలా దుప్పట, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి 10 వేల రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, సిల్క్ కో-ఆపరేటివ్ సొసైటీలు తమ ఉత్పత్తులను వివిధ రాష్ట్రాల నుండి ప్రదర్శిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 15 వరకూ ప్రదర్శన కొనసాగుతుందని భవిన్ మక్వానా తెలిపారు.



నేటి నుంచి బెంగాలీ ఉత్సవాలు

సాక్షి, సిటీబ్యూరో: బెంగాలీ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 13వ తేదీ వరకూ శ్రీశ్రీ దుర్గా పూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంజిత్ పాల్ తెలిపారు. హైదరాబాద్ జంట నగరాల్లో బెంగాలీలు, ఇతర వర్గాల మధ్య స్నేహభావాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. ప్రాంతాలు, భాషలతో సంబంధం లేకుండా అందరూ ఈ ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. 8న సార్వజనిన్ దుర్గోత్సవంతో ప్రారంభమై మహా దశమి 13న కార్యక్రమం ముగుస్తుందన్నారు. సందర్శకుల కోసం బెంగాలీ వంటకాలు, దక్షిణ భారత రుచులు ఆహార ప్రియులను కట్టిపడేయనున్నాయని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం ఏడు గంటల నుంచి కోల్‌కతా, ముంబై, ఢిల్లీకి చెందిన ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయన్నారు.



ఆర్గానిక్ ఐస్‌బర్గ్



మార్కెట్‌లోకి సరికొత్త ఐస్‌క్రీమ్ ఫ్లేవర్

- రూ.30 నుంచి 3 వేల వరకూ ధరలు
- ఆర్గానిక్ పదార్థాలతో ఐస్‌క్రీమ్ తయారీ

లక్డీకాపూల్: ఐస్‌క్రీమ్‌కి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు.. ఒక్క స్పూన్ చల్లని ఐస్ క్రీమ్ నోట్లో పెట్టుకుని చప్పరిస్తే.. ఆ ఫీల్ వేరే లెవెల్ అంటారు.. హిమక్రీములను ఇష్టపడేవారు.. ఈ ఐస్ క్రీములు గతంలో వేసవిలో మాత్రమే విరివిగా మార్కెట్‌లో అందుబాటులో ఉండేవి.. అయితే గత కొంత కాలంగా కాలంతో పనిలేకుండా ఏడాది పొడవునా లాగించేస్తున్నారు నగర ప్రియులు. దీంతో వీటికి డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు మార్కెట్‌లో ఎప్పటికప్పుడు కొత్త తరహా ఐస్ క్రీములు అందుబాటులోకి వస్తున్నాయి. కొత్త కొత్త రుచులు ఐస్‌క్రీమ్ ప్రియులను ఆకర్షిస్తున్నాయి. తాజాగా మార్కెట్‌లోకి ఐస్‌బర్గ్ నుంచి ఆర్గానిక్ ఐస్‌క్రీమ్ అందుబాటులోకి వచ్చింది. రుచిలో ఏ మాత్రం రాజీలేని విధంగా సరికొత్త ఫ్లేవర్‌తో రూ.30 నుంచి రూ.3వేల వరకూ ధరల్లో అందుబాటులో ఉన్నాయి.

పుల్ల ఐస్ నుంచి..

కాలక్రమంలో ఐస్ క్రీం అనేక రూపాలను సంతరించుకుంది. గతంలో ఐస్ అనగానే పుల్ల ఐస్ మాత్రమే ఉండేవి. అందులోనూ అనేక ఫ్లేవర్‌లు ఉండేవి. మ్యాంగో, ఆరెంజ్, మిల్క్, గ్రేప్, కొబ్బరి ఐస్ ఇలా అనేక రుచులు ఇళ్ల వద్దకే అమ్మకానికి వచ్చేవి.. ప్రస్తుతం వాటి స్థానంలో అనేక రకాలు అందుబాటులోకి వచ్చాయి. కోన్, చాకోబార్, కప్, స్కూప్, చాక్లెట్ వంటి రకాల్లో అనేక ఫ్లేవర్లు అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిని మరిపించే రీతిలో ఆర్గానిక్ ఐస్‌క్రీమ్ అందుబాటులోకి వస్తున్నాయి.









నగరంలో కామిక్ కాన్ 2024

నవంబర్ 15, 16, 17 తేదీల్లో హైటెక్స్ వేదికగా..

ఫిల్మ్‌నగర్‌లో కామిక్ కాన్ ఫేం సౌరభ్ సింగ్ రావత్

అనుభవాలు పంచుకున్న కాస్ప్లే ఫేం జోహైర్ ఖాన్

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక కామిక్ కాన్ 2024 కార్యక్రమానికి సర్వం సిద్ధం అయ్యింది. హైటెక్స్ వేదికగా నవంబర్ 15, 16, 17 తేదీల్లో కామిక్ కాన్ 2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఫిల్మ్ నగర్‌లోని ఆరోమలే కేఫ్ వేదికగా నిర్వహించిన కాస్ ప్లే వర్క్‌షాప్‌లో కామిక్ కాన్ ఫేం సౌరభ్ సింగ్ రావత్, జోహైర్ ఖాన్‌లు ప్రేక్షకులను అలరించారు. 2024 భారత కాస్ప్లే ఛాంపియన్, ప్రఖ్యాత చిత్రకారుడు సౌరభ్ సింగ్ రావత్ కాస్ప్లే కళపై ఆకర్షణీయ ప్రదర్శనను అందించారు. ఈ ప్రయోగాత్మక ప్రదర్శనలో నురుగు, బట్ట, జిగురు, కత్తెర వంటి సాధారణ వస్తువులను ఉపయోగించి క్లిష్టమైన దుస్తులను ఎలా సృష్టించాలో ప్రేక్షకులకు చూపించారు. ప్రాథమిక సామాగ్రితో కూడా కాస్ప్లే అందరికీ అందుబాటులో ఉంటుందని నిరూపించడం వారి ప్రత్యేకత అని నిర్వాహకులు చెప్పారు.

ఈవెంట్ కోసం ఆసక్తిగా..

ఇంటరాక్టివ్ సెషన్‌లో ఉర్ఫీ జావేద్ వంటి ప్రముఖుల కోసం ఐకానిక్ కాస్ట్యూమ్‌లను రూపొందించి, టాప్ గ్లోబల్ బ్రాండ్‌లతో పని చేస్తూ, వినోద పరిశ్రమలో దశాబ్ద కాలం పాటు నైపుణ్యాలను నేర్చుకోవడం సంతోషంగా ఉందని సౌరభ్ సింగ్ రావత్ తెలిపారు. సంప్రదాయ కళాత్మక, ఆధునిక పాప్ సంస్కృతి సమ్మేళనంతో అద్భుత డిజైన్‌లను రూపొందించిన సౌరభ్ తో కలిసి కామిక్ కాన్‌లో భాగస్వామ్యం కావడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నానని నగరానికి చెందిన కాస్ప్లే అనుభవజ్ఞుడైన జోహైర్ ఖాన్ తెలిపారు. ది హైదరాబాద్ కాస్ప్లేయర్స్ క్లబ్ నిర్వాహకులలో ఒకరిగా, స్థానిక కాస్ప్లే సన్నివేశానికి నేతృత్వం వహించడం మరచిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

పవన్ కల్యాణ్‌పై కేఏ పాల్ ఫిర్యాదు



పంజగుట్ట (హైదరాబాద్): తిరుపతి లడ్డూ విషయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 100 కోట్ల మంది హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఏ పాల్ సోమవారం పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పాల్ మాట్లాడుతూ లక్ష లడ్డూలు కల్తీ చేసి అయోధ్యకు పంపించారని అబద్ధపు మాటలు మాట్లాడారని, లడ్డూపై విచారణ జరిగిందే జూన్‌లో కాగా, అయోధ్య ప్రారంభోత్సవం జనవరిలో జరిగిందని కల్తీ ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. 14 సెక్షన్ల కింద ఫిర్యాదు చేశానని, ఆర్టికల్ 8 ప్రకారం ఆయన్ను వెంటనే ఉపముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని, లేదా ఆయనే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పవన్‌కల్యాణ్‌కు ఎవరు స్క్రిప్ట్ ఇస్తే.. అది సినిమాలో మాదిరి చదువుతున్నాడని, గతంలోనే చెప్పినా వినిపించుకోలేదన్నారు. ఏపీ స్పీకర్, గవర్నర్, దేశ ప్రధాని, కేంద్ర హోంమంత్రి, చీఫ్ జస్టిస్, సీబీఐ అతనిపై విచారణ చేయాలని, వెంటనే పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

ఆదాయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు నాలుగో స్థానం



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆదాయంలో నాలుగో స్థానంలో నిలిచింది. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఎక్కువ ఆదాయం పొందిన రైల్వే స్టేషన్ల జాబితాను రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. ఈ జాబితాలో ఢిల్లీ మొదటి స్థానంలో, హౌరా రెండో స్థానం, చెన్నై మూడో స్థానంలో నిలిచాయి. న్యూఢిల్లీ స్టేషన్ నుంచి రూ.3,337 కోట్ల ఆదాయం రాగా, హౌరా స్టేషన్ నుంచి రూ.1,692 కోట్లు, చెన్నై సెంట్రల్ నుంచి రూ.1,299 కోట్లు, సికింద్రాబాద్ నుంచి రూ.1,276 కోట్ల ఆదాయం సమకూరింది.

కాకినాడ-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: దసరా పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కాకినాడ-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు కాకినాడ-సికింద్రాబాద్ (07071/07072) ప్రత్యేక రైలు ఈ నెల 8, 10, 12 తేదీల్లో రాత్రి 9 గంటలకు కాకినాడ నుంచి బయల్దేరి.. మర్నాడు ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 9, 11 తేదీల్లో సాయంత్రం 6.15 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 7.30 గంటలకు కాకినాడ చేరుకుంటుంది.

టీజీఐఐసీ ఆధ్వర్యంలో 321 కంపెనీలు

తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వీసీఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే ప్రతీ సంస్థకు టీజీఐఐసీ అండగా ఉంటుందని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) వీసీఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పది నెలల కాలంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో 321 కంపెనీలు.. రాష్ట్రంలో రూ. 7,108 కోట్లు పెట్టుబడులుగా పెట్టనున్నాయని, ఈ కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా 25,277 మంది తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని సోమవారం ఓ ప్రకటనలో చెప్పారు. ఆయా కంపెనీల స్థాపన కోసం టీజీఐఐసీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 566.53 ఎకరాల భూమిని కేటాయించిందని వివరించారు. గత నెలలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ, స్టేట్ లెవెల్ ల్యాండ్ అలాట్మెంట్ కమిటీకి వచ్చిన భూకేటాయింపుల దరఖాస్తుల పరిశీలించిన అనంతరం 70 కంపెనీలకు భూకేటాయింపు ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. తద్వారా రూ. 1,721 కోట్ల పెట్టుబడులు, 7,543 మందికి ఉద్యోగాలు లభించనున్నట్టు తెలిపారు.

సీఎంతో ఎంపీ కొండా భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కలిశారు. సీఎంను సోమవారం ఆయన అధికారిక నివాసంలో కలిసిన సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ఒక వినతి పత్రాన్ని అందజేశారు. జీవో 111 గ్రామాలను 'సుస్థిర అభివృద్ధి జోన్'గా మార్చడంతో పాటు, సీతంపూర్ ఆలయ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎస్టీపీలు, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై సీఎంతో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చర్చించారు. భేటీలో కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీరారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు

• బాబు జమానా.. అవినీతి ఖజానా

ముంపులోనూ మేసేశారు

చంద్రబాబు వరద లెక్కల్లో బయటపడిన దిమ్మతిరిగే అవినీతి

అరకొర సహాయక చర్యలు.. వాటిలోనే రూ.534 కోట్లు బొక్కేశారు

బుడమేరు గేట్లెత్తి బెజవాడను నిండా ముంచిన చంద్రబాబు సర్కారు.. ఆదుకోండి మహాప్రభో అని వేడుకునేందుకు వచ్చిన వరద బాధితులను కలెక్టరేట్ గేట్లు మూసి నిర్దయగా గాలికొదిలేసింది. కానీ.. అదే వరద పేరు చెప్పి పాలకులు రూ.వందల కోట్లు కొల్లగొట్టేశారు. సహాయక చర్యలు చేపట్టి బాధితుల్ని ఆదుకున్నట్టు ఇప్పటికీ గొప్పలు చెప్పకుంటున్న చంద్రబాబు.. ఆ ముసుగులో ఏ పనీ చేయకుండానే ఖర్చుల పేరిట ఖజానా నుంచి భారీఎత్తున నిధులను పక్కదారి పట్టించారు.



- భోజనాలకే రూ.368 కోట్ల వ్యయం
- అసలు పెట్టని ఒక్కో భోజనానికి రూ.376 చొప్పున ఖర్చు
- ఎక్కడా కల్పించని తాత్కాలిక వసతికి రూ.1.39 కోట్లు.. పంచని అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులకు రూ.23 కోట్లు
- కేవలం డ్రోన్లకే రూ.2 కోట్లు
- మంచినీళ్ల బాటిళ్ల కోసం ఏకంగా రూ.26 కోట్లు.. వాటికి అంత ఖర్చవుతుందా! అని ప్రశ్నిస్తున్న జనం
- అవన్నీ ఎక్కడ పంచారని బాధితుల నిలదీత

సాక్షి, అమరావతి: వరద సహాయక చర్యల కోసం ప్రభుత్వం చేసిన ఖర్చుల లెక్కలు ప్రజల్ని నివ్వెరపరుస్తున్నాయి. బుడమేరు, కృష్ణా వరదలో పేరుకుపోయిన అవినీతి బురదను చూసి జనం అసహ్యించుకుంటున్నారు. సహాయ, పునరావాస చర్యల్లో ఘోరంగా విఫలమైన టీడీపీ సర్కారు.. ఖర్చులు మాత్రం దిమ్మతిరిగేలా చూపడంతో ఇంత ఖర్చు ఎక్కడ పెట్టారోనని ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు సహాయక చర్యలే చేపట్టక జనం అల్లాడిపోతే ప్రభుత్వం ఏకంగా రూ.534 కోట్లను రిలీఫ్ క్యాంప్‌ల కోసం ఖర్చు చేసినట్టు చెబుతుండటం విస్తుగొలుపుతోంది. గత నెలలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలను వరదలు అతలాకుతలం చేసినా ప్రభుత్వం ఎక్కడా పునరావాస కేంద్రాలు తెరవలేదు. విజయవాడలోని సగం ప్రాంతం మునిగిపోయినా పునరావాస కేంద్రాలు లేకపోవడంతో జనం డాబాలపైన, అపార్ట్‌మెంట్స్‌లోని పై అంతస్తుల్లోనే వారం రోజులపాటు గడిపారు. కాగితాల్లో పునరావాస కేంద్రాలు తెరిచినట్టు చూపించినా రెండు, మూడు మినహా అవి ఎక్కడా లేవు. తెరవని పునరావాస కేంద్రాల కోసం రూ.1.39 కోట్లు ఖర్చయినట్టు ప్రభుత్వం లెక్క రాసేసింది.

భోజనం ఖర్చు రూ.376

అన్ని ఖర్చుల్లోనూ భోజనాల ఖర్చే రూ.368.18 కోట్లు చూపించడంతో వరద బాధితులు నోరెళ్లబెడుతున్నారు. బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు పెద్దఎత్తున ఆహారం సమకూర్చారు. వరద ఎక్కువగా ఉండటంతో ముంపు ప్రాంతాల్లో శివారు ప్రాంతాలకు వాటిని తీసుకెళ్లడం సాధ్యం కాలేదు. కానీ.. చంద్రబాబు మాత్రం ప్రభుత్వం తరఫున 97 లక్షల మందికి ఆహారం అందించినట్టు లెక్క రాసేశారు. 3.97 లక్షల మందికి టిఫిన్, 4.33 లక్షల మందికి మధ్యాహ్న భోజనం, 4.26 లక్షల మందికి రాత్రి భోజనం ఇచ్చినట్టు ఆయనే స్వయంగా పలు మార్లు వెల్లడించారు. 97.70 లక్షల మందికి టిఫిన్, లంచ్, డిన్నర్‌కి రూ.368.18 కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కల్లో చూపారు. అంటే ఒక్కో బాధితుడికి రోజుకు రూ.376 చొప్పున ఆహారం కోసం ఖర్చు చేసినట్టు రాసుకుని ఆ మొత్తాన్ని కొల్లగొట్టారు. ఆహారం అందక జనం అష్టకష్టాలు పడితే.. వారికి స్టార్ హోటల్ భోజనం పెట్టినట్టు చెప్పడాన్ని బట్టి అవినీతి ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

మంచినీళ్లలోనూ అదే తీరు

వరద బాధితులకు 94 లక్షల మంచినీళ్ల బాటిళ్లు ఇచ్చినట్టు లెక్క రాసుకుని రూ.26.80 కోట్లను పాలకులు బొక్కేశారు. 94 లక్షల బాటిళ్లలో పావు వంతు కూడా జనానికి అందలేదు. నిత్యావసర సరుకులు కూడా అందరికీ అందకపోయినా లక్షలాది మందికి ఇచ్చేసినట్టు.. అందుకోసం రూ.61 కోట్లకు పైగా ఖర్చయినట్టు లెక్కల్లో చూపించారు. విజయవాడ సింగ్‌నగర్ పరిసరాల్లో ఇప్పటికీ కొన్నిచోట్ల వరద కంపు కొడుతున్నా, చెత్త కనిపిస్తున్నా పారిశుధ్యం మాత్రం సూపర్‌గా ఉందని.. ఇలా చేయడానికి రూ.51 కోట్లు ఖర్చయ్యిందని లెక్కల్లో రాసేసుకున్నారు.

అగ్గిపెట్టెలు, కొవ్వొత్తుల కోటా రూ.23 కోట్లు

అన్నిటికంటే విచిత్రమైన విషయం కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు రూ.23.07 కోట్లు ఖర్చవడం. అసలు జనానికి ఇవి ఎక్కడ ఇచ్చారో అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. ఏ ప్రాంతంలో వరద బాధితుల్ని అడిగినా కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు ఎక్కడ ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో మొబైల్ జనరేటర్ల ఖర్చు కూడా అందులో ఉందని కవర్ చేసుకుంటున్నారు. కానీ.. అవి ఎక్కడ, ఎన్ని పెట్టారో కూడా అధికారులకు తెలియదు. అవినీతి వరదలో వీటి ఖర్చే వింతల్లోకెల్లా వింతగా కనిపిస్తోంది.

డ్రోన్ల ఖర్చు రూ.2 కోట్లు

వరద ఖర్చుల వింతల్లో డ్రోన్ల ఖర్చు సరికొత్తగా ఉంది. కేవలం డ్రోన్ల కోసం రూ.2 కోట్లు ఖర్చు చేసినట్టు చూపించారు. డ్రోన్లతో ఆహారం సరఫరా చేసినట్టు ఏఐ సాయంతో ఫొటోలు తయారు చేసి.. ఇప్పుడు వాటికి కోసం కోట్లు ఖర్చయినట్టు లెక్కలు రాశారు. చెత్త తరలింపు, వరద నీరు తోడటం వంటి ఖర్చులే రూ.7 కోట్లు దాటిపోయాయి. వరద బాధితుల తరలింపు, చెత్త ఎత్తడం, పారిశుధ్యం ఈ లెక్క వేరేగా ఉంది. అవన్నీ కలుపుకుంటే ఖర్చులే రూ.557 కోట్లు దాటిపోయింది.

ఇవన్నీ ఎక్కడ పంచారు

ఇంత భారీ ఎత్తున సహాయ, పునరావాస చర్యల కోసం ఖర్చు పెట్టినట్టు ప్రభుత్వం చెబుతుండటంతో అంత ఖర్చు ఎక్కడ పెట్టారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. చేయని ఖర్చుకు భారీగా లెక్కలు చూసి సర్కారు పెద్దలు దండుకున్నట్టు ఏ లెక్క చూసినా స్పష్టమవుతోంది. ఈ సొమ్ములో చాలా వరకూ విడతల వారీగా ఇప్పటికే విడుదలైంది. కలెక్టర్లు, వివిధ శాఖల ద్వారా ఆ సొమ్మును డ్రా చేసి బిల్లులు కూడా చాలా వరకూ చెల్లించేశారు. వరద ఖర్చుల్లో ఒక్కో అంశంపైనా అవినీతి కేసులు పెట్టవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వరద బాధితులను ఆదుకోకపోగా వారి పేరుతో రూ.వందల కోట్లు దోచేయడంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.500 కోట్ల విరాళాలు హుష్ కాకే!

వరద బాధితులను ఆదుకోవడానికి చంద్రబాబు భారీగా విరాళాలు సేకరించారు. ఇప్పటివరకు రూ.500 కోట్లకుపైగా నిధులు దాతల నుంచి అందినట్టు ప్రకటించారు. విరాళాలు బాగా వచ్చాయనుకుంటే.. వాటికి మించి రూ.557 కోట్ల ఖర్చుల లెక్కలు చూపించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రాన్ని కుంగదీసిన వరద చంద్రబాబు సర్కారుకు కాసులు కురిపించినట్టు స్పష్టమవుతోంది. బాధితులకు రూ.602 కోట్ల నష్టపరిహారం ఇచ్చినట్టు ప్రకటించినా.. ఇంకా చాలా మందికి అందలేదు. నిత్యం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బాధితులు చేస్తున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనం.

సర్వభూపాలపై సర్వాంతర్యామి

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సర్వభూపాల వాహనంపై వేణుగోపాలకృష్ణుడి అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్త బృందాల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వాహన సేవ వైభవంగా సాగింది. ఉదయం కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో మలయప్ప దర్శనమిచ్చారు.




సర్వ భూపాల వాహనంపై విహరిస్తున్న మలయప్ప

చంద్రబాబుకు హైదరాబాద్‌పై తగ్గని మక్కువ

ఏపీ సీఎంగా ఉన్నా.. వారానికి రెండురోజులు ఇక్కడే!

- ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడూ చుట్టపు చూపుగానే ఏపీకి చంద్రబాబు
- తెలంగాణలో టీడీపీ బలోపేతం పేరుతో కొత్త రాజకీయం
- తాజాగా టీడీపీలో చేరుతానని ప్రకటించిన మాజీ మేయర్ తీగల
- మనవరాలి పెళ్లికార్డు ఇవ్వడానికి కలసిన మాజీ మంత్రి మల్లారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హైదరాబాద్‌పై మక్కువ తీరడం లేదు. తెలంగాణ వెనుకబాటు తనానికి, వనరుల దోపిడీకి కారణం చంద్రబాబేనని తెలంగాణవాదులు ఎన్ని విమర్శలు చేసినా, ఏపీకి సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఏంపని అని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రశ్నిస్తున్నా.. ఆయన పట్టించుకోవడం లేదు. జూన్ 12న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత చంద్రబాబు సుమారు 10 సార్లు హైదరాబాద్ వచ్చారు. మరీ అత్యవసర పని మినహాయిస్తే.. దాదాపుగా ప్రతి శని, ఆదివారాలు ఆయన హైదరాబాద్‌లోనే మకాం వేస్తూ.. ఇక్కడి నుంచే రాజకీయాలు నడుపుతున్నారన్న విమర్శలున్నాయి. ఆయన ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు చుట్టపుచూపుగానే వెళ్లి వచ్చేవారని గుర్తు చేస్తున్నారు. ఏపీలో ప్రతిపక్ష నేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు వెళ్తే రాద్ధాంతం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నేతలు.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు హైదరాబాద్‌లో ఎందుకు మకాం వేస్తున్నారో చెప్పాలని తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు. కాగా చంద్రబాబు హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా.. గతంలో తెలుగుదేశం పార్టీలో పనిచేసి, తెలంగాణ ఏర్పాటు తరువాత బీఆర్ఎస్‌లోకి వెళ్లిన నాయకులు, ప్రజాప్రతినిధులు తరచూ కలుస్తుండడం కొత్త అనుమానాలను రేకెత్తిస్తోంది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది అంతకు ముందు చంద్రబాబును కలసి చర్చలు జరిపిన వారే కావడం విశేషం. జూలై మొదటి వారంలో చంద్రబాబును కలసిన అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్ ఆ తరువాతే కాంగ్రెస్ గూటికి చేరారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం అప్పట్లో చంద్రబాబును ఆయన నివాసంలో కలసి చర్చలు జరిపారని గుర్తు చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరుతానన్న తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం టీడీపీ ఎమ్మెల్యేగా 2014లో ఎన్నికై బీఆర్ఎస్‌లో చేరి, 2018లో ఓడిపోయిన హైదరాబాద్ నగర మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన తన కోడలు తీగల అనితారెడ్డితో కలసి ఫిబ్రవరి 26న కాంగ్రెస్‌లో చేరారు. అయితే కాంగ్రెస్‌లో కూడా తగిన ప్రాధాన్యం లభించకపోవడంతో ఆయన కొంతకాలంగా స్తబ్దుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన చంద్రబాబును జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కలిశారు. అదే సమయంలో బాబుతో భేటీ అయిన మాజీ మంత్రి మల్లారెడ్డి.. తన మనవరాలి వివాహానికి ఆహ్వానించేందుకు చంద్రబాబును కలసినట్లు చెప్పగా, తీగల కృష్ణారెడ్డి మాత్రం తాను త్వరలోనే టీడీపీలో చేరనున్నట్లు స్పష్టం చేశారు. తనతో పాటు చాలా మంది టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తీగల వ్యాఖ్యానించారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తామని ఎన్నికల ముందు కూడా చెప్పిన చంద్రబాబు తన అనుయాయుడు రేవంత్‌రెడ్డి కోసం ఆ ఎన్నికల్లో అభ్యర్థులను కూడా నిలబెట్టలేని విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు.

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ : మంత్రి శ్రీధర్‌బాబు

- ఎస్‌జీ గ్రూప్ పెట్టుబడులు రూ.3 వేల కోట్లు
- మంత్రిని కలసిన ఎస్‌జీ గ్రూప్ ఎండీ భాటియా



శ్రీధర్‌బాబును కలిసిన ఎస్‌జీ గ్రూప్ ఎండీ భాటియా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలకు చిరునామాగా ఉన్న తెలంగాణలో ఎస్‌జీ గ్రూప్ ఈవీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు ఆసక్తి చూపుతోందన్నారు. రూ.3 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఈ యూనిట్ ద్వారా వెయ్యి మందికి ఉపాధి కల్పన సాధ్యమవుతుందన్నారు. సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో ఎస్‌జీ గ్రూప్ ఎండీ డాక్టర్ యోగేశ్ భాటియా, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావు భేటీ అయ్యారు. తెలంగాణలో ఈవీ రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వారు ఈ భేటీలో చర్చించారు.

12 వేల ఎకరాల్లో నెట్ జీరో సిటీ

రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 12 వేల ఎకరాల్లో కాలుష్య రహిత 'నెట్ జీరో సిటీ' ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని భారీ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేసే యోచనలో ఉందన్నారు. కాగా నెట్ జీరో సిటీలో ఎలక్ట్రానిక్ వాహనాల తయారీకి సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఎండీ భాటియా ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ భేటీలో డీహెచ్ సహారా ఎండీ వి.సుమన్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

దేశంలో మొదటిసారిగా డిజిటల్ హెల్త్ కార్డులు

దేశంలోనే మొదటి సారిగా రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డ్ అందించే దిశగా కృషి చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం హోటల్ నోవాటెల్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ సాంకేతిక ఉత్పత్తులను భారతీయ మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో డిజిటల్ సొల్యూషన్స్ ప్రభావం పెరిగిందని పేర్కొన్నారు. అమెరికాతోపాటు, యూరోప్‌కు చెందిన దేశాలు భారత్ నుంచి ముడిసరుకును దిగుమతి చేసుకుని విలువైన ఉత్పత్తులను తిరిగి భారత్‌కు ఎగుమతి చేస్తున్నాయని, ఇలాంటి తరుణంలో బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ వంటి సంస్థలు ఇక్కడే ఏఐ ఆధారిత డిజిటల్ సేవలు ఆవిష్కరించడం గర్వకారణమని అన్నారు. పేటెంట్ పొందిన, ట్రేడ్‌మార్క్ ఉత్పత్తులతో మొదటిసారిగా ఏఐ పరివర్తన ఉత్పత్తులను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ చైర్మన్ జానకి యార్లగడ్డ తెలిపారు.

రుణమాఫీ లెక్కలు ప్రజల ముందు పెట్టండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్/ న్యూఢిల్లీ: 'తెలంగాణలో.. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల మీద అబద్ధాలు ఆడుతోంది. కాంగ్రెస్ అంటేనే అబద్ధాల పుట్ట. అంకెల గారడీలతో ప్రజలను మోసం చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి అలవాటైపోయింది' అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'అసలు తెలంగాణలో పంటరుణాలు తీసుకున్న రైతులెందరు? రూ.2 లక్షల్లోపు రుణాలున్న వారెందరు? మీరు రుణమాఫీ చేసిన వారెందరు? ఈ లెక్కలన్నీ తెలంగాణ ప్రజలకు చెప్పాలి' అని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రైతుల్లో ఈ అయోమయం తొలగిపోవాలంటే రేవంత్‌రెడ్డి అన్ని లెక్కలు వారి ముందు పెట్టాలనే తమ డిమాండ్‌ను ఆయన పునరుద్ఘాటించారు. వాస్తవ పరిస్థితులు, ఇప్పటివరకు రైతులకు చేసిన రుణమాఫీని పరిశీలిస్తే మాత్రం రేవంత్‌రెడ్డి చెప్పిన దాంట్లో మూడోవంతు మందికి కూడా ప్రయోజనం చేకూరలేదనేది వాస్తవమని సోమవారం కిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'అధికారంలోకి రాగానే.. రైతుల రుణాలను ఒకేసారి మాఫీ చేయడమే మా మొదటి లక్ష్యమని వరంగల్ రైతు డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ చెప్పింది. కానీ అధికారంలోకి వచ్చిన 224 రోజుల తర్వాత రైతుల రుణాలు సగం మాత్రమే మాఫీ అయ్యాయి' అని ఆయన ధ్వజమెత్తారు. ఈ ఏడాది ఆగస్టు 26న సీఎం రేవంత్ ఓ సభలో మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రూ.31వేల కోట్లు మాఫీ చేశామని చెప్పారని, అయితే తాజాగా ప్రధాని మోదీకి రాసిన లేఖలో మాత్రం రూ.17 వేల కోట్ల రుణమాఫీ జరిగిందని తెలిపారు. 'మరి సీఎం గతంలో చెప్పినట్టుగా మిగిలిన రూ.14 వేల కోట్లు ఎక్కడకు పోయాయి? మరో 16 లక్షలకు పైగా రైతులకు ఎందుకు ఇంకా రుణమాఫీ జరగలేదు? మీరిచ్చిన హామీ అమలుకోసం రైతులు మరెంత కాలం వేచి చూడాలి?' అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. మొదట్లో.. అందరు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అన్న ప్రభుత్వం.. ఇప్పుడు మాట మార్చి.. ఒక కుటుంబానికి ఒక్కరికి మాత్రమే రుణమాఫీ చేస్తామని చెప్పడం మరో దారుణమైన మోసమని ధ్వజమెత్తారు.

మదర్ డెయిరీ అభివృద్ధికి సీఎంతో మాట్లాడుతా

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి ప్రమాణ స్వీకారం

లింగోజిగూడ: మదర్ డెయిరీని అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడుతానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తి సంస్థ మదర్ డెయిరీకి చైర్మన్‌గా ఎన్నికైన గుడిపాటి మధుసూదన్‌రెడ్డి సోమవారం హయత్‌నగర్ మదర్ డెయిరీలో ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మదర్ డెయిరీ ఉత్పత్తులు మార్కెట్లో ఎక్కువగా అమ్ముడు పోయే విధంగా ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. డెయిరీ నూతన చైర్మన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలు, ఎమ్మెల్యేల సలహాలతో, పాలకవర్గం సభ్యుల సూచనలతో డెయిరీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, రాంమోహన్‌రెడ్డి, సంస్థ ఎండీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవో 317పై త్వరగా నిర్ణయం

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వినతి



సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం తెచ్చిన జీవో 317 రాష్ట్రంలోని ఉద్యోగులకు శాపంగా మారిందని, దీనిపై వెంటనే నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం కేబినెట్ సబ్ కమిటీకి వినతిపత్రం అందజేసింది. సచివాలయంలో సబ్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహ, సభ్యుడు శ్రీధర్ బాబులను కలిసిన జేఏసీ ప్రతినిధి బృందం.. జీవో 317 కారణంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించింది. జీవో అమల్లో భాగంగా స్పౌజ్, మెడికల్, మ్యూచువల్ బదిలీలు జరిగేలా చూడాలని కోరారు. తమ ప్రతిపాదనలపై సబ్ కమిటీ సానుకూలంగా స్పందించిందని, త్వరలోనే ఉద్యోగుల కేటాయింపుపై ఉత్తర్వులను జారీ చేయనున్నారని జేఏసీ నేతలు వెల్లడించారు.

పెండింగ్ బిల్లులపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ



మాట్లాడుతున్న సుర్వి యాదయ్య గౌడ్

కాచిగూడ: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణను దసరా పండుగ తరువాత ప్రకటిస్తామని తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి మెడబోయిన గణేష్ ముదిరాజ్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, దసరా పండుగలోగా సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించమని వారినే అడగాలని ప్రభుత్వ పెద్దలు ఉచిత సలహాలు ఇస్తున్నారని తెలిపారు. దేశంలోనే గ్రామాల్లో అత్యధిక స్థాయిలో అభివృద్ధి పనులు కేసీఆర్ హయాంలోనే జరిగాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికే పెండింగ్ బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక చాలా మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

10 నుంచి మానసిక ఆరోగ్య సదస్సులు

బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి దామోదర

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 10వ తేదీ నుంచి వారం రోజుల పాటు తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్, సంజోజి హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య అవగాహన సదస్సులు జరగనున్నాయి. ఆయా సదస్సులకు సంబంధించిన పూర్తి వివరాలతో తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం, డాక్టర్ ఎ.రాకేశ్ కుమార్, డాక్టర్ కృష్ణగోపాల్ బండారి సంయుక్తంగా రూపొందించిన బ్రోచర్‌ను.. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో ఆవిష్కరించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య సూచనల మేరకు ఏటా అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని గ్లోబల్ క్యాంపెయిన్‌లో భాగంగా నిర్వహిస్తారు. ఈ నెల 10వ తేదీన పిల్లలు, 11న టీనేజ్ పిల్లలు, 12న యువతీ యువకులు, 13న బాలికలు, మహిళలు, 14న విద్యార్థులు, నిరుద్యోగులు, 15న తల్లిదండ్రులు, వారోత్సవాల ముగింపు రోజు 16న వయోవృద్ధుల కోసం విడివిడిగా మానసిక ఆరోగ్య ఉపయోగాలు, మానసిక ఆరోగ్య అవగాహన సదస్సులను నిర్వహిస్తారు. మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారం, ఉచిత కన్సల్టేషన్, కౌన్సెలింగ్ సేవలకు హెల్ప్‌లైన్ నంబర్ 9440488571 లేదా 04035717915 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పదేళ్ల కాలంలో రూ.40 కోట్ల అవినీతి

బీఆర్ఎస్ పాలనలో టీవీసీసీని నాశనం చేశారు: ముత్తినేని వీరయ్య



మాట్లాడుతున్న వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ (టీవీసీసీ)లో పదేళ్ల కాలంలో రూ.40 కోట్ల అవినీతి జరిగిందని ఆ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో వికలాంగుల సంక్షేమానికి సంబంధించిన నిధులను అప్పటి కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు అధికారులు విచ్చలవిడిగా ఖర్చు చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత పదేళ్ల కాలంలో కార్పొరేషన్ నిధుల ఖర్చుపై సోమవారం సచివాలయంలోని మీడియా సెంటర్‌లో వీరయ్య మాట్లాడారు. వికలాంగుల సహకార సంస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ ఈ అక్రమాల్లో భాగస్వాములేనని పేర్కొన్నారు. వికలాంగుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 45 వేల మోటార్ సైకిళ్లు కొనుగోలు చేసినప్పటికీ వాటి వివరాలు లేవని, లబ్ధిదారుల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాల్సి ఉన్నప్పటికీ వివరాలు జాడ లేవని చెప్పారు. వికలాంగుల శాఖలోని పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచి నిధులను దారిమళ్లించారన్నారు. ఈ శాఖ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాల్సి ఉండగా.. అక్రమాలను కప్పిపుచ్చేందుకు నాన్ కేడర్ అధికారిని కొనసాగించారని తెలిపారు. వికలాంగుల సహకార సంస్థ ఆడిట్ నిర్వహించక ఏళ్లు గడుస్తోందని, ఈ శాఖకు సంబంధించిన ఫైళ్లు 90 శాతం మాయమయ్యాయని అన్నారు. శాఖలో గత పదేళ్లుగా జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ లేదా అవినీతి నిరోధక శాఖ ద్వారా పూర్తిస్థాయి విచారణ చేయిస్తామని ముత్తినేని తెలిపారు.





ఒత్తిడి.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో దాదాపు అందర్నీ వెంటాడుతున్న ప్రధాన సమస్య. ముఖ్యంగా మహిళలు అటు వృత్తి జీవితాన్ని, ఇటు కుటుంబ జీవితాన్ని బ్యాలన్స్ చేసుకోలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో దీని ప్రభావం కుటుంబం మీదా, సమాజం మీదా పడుతోంది. ఇటువంటి వాటి నుంచి ఎలా బయట పడాలో నలుగురికీ చెబుతూ వారికి ప్రశాంతతనిచ్చే ప్రయత్నం చేస్తున్నారు ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ జ్యోతిర్మయి కోటిపల్లి. ఆమె ఇంటర్వ్యూని సాక్షి @ నవశక్తిలో చూద్దాం. సాక్షి డిజిటల్ యూ ట్యూబ్‌లో...
https://www.youtube.com/watch?v=b2OAvHsmLYQ



దసరా సెలవులే సుందరం
'సత్యం సుందరం'లో కార్తీ, అరవింద స్వామి

బాలపిట్టలూ బయటికెగరండి

తెలిసిన ఊరే. దసరా సెలవుల్లో కొత్తగా హుషారుగా అనిపిస్తుంది. మేనమామ కొడుకు మనం ఎప్పుడొస్తామా... ఊరంతా తిప్పి ఎప్పుడు చూపుదామా అని ఉంటాడు. మేనత్త కూతురి దగ్గర బోలెడన్ని బొమ్మలు. ఒకరోజు అందరూ కూడి బొమ్మల పెళ్లి కూడా చేయొచ్చు. చిన్న ఊరే. కాని మిఠాయి కొట్టు దగ్గరకు వెళ్లి మిఠాయి కొనుక్కోవడం... పాత సినిమా హాల్లో ఆడే పాత సినిమాను చూడటం... వీధిలోని కుర్రాళ్లను పిలవనవసరం లేకుండా మన బంధుగణంలోని పిల్లలే సరిపోయే విధంగా క్రికెట్ ఆడటం... సరే... ఓటీటీలో సినిమాలు చూడటం.

సెలవులొచ్చేది మనవాళ్లను కలవడానికి. కలిసి ఆటలు ఆడటానికి. పెద్దయ్యాక గుర్తు చేసుకోవడానికి. పూర్వం దసరా కోసం పిల్లలు కాచుకుని కూచునేవారు. ఇవాళ రేపు సెలవులొచ్చినా మంచి ర్యాంకుల కోసం తల్లిదండ్రులు 'ఎక్కడికీ కదిలేది లేదని' అదిలిస్తున్నారు. మరికొందరికి పిల్లల్ని తీసుకొని బంధువుల ఇంటికి వెళ్లడానికి తీరికే ఉండటం లేదు. కొందరికసలు బంధువులే లేరు. అంటే లేరని కాదు. ఉన్నా లేనట్టుగా వీరుంటారు. లేదా వారుంటారు. నడుమ అనుబంధాలు తెగేది పిల్లల మధ్య.

పెద్దయ్యాక జ్ఞాపకాలు ఏమీ ఉండవు. ఉన్నా అవి చెప్పుకోదగ్గవి కావు. జ్ఞాపకాలంటే బాల్యమే. బాల్యంలో ఇష్టంగా గడిపే రోజులు సెలవులు. పిన్ని ఇల్లు, పెద్దమ్మ ఊరు, బాబాయి మిద్దె, పెదనాన్న వాళ్ల తోట, తాతయ్య వాళ్ల చేను, సొంతపల్లెలోని చెరువు గట్టు... ఇవన్నీ కజిన్స్‌తో... దగ్గరి బంధువులతో తిరుగుతూ ఉంటే ఎంత బాగుంటుంది.

ఇటీవల వచ్చిన 'సత్యం సుందరం' ఈ బాల్యాన్నే చూపుతుంది. సత్యం అనే పేరుండే అరవింద స్వామి ఇంటికి సుందరం అనే కార్తీ చిన్నప్పుడు సెలవుల్లో వస్తాడు. ఆ సెలవుల్లో చిన్న అరవింద స్వామి, చిన్న కార్తీ కలిసి ఎన్నో ఆటలు ఆడతారు. సినిమాలు చూస్తారు. ఎన్నో కబుర్లు చెప్పుకుంటారు. ఆ అభిమానమే కార్తీని పెద్దయ్యాక కూడా అరవింద స్వామి అంటే ప్రాణం ఇచ్చేలా చేస్తుంది. ప్రేమ పంచేలా చూస్తుంది. చిన్నప్పుడు వీళ్లు ఆడుకున్న ఆట ఏమిటో తెలుసా? చిన్న అరవింద స్వామిని కూరగాయలు తెమ్మని ఇంట్లో చెప్తే పిల్లలందరినీ తీసుకొని బయలుదేరుతాడు. ఒకడి పేరు బెండకాయ అని పెడతాడు. ఎన్ని కిలోల బెండకాయలు తేవాలో పట్టిక అవసరం లేకుండా ఆ బెండకాయ గుర్తు పెట్టుకోవాలన్నమాట. ఇంకొకడి పేరు వంకాయ అని పెడతాడు. ఒకమ్మాయి పేరు కాకర. మరి కార్తీకి ఏం పేరు పెడతాడు? సినిమా చూస్తే తెలుస్తుంది.

'చిన్నప్పుడు ఎంత బాగుండేది' అని ఏ కాలంలో అయినా పిల్లలు అనుకునేలా వారి ఆటపాటలు సాగేలా పెద్దలు చూడాలి. ఆ ఆటపాటలన్నీ అయినవాళ్లతో జరగాలి. దసరా సెలవులు బంగారు గనులు. ఆ గనుల్లోకి పిల్లల్ని పంపండి. మర్చిపోవద్దు.

అతిథి

అతని ఫౌజీ సాజిదా

ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా భర్త, మాల్దీవుల అధ్యక్షుడు మొహహ్మద్ ముయిజ్జుతో కలిసి మన దేశంలో అడుగుపెట్టిన సాజిదాకు 'బెంగళూరు డేస్' గుర్తుకొచ్చి ఉంటాయి.
ఆశ్చర్యంగా ఉందా!
అవును. మాల్దీవుల ప్రథమ మహిళ సాజిదా బెంగళూరులో డిగ్రీ చేసింది. ఇక్కడి నుంచి వెళ్లిన తరువాత ముయిజ్జుతో వివాహం అయింది.
'ఆమె అతడి అదృష్టం' అనే మాట ఎలా ఉన్నా 'ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది' అని మరోసారి గట్టిగా చెప్పడానికి బలమైన ఉదాహరణ సాజిదా మొహమ్మద్....

మాల్దీవుల రాజధాని మాలేలో పుట్టింది సాజిదా. తండ్రి షేక్ మహ్మద్ ఇబ్రహీం ప్రఖ్యాత పండితుడు. రాజకీయ, సామాజిక విషయాలపై మొదటి నుంచి ఆసక్తి ఉన్న సాజిదా రకరకాల స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేసింది. సాజిదా స్వేచ్ఛకు తల్లిదండ్రులు ఎప్పుడూ అడ్డు పడలేదు.

బెంగళూరులో బ్యాచిలర్స్ డిగ్రీ చేసిన సాజిదా యూకేలోని లీడ్స్ యూనివర్శిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసింది. మాల్దీవుల సివిల్ సర్వీస్ కమిషన్‌లో సివిల్ సర్వెంట్‌గా పనిచేసింది. యూనిసెఫ్‌తో కలిసి ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. పిల్లల ఆరోగ్యం నుంచి సృజనాత్మక ప్రతిభను పెంపొందించడం వరకు ఎన్నో కార్యక్రమాలలో భాగం అవుతోంది. పాలస్తీనాకు సంఘీభావం తెలిపే క్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా నిధుల సమీకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా '5 మిలియన్ ట్రీ ప్రాజెక్ట్'ను లాంచ్ చేసింది. తలసీమియా పేషెంట్లను దృష్టిలో పెట్టుకొని ఎన్నో కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు అందరికీ అందుబాటులో ఉండే తలసీమియా చికిత్సపై దృష్టి పెట్టింది.

సాజిదా ప్రసంగాలలోని వాడి, వేడి ఏమిటో 2023 అధ్యక్ష ఎన్నిక సమయంలో లోకానికి తెలిసింది. తన అద్భుతమైన ప్రసంగాలతో శ్రోతలను ఆకట్టుకునేది. భర్త విజయానికి ఆమె ప్రసంగాలు ఒక కారణంగా చెప్పవచ్చు.

మాల్దీవులలో సైన్స్ రంగంలో మహిళలను, బాలికలను ప్రోత్సహించడానికి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజిటలైజేషన్ రంగాలలో మహిళల సంఖ్యను పెంచడానికి దేశ ప్రథమ మహిళగా ఎంతో కృషి చేస్తోంది సాజిదా. 'లింగ వివక్ష లేకుండా సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు ఉండాలి' అనే విషయాన్ని గట్టిగా చెబుతుంది.

'ఇవ్వాళ ఆలోచించి రేపు మాట్లాడాలి' అనేది ఆంగ్ల సామెత.

తాను మాట్లాడబోయే అంశాలను ఇంట్లో భార్యతో పంచుకోవడం మాల్దీవుల అధ్యక్షుడు మొహహ్మద్ ముయిజ్జుకు అలవాటు. తన ఆలోచనలను సాజిదాతో పంచుకోవడమే కాదు ఆమె సలహాలు తీసుకుంటాడు. ఆ ఇంట్లో తమ ముగ్గురు పిల్లలు యాస్మిన్, ఉమైర్, జాయెద్‌ల గురించి కుటుంబ విషయాలను ఎంత సహజంగా మాట్లాడుకుంటారో జెండర్ ఈక్వాలిటీ నుంచి జీరో వేస్ట్ ప్రాజెక్ట్‌ల వరకు ఎన్నో సామాజిక విషయాలను అంతే సహజంగా మాట్లాడుకుంటారు.

'మా ఆలోచనలు ఎప్పుడు ఒకేరకంగా ఉంటాయి' అని భార్య గురించి మురిసిపోతుంటాడు డా. మొహమ్మద్ ముయిజ్జు.



మొహహ్మద్ ముయిజ్జు, సాజిదా మొహమ్మద్

● కమలా హ్యారిస్

ఖాళీ బుక్... బెస్ట్ సెల్లర్



అమెరికా అధ్యక్ష ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ప్రచార పర్వంలో చిత్రవిచిత్రాలు జరుగుతున్నాయి. డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారిస్‌పై వ్యంగ్యాస్త్రంగా ఇటీవల వెలువడిన పుస్తకం 'అమెజాన్' బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. 'ది అచీవ్‌మెంట్స్ ఆఫ్ కమలా హ్యారిస్' అనే ఈ పుస్తకంలో ఉన్నవల్లా దాదాపు ఖాళీ పేజీలే! ఈ పుస్తకంలో కొన్ని అధ్యాయాల పేర్లు మాత్రమే ముద్రించి, అధ్యాయానికీ అధ్యాయానికీ మధ్య నున్న పేజీలన్నీ ఖాళీ తెల్ల కాగితాలుగా విడిచిపెట్టి అచ్చేశారు. వాల్‌మార్ట్ బుక్‌స్టోర్‌లో ఒక వ్యక్తి ఈ పుస్తకం వీడియోను చిత్రించి 'టిక్‌టాక్'లో పోస్ట్ చేశారు. తర్వాత జాక్ అనే వ్యక్తి ఈ పుస్తకం వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేస్తే, దాదాపు ఏడు గంటల వ్యవధిలోనే ఇరవై లక్షల మందికి పైగా చూశారు. వందలాది మంది దీనిని రీపోస్ట్ చేశారు. కమలా హ్యారిస్ మీద ఈ వెటకారం వీడియో సంగతి ఎలా ఉన్నా, హోరాహోరీ పోరు నెలకొన్న ఈ ఎన్నికల్లో ఆమె విజయం తథ్యమని 'ఎన్నికల నోస్ట్రడామస్'గా పేరుపొందిన అమెరికన్ రాజకీయ విశ్లేషకుడు అలన్ లిచ్‌మన్ ఘంటాపథంగా చెబుతుండటం విశేషం.



యోగం



లైఫ్ బోట్.. బ్యాలెన్సింగ్

శరీర బలాన్ని బ్యాలెన్స్ చేసే ఈ ఆసనాన్ని బోట్ ఆసన అని కూడా అంటారు. ఈ ఆసనం శక్తిని పెంచుతుంది. అలసటను పోగొడుతుంది. తొడలను బలోపేతం చేయడం ద్వారా ఎక్కువసేపు కూర్చొని చేసే పనుల వల్ల కలిగే సమస్యలను నిరోధిస్తుంది. నౌకాసనాన్ని సాధన చేయాలనుకునేవారు..

● ముందుగా మ్యాట్ పైన కాళ్లను ముందుకు చాపి విశ్రాంతిగా కూర్చోవాలి. ● తుంటి భాగానికి ఇరువైపులా చేతులను నిటారుగా ఉంచాలి. ● తల నుంచి వెన్నుభాగాన్ని కొద్దిగా వెనక్కి వంచాలి. ఇలాంటప్పుడు హిప్ భాగంపై బరువును బ్యాలన్స్ చేసుకునేలా చూసుకోవాలి. ● శ్వాస వదులుతూ మోకాళ్లను, పాదాలను నేల నుండి పైకి ఎత్తాలి. ముందు మోకాళ్లు వంగి ఉంటాయి. నెమ్మదిగా నిటారుగా ఉంచే స్థాయికి తీసుకురావాలి. ● కంటి చూపు స్థాయికి పాదాలను పైకి లేపాలి. సాధ్యం కాకపోతే కొద్దిగా మోకాళ్లను వంచి, పిక్కలు, మడమల భాగాన్ని నేలకి సమాంతరంగా ఉంచాలి.
● భుజాలను కొద్దిగా వెనక్కి లాగి, రెండు చేతులను మోకాళ్లకు సమాంతరంగా ఉంచాలి. నాభి భాగాన్ని దృఢంగా ఉంచడానికి ప్రయత్నించాలి
● పాదం, వేళ్లను కొద్దిగా వంచి, ఈ భంగిమలో శ్వాస తీసుకొని, వదలాలి. 10 నుండి 20 సెకన్ల పాటు భంగిమలో ఉండటానికి ప్రయత్నించాలి.
● తర్వాత సాధారణ స్థితికి చేరుకోవడానికి ముందుగా పాదాలను, చేతులను నేలపై ఉంచాలి. తర్వాత తల, వెన్నుభాగాన్ని యథాస్థితికి చేర్చాలి. ● సాధనలో నెమ్మదిగా సమయాన్ని పెంచాలి.



– జి.అనూష, యోగా గురు

సాగుబడి
హస్త కార్తె: అక్టోబర్ 10 వరకు
చిత్త కార్తె : అక్టోబర్ 11 నుంచి

సేంద్రియ ఇంటిపంటలతో పుష్కలంగా కూరగాయలు

సేంద్రియ ఆహారం ఆవశ్యకతపై వినియోగదారుల్లో పెరుగుతున్న చైతన్యంతో కిచెన్ గార్డెన్ల సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు పెచ్చరిల్లుతున్న నేపథ్యంలో కూరగాయలు, పండ్ల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో ఇంటిపట్టునే 13 రకాల కూరగాయలను సేంద్రియంగా పండించుకొని తింటున్న కుటుంబాల సంఖ్య దేశంలో అంతకంతకూ పెరుగుతోంది. పఠాన్‌చెరులోని 'ఇక్రిశాట్' ఆవరణలో గల వరల్డ్ వెజిటబుల్ సెంటర్ దక్షిణాసియా కేంద్రం సేంద్రియ పెరటి తోటల సాగుపై పరిశోధనలు చేపట్టింది (లాభాపేక్ష లేని ఈ సంస్థ కేంద్ర కార్యాలయం తైవాన్‌లో ఉంది). రెండు నమూనాల్లో సేంద్రియ పెరటి తోటల సాగుకు సంబంధించి 'సెంటర్' అధ్యయనంపై 'సాక్షి సాగుబడి' ప్రత్యేక కథనం.

సేంద్రియ ఇంటిపంటలపై వరల్డ్ వెజిటబుల్ సెంటర్ పరిశోధన

36 చ.మీ. స్థలంలో వారానికి 5.1 (ఏడాదికి 266.5) కిలోల సేంద్రియ ఆకుకూరలు, కూరగాయల దిగుబడి

కుటుంబానికి అవసరమైన ప్రొటీన్లు 75%, ఐరన్ 25%, పుష్కలంగా ఎ, సి విటమిన్లు

వరల్డ్ వెజిటబుల్ సెంటర్ జాతీయ, అంతర్జాతీయ ప్రభుత్వ / ప్రైవేటు వ్యవసాయ పరిశోధనా సంస్థలతో కలసి కూరగాయలు, మిరప వంటి పంటలపై పరిశోధనలు చేసింది. టాటా ట్రస్టులతో కలిసి 36 చదరపు మీటర్ల స్థలంలో పోషక విలువలతో కూడిన 13 రకాల సేంద్రియ కూరగాయల పెరటి తోటల (న్యూట్రి గార్డెన్స్)పై తాజాగా క్షేత్రస్థాయిలో ఈ పరిశోధన జరిగింది.

కుటుంబానికి వారానికి 5.1 కిలోల (ప్రతి మనిషికి రోజుకు 182 గ్రాముల) చొప్పున.. ఏడాదికి 266.5 కిలోల పోషకాలతో కూడిన తాజా సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు సమకూరాయి. తద్వారా ఒక కుటుంబానికి అవసరమైన ప్రొటీన్లు 75% అందాయి. బీటా కెరొటిన్ (విటమిన్ ఎ), విటమిన్ సి అవసరానికన్నా ఎక్కువే అందాయి. 25% ఐరన్ సమకూరిందని వరల్డ్ వెజిటబుల్ సెంటర్ తెలిపింది.

జార్కండ్‌లో పెరటి తోటల పెంపకం ద్వారా కుటుంబాలకు కూరగాయల ఖర్చు 30% తగ్గింది. అస్సాంలో సేంద్రియ న్యూట్రిగార్డెన్ల వల్ల పది వేల కుటుంబాలు విషరసాయనాలు లేని కూరగాయలను సొంతంగానే పండించుకుంటున్నారు. మార్కెట్‌లో కొనటం మానేశారని వరల్డ్ వెజిటబుల్ సెంటర్ తెలిపింది. వ్యవసాయ దిగుబడులు పెంచే పరిశోధనలతో పాటు భవిష్యత్తు తరాల ప్రజల ఆరోగ్యదాయక జీవనానికి ఉపయోగపడే క్షేత్రస్థాయి పరిశోధనలు చేస్తున్నామని వరల్డ్ వెజిటబుల్ సెంటర్ ఇండియా కంట్రీ డైరెక్టర్ అరవరిఝి సెల్వరాజ్ చెప్పారు.









సర్క్యులర్ కిచెన్ గార్డెన్ ఎలా?

పట్టణ ప్రాంతాల్లో స్థలం తక్కువగా ఉన్న చోట సర్క్యులర్ గార్డెన్ అనుకూలంగా ఉంటుంది. చూపులకూ ముచ్చటగా ఉంటుంది. 3 మీటర్ల చుట్టుకొలత ఉండే మడిలో 11 రకాల పంటలు పండించవచ్చు, మధ్యలో ఉండే చిన్న సర్కిల్‌లో కొత్తిమీర, పుదీన వంటి ఆకుకూరలు వేసుకోవచ్చు. పెద్దగా ఉండే వెలుపలి సర్కిల్‌లో అనేక మడులు చేసి వేర్వేరు కూరగాయ మొక్కలు వేసుకోవచ్చు. ఒక మడిలో భూసారం పెంపుదలకు వాడే పచ్చిరొట్ట పంటలు వేసుకోవాలి. చీడపీడల నియంత్రణకు పసుపు, నీలం జిగురు అట్టలు పెట్టుకోవాలి. వేపనూనె, పులిసిన మజ్జిగ పిచికారీ చేస్తుంటే తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవచ్చు. ఈ సస్యరక్షణ చర్యల ద్వారా రసాయనిక పురుగుమందులు వాడకుండానే పంటలను రక్షించుకోవచ్చు.



స్క్వేర్ గార్డెన్ నిర్మాణం ఎలా?

గ్రామీణ కుటుంబాలకు సర్కిల్ గార్డెన్‌తో పోల్చితే నలుచదరంగా ఉండే స్క్వేర్ గార్డెనే ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుంది. 6 మీటర్ల పొడవు, 6 మీటర్ల వెడల్పు ఉండే స్థలాన్ని ఎంపికచేసుకొని మెత్తగా దున్నాలి. మాగిన పశువుల ఎరువు లేదా కోళ్ల ఎరువుతో వేప పిండి కలిపి చల్లితే చీడపీడలు రావు. 6x6 స్థలాన్ని 7 బెడ్స్ (ఎత్తు మడులు) గా ఏర్పాటు చేయాలి. వాటిని అడ్డంగా విభజించి 14 చిన్న మడులు చేయాలి. ఒక్కో మడిలో ఒక్కో పంట వేయాలి. పాలకూర, గోంగూర, ఉల్లి, క్యారట్, టొమాటో, బెండ, వంగ వంటి పంటలు వేసుకోవాలి. బెడ్స్ మధ్యలో అంతరపంటలుగా బంతి, మొక్కజొన్న విత్తుకుంటే రసంపీల్చే పురుగులను నియంత్రించవచ్చు.

ఇంటిపంటల ఉత్పాదకత 5 రెట్లు!

సేంద్రియ ఇంటిపంటలు పోషక విలువలతో కూడి సమతులాహార లభ్యతను, ఆహార భద్రతను పెంపొందిస్తున్నాయి. తాము తినే ఆహారాన్ని తమ చేతుల్లోకి తీసుకునే సామర్థ్యాన్ని కుటుంబాలకు ఇస్తున్నాయి. ఫలితంగా మరింత సుస్థిరమైన, ఆరోగ్యదాయకమైన జీవనానికి మార్గం సుగమం అవుతోంది. ప్రణాళికాబద్ధంగా సేంద్రియ ఇంటిపంటలను వ్యక్తిగత శ్రద్ధతో సాగు చేస్తే పొలాల ఉత్పాదకతో పోల్చినప్పుడు దాదాపు 5 రెట్ల ఉత్పాదకత సాధించవచ్చు. భారత్‌లో పొలాల్లో కూరగాయల దిగుబడి హెక్టారుకు సగటున 12.7 టన్నులు ఉండగా, సేంద్రియ ఇంటి పంటల ద్వారా హెక్టారుకు ఏడాదికి 73.9 టన్నుల దిగుబడి పొందవచ్చు. విస్తారమైన కూరగాయ తోటల్లో సైతం సమీకృత వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రసాయనాల వినియోగం తగ్గటంతో పాటు 20% అధిక దిగుబడి పొందవచ్చు.

– ఎం. రవిశంకర్, సీనియర్ హార్టీకల్చరిస్ట్, ప్రాజెక్టు మేనేజర్, వరల్డ్ వెజిటబుల్ సెంటర్, దక్షిణాసియా ప్రాంతీయ కేంద్రం, పఠాన్‌చెరు

స్క్వేర్ గార్డెన్ దిగుబడి ఎక్కువ

గుండ్రంగా, దీర్ఘ చతురస్రాకారంలో ఉండే రెండు రకాల గార్డెన్ డిజైన్లు పెరటి కూరగాయ తోటల సాగుకు అనుకూలం. స్థలం లభ్యతను బట్టి గార్డెన్ డిజైన్‌ను ఎంపిక చేసుకోవాలి. 6 మీటర్ల చుట్టుకొలత గల సర్కిల్ గార్డెన్‌లో 150 రోజుల్లో 56 కిలోల పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, దుంపలు పండాయి. ఎరువులు, విత్తనాలు తదితర ఉత్పాదకాల ఖర్చు రూ. 1,450. అయితే, 6×6 మీటర్ల విస్తీర్ణంలో పెరటి తోట (స్క్వేర్ గార్డెన్)లో అవే పంటలు సాగు చేస్తే 67 కిలోల దిగుబడి వచ్చింది, ఉత్పాదకాల ఖర్చు రూ. 1,650 అయ్యింది. ఈ గార్డెన్లు విటమిన్లు, ఖనిజాలు, పీచు, యాంటీఆక్సిడెంట్లతో కూడిన సమతుల ఆహారాన్ని కుటుంబానికి అందించాయి. ఆమేరకు మార్కెట్‌పై ఆధారపడకుండా రోగనిరోధక శక్తిని ఇనుమడింపజేసే పోషకాహారాన్ని ఆ కుటుంబం పండించుకొని తినవచ్చని వరల్డ్ వెజిటబుల్ సెంటర్ పేర్కొంది. ఇళ్లు కిక్కిరిసి ఉండే అర్బన్ ప్రాంతాల్లో కంటెయినర్ గార్డెన్లను ఏర్పాటు చేసుకొని ఆరోగ్యదాయకమైన కూరగాయలు, ఆకుకూరలను నగరవాసులు పండించుకోవటం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న విషయం తెలిసిందే.

(ఇతర వివరాలకు.. వరల్డ్ వెజిటబుల్ సెంటర్ ప్రతినిధి వినయనాథ రెడ్డి 99125 44200)

పనికిరాని చేపలతో పంటలకు పోషణ

మీనామృతం తదితర ద్రావణాలు, కషాయాల తయారీలో దుర్గాడ ప్రకృతి వ్యవసాయదారుల విశేష కృషి



మీనామృతం తయారు చేస్తున్న రైతు గుండ్ర శివ చక్రం


మత్స్యకారులు వేటాడి తెచ్చిన చేపలలో కొన్ని కుళ్లి తినటానికి పనికి రాకుండా పోతుంటాయి. వాటిని మత్స్యకారులు పారేస్తుంటారు. అటువంటి పనికిరాని చేపలను ప్రకృతి వ్యవసాయదారులు పునర్వినియోగిస్తున్నారు. పంట చేలకు పోషకాలను అందించే చక్కని మీనామృతం తయారు చేస్తున్నారు.

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన రైతు గుండ్ర శివ చక్రంతో పాటు పలువురు రైతులు మీనామృతం, అనేక రకాల కషాయలు, ద్రావణాల తయారీలో విశేష అనుభవం గడించారు. ప్రకృతి/సేంద్రియ వ్యవసాయం చేస్తూ కషాయాలు, ద్రావణాలు స్వయంగా తయారు చేసుకోలేని స్థితిలో ఉన్న ఎందరో రైతులకు దువ్వాడ రైతాంగం చేదోడుగా ఉంటున్నది. గతంలో కుళ్లిన ఉల్లిపాయలతో ద్రావణం తయారు చేసి నల్ల తామర పురుగును నియంత్రించటంలో దుర్గాడ రైతులు విజయం సాధించటం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశం అయ్యింది. అ రైతులు స్థానికంగా దొరికే పదార్థాలు, వనరులతో అనేక కషాయాలు, ద్రావణాలు తయారు చేస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని పరిపుష్టం చేస్తున్నారు. ఈ కోవలోదే మీనామృతం. తినటానికి, ఎండబెట్టడానికి పనికిరాని పచ్చి చేపలను ముక్కలు చేసి పాత బెల్లం కలిపి, 90 రోజులు మురగబెట్టి మీనామృతం తయారు చేస్తున్నారు. ఇది కొన్ని నెలల పాటు నిల్వ ఉంటుంది. పంటల ఎదుగుదలకు.. పూత, పిందె రాలకుండా బలంగా పెరగడానికి దీన్ని పంటలపై పిచికారీ చేస్తున్నారు. ఎకరానికి ఒక లీటరు సరిపోతుంది. మీనామృతం తయారు చేసి తమ పంటలపై వాడుకోవటంతో పాటు ఇతర ప్రాంతాల రైతులకు లీటరు రూ.120కి విక్రయిస్తున్నారు.

– ప్రసాద్, సాక్షి, పిఠాపురం

మీనామృతం బాగా పని చేస్తోంది!

పచ్చి చేపలు, పాత బెల్లంతో తయారు చేస్తున్న మీనామృతం సేంద్రియ పంటలకు బాగా ఉపయోగపడుతోంది. దీన్ని పిచికారీ చేసిన పంటల దిగుబడి పెరుగుతోంది. మా గ్రామంలో గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ శిక్షణ కేంద్రంలో ఈ ద్రావణం తయారు చేస్తున్నాం. ఈ ద్రావణం కోసం వివిధ ప్రాంతాల నుంచి రైతులు వచ్చి తీసుకెళుతున్నారు. ప్రతీ రోజు సుమారు 100 లీటర్ల వరకు తయారు చేస్తున్నాం. దీంతోపాటు రసం పీల్చు పురుగు నివారణకు చిల్లీ స్పెషల్ కషాయం తయారు చేస్తున్నాం. కాకినాడ జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి ఎలియాజరు సహాయంతో వివిధ రకాల కొత్త కషాయాలు తయారు చేసి విక్రయిస్తున్నాం.



– గుండ్ర శివచక్రం (95537 31023), ప్రకృతి వ్యవసాయదారుడు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం, కాకినాడ జిల్లా

కషాయాలు, ద్రావణాల తయారీతో ఉపాధి



కాకినాడ జిల్లా దుర్గాడలో గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశాం. సుమారు 300 మంది రైతుల వరకు ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే ద్రావణాలు, కషాయాల తయారీలో మెళుకువలు తెలుసుకుని మంచి ఫలితాలు సాధిస్తున్నారు. గతంలో మిరప పంటను నాశనం చేసిన నల్ల తామర పురుగును ఉల్లి కషాయంతో పరారయ్యేలా చేసిన ఘనత ఇక్కడి రైతులకు దక్కింది. ఈ గ్రామంలో కషాయాల తయారీ కుటీర పరిశ్రమగా మారింది. పరిసర ప్రాంతాల్లో వేలాది మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మరలడానికి ఇక్కడి రైతుల విజయాలే స్ఫూర్తిగా నిలిచాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇచ్చే కషాయాలు, ద్రావణాలు తయారు చేసి వివిధ రాష్ట్రాల రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. ఇక్కడ ఔత్సాహిక రైతులకు కషాయాల తయారీలో శిక్షణ ఇస్తున్నాం. పలువురు మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాం.

– ఎలియాజరు (94416 56083), జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖాధికారి, కాకినాడ



అరుంధతి రెడ్డికి మందలింపు

పాకిస్తాన్‌తో జరిగిన టి20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆగ్రహానికి గురైంది. పాక్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లో నిదా దర్‌ను అవుట్ చేశాక 'సెండాఫ్' ఇస్తూ ఆమెను వెళ్లిపో మన్నట్లుగా అరుంధతి సైగ చేసింది. దీనిపై ఫీల్డ్ అంపైర్లు ఫిర్యాదు చేయగా ఐసీసీ స్పందించింది. 'ప్రత్యర్థి ఆటగాళ్లను రెచ్చగొట్టే ఈ తరహా చర్యలు ఐసీసీ నియమావళికి విరుద్ధం' అంటూ ఐసీసీ అరుంధతిని హెచ్చరికతో సరి పెట్టింది.

జిమ్నాస్టిక్స్‌కు దీపా కర్మాకర్ వీడ్కోలు



ఒలింపిక్స్ క్రీడల్లో పోటీపడ్డ తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా గుర్తింపు పొందిన దీపా కర్మాకర్ రిటైర్మెంట్ ప్రకటించింది. 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో, 2015 ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు గెల్చుకున్న దీపా కర్మాకర్ 2016 రియో ఒలింపిక్స్‌లో వాల్ట్ ఈవెంట్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. రియో ఒలింపిక్స్ తర్వాత దీపా గాయాల బారిన పడింది. 2021 ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచి పునరాగమనం చేసిన ఆమె అదే ఏడాది డోపింగ్ పరీక్షలో విఫలమై రెండేళ్లు నిషేధం ఎదుర్కొంది.

ఇంగ్లండ్‌దే పైచేయి

ఏడు వికెట్లతో దక్షిణాఫ్రికా ఓటమి
- రాణించిన ఎకెల్‌స్టోన్, వ్యాట్, బ్రంట్
- మహిళల టి20 వరల్డ్ కప్

షార్జా: గత టి20 వరల్డ్ కప్ సెమీఫైనల్లో దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన అనూహ్య పరాజయానికి ఇంగ్లండ్ మహిళల జట్టు బదులు తీర్చుకుంది. చివరి ఓవర్ వరకు ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్‌లో సఫారీ జట్టును ఓడించి ఈ టోర్నీలో ఇంగ్లండ్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. ఫలితంగా గ్రూప్ 'బి'లో తమ అగ్రస్థానాన్ని ఇంగ్లండ్ పటిష్టపర్చుకుంది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. కెప్టెన్ లారా వోల్‌వార్ట్ (39 బంతుల్లో 42; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సోఫీ ఎకెల్‌స్టోన్ (2/15)తో పాటు ఇతర బౌలర్లు ప్రత్యర్థిని నిలువరించారు. అనంతరం ఇంగ్లండ్ 19.2 ఓవర్లలో 3 వికెట్లకు 125 పరుగులు సాధించి గెలిచింది. నాట్ సివర్ బ్రంట్ (36 బంతుల్లో 48 నాటౌట్; 6 ఫోర్లు), డానీ వ్యాట్ (43 బంతుల్లో 43; 4 ఫోర్లు) మూడో వికెట్‌కు 55 బంతుల్లో 64 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.

రాణించిన కెప్టెన్...

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో కెప్టెన్ వోల్‌వార్ట్ మినహా మిగతా వారెవ్వరూ చెప్పుకోదగ్గ ప్రదర్శన కనబర్చలేదు. తొలి వికెట్‌కు వోల్‌వార్ట్, తజ్‌మీన్ బ్రిట్స్ (19 బంతుల్లో 13; 1 ఫోర్)తో కలిసి 31 బంతుల్లో 31 పరుగులు జోడించడంతో జట్టుకు మెరుగైన ఆరంభం లభించింది. ఆ తర్వాత అనేక్ బాష్ (26 బంతుల్లో 18; 1 ఫోర్) కూడా కొద్దిసేపు కెప్టెన్‌కు అండగా నిలిచింది. 10 ఓవర్లు ముగిసేసరికి సఫారీ టీమ్ స్కోరు 54 పరుగులకు చేరింది. ఈ దశలో ఇంగ్లండ్ స్పిన్నర్లు ప్రత్యర్థిని కట్టడి చేయడంలో సఫలమయ్యారు. అనంతరం వేగంగా ఆడే ప్రయత్నంలో ఉన్న వోల్‌వార్ట్‌ను ఎకెల్‌స్టోన్ చక్కటి బంతితో బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ పైచేయి సాధించింది. కెప్టెన్ వెనుదిరిగిన తర్వాత మిగిలిన 26 బంతుల్లో దక్షిణాఫ్రికా 36 పరుగులు చేసింది. మరిజాన్ కాప్ (17 బంతుల్లో 26; 3 ఫోర్లు), ఇన్నింగ్స్ చివర్లో డెర్క్‌సెన్ (11 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ప్రదర్శన దక్షిణాఫ్రికాకు గౌరవప్రదమైన స్కోరును అందించాయి.



సోఫీ ఎకెల్‌స్టోన్



డానీ వ్యాట్

కీలక భాగస్వామ్యం...

షార్జా మైదానంలో గత నాలుగు మ్యాచ్‌లతో పోలిస్తే మెరుగైన స్కోరును దక్షిణాఫ్రికా నమోదు చేయగా... దానిని ఛేదించే లక్ష్యంతో ఇంగ్లండ్ బరిలోకి దిగింది. ఆరంభంలోనే మయా బౌచర్ (20 బంతుల్లో 8; 1 ఫోర్) వెనుదిరిగినా... వ్యాట్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. అలైస్ క్యాప్సీ (16 బంతుల్లో 19; 3 ఫోర్లు) ఫర్వాలే దనిపించినా ఎక్కువ సేపు నిలవలేదు. ఈ దశలో వ్యాట్, బ్రంట్ భాగస్వామ్యం జట్టును గెలుపు దిశగా నడిపించింది. ఈ ఇద్దరు సీనియర్ల జోడీని విడదీసేందుకు సఫారీ బౌలర్లు ఎంత శ్రమించినా లాభం లేకపోయింది. 11–15 ఓవర్ల మధ్యలో 39 పరుగులు చేసిన ఇంగ్లండ్ చివరి 5 ఓవర్లలో 31 పరుగులు చేయాల్సిన స్థితిలో నిలిచింది. అయితే చివర్లో కొంత ఒత్తిడి ఎదురైనా ఇంగ్లండ్ గెలుపు గీత దాటింది. విజయానికి 11 పరుగుల దూరంలో వ్యాట్ వెనుదిరగ్గా... బ్రంట్ మిగిలిన పనిని పూర్తి చేసింది. సఫారీ ఫీల్డర్లు మూడు క్యాచ్‌లు వదిలేయడం కూడా ఇంగ్లండ్‌కు కలిసొచ్చింది. నేడు జరిగే గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టుతో న్యూజిలాండ్ తలపడుతుంది.



నాట్ సివర్ బ్రంట్

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: వోల్‌వార్ట్ (బి) ఎకెల్‌స్టోన్ 42; బ్రిట్స్ (సి) గిబ్సన్ (బి) స్మిత్ 13; అనేక్ బాష్ (బి) గ్లెన్ 18; మరిజాన్ కాప్ (బి) ఎకెల్‌స్టోన్ 26; ట్రియాన్ (బి) డీన్ 2; డెర్క్‌సెన్ (నాటౌట్) 20; లూస్ (రనౌట్) 1; డి క్లెర్క్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 124. వికెట్ల పతనం:** 1–31, 2–71, 3–88, 4–99, 5–110, 6–114. **బౌలింగ్:** నాట్ సివర్ బ్రంట్ 4–0–34–0, లిన్సీ స్మిత్ 4–0–32–1, చార్లీ డీన్ 4–0–25–1, సోఫీ ఎకెల్‌స్టోన్ 4–0–15–2, సారా గ్లెన్ 4–0–18–1.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: మయా బౌచర్ (ఎల్బీ) (బి) కాప్ 8; డానీ వ్యాట్ (స్టంప్డ్) జఫ్తా (బి) ఎమ్‌లాబా 43; క్యాప్సీ (సి అండ్ బి) డి క్లెర్క్ 19; నాట్ సివర్ బ్రంట్ (నాటౌట్) 48; హీతర్ నైట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.2 ఓవర్లలో 3 వికెట్లకు) 125. వికెట్ల పతనం:** 1–16, 2–50, 3–114. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 4–2–17–1, అయబొంగా ఖాకా 3.2–0–21–0, క్లో ట్రియాన్ 3–0–25–0, నాన్‌కులులెకో ఎమ్‌లాబా 4–0–22–1, నదీన్ డి క్లెర్క్ 4–0–23–1, సూన్ లూస్ 1–0–10–0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గ్రూప్ 'ఎ'					
న్యూజిలాండ్	1	1	0	2	2.900
ఆస్ట్రేలియా	1	1	0	2	1.908
పాకిస్తాన్	2	1	1	2	0.555
భారత్	2	1	1	2	-1.217
శ్రీలంక	2	0	2	0	-1.667
గ్రూప్ 'బి'					
ఇంగ్లండ్	2	2	0	4	0.653
వెస్టిండీస్	2	1	1	2	1.154
దక్షిణాఫ్రికా	2	1	1	2	0.245
బంగ్లాదేశ్	2	1	1	2	-0.125
స్కాట్లాండ్	2	0	2	0	-1.897

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'టాప్'తో ముగించారు

- ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు అగ్రస్థానం
- 24 పతకాలు గెలిచిన భారత షూటర్లు
- ఆరు పతకాలతో మెరిసిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ముకేశ్

లిమా (పెరూ): టోర్నీ ఆద్యంతం లక్ష్యంపై గురి తప్పకుండా షూట్ చేసిన భారత షూటర్లు ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌ను ఘనంగా ముగించారు. ఓవరాల్‌గా 13 స్వర్ణాలు, 3 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 24 పతకాలతో భారత్ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. 5 స్వర్ణాలు, 4 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 13 పతకాలు నెగ్గిన ఇటలీ రెండో స్థానంలో నిలిచింది. చివరిరోజు భారత షూటర్లు ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలు సాధించారు. పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో దీపక్ దలాల్ (545), కమల్జీత్ (543), రాజ్ చంద్ర (528)లతో కూడిన భారత జట్టు 1616 పాయింట్లతో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. మహిళల 50 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో పరీషా గుప్తా 540 పాయింట్లు స్కోరు చేసి రజత పతకాన్ని సంపాదించింది. మహిళల 50 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో సేజల్ కాంబ్లే (529), కేతన్ (525), కనిష్కా డాగర్ (513)లతో కూడిన భారత జట్టు 1567 పాయింట్లతో రజత పతకాన్ని దక్కించుకుంది. మిక్స్‌డ్ ట్రాప్ ఈవెంట్‌లో శార్దుల్ విహాన్ (71), సబీరా హారిస్ (67) జోడీ 138 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించింది.



ముకేశ్

ముకేశ్ 'సిక్సర్'

ఆఖరి రోజు ఆంధ్రప్రదేశ్ యువ షూటర్ ముకేశ్ నెలవల్లి పురుషుల 50 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ 548 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఈ చాంపియన్‌షిప్‌లో ముకేశ్‌కిది ఆరో పతకం కావడం విశేషం. అంతకుముందు ముకేశ్ 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం, 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం, 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించాడు.

జయసూర్యకే పూర్తి స్థాయి బాధ్యతలు

శ్రీలంక హెడ్ కోచ్‌గా మాజీ ప్లేయర్

కొలంబో: శ్రీలంక క్రికెట్ దిగ్గజం సనత్ జయసూర్య తమ జాతీయ జట్టుకు హెడ్ కోచ్‌గా పూర్తి స్థాయిలో నియమితుడయ్యాడు. ఇప్పటి వరకు తాత్కాలిక కోచ్‌గా పని చేసిన జయసూర్యపైనే నమ్మకం ఉంచుతూ లంక క్రికెట్ బోర్డు తాజా నిర్ణయం తీసుకుంది. జయసూర్యను జూలైలో తాత్కాలిక కోచ్‌గా నియమించారు. అతని నేతృత్వంలో సొంత గడ్డపై శ్రీలంక వన్డే సిరీస్‌లో భారత్‌ను ఓడించింది. 27 ఏళ్ల తర్వాత భారత్‌పై లంక సిరీస్ గెలవగలిగింది. ఆ తర్వాత ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టుల్లో ఓడి సిరీస్ చేజార్చుకున్నా... స్ఫూర్తిదాయక ప్రదర్శనతో మూడో టెస్టు నెగ్గిన లంక పదేళ్ల తర్వాత ఈ ఘనత సాధించింది. ఆపై స్వదేశంలో న్యూజిలాండ్‌ను 2–0తో టెస్టు సిరీస్‌లో లంక ఓడించింది. ఈ నేపథ్యంలో జట్టును ముందుకు తీసుకెళ్లేందుకు జయసూర్యనే సరైన వ్యక్తిగా భావించిన బోర్డు 2026 టి20 వరల్డ్ కప్ వరకు బాధ్యతలు అప్పగించింది. 22 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 110 టెస్టులు, 445 వన్డేలు, 31 టి20లు ఆడిన జయసూర్య మూడు ఫార్మాట్‌లలో కలిపి 21,032 పరుగులు సాధించడంతో పాటు 440 వికెట్లు పడగొట్టాడు.



సినిమా



● గుణశేఖర్, 'దిల్' రాజు, నీలిమ గుణ, లిఖిత

ఆ కిక్కు వేరేలా ఉంటుంది

–'దిల్' రాజు

''గుణశేఖర్‌గారి మొదటి చిత్రం 'లాఠీ' చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. ఆయన ఎన్నో విజయాలు, పరాజయాలు చూశారు. ఫెయిల్యూర్స్ తర్వాత వచ్చే సక్సెస్, ఆ విజయం ఇచ్చే కిక్కు వేరేలా ఉంటుంది. కొత్తవాళ్లతో ఆయన తీస్తున్న 'యుఫోరియా' మూవీ పెద్ద హిట్ అవ్వాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. డైరెక్టర్ గుణశేఖర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'యుఫోరియా'. విఘ్నేష్, లిఖిత, పృథ్వీ, శ్రీనిక ప్రధాన పాత్రల్లో, నటి భూమిక ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ చిత్రం గ్లింప్స్‌ను నిర్మాతలు 'దిల్' రాజు, కేఎల్ దామోదర ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ– ''ఓ రెండు ఘటనలు నన్ను కదిలించాయి. వాటి స్ఫూర్తితో 'యుఫోరియా' కథ అనుకున్నాను. ఈ కథని నా కుమార్తె నీలిమకు చెబితే.. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఉందని చెప్పింది. యూత్, పేరెంట్స్ మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. ఈ సినిమాలో తొంభై శాతం కొత్త వాళ్లే కనిపిస్తారు. ఇప్పటి వరకు అరవై శాతం చిత్రీకరణ పూర్తయింది'' అని తెలిపారు. ''చక్కగా తెలుగు మాట్లాడే వాళ్లని, థియేటర్ ఆర్టిస్టుల్ని ఈ సినిమాకు తీసుకున్నాం'' అన్నారు నీలిమ గుణ. ''గుణశేఖర్‌గారి దర్శకత్వంలో 'యుఫోరియా' లాంటి మంచి సినిమా చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అని విఘ్నేష్, శ్రీనిక రెడ్డి, పృథ్వీ రాజ్, లిఖిత చెప్పారు.



● రజనీకాంత్

గ్రాఫిక్స్‌కి సమయం ఇవ్వలేదు!

హీరో రజనీకాంత్, డైరెక్టర్ కేఎస్ రవికుమార్‌లది హిట్ కాంబినేషన్. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ముత్తు'(1995) చిత్రం సూపర్ హిట్ కాగా, 'నరసింహ'(1999) మూవీ బ్లాక్‌బస్టర్ అయింది. అయితే వీరికాంబోలో వచ్చిన 'లింగ'(2014) చిత్రం ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. కాగా ఈ సినిమా ఎడిటింగ్ విషయంలో రజనీకాంత్ జోక్యం చేసుకున్నారంటూ కేఎస్ రవికుమార్ తాజాగా ఆరోపించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ–''లింగ' సినిమా ఎడిటింగ్ విషయంలో రజనీకాంత్ జోక్యం చేసుకున్నారు. ద్వితీయార్ధం మొత్తం మార్చేశారు. కంప్యూటర్ గ్రాఫిక్స్‌కి నాకు సమయం ఇవ్వలేదు. అనుష్కతో ఉండే ఒక పాటని, పతాక సన్నివేశంలో వచ్చే ఓ ట్విస్ట్‌ను పూర్తిగా తొలగించారు. కృత్రిమంగా ఉండే బెలూన్ జంపింగ్ సీన్‌ని యాడ్ చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే సినిమా మొత్తాన్ని గందరగోళం చేశారు'' అని పేర్కొన్నారు. రజనీకాంత్‌పై కేఎస్ రవికుమార్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. అయితే 'లింగ' సినిమా గురించి 2016లో కేఎస్ రవికుమార్ మాట్లాడిన మాటలను కొందరు గుర్తు చేస్తున్నారు. ''ప్రపంచవ్యాప్తంగా మా సినిమా(లింగ) రూ.150 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అది మామూలు విషయం కాదు. బాక్సాఫీస్ వసూళ్ల పరంగా మా సినిమా సూపర్‌హిట్'' అంటూ గతంలో మాట్లాడిన ఆయన.. ఇప్పుడేమో 'లింగ' పరాజయానికి రజనీకాంత్ కారణమని చెబుతున్నారంటూ విమర్శిస్తున్నారు.



● కేఎస్ రవికుమార్

స్నేహమే మెల్లగా గీతలే దాటెనే...

''హే రంగులే ..హే రంగులే.. నీ రాకతో లోకమే రంగులై పొంగెనే..' అంటూ సాగుతుంది 'అమరన్' సినిమాలోని 'హే రంగులే..' పాట. శివ కార్తికేయన్, సాయిపల్లవి జోడీగా నటించిన బయోగ్రాఫికల్ యాక్షన్ ఫిల్మ్ 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్‌నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈ నెల 31న రిలీజ్ కానుంది. తెలుగులో సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి విడుదల చేస్తున్నారు. కాగా ఈ సినిమాలోని 'హే రంగులే..' పాట లిరికల్ వీడియోను హీరో నితిన్ లాంచ్ చేశారు. ''స్నేహమే మెల్లగా గీతలే దాటెనే.. కాలమే సాక్షిగా అంతరాలు చెరిగెనే..'' అంటూ ఈ పాట సాగుతుంది. రామజోగయ్యశాస్త్రి లిరిక్స్ అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, రమ్య బెహ్రా పాడారు. ఈ మూవీకి జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందించారు.



● శివ కార్తికేయన్, సాయిపల్లవి

అమ్మోరే మురిసేలా ఆడు!

కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'క'. గ్రామీణ నేపథ్యంతో సాగే ఈ చిత్రంలో నయన్ సారిక, తన్వీరామ్ హీరోయిన్లుగా నటించారు. దర్శకద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించిన ఈ సినిమాను చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'క మాస్ జాతర..' పాట వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఆడు ఆడు ఆడు ఆడు నిలువెల్లా పూనకమై ఆడు.. ఆడు ఆడు ఆడు ఆడు అమ్మోరే మురిసేలా ఆడు... ఆడు ఆడు ఆడు ఆడు ఊరు వాడ అదిరేలా ఆడు..' వంటి లిరిక్స్‌తో ఈ పాట సాగుతుంది. సానాపతి భరద్వాజ పాత్రుడు లిరిక్స్ అందించిన ఈ పాటను చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్‌తో కలిసి దివాకర్, అభిషేక్ ఏఆర్ పాడారు. ఈ పాటకి పొలాకి విజయ్ కొరియోగ్రఫీ అందించారు.



● కిరణ్ అబ్బవరం

దీపావళికి సింగమ్



● 'సింగమ్ ఎగైన్' పోస్టర్

హీరో అజయ్ దేవగన్, దర్శకుడు రోహిత్ శెట్టి కాంబినేషన్‌లోని హిట్ ఫ్రాంచైజీ 'సింగమ్' నుంచి వస్తున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొనె, కరీనా కపూర్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. అజయ్ దేవగన్, జ్యోతిదేశ్ పాండే, రోహిత్ శెట్టి నిర్మించారు. ఈ పోలీస్ యాక్షన్ చిత్రాన్ని దీపావళి సందర్భంగా నవంబరు 1న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించి, హిందీ ట్రైలర్‌ను సోమవారం విడుదల చేసింది చిత్రయూనిట్. దాదాపు ఐదు నిమిషాల నిడివి ఉన్న ఈ ట్రైలర్‌లో 'అవని కోసం నేను రాకపోయినట్లయితే.. సింగమ్ అసలైన మరాఠీనే కాదు (అజయ్ దేవగన్),'మీ రామాయణంలోని రావణ్ నేను', 'ఇది కలియుగం.. ఈ సారి రావణ్ గెలుస్తాడు (అర్జున్ కపూర్), 'మీ జనరేషన్ వాళ్లు నిజమైన ప్రేమకు అర్థం తెలుసుకోలేకపోతున్నారు' (కరీనా కపూర్) వంటి డైలాగ్స్ ఉన్నాయి. భారతీయ ఇతిహాసం 'రామాయణం' స్ఫూర్తిగా 'సింగమ్ ఎగైన్' సినిమాను రోహిత్ శెట్టి రూపొందించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది.

తండ్రీ కొడుకుల ముక్కోణపు ప్రేమకథ

– సుధీర్ బాబు



''మా నాన్న సూపర్ హీరో' సినిమా యూనివర్సల్ పాయింట్‌తో రూపొందింది. ఇద్దరు తండ్రులు, ఒక కొడుకు మధ్య నడిచే ముక్కోణపు ప్రేమకథ అని చెప్పొచ్చు. తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకులకు ఈ చిత్రం కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను'' అని సుధీర్ బాబు అన్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సుధీర్ బాబు, ఆర్ణ జోడీగా నటించిన చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. సాయి చంద్, సాయాజీ షిండే ఇతర పాత్రల్లో నటించారు. వి సెల్యులాయిడ్స్, కామ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై సునీల్ బలుసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుధీర్ బాబు పంచుకున్న విశేషాలు...

- అభిలాష్ చేసిన 'లూజర్' సిరీస్ చూశా.. బాగా నచ్చింది. తను 'మా నాన్న సూపర్ హీరో' కథ చెప్పినప్పుడు చాలా ఫ్రెష్‌గా అనిపించింది. పూర్తిస్థాయిలో ఫాదర్ ఎమోషన్ ఉన్న సినిమాలు అరుదు. ఇద్దరు తండ్రులు, ఒక కొడుకు కథ ఇంతకుముందెన్నడూ రాలేదు. 'మా నాన్న సూపర్ హీరో' మొదటి చిత్రం. నా కెరీర్‌లో చాలా సంతృప్తి ఇచ్చిన సినిమా ఇది. మానవ సంబంధాలపై ఉన్న ఈ పాయింట్ కచ్చితంగా ప్రేక్షకులకి నచ్చుతుంది. మొదటి ఆట నుంచే ఆడియన్స్, క్రిటిక్స్ నుంచి ఏకగ్రీవంగా పాజిటివ్ టాక్ వస్తుందనే నమ్మకం ఉంది.
- 'హరోం హర' సినిమాకి ముందే 'మా నాన్న సూపర్ హీరో' కి ఒప్పుకున్నా. అయితే ఫలానా జోనర్‌లో సినిమా చేయాలని నేనెప్పుడూ ప్రణాళిక వేసుకోను. ఒక నటుడిగా అన్ని జోనర్ సినిమాలు చేయాలి. నాకు వచ్చిన కథల్లో ఏది బాగుంటే అది చేస్తాను. అలా వచ్చిన కథే 'మా నాన్న సూపర్ హీరో'. నాన్నపై కొడుకు ప్రేమని 'యానిమల్' సినిమాలో అగ్రెసివ్ అండ్ బోల్డ్‌గా చూపించినా జనాలకి నచ్చింది. కానీ, 'మా నాన్న సూపర్ హీరో' లో నాన్నమీద కొడుకుకి ఉన్న లవ్‌ని ప్రేమతో ప్రొజెక్ట్ చేస్తున్నాం. సన్నివేశాలు వాస్తవానికి చాలా దగ్గరగా ఉంటాయి. రియల్ లైఫ్‌లో మా నాన్నగారు చాలా క్రమశిక్షణ గల మనిషి. ఆయన క్రమశిక్షణ మా అక్కకి, నాకు స్ఫూర్తినిచ్చింది.
- మహేశ్ బాబుగారు మా చిత్రం ట్రైలర్ చూసి మనసుని తాకింది అన్నారు. ట్రైలర్ చివర్లో వచ్చే మహేశ్ బాబు పేరు ఉన్న డైలాగ్ గురించి ప్రస్తావిస్తూ చాలా వినోదాత్మకంగా ఉందని చెప్పారు. నా సినిమాల గురించి ఇంత చెప్పడం ఇదే తొలిసారి. యువీ క్రియేషన్స్ విక్కీ, వంశీ, సునీల్, నేను కలిసి 2002లో సినిమాల్ని డిస్ట్రిబ్యూట్ చేసేవాళ్లం. ఇప్పుడు వాళ్ల బ్యానర్‌లో నేను హీరోగా చేయడం సంతోషంగా ఉంది. అలాగే ఎలాగైనా హిట్ కొట్టాలనే బాధ్యత ఉంది. వందశాతం హిట్ కొడతామనే నమ్మకం వచ్చింది. సాయిచంద్, సాయాజీ షిండేగార్లతో పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చింది. ఈ సినిమా ఫైనల్ ఔట్‌పుట్ చూశాక నా నమ్మకాన్ని అభిలాష్ నిలబెట్టుకున్నాడనిపించింది. తను భవిష్యత్‌లో పెద్ద డైరెక్టర్ అవుతాడు.. మంచి సినిమాలు తీస్తాడు. జై క్రిష్ సంగీతం, నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటుంది. నా కెరీర్‌కి ఉపయోగపడే, వైవిధ్యమైన పాత్ర ఉంటే విలన్‌గా చేస్తాను. నా తర్వాతి సినిమా 'జటాధర' నవంబరులో ప్రారంభం అవుతుంది. ఈ సినిమా తర్వాత రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో 70ఎంఎం బ్యానర్‌లో మరో చిత్రం చేస్తాను.

యాక్షన్ డ్రామా



● అనన్య నాగళ్ల

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో నటించిన రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్ పతాకాలపై నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 25న రిలీజ్ చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు మేకర్స్. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు శేఖర్ చంద్ర సంగీతం అందించారు.

గూఢచారి 2 సెట్స్‌లో ఇమ్రాన్ హష్మీకి గాయం

బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ గాయపడ్డారు. అడివి శేష్ హీరోగా నటిస్తున్న స్పై థ్రిల్లర్ మూవీ 'గూఢచారి 2'. 'గూఢచారి'(2018) కి సీక్వెల్‌గా 'గూఢచారి 2' తెరకెక్కుతోంది. వినయ్ కుమార్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, అభిషేక్ అగర్వాల్, టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. అయితే ఓ యాక్షన్ సీన్ చిత్రీకరణ సమయంలో ఇమ్రాన్ హష్మీ గాయపడ్డారు. సెట్స్‌లో ఓ చోటు నుంచి మరో చోటుకు ఇమ్రాన్ జంప్ చేసిన సమయంలో ఆయన మెడకు గాయం అయినట్లు ఫిల్మ్‌నగర్ టాక్. కాగా ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు 'గూఢచారి 2' సినిమాను వచ్చే ఏడాదిలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



● ఇమ్రాన్ హష్మీ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	638	81,050
నిఫ్టీ ▽	219	24,796

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,054	▽ 84
డోజోన్స్	42,082	▽ 270
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,304	△ 30
డాక్స్	19,104	▽ 17
షాంఘై	3,337	△ 249
నికాయ్	39,333	△ 697

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	75,933
బంగారం (99.5 స్వచ్ఛత)	75,629
వెండి (కిలో)	91,940

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.56	84.58
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	109.05	111.66
€	యూరో	ఒకటి	91.05	93.43
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.99	57.25
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.22	58.18
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.09	66.75
SAR	సౌదీ రియాల్	పది	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	పది	21.97	23.76
¥	చైనా యువాన్	పది	11.09	12.91

అమ్మకాల వెల్లువ!

ముంబై: దేశీ స్టాక్ సూచీలు వరుసగా ఆరోరోజూ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 638 పాయింట్లు పతనమై 81,050 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 219 పాయింట్లు కోల్పోయి 24,796 వద్ద నిలిచింది. పశ్చిమాసియాలో నానాటికీ పెరుగుతున్న ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు ప్రతికూల ప్రభావం చూపాయి.

- 25 వేల దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ నష్టం 638 పాయింట్లు
- కొనసాగుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం



ఉదయం లాభాలతో మొదలైన స్టాక్ సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ట్రేడింగ్ గడిచే కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో ఏ దశలోనూ కోలుకోలేపోయాయి. యుటిలిటీ, పవర్, సర్వీసెస్, కమోడిటీ, టెలికం, ఇంధన, ఆయిల్అండ్‌గ్యాస్, ఇండస్ట్రియల్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 962 పాయింట్లు క్షీణించి 80,726 వద్ద, నిఫ్టీ 321 పాయింట్లు పతనమై 24694 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. ఐటీ షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది.

→ చిన్న, మధ్య తరహా షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 3.27%, మిడ్ క్యాప్ ఇండెక్స్ 2% చొప్పున నష్టపోయాయి.

→ రంగాల వారీగా యుటిలిటీ ఇండెక్స్ 4 శాతం, విద్యుత్, సర్వీసెస్ సూచీలు 3 శాతం, కమోడిటీ, టెలికం, ఇంధన ఇండెక్సులు 2.5%, ఆయిల్అండ్ గ్యాస్ 2.5% చొప్పున నష్టపోయాయి.

→ సర్వీసుల నాణ్యతపై సోషల్ మీడియాలో నెటిజన్లు దుమ్మెత్తిపోయడంతో ఓలా ఎలక్ట్రిక్ షేరు 8% నష్టపోయి రూ.91 వద్ద స్థిరపడింది.


ఆరు రోజుల్లో రూ.8.90 లక్షల కోట్ల నష్టం

స్టాక్ మార్కెట్ వరుస నష్టాలతో ఇన్వెస్టర్లకు భారీ నష్టం వాటిల్లింది. రూ.8.90 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. బీఎస్ఈలోని మొత్తం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.451 లక్షల కోట్ల (5.38 ట్రిలియన్ డాలర్లు)కు దిగివచ్చింది.

పసిడి ఆల్‌టైమ్ హై @ 78,700



న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలో పసిడి ధర వరుస రికార్డులతో హోరెత్తిస్తోంది. పూర్తి స్వచ్ఛత (99.9) 10 గ్రాముల బంగారం ధర సోమవారం రూ.250 ఎగసి, రూ.78,700కు చేరింది. పండుగల సీజన్ నేపథ్యంలో దేశీయంగా ఆభరణ వర్తకుల నుంచి డిమాండ్, అంతర్జాతీయ మార్కెట్లలో పటిష్ట స్థాయిలో ధర, రూపాయి బలహీన ధోరణి బంగారం ధర రికార్డుకు కారణం. ఇక 99.5 స్వచ్ఛత ధర రూ.200 ఎగసి రూ.78,300కు ఎగసింది. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఔన్స్ (31.1గ్రాములు) ధర ఆల్‌టైమ్ రికార్డు 2,697 డాలర్లుకాగా, ప్రస్తుతం పటిష్ట స్థాయిలో 2,665 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



- యుద్ధాల్లో మార్కెట్ క్రాష్‌లపై ఆందోళన వద్దు
- ఇన్వెస్ట్‌మెంట్‌కు ఇదొక సదవకాశం
- తక్కువ ధరల్లో దొరికే క్వాలిటీ స్టాక్స్‌ను ఎంచుకోవాలి
- గతంలో యుద్ధ ప్రభావం తర్వాత వేగంగా కోలుకున్న మార్కెట్
- ప్రస్తుత పతనంపై నిపుణుల అభిప్రాయం

గన్స్ & స్టాక్స్!

రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థలకు... చినికి చినికి 'మిస్సైళ్ల'వానగా మారిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇజ్రాయెల్–హమాస్ మధ్య పోరు లెబనాన్‌కు పాకడం.. తాజాగా ఇరాన్ కూడా రణరంగంలోకి దూకి ఇజ్రాయెల్‌పై మిస్సైళ్ల వర్షం కురిపించడంతో ఈ ప్రాంతంలో పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను వణికిస్తోంది. క్రూడ్ ధరలు భగ్గుమనడం (10% పైగా జంప్) మనలాంటి వర్ధమాన దేశాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ పరిణామాలతో సెన్సెక్స్ 4,422 పాయింట్లు, నిఫ్టీ 1,383 పాయింట్లు, అంటే 5.3% చొప్పున పతనమయ్యాయి. గడిచిన రెండేళ్లలో వారం రోజుల్లో మార్కెట్లు ఇంతలా పడిపోవడం ఇదే తొలిసారి. అయితే, ఈ పతనాలను చూసి రిటైల్ ఇన్వెస్టర్లు మరీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు మార్కెట్ నిపుణులు. గత యుద్ధాల సమయంలో పడిపోయిన మార్కెట్లు చాలా త్వరగా కోలుకున్నాయని, అందుకే ఈ క్రాష్‌ను సదవకాశంగా మలచుకోవాలనేది విశ్లేషకుల మాట!!

నాన్‌స్టాప్‌గా దౌడు తీస్తున్న బుల్‌కు పశ్చిమాసియా యుద్ధ ప్రకంపనలు బ్రేకులేశాయి. రోజుకో కొత్త ఆల్‌టైమ్ రికార్డులతో చెలరేగిన దేశీ స్టాక్ మార్కెట్లో ఎట్టకేలకు కరెక్షన్ మొదలైంది. సూచీలు 5 శాతం పైగా క్షీణించగా.. ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.26 లక్షల కోట్లు ఆవిరైంది. టాప్–10 కంపెనీల మార్కెట్ విలువ సుమారు రూ.7 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. ఇప్పటిదాకా మార్కెట్‌ను పరుగులు పెట్టించిన విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రం కావడంతో రివర్స్‌గేర్ వేశారు. మరోపక్క, చైనా ఉద్దీపక ప్యాకేజీ ప్రభావంతో మన మార్కెట్ నుంచి వైదొలగి అక్కడికి క్యూ కడుతున్నారు. గత 4 ట్రేడింగ్ సెషన్లలో ఎఫ్‌పీఐలు దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన షేర్లను విక్రయించడం గమనార్హం. ఈ నేపథ్యంలో దీర్ఘకాల లక్ష్యంతో ఇన్వెస్ట్ చేసే మదుపరులకు ఇది మంచి చాన్సని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. చారిత్రకంగా చూస్తే, ఇలాంటి ఉద్రిక్తతలు, యుద్ధాల సమయంలో మార్కెట్లు స్వల్పకాలానికి భారీగా పడటం లేదంటే దిద్దుబాటుకు లోనైనప్పటికీ... మళ్లీ కొద్ది వారాలు, నెలల్లోనే పుంజుకున్నాయని, భారీగా లాభాలను పంచాయని గణాంకాలతో సహా వారు ఉటంకిస్తున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాల బాట పట్టారు. తమ లాంగ్ పొజిషన్లను తగ్గించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నిఫ్టీ మరో 5 శాతం క్షీణించే అవకాశం ఉంది.

– రాజేశ్ పల్వియా, వైస్ ప్రెసిడెంట్, యాక్సిస్ సెక్యూరిటీస్

క్వాలిటీ స్టాక్స్.. మంచి చాయిస్!

స్వల్పకాలిక తీవ్ర ఒడిదుడుకుల ఆధారంగా ఇన్వెస్టర్లు హఠాత్తుగా నిర్ణయాలు తీసుకోకూడదని.. గతంలో మంచి పనితీరు కనబరిచి తక్కువ ధరల్లో (వేల్యుయేషన్లు) దొరుకుతున్న నాణ్యమైన షేర్లను ఎంచుకోవడం ద్వారా లాంగ్ టర్మ్ పెట్టుబడులకు పోర్ట్‌ఫోలియోను రూపొందించుకోవాలని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే, మంచి డివిడెండ్ రాబడులను అందించే స్టాక్స్ కూడా ఈ పతనంలో కొనుగోలుకు మరింత ఆకర్షణీయమైన ఆప్షన్ అనేది వారి అభిప్రాయం.

ఊరించే వేల్యుయేషన్లు...

'పటిష్టమైన పోర్ట్‌ఫోలియోను నిర్మించుకోవాలనుకునే ఇన్వెస్టర్లకు ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయి' అని రైట్ రీసెర్చ్ ఫౌండర్ సోనమ్ శ్రీవాస్తవ చెప్పారు. భారీ పీఈ (ప్రైస్ టు ఎర్నింగ్స్) నిష్పత్తితో కూడిన అధిక వేల్యుయేషన్ స్టాక్స్.. ఈ కరెక్షన్‌లో మరింతగా దిగొచ్చే అవకాశం ఉంది. ఈ తరుణంలో చేతిలో క్యాష్ పుష్కలంగా ఉన్న మదుపరులు... తక్కువ ధరల్లో ఇలాంటి ఊరించే షేర్లను కొనుగోలు చేయడం బెటర్ అంటున్నారు మార్కెట్ పరిశీలకులు. 'మార్కెట్లో ఈ కుదుపులు సద్దుమణిగి, పరుగులంకించుకున్నప్పుడు కొత్త పెట్టుబడులు భారీ లాభాలను అందించే అవకాశం ఉంటుంది' అని వీఎస్ఆర్‌కే క్యాపిటల్ డైరెక్టర్ స్వాప్నిల్ అగర్వాల్ పేర్కొన్నారు. ఇటీవలి బుల్ రన్‌కు మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు దన్నుగా నిలిచాయి, తాజా కరెక్షన్లో ఇవే భారీగా పతనమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దీర్ఘకాలిక దృష్టితో లార్జ్ క్యాప్ స్టాక్స్‌ను ఎంచుకోవడం తెలివైన ఆప్షన్ అనేది నిపుణుల సలహా!

యుద్ధాల సమయంలో సెన్సెక్స్ తీరు ఇదీ.. (వృద్ధి/క్షీణత శాతాల్లో)

	1వ రోజు	1 వారం తర్వాత	1 నెల తర్వాత	3 నెలల తర్వాత
కార్గిల్ వార్ (1999)	-2.14	-0.94	3.49	21.97
ఇరాక్–యూఎస్ (2003)	1.18	0.72	-4.38	10.68
రష్యా–ఉక్రెయిన్ (2022)	- 4.72	1.05	5.62	-0.80
ఇజ్రాయెల్–హమాస్ (2023)	0.55	0.44	-1.57	8.12

ఏఏఏఐ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్ కుమార్



హైదరాబాద్: సౌత్ ఏషియా ఆఫ్ గ్రూప్ ఎం మీడియా (ఇండియా) ప్రైవేటు లిమిటెడ్ సీఈవో అయిన ప్రశాంత్ కుమార్, అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఏఏఐ) ప్రెసిడెంట్‌గా మరోసారి ఎన్నికయ్యారు. ముంబైలో సమావేశమైన ఏఏఏఐ వార్షిక జనరల్ బాడీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి కొత్త పాలకమండలిని ఎన్నుకుంది. హవాస్ ఇండియా గ్రూప్ సీఈవో అయిన రాణా బారువా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. మోహిత్ జోషి, సంతోష్ కుమార్, కె.శ్రీనివాస్ తదితరులు సభ్యులుగా ఎన్నికయ్యారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు, నూతన అవకాశాలను సొంతం చేసుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని కొత్త ప్రెసిడెంట్ ప్రశాంత్ కుమార్ ప్రకటించారు.

లాట్ మొబైల్స్ దసరా, దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ చైన్ లాట్ మొబైల్స్ సంస్థ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దసరా, దీపావళి సందర్భంగా భారీ ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఏసీల కొనుగోలుపై 40% ఇన్‌స్టంట్ రాయితీతో పాటు 10% క్యాష్ బ్యాక్ అందిస్తుంది. రూ.9,999 వరకు విలువ చేసే ప్రతీ కొనుగోలుపై కచ్చితమైన బహుమతులు ఇస్తుంది. ఒప్పో, వివో, రియల్‌మీ, ఎంఐ మొబైళ్ల కొనుగోలుపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదుతో పాటు కార్లు, బైకులు మరెన్నో బహుమతులు గెలుచుకోవచ్చు. ముందస్తు చెల్లింపు లేకుండా జీరో కాస్ట్ ఈఎంఐ ఫైనాన్స్ సదుపాయం ఉంది. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 80% వరకు డిస్కౌంట్ లభిస్తుంది. ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డ్ కస్టమర్లు 5% తక్షణ తగ్గింపు పొందొచ్చు. కస్టమర్లకు 12వ వారికోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ.. పండుగ ఆఫర్లను వినియోగించుకోవాలని కంపెనీ డైరెక్టర్ సుప్రజ కోరారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష ప్రారంభం	హైడెల్‌బర్గ్ సిమెంట్‌పై అదానీ కన్ను!

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఐటీఐలు.. ఉపాధికి వేదికలు

ఐటీఐలు.. ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్స్! పదో తరగతి తర్వాత సత్వర ఉపాధి కోరుకునే వారికి చక్కటి మార్గం!! ఐటీఐలు అందించే విభిన్న ట్రేడుల్లో చేరి శిక్షణ పూర్తి చేసుకుంటే.. కొలువు ఖాయం. తాజాగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఐటీఐల్లో ప్రవేశ ప్రక్రియ ముగిసింది. తెలంగాణలో వాక్ ఇన్ అడ్మిషన్స్ కొనసాగుతున్న నేపథ్యంలో.. ఐటీఐ కోర్సుల వివరాలు, ఉపాధి మార్గాలు తదితర వివరాలు..

- పదో తరగతి అర్హతతోనే నైపుణ్యాలకు మార్గం
- కోర్సు పూర్తి చేసుకుంటే కొలువు ఖాయం
- తెలంగాణాలో కొనసాగుతున్న వాక్ ఇన్ అడ్మిషన్స్



కెరీర్ గైడెన్స్

నేడు నైపుణ్యాలు ఉంటేనే జాబ్ మార్కెట్‌లో ప్రాధాన్యం. ఇలాంటి పరిస్థితుల్లో పదో తరగతి అర్హతతో క్షేత్ర స్థాయి నైపుణ్యాలను అందుకునే అవకాశాన్ని ఐటీఐలు కల్పిస్తున్నాయి. పలు ఇంజనీరింగ్, నాన్–ఇంజనీరింగ్ విభాగాల్లో ఆరు నెలల నుంచి రెండేళ్ల వ్యవధిలో వివిధ కోర్సులను అందిస్తున్నాయి. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి తెలంగాణలో వాక్–ఇన్ అడ్మిషన్స్ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ కొనసాగనుంది.

పదుల సంఖ్యలో ట్రేడ్స్

అధికారిక గణాంకాల ప్రకారం–ఆంధ్రప్రదేశ్ లో 82 ప్రభుత్వ, 428 ప్రైవేట్ ఐటీఐలు; తెలంగాణ లో 63 ప్రభుత్వ ఐటీఐలు, 211 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి. ఇవి అందించే కోర్సులను ట్రేడ్స్‌గా పిలుస్తారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ 45కు పైగా ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయి. నాన్–ఇంజనీరింగ్ విభాగంలో.. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్, డ్రైవర్ కమ్ మెకానిక్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హాస్పిటల్ హౌస్ కీపింగ్, ఐటీటీ టెక్నీషియన్, రేడియాలజీ టెక్నీషియన్, సెక్రటేరియల్ ప్రాక్టీస్, స్యూయింగ్ టెక్నాలజీ, స్మార్ట్‌ఫోన్ టెక్నీషియన్ కమ్ యాప్ టెస్టర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్, డెంటల్ లేబరేటరీ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్ తదితరాలు ఉన్నాయి.

ఇంజనీరింగ్ ట్రేడ్స్

ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్/మెకానిక్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఫౌండ్రీమ్యాన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్ (గ్రైండర్), మోటార్ వెహికిల్ మెకానిక్, ఆటో బాడీ పెయింటింగ్ మెకానిక్, ఆటో బాడీ రిపెయిర్ మెకానిక్, ఆటో ఎలక్ట్రీషియన్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, జనరల్ పెయింటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ఆపరేటర్, ప్లంబర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్, షీట్ మెటల్ వర్కర్, సోలార్ టెక్నీషియన్, టర్నర్, వెల్డర్, వైర్‌మ్యాన్ ట్రేడ్‌లు ఉన్నాయి.

వేర్వేరుగా కోర్సుల వ్యవధి

ఇంజనీరింగ్, నాన్–ఇంజనీరింగ్ ట్రేడ్‌ల వ్యవధి ఏడాది, రెండేళ్లుగా ఉంది. ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు సంబంధించి ఎక్కువ శాతం రెండేళ్ల వ్యవధిలోనే ఉన్నాయి. ఆయా ట్రేడ్‌లను అనుసరించి పదో తరగతి, ఎనిమిదో తరగతి అర్హతతో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. పదో తరగతి అర్హతతో ఉండే రెండేళ్ల కోర్సులు పూర్తి చేసుకుంటే.. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో సుస్థిర ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. ఉన్నత విద్యలో చేరేందుకు కూడా వీలుంది.

మెరిట్‌తో ప్రవేశాలు

ఏపీ, తెలంగాణలో ఐటీఐలలో కనీస విద్యార్హత గా పేర్కొన్న ఎనిమిది, పదో తరగతుల్లో పొందిన మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. అభ్యర్థులు నిర్దేశిత వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి. ఆన్‌లైన్ అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. ఈ అప్లికేషన్‌ను పూర్తి చేసే సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న ట్రేడ్‌లు, ఐటీఐలను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా అభ్యర్థులకు సీటు కేటాయింపు చేస్తారు. ప్రవేశం పొందిన విద్యార్థులు నిర్దేశిత తేదీలోపు సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

నైపుణ్యాలు అందించేలా బోధన

ఐటీఐల్లో క్షేత్ర స్థాయి నైపుణ్యాలు అందించేలా బోధన, కరిక్యులం రూపొందించి అమలు చేస్తున్నారు. క్రాఫ్ట్స్‌మెన్ ట్రెనింగ్ స్కీమ్, డ్యూయల్ సిస్టమ్ ఆఫ్ ట్రెనింగ్ విధానాల్లో శిక్షణనిస్తారు. ఇలా పరిశ్రమకు అవసరమైన రీతిలో నైపుణ్యాలు లభిస్తాయి. నిర్దిష్ట వ్యవధిలో ప్రాక్టికల్ ట్రెనింగ్ ఉంటుంది. మొత్తంగా కోర్సు వ్యవధిలో 70 శాతం సమయాన్ని ప్రాక్టికల్ ట్రెనింగ్‌కు, మిగతా 30 శాతాన్ని థియరిటికల్ బోధన కు కేటాయిస్తారు. ఫలితంగా విద్యార్థులకు క్షేత్ర నైపుణ్యాలు లభించి, ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి.

ట్రేడ్ టెస్ట్‌కు అర్హత

ఐటీఐల్లో కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ నిర్వహించే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌కు హాజరయ్యే అర్హత లభిస్తుంది. ఈ ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఆయా కంపెనీల్లో అప్రెంటీస్ నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణతను కొన్ని సంస్థలు తప్పనిసరి చేస్తున్నాయి. కాబట్టి ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులు ట్రేడ్ టెస్ట్‌లోనూ అర్హత సాధిస్తే ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయి.

ఎన్‌ఏపీఎస్‌కు అర్హత

ఐటీఐలో సర్టిఫికెట్ సొంతం చేసుకుంటే..జాతీయ స్థాయిలో అమలవుతున్న నేషనల్ అప్రెంటీస్ ప్రమోషన్ స్కీమ్‌కు కూడా అర్హత లభిస్తుంది. ఐటీఐ పూర్తి చేసుకున్నాక అభ్యర్థులు ఎన్‌ఏపీఎస్ పోర్టల్‌లో తమ పేరు, అర్హతలు, ట్రేడ్ వివరాలు నమోదు చేసుకోవాలి. వీటి ఆధారంగా సంస్థలు అప్రెంటీస్ ట్రైనీగా నియమించుకుంటున్నాయి. అప్రెంటీస్ శిక్షణ సమయంలో.. నెలకు రూ.9వేల వరకు స్టయిఫండ్ పొందొచ్చు. ఉద్యోగుల సంఖ్య 30 మంది ఉన్న సంస్థలు అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకునే విధంగా ఎన్‌ఏపీఎస్ విధానాలను రూపొందించారు. దీంతో ఐటీఐ పూర్తి చేసుకున్న వారికి అప్రెంటీస్ అవకాశాలు లభిస్తున్నాయి.

జాబ్ మార్కెట్‌లో ముందంజ

ఐటీఐ సర్టిఫికెట్‌తో విద్యార్థులు జాబ్ మార్కెట్ పోటీలో ముందుంటున్నారనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. ఇంజనీరింగ్ ట్రేడ్‌ల ఉత్తీర్ణులకు టెక్నీషియన్స్, ఫ్లోర్‌మెన్‌ల హోదాల్లో నెలకు రూ.20 వేల వరకు వేతనం లభిస్తోంది. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్ వంటి నాన్–ఇంజనీరింగ్ ట్రేడ్‌లు పూర్తి చేసుకున్న వారికి చిన్న, మధ్య తరహా సంస్థల్లో ఆఫీస్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ వంటి ఉద్యోగాలు దక్కుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వ కొలువులు

ఐటీఐ పూర్తి చేసుకున్న వారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడే అవకాశముంది. ముఖ్యంగా రైల్వేలో టెక్నికల్ విభాగంలో అసిస్టెంట్ లోకో పైలట్.. ఇతర టెక్నికల్ విభాగాల్లో టెక్నీషియన్ గ్రేడ్–3 పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే విధంగా.. నవరత్న, మహారత్న, మినీరత్న హోదా కలిగిన ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా టెక్నీషియన్ కొలువులు సొంతం చేసుకునే వీలుంది. ఐటీఐ పూర్తి చేసుకున్న వారు స్వయం ఉపాధి అవకాశాలు పొందొచ్చు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ వంటి ట్రేడ్‌ల ఉత్తీర్ణులు సొంతంగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించి ఉపాధి పొందొచ్చు.

ఐటీఐలు.. ముఖ్యాంశాలు

- ఏడాది, రెండేళ్ల వ్యవధిలో కోర్సులు.
- ఎనిమిది, పదో తరగతి అర్హతగా ఐటీఐల్లో ప్రవేశాలు.
- ఎన్‌సీక్యూఎఫ్ మేరకు ప్రాక్టికల్, థియరీ శిక్షణ.
- డీఎస్‌టీ స్కీమ్ ప్రకారం–ఇండస్ట్రీలో భాగస్వామ్యంతో శిక్షణ.
- ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణతతో అప్రెంటీస్ అవకాశాలు.
- అప్రెంటీస్‌షిప్ సర్టిఫికెట్‌తో.. పూర్తిస్థాయి ఉద్యోగాల్లో ముందంజ.
- టెక్నీషియన్, అసిస్టెంట్ సూపర్‌వైజర్ వంటి కొలువులు.
- నెలకు రూ.25 వేల వరకు వేతనం పొందే అవకాశం.

విద్య, ఉద్యోగ సమాచారం

ఓఎన్‌జీసీలో 2,236 అప్రెంటిస్‌లు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎన్‌జీసీ) దేశవ్యాప్తంగా ఉన్న ఓఎన్‌జీసీ సెక్టార్లలోని వివిధ ట్రేడ్/విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 2,236.
» **అప్రెంటిస్‌లు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్, డిప్లొమా అప్రెంటిస్, ట్రేడ్ అప్రెంటిస్.
» **సెక్టార్ల వారీగా ఖాళీలు:** నార్తర్న్ సెక్టార్–161, ముంబై సెక్టార్–310, వెస్ట్రన్ సెక్టార్–547, ఈస్ట్రన్ సెక్టార్–583, సదరన్ సెక్టార్–335, సెంట్రల్ సెక్టార్–249.
» **అర్హత:** విభాగాన్ని అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ట్రేడ్/విభాగాలు:** అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సెక్రటేరియల్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, సివిల్ ఎగ్జిక్యూటివ్, పెట్రోలియం ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ అసిస్టెంట్, ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, స్టోర్ కీపర్, మెషినిస్ట్, సర్వేయర్, వెల్డర్, ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, మెకానిక్ డీజిల్ తదితరాలు.
» **వయసు:** 25.10.2024 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8,050, ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7000 నుంచి రూ.8,050.
» **ఎంపిక విధానం:** అర్హత పరీక్షల్లో సాధించిన మార్కులు, సర్టిఫికేట్‌ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **వర్క్ సెంటర్:** డెహ్రాడూన్, ఢిల్లీ, జోధ్‌పూర్, గోవా, హజీరా, ముంబై, ఉరాన్, పన్వేల్, నవా, అహ్మదాబాద్, అంకలేశ్వర్, వడోదర, బొకారో, కాంబే, మెహసానా, జోర్హాట్, నజీరా–శివసాగర్, సిల్చార్, చెన్నై, కాకినాడ, కారైకల్, రాజమండ్రి, అగర్తల, కోల్‌కతా.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.10.2024.
» **ఫలితాల వెల్లడి తేది:** 15.11.2024.
» **వెబ్‌సైట్:** https://ongcindia.com/

కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్‌లో యూజీ ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ ఆయుష్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సులు:** బీఏఎంఎస్/బీహెచ్‌ఎంఎస్/బీఎన్‌వైఎస్/బీయూఎం ఎస్ డిగ్రీ కోర్సులు.
» **అర్హత:** ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ)తో పాటు నీట్ యూజీ–2024 స్కోరు తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 31.12.2024 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:** నీట్ యూజీ–2024 స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.10.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.10.2024.
» **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in/

బెల్ బెంగళూరులో సీనియర్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) శాశ్వత ప్రాతిపదికన సీనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్), ఎంఈ/ఎంటెక్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.10.2024 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది మేనేజర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహళ్లి పోస్ట్, బెంగళూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 24.10.2024.
» **వెబ్‌సైట్:** http://https//bel-india.in/





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
మంగళవారం । 8-10-2024

కుర్చుని చేసే ఉద్యోగాలతో తిప్పలే కాదు.. అనారోగ్య సమస్యలు అనేకం...!

కార్యాలయం, వర్క్ ఫ్రం హోం ఉద్యోగాలతో అధికశాతం ముప్పు

ఒకేచోట గంటల పాటు కదలకుండా కూర్చుంటే 'డీప్ వీన్ థ్రాంబోసిస్'

రోజుకు కనీసం 40 నిమిషాల ఓ మోస్తరు వ్యాయామంతోనే మేలు

'బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్'లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడి

కదలకపోతే.. కదల్లేరు!



కూర్చుని కదలకుండా చేసే ఉద్యోగాలు (సిట్టింగ్ జాబ్స్) ప్రాణాంతకంగా మారుతున్నాయనే హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. రోజూ కార్యాలయం లేదా ఇంట్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌ల ముందు ఐటీ ఉద్యోగులు కూర్చుని పనితో కుస్తీ పట్టడం సాధారణమైంది. ఉదయం నుంచి సాయంత్రం దాకా ప్రభుత్వ కార్యాలయాలు మొదలు వివిధ ప్రైవేట్ ఉద్యోగులు కూడా అత్యధిక సమయం డెస్క్‌లు, ఫైళ్ల ముందు గడపడం తెలిసిందే. కార్యాలయ ఉద్యోగాలు, వర్క్ ఫ్రం హోం ఉద్యోగాలతో అధిక శాతం ఉద్యోగులు టేబుళ్ల ముందు కూర్చుని నిర్వహిస్తున్న విధులతో ఈ ముప్పు పెరుగుతున్నట్టు అంచనా వేస్తున్నారు. ఒకేచోట కొన్ని గంటల పాటు కదలకుండా కూర్చుంటే రక్తప్రసారం జరగక 'డీప్ వీన్ థ్రాంబోసిస్'(డీవీటీ)కు దారితీయొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డీవీటీ వంటి పెను ఆరోగ్య సమస్యతో పాటు రక్తపోటు, మధుమేహం, వెన్నెముక, కీళ్ల నొప్పులు, మానసిక కుంగుబాటు, ఆందోళన, మెటబలైజ్ ఫ్యాట్ తదితర సమస్యలు తప్పవని వారు స్పష్టం చేస్తున్నారు. రోజంతా కార్యాలయం పనిలో, ఇతరత్రా ఎంతగా పని ఒత్తిళ్లను ఎదుర్కొన్నా.. రోజుకు కనీసం 40 నిమిషాల పాటు ఓ మోస్తరు వ్యాయామం, నడక లాంటి వ్యాపకాలతో మంచి ఫలితాలు వస్తాయని నిపుణులు వివరిస్తున్నారు. రోజులో ఎక్కువ గంటల పాటు ఒకేచోట కూర్చుని పనిచేయడం వల్ల ఎదురయ్యే ప్రతికూల అంశాలు, సమస్యలను ఎదుర్కొనేందుకు వ్యాయామమే మంచి ఉపయోగమని సూచిస్తున్నారు. కూర్చుని చేసే ఉద్యోగాల వల్ల ఎదురయ్యే దుష్ఫలితాలు, అనారోగ్య సమస్యలకు సంబంధించి నిర్వహించిన వివిధ పరిశీలనను 'మెటా అనాలిసిస్'చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాలకు అనుగుణంగా.. మెరుగైన ఆరోగ్యం కోసం రోజువారీ జీవనవిధానాన్ని కొంత మార్చుకుని, దినచర్యలో వ్యాయామం (ఫిజికల్ యాక్టివిటీ) చేర్చితే మెరుగైన ఫలితాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా.. 'బ్రిటిష్ జర్నల్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్' ప్రచురితమైన అధ్యయనంలో పలు విషయాలు వెల్లడయ్యాయి.

- సాక్షి, హైదరాబాద్

ముఖ్యాంశాలు..

ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని 45 వేల మందిపై ఆయా అంశాల వారీగా జరిపిన పరిశీలనలో వివిధ అంశాలపై స్పష్టత వచ్చింది. రోజులో ఒకేచోట కూర్చుని పనిచేసే ఉద్యోగుల్లో.. రోజుకు కనీసం 40 నిమిషాల పాటు వ్యాయామం, ఇతర శారీరక శ్రమ వల్ల.. సుదీర్ఘగంటల పాటు కూర్చుని పనిచేయడంతో కలిగే దుష్ఫలితాలను అధిగమించవచ్చునని స్పష్టమైంది. రోజులో దాదాపు పది గంటల పాటు కూర్చుని పనిచేయడం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, ఇతర ఇబ్బందులను వ్యాయామంతో దూరం చేయొచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ (2020 గ్లోబల్ గైడ్‌లైన్స్).. వారానికి 150–300 నిమిషాలలోపు ఓ మోస్తరు, 75 నుంచి 150 నిమిషాల దాకా ఒకింత ఉధృతమైన వ్యాయామం (విగరస్–ఇంటెన్సిటీ ఫిజికల్ యాక్టివిటీ) చేయాలని సిఫార్సు చేసింది. దైనందిన కార్యక్రమాల్లో మార్పులు చేసుకోవడం, స్వల్ప వ్యాయామం, లిఫ్ట్‌కు బదులు మెట్లను ఉపయోగించడం, ఇంట్లో పిల్లలతో ఆడుకోవడం వంటి వాటితో ఉపశమనం పొందవచ్చని ఈ అధ్యయనం చెబుతోంది. కార్యాలయం లేదా ఇళ్ల నుంచి పనిచేసేపుడు ఒకేచోట చైతన్యరహితంగా గడపకుండా చురుకుగా వ్యవహరించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. వరుసగా ఎన్ని గంటల పాటు ఒకేచోట లేవకుండా పనిచేయడం వల్ల ఏయే రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయనే దానిపై మాత్రం మరింత లోతైన పరిశోధన జరగాల్సిన అవసరం ఉందని భావించడం గమనార్హం.

సమస్యలివే..

- ఒకరోజులో ఎక్కువ గంటల పాటు కూర్చునే ఉండడం, కార్యాలయంలో పని చేయడం వల్ల కదలికలు లేని కారణంగా కాళ్లలో రక్తం, ద్రావకాలు ఒకేచోట చేరడం వల్ల గుండెజబ్బులకు కారణమౌతుంది.
- ఇది రక్తప్రసారంలో మార్పులకు కారణమై రక్తపోటుకు దారితీయడంతో పాటు రక్తంలో చక్కెర నియంత్రణలు మారే అవకాశాలు పెరుగుతాయి.
- ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం వల్ల మధుమేహ సమస్య పెరుగుదలకు దారితీస్తుంది.
- అధిక గంటలు కూర్చోవడం వంటి వాటి వల్ల కొన్నిరకాల కేన్సర్‌లకు కారణం కావొచ్చు.
- రోజులో చాలాగంటలు కూర్చుని ఉండడం వల్ల మానసిక ఒత్తిళ్ల పెరగడంతో పాటు ఆందోళనలు, చిరాకు పెరిగే అవకాశాలున్నాయి.
- అధిక సమయం సిట్టింగ్ వల్ల వాస్తవ వయసు కంటే ముందుగానే వయసు మీదపడిన భావనకు దారితీస్తుంది.

ఏం చేయాలి?

- పనిచేస్తున్నపుడు మధ్యమధ్యలో లేచి నిల్చోవాలి.
- కొంత దూరం అటు ఇటు నడవాలి.
- చేస్తున్న పని నుంచి కొంతసేపు విరామం తీసుకోవాలి.
- కూర్చునే పనిచేయకుండా.. వీలును బట్టి నిల్చోవాలి.



సోమవారం తిరుపతి చేరుకున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు




సోమవారం ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు

ప్రపంచవ్యాప్తంగా అయిదు గ్రామాల్లో జీవిత కాలం ఎక్కువ

బ్లూ జోన్ పరిధిలో జీవిత కాలం 90 నుంచి 100 ఏళ్లు

అక్కడ తినే ఆహారం, వాతావరణ పరిస్థితులే కారణం

'పంచ'ప్రాణాలు పదిలం



ప్రపంచంలోని అయిదు గ్రామాల్లో మనుమల జీవిత కాలం సగటున 80 ఏళ్ల నుంచి 100 ఏళ్లు ఉంటుందట. వినడానికి ఆశ్చర్యం అనిపించినా ఇది నిజమని సర్వేలు చెబుతున్నాయి. ప్రపంచంలోని ఐదు ప్రాంతాల్లో ఈ రకమైన జీవన శైలి కనిపిస్తోందట. అమెరికాకు చెందిన డాన్ బట్నకర్ ఆధ్వర్యంలో జీవిత కాలంపై చేపట్టిన సర్వేలో.. ప్రపంచంలోని ఐదు ప్రాంతాల్లో ప్రజలు అత్యధికంగా వందేళ్ల వరకు జీవిస్తున్నారని గుర్తించారు. దీనికి గల కారణాలను సర్వే నివేదికల్లో వివరించారు. ప్రధానంగా అక్కడి ప్రజలు తినే ఆహారం, వాతావరణ పరిస్థితులు ఎక్కువ కాలం జీవించడానికి సహాయ పడుతున్నాయని విశ్లేషించారు.

- సాక్షి, హైదరాబాద్

ఐదు బ్లూ జోన్స్..

ప్రపంచంలో ఐదు ప్రాంతాలను బ్లూ జోన్స్‌గా గుర్తించారు. జపాన్‌లోని ఒకినావా, ఇటలీలోని సార్డీనియా, కాలిఫోర్నియాలోని లోమాలిండా, గ్రీస్‌లోని ఇకారియా, కోస్టారికాలోని నికోయా ప్రాంతాలు ఈ జాబితాలో చేర్చారు. ఒక్కో జోన్‌లో కనీసం 20 నుంచి 50 గ్రామాలున్నాయి. ఇక్కడ సుమారు పదివేల మందికి పైగా ప్రజల జీవన శైలిని పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు సరాసరి 80 ఏళ్ల నుంచి 100 ఏళ్లు జీవిస్తున్నారు. ప్రశాంతమైన వాతావరణం, కాలుష్య కారకాలకు దూరంగా జీవించడం ఒక ఎత్తయితే.. తినే ఆహారంలో ఎలాంటి కల్తీ పదార్థాలు లేకపోవడం, నూనె, వేపుడు, పాశ్చాత్య ఆహారానికి దూరంగా ఉండటం, ఆహారపు పంటల్లో క్రిమిసంహారక మందులు వాడకుండా సహజసిద్ధంగా పండించినవి వినియోగించడం మరో కారణమని పేర్కొంటున్నారు. ప్రజలు ఎక్కువగా ఆకు కూరలు తింటున్నారు. ఆకలిగా ఉన్నపుడు సుమారు 80 శాతం పొట్ట నిండేంత వరకు తిని, మిగతా 20 శాతం ఖాళీగా ఉంచుతారు. దానివల్ల నిద్ర మత్తు, పని బద్ధకం వంటివి దూరమవుతాయని చెబుతున్నారు. తీపి తినాలనుకునే వారు ప్రకృతి సిద్ధంగా లభించే తేనె వంటివి వినియోగిస్తారే తప్ప చక్కెర వినియోగించరు. కొన్ని ప్రాంతాలు దీవులు కావడంతో సముద్రంలో లభించే చేపలు, ఇతర సీ ఫుడ్‌ను ఎక్కువగా ఆరగిస్తారు. ఇవన్నీ గ్రామీణ ప్రాంతాలు కావడంతో వివిధ రకాల వ్యవసాయ, ఇతర పనులు చేసుకోవడం వల్ల ప్రత్యేకించి శారీరక వ్యాయామం అవసరం ఉండదు. చికెన్ వంటి మాంసాహారం (రెడ్ మీట్) పూర్తిగా ఇక్కడ నిషేధం. బ్లాక్ రైస్, బ్రౌన్ రైస్, స్వీట్ పొటాటో, కాకరకాయలు, బీన్స్, గుమ్మడికాయ, కుకుంబర్, తోటకూర, గోంగూర, ఇతర ఆకుకూరలు అధికంగా వినియోగిస్తారు. దీనివల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రోగాలు దూరంగా ఉంటాయి. అరుణాచల్‌ప్రదేశ్ అపతానీ ట్రైబ్స్ జీరో వ్యాలీ ప్రాంతంలో ప్రజల జీవిత కాలం 80 ఏళ్ల నుంచి 100 ఏళ్లుగా సర్వే వెల్లడించింది.

రెండు నెలల పాటు బ్లూ జోన్ ఫుడ్

హైదరాబాద్ విమానాశ్రయం నోవోటెల్ హోటల్‌లో రెండు నెలల పాటు బ్లూ జోన్ సంబంధిత ఆహారాన్ని అందుబాటులో ఉంచుతున్నాం. భారత సంప్రదాయ వంటకాల్లోనూ ఈ తరహా రెసిపీలు ఉంటాయి. బ్లూ జోన్ ఫుడ్‌పై మా వినియోగదారులకు అవగాహన కల్పించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ తరహా ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తాం. వందేళ్లు జీవిస్తున్న బ్లూ జోన్ పరిధి ప్రజలు తీసుకునే ఆహారపు అలవాట్లు, వారి ఆరోగ్య పరిస్థితులను తెలియజేస్తాం. రెండు నెలల పాటు ప్రత్యేక వంటకాలను వినియోగదారులకు పరిచయం చేస్తాం.

– అమన్నరాజు, సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెఫ్, నోవోటెల్, హైదరాబాద్ ఎయిర్‌పోర్టు



అమెరికా నార్త్ కరోలినా కాంకార్డ్ కానన్ రన్ ప్రస్తమ్‌లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో, బతుకమ్మ పాటలతో తెలంగాణ సంప్రదాయ వేడుక ఘనంగా జరిగింది.

రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ

- బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతోందని, తెలంగాణ కూడా అదే దిశగా అడుగులు వేస్తోందని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. ఆయన సోమవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పీకి పందిరేస్తోందని, రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలి.. నిర్మాణం పూర్తయిన ఫ్లాట్లు అమ్ముడుపోవడం లేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు, సంక్షేమ హాస్టళ్ల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల్లేవని, ఉద్యోగులకు అయిదు డీఏలు పెండింగులో ఉన్నాయని వివరించారు. సీఎం పదవిలో ఉంటూ రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీపై అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

పెండింగ్ బకాయిలు మంజూరు చేయండి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేందుకు రూ.600 కోట్లు వెంటనే విడుదల చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. పీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్, మెడికల్ లీవ్ బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఉద్యోగుల బిల్లుల చెల్లింపునకు అమల్లో ఉన్న ఈ–కుబేర్‌ను రద్దు చేయాలని కోరారు. ఉద్యోగులకు రైతు రుణమాఫీ కూడా చేయలేదని, వారికి న్యాయంగా రావలసిన డీఏల్లో కనీసం మూడింటినైనా ప్రకటించాలని హర్షవర్ధన్‌రెడ్డి కోరారు.


జీవో 477 రద్దుకు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: మూసీనది పరీవాహక అభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 477ను తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు అమలు కోసం లక్షలాది మంది నిరుపేద కుటుంబాలకు పునరావాసం కల్పించకుండా బలవంతంగా పంపించడం, బాధితుల ఇళ్లను కూల్చివేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ప్రభావిత వర్గాలతో రాష్ట్ర ప్రభుత్వం నేరుగా సంప్రదింపులు జరిపి బాధితులతో మాట్లాడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి పునరావాస ప్రణాళికను రూపొందించి పారదర్శకతతో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న నేపథ్యంలో.. నిధుల వినియోగం వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని కోరారు.

అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలి

సీఎంకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని నర్సంపేట బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే అది బోగస్ హామీగా ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మితేనే బోనస్ ఇస్తామనడం సరైంది కాదని తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధర రూ.2,320 ఉంది. హామీ ఇచ్చిన 500 బోనస్ కలుపుకుని రూ. 2,820 అవుతుంది..అంటే సన్నరకం ధాన్యానికి సుమారు రూ. 4,404 కోట్ల బోనస్, దొడ్డు రకం వడ్లకు రూ. 2,909 కోట్లు బోనస్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం ధాన్యంలో కోతలు పెడుతూ ప్రభుత్వం 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఈ ధాన్యానికి రూ. 2,350 కోట్లు వెచ్చిస్తుంది..అంటే మొత్తం ధాన్యంకు ఇచ్చే బోనస్ రూ. 7,314 కోట్లు ఉంటే ప్రభుత్వం రైతును మోసం చేస్తూ కేవలం రూ. 2,350 కోట్లు మాత్రమే బోనస్ చెల్లించే విధంగా కొర్రీలు పెడుతుంది. తక్షణమే ఇచ్చిన హామీ మేరకు బోనస్ రూ. 500 ఇవ్వాలని, రకరకాల కారణాలతో తప్పించుకునే చర్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది'అని సుదర్శన్‌రెడ్డి లేఖలో వివరించారు.

డీఏ, బిల్లులు చెల్లించండి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులకు నాలుగు డీఏలు, పెండింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం సోమవారం డిప్యూటీ సీఎంను కలిసింది. ఉపాధ్యాయుల జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ, సప్లిమెంటరీ వేతనాలు, సరెండర్ లీవులు, గత పీఆర్సీ బకాయిలు, మార్చి నుండి ఉద్యోగ విరమణ చేసిన వారికి పింఛను ప్రయోజనాలకు సంబంధించి తదితర వేలాది బిల్లులు ట్రెజరీల్లో ఆమోదం పొందినప్పటికీ ఖాతాల్లో జమ కావడం లేదని వివరించారు.

మోదీ ఇజ్రాయెల్ మోడల్ అమలు చేస్తున్నారు

- ప్రధాని విదేశీ పర్యటనలన్నీ నిష్ప్రయోజనం: సీపీఐ కార్యదర్శి నారాయణ
- అమిత్ షా నక్సలిజంపై కాదు.. అత్యాచారాలు, హత్యలను అరికట్టడంపై దృష్టి పెట్టాలని వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ మోడల్‌ను అమలు చేస్తున్నారని సీపీఐ కార్యదర్శి నారాయణ విమర్శించారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనలన్నీ నిష్ప్రయోజనమని వ్యాఖ్యానించారు. ప్రకృతి విపత్తులకు గురైన బిహార్‌లో, రావణ కాష్టంలా మారిన మణిపూర్‌లో ప్రధాని ఎందుకు పర్యటించలేదని ప్రశ్నించారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నక్సలిజంపై ముఖ్యమంత్రులతో సమావేశాలు నిర్వహించడం కాకుండా.. దేశంలో జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టడంపై దృష్టి సారించాలని సూచించారు. అదే సమయంలో దేశంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమాల్లో మార్పులు తెచ్చుకోవాలని.. ప్రజలతో కలసి పోరాడాలని మావోయిస్టులకు హితవు పలికారు. ఇక దేశంలో అత్యాచారాలకు పాల్పడే వారికి బెయిల్ ఇస్తున్నారని.. హరియాణా, పంజాబ్ ఎన్నికల సమయంలో ఎన్నో ఘోరాలు చేసిన డేరా బాబాకు బెయిల్ ఎందుకు ఇచ్చారని నారాయణ ప్రశ్నించారు. వరవరరావు వంటి వాళ్లకు మాత్రం బెయిల్ రాదని విచారం వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో దొడ్డిదారిన ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీ ప్రయత్నాలు మొదలుపెట్టిందని ఆరోపించారు. జమ్మూకాశ్మీర్‌లో ఐదుగురు ఎమ్మెల్యేలను ముందే నామినేట్ చేశారని.. ఓట్ల లెక్కింపు సమయంలో, సీట్లు గెలవకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు.



కలువ కాంతుల్లో కల్పవల్లి

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారు సోమవారం సంతాన లక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కలువపూలతో అలంకరించి పూజించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్టణం



దాండియా ఆటలు ఆడ..

వాడవాడలా శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. శ్రీకాకుళం నగరంలో మార్వాడీ కుటుంబాలన్నీ ఒక చోటకి చేరి దాండియా ఆడుతున్న దృశ్యం
– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



చట్టం గిట్టం జాన్తానై!

మనల్ని ఆపేదెవడ్రా.. అని లీడర్ అంటే.. అదే అదనుగా కేడర్ చెలరేగిపోతోంది. కూటమి ప్రభుత్వంలో చట్టం మన చుట్టమే అనుకుంటూ ఆయా పార్టీల కార్యకర్తలు ఇలా బండ్లు, కార్ల నంబర్ ప్లేట్లపై ఫలానా వారి తాలూకా అని రాసుకుని తిరుగుతున్నారు. పోలీసులు మాత్రం మౌనంగా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. నెల్లూరు నగరంలో ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా...

'ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం ఇవ్వాలి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మసీదులకు నిర్వహణ సాయంతోపాటు ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం మంజూరు చేయాలని జాతీయ మైనార్టీస్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సలహాదారుడు ఎం.అర్షద్ అయూబ్‌ఖాన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు ఆయన సోమవారం లేఖ రాశారు. మసీదుకు రూ.5వేలు, ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5వేలు చొప్పున నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు.

'మద్యం' ఫీజు డీడీల ద్వారా చెల్లించవచ్చు

సాక్షి, అమరావతి: మద్యం షాపులకు నాన్-రిఫండబుల్ దరఖాస్తు రుసుమును దేశంలోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు, ఏపీలోని గ్రామీణ బ్యాంకుల్లో డీడీల రూపంలో చెల్లించేందుకు వీలుకల్పిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతోపాటు సీఎఫ్ఎంఎస్‌లో సిటిజన్ చలానా సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఎండీగా గేదెల సురేష్ కుమార్

సాక్షి, అమరావతి : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా గేదెల సురేష్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ సీడ్స్ ఎండీ ఎం.శివప్రసాద్ ఇప్పటి వరకు పూర్తి అదనపు బాధ్యతలతో ఎండీగా పనిచేశారు.

రాయితీపై టమాటా, ఉల్లి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టమాటా, ఉల్లి పాయలను రాయితీతో విక్రయించేలా ఏర్పాట్లు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. సోమవారం సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కిలో టమాటా ధర బహిరంగ మార్కెట్‌లో రూ.70–రూ.75, రైతుబజార్లలో రూ.63 ఉన్నట్లు తెలిపారు. దీన్ని రాయితీపై కిలో రూ.50కే విక్రయించాలని సూచించారు.

ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా మునిరత్నం బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా పి.ఎస్.మునిరత్నం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీసీ హౌస్‌లోని ఆయన కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అర్హతగల ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణకు చర్యలు చేపట్టామని సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ బి.లావణ్యవేణి ఒక ప్రకటనలో తెలిపారు. AP E&procurement portal (https://tender. apeprocurement. gov. in)లో వివరాలు ఉంచామని తెలిపారు. ఈనెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రూ.290 కోట్లతో రహదారుల మరమ్మతులు

మంగళగిరి: రాష్ట్రవ్యాప్తంగా ధ్వంసమైన 7,071 కిలోమీటర్ల రోడ్లకు సంబంధించిన 1,393 రోడ్లను గుంతల రహిత రోడ్లుగా మార్చేందుకు రూ.290 కోట్లతో మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా నీరుకొండలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో సోమవారం రహదారుల నిర్మాణంపై వర్క్‌షాప్ నిర్వహించారు. రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌నకు మంత్రి జనార్ధనరెడ్డి ఆన్‌లైన్‌లో సందేశాన్నిచ్చారు.

కేజీబీవీల్లో 729 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సొసైటీ ద్వారా కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీల్లో) 729 బోధనేతర పోస్టులను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీచేయనున్నట్టు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 15వ తేదీ వరకు స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంటు నుంచే అంకురం.. జీడిమామిడికి వరం

బాపట్ల పరిశోధనా స్థానంలో జీడిమామిడి అంటు మొక్కల ఉత్పత్తి



అధిక దిగుబడులిస్తున్న బీపీపీ 8, 9 రకాలు

- నాటిన మూడేళ్లకే కాపుకొచ్చే వెరైటీలు
- ఇతర రాష్ట్రాలకూ ఇక్కడి నుంచే అంటు మొక్కలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: దేశ ప్రజల జీడిపప్పు అవసరాలు తీర్చే స్థాయిలో ఉత్పత్తిని పెంచేందుకు వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ పరిధిలోని బాపట్ల జీడిమామిడి పరిశోధనా స్థానం చేపట్టిన కృషి ఫలిస్తోంది. అధిక దిగుబడినిచ్చే జీడిమామిడి మొక్కలను అభివృద్ధి చేసిన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు వాటిని అంటు మొక్కల రూపంలో రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే కొత్త రకాలైన బీపీపీ 8, 9 (బాపట్ల సంతతి) వెరైటీలను రైతులకు సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది మరో 50 వేల మొక్కలు సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాలకు 10 వేల మొక్కలు సరఫరా చేశారు. రాష్ట్ర అటవీ శాఖకు మరో 10 వేల మొక్కలు అందించారు. మరో 25 వేల మొక్కలు బాపట్ల జీడిమామిడి పరిశోధనా స్థానంలో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే మరిన్ని మొక్కలను రైతులకు అందించేందుకు ఇక్కడి పరిశోధనా స్థానం సిద్ధంగా ఉంది. ఒక్కొక్క మొక్కను రూ.50కే రైతులకు అందిస్తున్నారు. ఈ అంటు మొక్కలను ఆగస్టు నెల నుంచి డిసెంబర్‌లోపు నాటుకోవచ్చు. అవసరమైన రైతులు బాపట్ల పరిశోధనా స్థానాన్ని సంప్రదిస్తే మొక్కలు సరఫరా చేస్తారు.

మూడేళ్లకే కాపు

సాధారణ జీడిమామిడి రకాలు నాటిన 6 ఏళ్లకు గాని కాపునకు రావు. బాపట్ల సంతతి రకాలైతే మూడేళ్ల నుంచే కాపునిస్తాయి. సాధారణ రకాలైతే.. చెట్టుకు 10 నుంచి 15 కేజీల వరకు జీడి గింజల దిగుబడి వస్తుంది. బాపట్ల సంతతి రకాలైతే.. చెట్టుకు 20 నుంచి 25 కేజీల దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాకుండా కొత్త జీడిమామిడి రకాలు నాటిన తోటల్లో అంతర పంటలుగా వేరుశనగ, దోస వంటివి సాగు చేసుకోవచ్చు. ఎరువులు సక్రమంగా అందించి, గాలి వెలుతురు సోకేలా కొమ్మలు కత్తిరింపులు చేసి యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే దిగుబడి పెరుగుతుంది.



బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానంలో కొత్త రకం జీడిమామిడి మొక్కలు

ఏపీలో 1,21,540 టన్నుల గింజల ఉత్పత్తి

రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో 1,35,241 హెక్టార్లలో జీడిమామిడి తోటలు సాగవుతుండగా.. ఏటా 1,21,540 టన్నుల జీడిగింజలు ఉత్పత్తి అవుతున్నాయి. రాష్ట్రంలోని వేటపాలెం, రాజమండ్రి, దేవరపల్లి, మోరి (సఖినేటిపల్లి), పలాస, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, విజయనగరం తదితర ప్రాంతాల్లో జీడిమామిడి ప్రాసెసింగ్ పరిశ్రమలు 45 ఉండగా.. జీడిగింజల దిగుబడి ఆశించినంత లేకపోవడంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి

ప్రజల అవసరాలకు సరిపడేంత స్థాయిలో దేశంలోనే జీడిపప్పు ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సాగు విస్తీర్ణాన్ని పెంచాలనే లక్ష్యం మేరకు బాపట్ల పరిశోధన స్థానం ప్రణాళికలు రచించింది. సాగు పెరిగితే ఉత్పత్తి పెరిగి తద్వారా పరిశ్రమలతోపాటు పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి దొరుకుతుంది. ఈ నేపథ్యంలో ఏటా లక్షకు పైగా అంటు మొక్కలను బాపట్ల పరిశోధన స్థానం సిద్ధం చేసి రైతులకు అందిస్తోంది. బాపట్ల నుంచి మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకూ జీడిమామిడి మొక్కలను ఎగుమతి చేస్తున్నారు.

రాష్ట్రంలో జీడిమామిడి సాగు ఇలా..

జిల్లా	సాగు (హెక్టార్లలో)	ఉత్పత్తి (మెట్రిక్ టన్నులు)
శ్రీకాకుళం	25,473	20,620
విజయనగరం	17,903	16,589
విశాఖపట్నం	34,536	29,855
తూర్పు గోదావరి	32,814	28,722
పశ్చిమ గోదావరి	20,281	23,029
కృష్ణా	222	286
గుంటూరు	1,256	783
ప్రకాశం	1,156	797
నెల్లూరు	1,276	592
చిత్తూరు	324	267
	1,35,241	1,21,540

తక్కువ పెట్టుబడి చాలు

తక్కువ పెట్టుబడితో జీడిమామిడి సాగు చేసుకోవచ్చు. ఇసుక, ఎర్ర నేలలు అనుకూలంగా ఉంటాయి. ఒకసారి సాగుచేస్తే 45 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుంది. కనీసం ఎకరాకు రూ.60 వేల వరకు రాబడి ఉంటుంది. వినియోగం అధికంగా ఉన్నందున దిగుబడులు పెంచే మొక్కలను సృష్టించడంతోపాటు సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం.
– డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు, సీనియర్ సైంటిస్ట్, జీడిమామిడి పరిశోధన కేంద్రం, బాపట్ల



పాఠశాలల ప్రగతిలో ఎస్ఎంసీల పాత్ర కీలకం



పాఠశాల యాజమాన్య కమిటీ కరదీపికను ఆవిష్కరిస్తున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతిలో పాఠశాల యాజమాన్య కమిటీలు బాధ్యత వహించాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఇటీవల ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీలకు పాఠశాల విధివిధానాలపై మొదటి దశ శిక్షణ కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా పెదపరిమి, ఏలూరు జిల్లా ఆగిరిపల్లి కేంద్రాల్లో సోమవారం ప్రారంభించారు. ఆగిరిపల్లి వర్క్‌షాప్‌లో సీమ్యాట్ డైరెక్టర్ వి.ఎన్.మస్తానయ్య పాల్గొన్నారు. పెదపరిమిలో నిర్వహించిన శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీడీ మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు తొలిసారి శిక్షణలో ప్రాతినిధ్యం కల్పించామని, వీరు అభ్యసన ఫలితాలపై దృష్టి సారించాలన్నారు. ఎస్ఎంసీలకు ప్రత్యేకమైన మొబైల్ యాప్ రూపొందిస్తున్నామని, దీని ద్వారా పాఠశాలల్లో సమస్యలు, ప్రగతిని నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చునని చెప్పారు. పాఠశాల పనితీరు, విద్యార్థుల అభ్యసన స్థాయి, మరుగుదొడ్ల వినియోగం, ప్రభుత్వ పథకాల అమలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను సభ్యులు పర్యవేక్షించాలన్నారు. రెండు కేంద్రాల్లో ఎంపికైన ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లకు స్టేట్ రిసోర్సు పర్సన్లు శిక్షణనిచ్చారు.

ధిక్కార కేసులో ఐఏఎస్ అధికారి శేషగిరిబాబుకి ఊరట

- జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సింగిల్‌జడ్జి ఇచ్చిన తీర్పుపై స్టే

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కార కేసులో ఇంటర్ బోర్డు అప్పటి కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబుకు హైకోర్టు ధర్మాసనం ఊరటనిచ్చింది. ఆయనకు నెల రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై ధర్మాసనం స్టే విధించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఆరు వారాల పాటు నిలిపేసింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న విజయలక్ష్మీకి నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ధర్మాసనం ఇటీవల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ విరమణ వయస్సును రాష్ట్ర ప్రభుత్వం 62 సంవత్సరాలకు పెంచిన నేపథ్యంలో తన సర్వీసును కూడా అప్పటి వరకు పొడిగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఇంటర్ బోర్డులో పాలనాధికారిగా పనిచేస్తున్న ఎం.విజయలక్ష్మీ 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, పిటిషనర్‌ను 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాలను అధికారులు అమలు చేయకపోవడంతో ఆమె వారిపై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో పాఠశాల విద్యాశాఖ అప్పటి ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, బోర్డు కార్యదర్శి శేషగిరిబాబు తదితరులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ ధిక్కార పిటిషన్‌పై జస్టిస్ వెంకటేశ్వర్లు ఇటీవల విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, అధికారులు ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని తేల్చారు. ఇది కోర్టు ధిక్కారమేనంటూ ప్రవీణ్ ప్రకాశ్, శేషగిరిబాబుకు నెల రోజుల జైలు శిక్ష, చెరో రూ.2 వేల జరిమానా విధిస్తూ ఇటీవల జస్టిస్ వెంకటేశ్వర్లు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై అప్పీల్ దాఖలు చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును నాలుగు వారాల పాటు నిలిపేశారు. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ శేషగిరిబాబు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. శేషగిరిబాబు తరపు న్యాయవాది కేవీ రఘువీర్ వాదనలు విన్న ధర్మాసనం సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై ఆరు వారాల పాటు స్టే విధించింది.

'కూటమి ఎమ్మెల్యేలూ మీ వైఖరి మార్చుకోండి'

- వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి

సాక్షి,అమరావతి: కేంద్రం నుంచి వచ్చిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు గ్రామాల అభివృద్ధి కోసం కేటాయిస్తే కొంతమంది కూటమి ఎమ్మెల్యేలు పంచాయతీ కార్యదర్శులను అడ్డు పెట్టుకుని నిధులు విడుదల చేయాలంటే గ్రామ సర్పంచులు ఎమ్మెల్యేలను కలవాలని, వారికి కమీషన్లు ముట్టజెప్పాలని చెప్పడం అనైతికమని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులను మధ్యలో పెట్టుకుని వ్యవహారం చేస్తున్న కూటమి నాయకులు, తక్షణమే తమ పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు పైబడినా స్థానిక సంస్థలకు నేటికీ ఒక్క రూపాయి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల పొగడ్తల కోసం అధికారులు వైఎస్సార్‌సీపీ ద్వారా ఎన్నికైన సర్పంచులకు, ఎంపీటీసీలకు, ఎంపీపీలకు, జెడ్పీటీసీలకు సమావేశాల్లో, నిధుల పంపకంలో తగిన గౌరవం ఇవ్వడం లేదన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ప్రోటోకాల్ అధికారాల్లోకి జొరబడితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని వెన్నపూస హెచ్చరించారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,859 మంది స్వామివారిని దర్శించుకోగా 37,173 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.63 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితోఅభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బ్రహ్మంగారిమఠంలో ప్రత్యేక పూజలు


బ్రహ్మంగారిమఠం: జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ దేవీ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా 5వ రోజు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని దేవతా మూర్తులు, ధ్వజస్తంభానికి పూర్వ మఠాధిపతి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రి స్వామి పూజలు చేశారు.

అమ్మవార్లకు విశేషంగా తిరువీధి



సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవార్లకు విశేషంగా తిరువీధి నిర్వహించారు. అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్ఠింపజేశారు. నాదస్వర వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలతో బేడా తిరువీధిని నిర్వహించారు. విశేష హారతి అందించారు.

మహాచండీ.. పాహిమాం



రామచంద్రపురం రూరల్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమకు మహాచండికాదేవి అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పలు ఆధ్యాత్మిక ప్రసంగ కార్యక్రమాలను నిర్వహించారు.

విద్యా సమాచారం

ముగిసిన రెండో విడత పీజీ అడ్మిషన్ల ప్రక్రియ

తిరుపతి సిటీ: తిరుపతిలోని ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీల్లో పీజీసెట్-2024 రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. ఎస్వీయూలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ కోర్సులలో సుమారు 80 శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యాయి. అలాగే మహిళా వర్సిటీలో అన్ని పీజీ కోర్సుల్లో 85 శాతానికి మించి అడ్మిషన్లు జరిగినట్టు సమాచారం.

సమాన అవకాశాలు కల్పించే విద్యావిధానం అవసరం

విజయనగరం అర్బన్: దేశంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించే విద్యావిధానం అవసరమని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి ఆకాంక్షించారు. రెండు రోజులుగా విజయనగరంలోని ఒక ప్రైవేటు సమావేశ మందిరంలో జరుగుతున్న ఏపీటీఎఫ్ 80వ వసంతాల ఉత్సవాలకు సోమవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో డ్రాపౌట్ల సంఖ్య తగ్గించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. నవోదయ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ జతిన్ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. ఏపీటీఎఫ్ పూర్వ నాయకుడు మార్పు బాలకృష్ణమ్మ, చున్నుపాటి తదితరులు నవసమాజ స్థాపనకు కృషి చేశారని గుర్తు చేశారు. 'ఆర్థిక సంక్షోభం–విద్యారంగంపై ప్రభావ' అనే అంశంపై ఆర్థిక రంగ నిపుణుడు డి.అప్పారావు మాట్లాడారు.

ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పీఆర్సీ అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

హెల్త్ సాక్షి ప్లస్
మంగళవారం ॥ 8-10-2024



అల్జైమర్స్ ముప్పు మహిళల్లోనే ఎందుకు ఎక్కువ? క్రమక్రమంగా చాలా విషయాల మరపునకు దారితీసే 'న్యూరో-డీజనరేటివ్' వ్యాధి అల్జైమర్స్... మహిళ జ్ఞాపకశక్తి, ఆలోచన, ప్రవర్తన తీరు... ఇలా ఎన్నో అంశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. తాము ఉన్న ఇంటి అడ్రస్‌తో సహా క్రమంగా అన్నీ మరచిపోయేలా చేసే 'అల్జైమర్స్' ముప్పు మహిళల్లోనే ఎక్కువ.

ఆదమరిస్తే మరపు ఖాయం

అల్జైమర్స్ మహిళలకు చేటు

కొన్ని పరిశీలనల ప్రకారం మొత్తం రోగుల్లో మూడింట రెండు వంతులు మహిళలే! ఎందుకిలా జరుగుతోందనే అంశంపై అధ్యయనాలు జరిగినప్పుడు చాలా అంశాలే ఇందుకు కారణమవుతున్నాయని తేలింది. ఉదాహరణకు జన్యుపరమైన, పర్యావరణ, జీవశాస్త్ర సంబంధితమైన పలు అంశాలు ఇందుకు కారణమవుతున్నట్లు గుర్తించారు.

అన్నింటికంటే ముఖ్యంగా మెనోపాజ్ తర్వాత వారిలో వచ్చే హార్మోనల్ మార్పులు ప్రధాన కారణంగా చెబుతున్నారు. కీలకమైన శుభవార్త ఏమిటంటే... దీనివల్ల కలిగే దుష్ప్రభావాల నివారణ చాలావరకు సాధ్యమని నిపుణులు చెబుతున్నారు.

మెనోపాజ్ తర్వాత మెదడులో వచ్చే మార్పులు...

బ్రెయిన్ ఎమ్మారై, సీటీ స్కాన్ వంటి పలు ఇమేజింగ్ పరీక్షల తర్వాత తేలిన అంశం ఏమిటంటే... మెనోపాజ్ తర్వాత మహిళల మెదడు పనితీరు, జీవక్రియల్లో మార్పు వస్తుంది. మెదడు పనితీరు తగ్గడంతో పాటు న్యూరాన్ల మధ్య కనెక్షన్లూ తగ్గుతాయి. ఈ న్యూరాన్ కనెక్షన్ల వల్లనే ఆలోచనలూ, విషయాలు జ్ఞప్తికి రావడం, నేర్చుకునే / అభ్యాసన శక్తీ... ఇవన్నీ కలుగుతాయి. మెనోపాజ్ తర్వాత మెదడు జీవక్రియలు (మెటబాలిజమ్) తగ్గడంతో జ్ఞాపకశక్తి తగ్గుతుండటం, ఏదీ టక్కున గుర్తుకు రాకపోవడం వంటి అనర్థాలు కనిపిస్తుంటాయి. ఇలా జరగడాన్ని 'బ్రెయిన్ ఫాగ్' గా పేర్కొంటారు. మెనోపాజ్ తర్వాత ఇలాంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. అంతేకాదు వీటిని 'అల్జైమర్స్' తాలూకు ముందస్తు చిహ్నాలుగా కూడా భావించవచ్చు.

మహిళల్లోనే ఎందుకు ఎక్కువంటే...

మహిళల్లో స్రవించే ఈస్ట్రోజెన్ హార్మోన్ల మోతాదులు మెనోపాజ్ తర్వాత తగ్గిపోతాయి. మెదడు కణాలను, మరీ ముఖ్యంగా న్యూరాన్లకు ఈస్ట్రోజెన్ మంచి రక్షణ కల్పిస్తుంటుంది. అంతేకాదు మెదడు తాలూకు జ్ఞాపకాల సెంటర్‌గా పేర్కొనే హిప్పోక్యాంపస్‌కూ ఈస్ట్రోజెన్ రక్షణ ఇస్తుంది. సమయం గడుస్తున్న కొద్దీ దేహానికీ, అందులోని అన్ని అవయవాలకూ ఏజింగ్ ప్రాసెస్ జరుగుతుంటుంది కదా. ఈస్ట్రోజెన్ స్రావాలు అకస్మాత్తుగా తగ్గగానే మెదడు ఏజింగ్ ఒక్కసారిగా పెరిగిపోతుంది. అలాగే మెదడులో అమైలాయిడ్స్ అనే పాచివంటి పదార్థాలు పేరుకుపోతుంటాయి.

మహిళల్లో అల్జైమర్స్ ఎక్కువగా ఉండటానికి మరో కారణమం ఏమిటంటే... పురుషులతో పోలిస్తే వారు ఎక్కువకాలం జీవిస్తారు. వాళ్ల ఆయుర్దాయం కూడా ఈ ముప్పునకు మరో కారణం.

ఇక జన్యుపరమైన కారణాల విషయానికి వస్తే పురుషులతో పోలిస్తే మహిళల్లో 'ఏపీఓఈ-ఈ4' అనే జన్యువు ఎక్కువగా ప్రభావం చూపుతుంది. పరిశోధనల్లో తేలిన విషయం ఏమిటంటే... ఈ జన్యువును కలిగి ఉన్న మహిళల్లో అల్జైమర్స్ ముప్పు పురుషుల కంటే మరింత ఎక్కువ.

మరి మహిళ మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమెలా?

ఇప్పటివరకూ అల్జైమర్స్‌ను నివారించడానికి నిర్దిష్టమైన చర్యలు లేకపోయినా, జీవనశైలిలో కొన్న మార్పుల ద్వారా (మరీ ముఖ్యంగా మెనోపాజ్ తర్వాత) ఈ ముప్పును చాలావరకు నివారించవచ్చు.

✦ మెనోపాజ్ రాబోయే ముందర హార్మోన్ రీ-ప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్ఆర్‌టీ)లో భాగంగా ఈస్ట్రోజెన్ ఇవ్వడం వల్ల అల్జైమర్స్ ముప్పును చాలావరకు తగ్గించవచ్చని కొన్ని అధ్యయనాల్లో తేలింది.

✦ మెదడుకు మేత కల్పించేలా బాగా చదవడం, రకరకాల పజిల్స్ ఛేదించడం, కొత్త విద్యలు నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాల సాధన, తరచూ పలువురితో కలవడం, మాట్లాడుతుండటం (సోషల్ ఇంటరాక్షన్స్) వంటివి అల్జైమర్స్ ముప్పును గణనీయంగా తగ్గిస్తాయి.

✦ నిత్యం తగినంత శారీరక శ్రమతో, దేహంలో కదలికలతో ఉండేవారిలో అల్జైమర్స్ ముప్పు గణనీయంగా తగ్గుతుంది. అందుకే వేగంగా నడక (బ్రిస్క్ వాకింగ్), ఈత, యోగా వంటి వ్యాయామాలు అల్జైమర్స్ రిస్కును తగ్గించడమే కాకుండా ఇతరత్రా మొత్తం ఆరోగ్యానికి బాగా దోహదపడతాయి. ✦ ఆహారంలో తగినంతగా ఆకుకూరలు, కూరగాయలు, చేపలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, తాజాపండ్లు ఎక్కువగా తీసుకుంటూ ఉండటం వల్ల అవి మెదడు ఆరోగ్యానికి బాగా సహాయపడతాయి. ✦ నిద్రను దూరం చేసే కెఫిన్‌ను పరిమితంగా తీసుకుంటూ మంచి నిద్ర అలవాట్లతో కంటినిండా నిద్రపోవడం అల్జైమర్స్ ముప్పును చాలావరకు తగ్గిస్తుంది. ✦ గుండె ఆరోగ్యం బాగుంటే మెదడు ఆరోగ్యమూ బాగుంటుంది. కీలకమైన ఈ రెండు అవయవాల ఆరోగ్యాలు ఒక దానితో మరొకటి ముడిపడి ఉంటాయి. అందుకే గుండె సంబంధిత (కార్డియో వాస్క్యులార్) సమస్యలైన హైబీపీ, డయాబెటిస్ , అధిక కొలెస్ట్రాల్ వంటి జబ్బులను అదుపులో పెట్టుకోవడం ద్వారా అల్జైమర్స్ ముప్పును చాలావరకు నివారించవచ్చు.

డిమెన్షియా కాలుష్యం కాటు

మామూలుగానైతే వాతావరణంలో వాయుకాలుష్యానికి కారణమయ్యే సస్పెండెడ్ ఎయిర్ పార్టికిల్స్ అనే ధూళి కణాల వల్ల సాధారణంగా శ్వాససంబంధిత వ్యాధులు, ఆస్తమా వంటివి పెరుగుతాయన్నది చాలామందిలో ఉండే అభిప్రాయం. కానీ వాతావరణంలో పెరిగే కొద్దిపాటి కాలుష్యం మెదడుపై ప్రభావం చూపి మతిమరుపునకు దారితీయవచ్చు. గాల్లోకి వ్యాపించే కొద్దిపాటి హానికరమైన ధూళికణాలు (టాక్సిక్ పార్టికిల్స్) ఏమాత్రం పెరిగినా అవి మతిమరపు (డిమెన్షియా) వచ్చే అవకాశాలను కనీసం 16 శాతం పెంచుతాయంటున్నారు అధ్యయనవేత్తలు. అలాగే అల్జైమర్స్ ముప్పునూ 11 శాతం వరకు పెంచవచ్చునంటున్నారు. ఈ విషయాలన్నింటినీ యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ (యూడబ్ల్యూ) అధ్యయనవేత్తలు గట్టిగా చెబుతున్నారు. నాడీవ్యవస్థకు సంబంధించిన ఇలాంటి రుగ్మతలను నివారించాలంటే వాతావరణంలో వాయువుల నాణ్యత తగ్గకుండా చూసుకోవడం తప్ప మరో దారి లేదంటున్నారు.

'అడల్ట్ ఛేంజెస్ ఇన్ థాట్ - (యాక్ట్)' అనే అధ్యయనం కోసం దాదాపు పాతికేళ్లకు పైగానే 'కైయిసర్ పర్మనెంట్ వాషింగ్టన్ హెల్త్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' వారు సేకరించిన డేటాపై ఆ మాతృసంస్థతో పాటు యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ (యూడబ్ల్యూ) పరిశోధకులు సంయుక్తంగా ఓ అధ్యయనం నిర్వహించారు. వాషింగ్టన్-సియాటెల్ ప్రాంతంలోని దాదాపు 4,000 మంది పరిశీలించినప్పుడు వాళ్లలో 1,000 పైగానే డిమెన్షియా రోగులు ఉన్నట్లు తేలింది. గాలిలోని హానికరమైన ధూళులు మతిమరపునకు కారణమయ్యే డిమెన్షియా, అల్జైమర్స్ జబ్బులు పెరుగుతాయని నిర్ద్వంద్వంగా తేలింది. అధ్యయనం నిర్వహించిన వారిలో నాలుగింట ఒక వంతు మందికి (దాదాపు 25 శాతం మందిలో) డిమెన్షియా ఉండటంతో ఇది కొంత ఆందోళన కలిగించే అంశంగా పరిశోధకులు పేర్కొంటున్నారు.

గాల్లోని అత్యంత సూక్ష్మమైన ధూళికణాలను 'ఫైన్ పార్టిక్యులేట్ మ్యాటర్' అంటారు. (ఈ ధూళికణాలు ఎంత చిన్నవంటే వీటి సైజు 2.5 మైక్రోమీటర్స్ మాత్రమే. ఒక పోలిక చెప్పాలంటే వెంట్రుకను నిలువునా 30 భాగాలు చేస్తే అందులో ఒక భాగం ఎంత సైజుంటుందో ఈ ధూళికణాల సైజు అంత ఉంటుంది). కారు ఎగ్జాస్ట్ నుంచి వెలువడే పొగ, భవన నిర్మాణ ప్రదేశాలు, మంటలూ, పొగలు ధారాళంగా వెలువడే ప్రదేశాలు... ఇలాంటి ప్రాంతాలనుంచి వెలువడే ఈ ఫైన్ పార్టిక్యులేట్ మ్యాటర్ వల్లనే వాతావరణం బాగా కలుషితమైపోయి డిమెన్షియా, అల్జైమర్స్ వంటి నాడీ సంబంధ వ్యాధుల ముప్పు పెరుగుతోందంటున్నారు అధ్యయనవేత్తలు. ఈ అంశాలన్నీ ఇటీవలే 'ద జర్నల్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ ప్రాస్పెక్టివ్స్'లో ప్రచురితమయ్యాయి.

ఈ అధ్యయనంతో... గాల్లోని కాలుష్యపదార్థాలను, ప్రమాదకరమైన ధూళికణాలను తగ్గిస్తే అటు శ్వాసకోశ వ్యాధులైన ఆస్తమా వంటివి వాటి నుంచి విముక్తి కలగడమే కాకుండా... ఇటు నాడీ వ్యవస్థకు సంబంధించిన మతిమరపూ, అల్జైమర్స్ వంటి సమస్యలూ తగ్గుతాయని స్పష్టమవుతోంది.

ఇటీవల డైనింగ్ టేబుల్స్ మీద ఉండే కిచెన్ వేర్‌లలో అందంగా కనిపించే ప్లాస్టిక్ బౌల్స్‌లో కూడా ఉంటున్నాయి. అందులో వేడివేడి కూరలూ, పులుసు, అన్నం వంటి ఆహారాలు తీసి ఉంచి వడ్డిస్తూ ఉండటం చాలా మంది ఇళ్లలో కనిపించేదే. పైకి అనేక డిజైన్లతో చాలా అందంగా కనిపించే ఈ బౌల్స్... అందులో ఉంచే ఆహారం విషయానికి వచ్చేటప్పటికి ఆరోగ్యానికి అంత మంచిది కాదని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది.

ప్లాస్టిక్ బౌల్‌లో ఆహారం ఎందుకు వద్దంటే..?

సాధారణంగా ఈ బౌల్స్‌ను 'మెలమైన్' అనే ప్లాస్టిక్ వంటి పదార్థంతో తయారు చేస్తారు. వేడి వేడి కూరలు, పులుసుల వంటి ఆహారపదార్థాలను ఇందులోకి తీయగానే ఆ వేడికి మెలమైన్... ఆహారంతో పాటు కలిసి నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుందనీ, దేహంలోకి ప్రవేశించే ఈ మెలమైన్ వల్ల మూత్రపిండాలకు సంబంధించిన అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఒక అధ్యయనంలో తేలింది.

అధ్యయనం నిర్వహించిన తీరిది...

ఈ అధ్యయనంలో భాగంగా కొంతమందికి మెలమైన్ బౌల్స్‌లో నూడుల్స్ ఇచ్చారు. మరికొందరికి పింగాణీ బౌల్స్‌లో ఇచ్చారు. ఈ రెండు గ్రూపుల వారికి చేసిన మూత్ర పరీక్షల్లో మెలమైన్ బౌల్స్‌లో తిన్నవారి మూత్రంలో మెలమైన్ మోతాదులు దాదాపు ఎనిమిది రెట్లు ఉన్నాయని తేలింది. ఫలితంగా వారిలో కిడ్నీఫెయిల్యూర్‌కు దారితీసే అవకాశంతో పాటు క్యాన్సర్ ప్రమాదమూ ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు చెబుతున్నాయి.



ఈ పని అస్సలు వద్దు...

మెలమైన్‌తో చేసిన వంటపాత్రలలో వేడి ఆహారాన్ని తీయడమే చాలా ప్రమాదకరమంటే కొందరు మెలమైన్ బౌల్‌లో పెట్టిన ఆహారాన్నీ మైక్రోవేవ్ ఒవెన్‌లో ఉంచి వేడిచేస్తుంటారు. ఇలా అస్సలు చేయకూడదని అమెరికన్ ప్రమాణాల సంస్థ ఎఫ్‌డీఏ గట్టిగా చెబుతోంది.

అనర్థాలేమిటంటే...

ఈ మెలమైన్ దుష్ప్రభావాలు ముఖ్యంగా హార్మోన్లపై... మరీ ముఖ్యంగా మహిళల్లోని ఈస్ట్రోజెన్ స్రావాలపై ఉంటాయి. దాంతో ప్రత్యుత్పత్తికి తోడ్పడే హార్మోన్ల సమతౌల్యతలలో తేడాలు వచ్చి గర్భధారణ సమస్యలు రావచ్చు. అలాగే పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, నాణ్యత, వీర్య కణాల కదలికలు తగ్గడం, పురుష హార్మోన్ల స్రావం తగ్గడం వంటివి జరగవచ్చు. ఇక చాలామందిలో డయాబెటిస్ ముప్పు పెరుగుతున్నట్లుగా ఇలాంటిదే మరో అధ్యయనంలో తేలింది. ఈ ప్లాస్టిక్ పాత్రలలో తింటున్నవారిలో స్థూలకాయం కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ వంటి క్యాన్సర్‌ల రిస్కులు చాలా ఎక్కువ. ప్లాస్టిక్ బౌల్స్‌లో వేడి వేడి ఆహారం పెట్టుకుని తీసుకునేవారిలో మెదడు కణాలు బలహీనమై జ్ఞాపకశక్తి తగ్గుతున్నట్లు, మూడ్స్ మారిపోవడం వంటి సమస్యలు వస్తున్నట్లు, అల్జైమర్స్ కేసులు కూడా పెరుగుతున్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. అందుకే కూరలు, పులుసుల వడ్డింపునకు ప్లాస్టిక్ బౌల్స్‌కు బదులు పింగాణీ బౌల్స్ మంచిదన్నది నిపుణుల మాట. ఈ పరిశోధనల ఫలితాలన్నీ 'జామా ఇంటర్నల్ మెడిసిన్' జర్నల్‌లోనూ ప్రచురితమయ్యాయి.

చిన్నారుల అరచేతులు, అరికాళ్లలో దురదలా?



కొంత మంది పిల్లల్లో అరచేతులు, అరికాళ్లలో దురదలు ఎక్కువగా వస్తుంటాయి. ఇలా వచ్చి తగ్గిపోవడం అన్నది చాలా మామూలు విషయమే. అయితే అలా కాకుండా మరికొంత మంది పిల్లల్లోనైతే అరచేతులు లేదా అరికాళ్లలో విపరీతంగా దురద రావడంతో పాటు అక్కడి చర్మం పొరలుగా ఊడిపోతుంటుంది. ఇది అంత ఆరోగ్యకరమైన విషయం కాదు. ఇలా జరగడానికి చాలా అంశాలు కారణమవుతుంటాయి.

కారణాలు...

సాధారణంగా పిల్లల్లో ఏవైనా ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు... మరీ ముఖ్యంగా వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చాక కొందరు చిన్నారుల్లో ఈ విధమైన లక్షణాలు కనిపిస్తుంటాయి. మొదట్లో అవి చాలా తీవ్రంగా కనిపించినా క్రమేపీ తగ్గిపోతాయి. ఇది చాలా సాధారణం. అలాగే ఎగ్జిమా వంటి మామూలు సమస్యలతో పాటు హైపర్‌కెరటోటిక్ పాల్మార్ ఎగ్జిమా, కెరటోలైసిస్ ఎక్స్‌ఫోలియేటా, ఎస్.ఎస్.ఎస్. సిండ్రోమ్, స్ట్రెస్ వంటి కొన్ని సిస్టమిక్ వ్యాధులు ఉన్నప్పుడూ, ఇక సోరియాసిస్, స్కార్లెట్ ఫీవర్‌లతోపాటు, కొన్నిసార్లు విటమిన్ లోపాలు... ఇలాంటి కారణాల వల్ల అరచేతుల్లో, అరికాళ్లలో దురదలు రావడంతో పాటు చర్మం పగలడం, ఊడిపోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చు.



డా॥ శివనారాయణరెడ్డి వెన్నపూస
సీనియర్ పీడియాట్రీషియన్

అంత ప్రమాదకరం కాదు గానీ...

పైన పేర్కొన్న సోరియాసిస్ వంటివి మినహాయిస్తే ఇలా చర్మం ఊడిపోతూ కొత్త చర్మం వచ్చే ఎగ్జిమా వంటి వాటితో పాటు... కొంత మంది చిన్నారుల్లో ఇన్ఫెక్షన్ వచ్చి తగ్గాక ఇలా అరచేతులు, అరికాళ్లలో సెకండరీ ఇన్ఫెక్షన్‌లాగా కూడా వచ్చే 'పోస్ట్ వైరల్ ఎగ్జింథిమా' అనే కండిషన్లు సాధారణంగా రెండు నుంచి మూడు వారాల్లో వాటంతట అవే పూర్తిగా తగ్గిపోతాయి. దాదాపుగా ఏమాత్రం ప్రమాదకరం కాదనే చెప్పవచ్చు.



ఈ జాగ్రత్తలు పాటించాలి...

ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నప్పుడు చేతులు తేమగా ఉంచుకోవడం (వెట్ సోక్స్), మాయిశ్చరైజింగ్ క్రీమ్స్ రాయడం వంటివి చేయాలి. జింక్ బేస్‌డ్ క్రీమ్స్ రాయడం వల్ల చాలావరకు ప్రయోజనం ఉంటుంది. లక్షణాల తీవ్రత మరింత ఎక్కువగా ఉన్నప్పుడు తక్కువ మోతాదు స్టెరాయిడ్స్ (మైల్డ్ స్టెరాయిడ్స్) వల్ల ఉపశమనం పొందవచ్చు. ఒకవేళ పైన పేర్కొన్న జాగ్రత్తల తర్వాత కూడా తగ్గకపోయినా, చేతులు, కాళ్లకు ఇన్ఫెక్షన్ వచ్చినా, లక్షణాలు మరీ తీవ్రతరమవుతున్నా పీడియాట్రీషియన్ లేదా డెర్మటాలజిస్ట్‌ను సంప్రదించాలి.

గౌట్ నివారణ కోసం కొన్ని ఆహార నియమాలు...



కీళ్ల మధ్య యూరిక్ యాసిడ్ రాయిగా ఏర్పడి... అందులోనూ ముఖ్యంగా బొటనవేలి ఎముకల మధ్యగానీ, మోకాలి దగ్గరగానీ రాపిడి కలిగిస్తూ ఎంతో నొప్పిని, ఇబ్బందినీ కలిగించే వ్యాధి గౌట్. గౌట్‌ను నివారించేవి లేదా వచ్చాక అనుసరించాల్సిన ఆహార నియమాలివి...

● మాంసాహారం ముఖ్యంగా వేటమాంసం (రెడ్‌మీట్), పోర్క్, సీ ఫుడ్స్ లాంటి ఎక్కువ క్యాలరీలు ఇచ్చే ఆహారం (హై క్యాలరీ డైట్) బాగా తగ్గించాలి. ● మద్యం, మాంసాహారంలో ఉండే ప్యూరిన్స్ అనే వ్యర్థ పదార్థాల వల్ల గౌట్ వస్తుంది కాబట్టి మద్యానికి పూర్తిగా దూరంగా ఉండాలి. ● స్వీట్స్, సాఫ్ట్‌డ్రింక్స్, ఆలూ (పొటాటోస్), ఐస్‌క్రీమ్స్‌లోని కొన్ని పదార్థాల వల్ల రక్తంలో యూరిక్ యాసిడ్ పెరిగే అవకాశం ఉంది కాబట్టి వాటికి దూరంగా ఉండాలి. ● పాలు, మజ్జిగ వంటి డైరీ ఉత్పాదనలు రక్తంలో యూరిక్ యాసిడ్ పాళ్లను తగ్గిస్తాయి. కాబట్టి అవి ఎక్కువగా తీసుకోవాలి. ● విటమిన్ సీ సమృద్ధిగా ఉండే పండ్లు కూరగాయలు యూరిక్ యాసిడ్‌ను తగ్గిస్తాయి. ● చెర్రీ పండ్లు కూడా యూరిక్ యాసిడ్ మోతాదులను నియంత్రించేందుకు బాగా ఉపయోగపడతాయి. ● పొట్టు తీయని బియ్యం (బ్రౌన్ రైస్), ఓట్స్ గౌట్ నివారణకు బాగా పనిచేస్తాయి. ● ఆకుపచ్చరంగులో ఉండి యాంటీ ఆక్సిడెంట్స్‌ను కలిగి ఉండే వెజిటబుల్స్ (ముఖ్యంగా బ్రాకలీ వంటివి) తీసుకోవడం వల్ల అవి గౌట్‌ను సమర్థంగా నివారించగలవు.

అన్ని వయసుల వారికీ

అమోదయోగ్యమైన నడక ఎంత?

వాకింగ్ నిర్ద్వంద్వంగా అందరికీ మేలు చేసే వ్యాయామం. పైగా అది ఎవరైనా చేయగలిగే చాలా తేలికైన ఎక్సర్‌సైజ్. పైగా దీనికి ఎలాంటి వ్యాయామం ఉపకరణాలూ, పరికరాలూ అక్కర్లేదు. వ్యాయామం చేయగలిగే ఏ వయసు వారైనా అలాగే మహిళలైనా, పురుషులైనా వాకింగ్ చేయాల్సిన సగటు దూరమెంతో, ఎంత నడిస్తే దేహం మీద దాని ప్రభావం పడి, మంచి ఆరోగ్యం సమకూరుతుందో లెక్కలు వేశారు యూఎస్‌కు చెందిన సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) వారి సిఫార్సుల ప్రకారం రోజుకు ఎనిమిది కిలోమీటర్లు మంచిదని చెబుతున్నారు. (వాళ్ల లెక్కల ప్రకారం 5 మైళ్లు).

ఇక ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) చెబుతున్న ప్రకారం వారానికి 150 నిమిషాల పాటు నడక గానీ లేదా ఏరోబిక్స్‌గానీ చేయడం మంచిది. నడక అయితే రోజుకు 30 నిమిషాల పాటు బ్రిస్క్ వాక్ చేస్తూ వారంలో కనీసం ఐదు రోజుల పాటైనా ఈ వ్యాయామం చేయాలి. ఇలా చేస్తే రోజులో కనీసం 4 నుంచి 5 కిలోమీటర్లు నడవడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలన్నది డబ్ల్యూహెచ్‌వో లెక్క. ఏ లెక్కలు ఎలా ఉన్నా... ఎత్తుకు తగినట్లుగా బరువు తగ్గి, మంచి ఫిట్‌నెస్ సాధించడం కోసం అందరూ రోజూ ఆరు నుంచి ఎనిమిది కిలోమీటర్లు నడవాలని పలు ఆరోగ్య సంస్థల అధ్యయనాల్లో తేలింది. దీనివల్ల గరిష్ఠమైన ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయన్నది ఆ అధ్యయనాల మాట.

ఇది అందరి లెక్క అయినప్పుడు అందరూ ఇన్ని దూరాలు నడవగలరా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది కదా...

ఈ ప్రశ్న వచ్చినప్పుడు నడక వల్ల కలిగే వేర్వేరు ఆరోగ్య ప్రయోజనాలే సమాధానాలుగా నిలుస్తాయంటున్నాయి ఆరోగ్య పరిశోధక సంస్థలు. నడక వల్ల ఒత్తిడి తగ్గడం, మూడ్స్ మెరుగుపడటం, శక్తి

అసలు ఎందుకు నడవాలి?

సామర్థ్యాలు పెరగడం, బరువు తగ్గడం, కండరాలు బలంగా మారడం, కీళ్ల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు వాటికి అవసరమైన పోషకాలు అందడం, వాటి ఫ్లెక్సిబిలిటీ పెరగడంతో పాటు మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయంటున్నారు నిపుణులు.



దీనికి సమాధానమిస్తూ టీనేజ్‌లో ఉన్న పిల్లలు, యువత చాలా వేగంగా ఆరు నుంచి ఎనిమిది కిలోమీటర్లు దూరాలు నడవాలనీ, అయితే మధ్యవయస్కులు మొదలు కాస్త వయసు ఎక్కువగా ఉన్నవారు నెమ్మదిగా నడవాలని సూచిస్తున్నారు. మరీ ఎక్కువ వయసుతో వృద్ధాప్యంలో ఉన్నవారు మాత్రం రోజూ 2 నుంచి 4 కిలోమీటర్లు నడిస్తే చాలన్నది ఆ అధ్యయన సంస్థల సూచన.



ఇక ఆరు నుంచి పదిహేడేళ్ల వరకు ఉన్న చిన్నారులు రోజుకు కనీసం 60 నిమిషాల పాటైనా వేగంతో కూడిన నడక లేదా కాస్త శ్రమ కలిగించే వ్యాయామాలు చేయాలంటున్నారు.

బిజినెస్ రీల్

ఒలెక్ట్రాకు హిమాచల్ ఆర్టీసీ ఆర్డర్!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్‌ల తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌టీసీ) టెండర్లలో లోయెస్ట్ బిడ్డర్‌గా నిలిచింది. హెచ్‌ఆర్‌టీసీ 327 విద్యుత్ బస్సుల కొనుగోలుకు ఇటీవల టెండర్లు పిలిచింది. ఇందులో తొమ్మిది మీటర్ల బస్సులు 297, అలాగే 12 మీటర్ల బస్సులు 30 ఉన్నాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌తోపాటు స్విచ్ మొబిలిటీ సైతం సాంకేతిక పరీక్షల్లో అర్హత సాధించింది. అయితే తక్కువ ధర కోట్ చేసిన ఒలెక్ట్రా ఎల్1గా నిలిచింది. హెచ్‌ఆర్‌టీసీ 2017 సెప్టెంబరులో ఎలక్ట్రిక్ బస్‌లను తొలిసారి కొనుగోలు చేసింది. ఒలెక్ట్రా ఆ సమయంలో 25 బస్‌లను విక్రయించింది.

నెస్లే ఇండియాకు కొత్త సారథి

- కొత్త ఎండీగా మనీష్ తివారీ
- సురేష్ నారాయణన్ పదవీ విరమణ

న్యూఢిల్లీ: బహుళజాతి ఎఫ్‌ఎంసీజీ సంస్థ నెస్లే ఇండియా తన తదుపరి ఎండీగా మనీష్ తివారీని నియమించుకుంది. 26 ఏళ్లుగా నెస్లే ఇండియాతో ప్రయాణం చేస్తున్న సురేష్ నారాయణన్ వచ్చే ఏడాది జూలై 31న పదవీ విరమణ తీసుకోనున్నారు. అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్‌గా ఉన్న తివారీ 2025 ఆగస్ట్ 1 నుంచి నెస్లే ఇండియా ఎండీ బాధ్యతలు చేపడతారని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారం ఇచ్చింది. తివారీ నియామకానికి మాతృ సంస్థ నెస్లే ఎస్ఏ నుంచి ఆమోదం లభించినట్టు తెలిపింది. ఈ ప్రతిపాదన నియంత్రణ సంస్థల ఆమోదంపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. అమెజాన్ డిజిటల్ సర్వీసెస్, మోర్ కన్స్యూమర్ బ్రాండ్‌కు తివారీ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ నెల 30తో ఈ బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. ఐఐఎం బెంగళూరు పూర్వ విద్యార్థి అయిన తివారీకి ఈ కామర్స్, కన్స్యూమర్ గూడ్స్‌లో సుదీర్ఘ అనుభవం ఉంది. యూనిలీవర్‌లో 20 ఏళ్లపాటు పనిచేసిన అనంతరం 2016లో అమెజాన్‌లో చేరారు.

సెయిల్, బీహెచ్‌పీ మధ్య ఒప్పందం

న్యూఢిల్లీ: స్టీల్ తయారీలో కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు వీలుగా అవసరమైన సాంకేతికతల కోసం బీహెచ్‌పీతో ప్రభుత్వరంగ ఉక్కు సంస్థ సెయిల్ కలసి పనిచేయనుంది. ఈ మేరకు ఇరు కంపెనీలు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ''భారత్‌లో బ్లాస్ట్ ఫర్నేస్ కోసం తక్కువ కర్బనాలు విడుదలయ్యే స్టీల్ తయారీ టెక్నాలజీ మార్గాలను ప్రోత్సహించే దిశగా ఈ ఒప్పందం కీలక అడుగు''అని సెయిల్ ప్రకటించింది. స్టీల్ తయారీలో సుస్థిర విధానాలను అభివృద్ధి చేసేందుకు బీహెచ్‌పీతో సహకారం ముందడుగు అని సెయిల్ చైర్మన్ అమరేందు ప్రకాష్ వ్యాఖ్యానించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-10-2024	
విశాఖ	525-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	7,489.90	1.86
M&M	3,062.00	1.48
BHARTIARTL	1,662.60	1.32
ITC	510	1.28
BAJFINANCE	7,260.00	0.67

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,353.00	-4.29
BEL	267.4	-3.54
ADANIENT	3,011.00	-3.2
COALINDIA	481.4	-3.18
NTPC	417.1	-3.1

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,511
ఎన్ఎస్ఈ	1,27,527
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,00,437
ఎఫ్ఐఐ	- 8,293
డీఐఐ	+ 13,245

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	77.28	$ 74.38
బ్రెంట్	81.00	$ 78.05

హైడెల్‌బర్గ్ సిమెంట్‌పై అదానీ కన్ను!

- దేశీ బిజినెస్ కొనుగోలుకు చర్చలు!
- 52 వారాల గరిష్టానికి హైడెల్‌బర్గ్ షేరు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ గ్రూప్ అదానీ.. తాజాగా హైడెల్‌బర్గ్ సిమెంట్ ఇండియాపై కన్నేసింది. జర్మన్ దిగ్గజం హైడెల్‌బర్గ్ మెటీరియల్స్ దేశీ అనుబంధ సంస్థ హైడెల్‌బర్గ్ సిమెంట్ కొనుగోలుకు అదానీ గ్రూప్ చర్చలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో హైడెల్‌బర్గ్ సిమెంట్ ఇండియా షేరు తొలుత ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో 18 శాతం దూసుకెళ్లింది. రూ.258 వద్ద 52 వారాల గరిష్టాన్ని తాకింది. చివరికి 4 శాతం లాభంతో రూ. 227 వద్ద ముగిసింది. చర్చలు సఫలమైతే హైడెల్‌బర్గ్ ఇండియాను బిలియనీర్ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ గ్రూప్ దిగ్గజం అంబుజా సిమెంట్స్ సొంతం చేసుకునే వీలున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 1.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 10,000 కోట్లు) విలువలో డీల్ కుదరవచ్చని అంచనా వేశాయి. అయితే అంబుజా సిమెంట్స్ షేరు ఎన్ఎస్ఈలో 3.3 శాతం క్షీణించి రూ. 591 వద్ద ముగిసింది.

2006లో షురూ

హైడెల్‌బర్గ్ సిమెంట్ ఏజీ 2006లో భారత్‌లోకి ప్రవేశించింది. మైసూర్ సిమెంట్, కొచ్చిన్ సిమెంట్, ఇండోరమా సిమెంట్‌తో ఏర్పాటైన జేవీలను కొనుగోలు చేయడం ద్వారా కార్యకలాపాలు ప్రారంభించింది. వ్యాపార పునర్వ్యవస్థీకరణ, విస్తరణల తదుపరి 5.5 మిలియన్ టన్నులకు స్థాపిత సిమెంట్ సామర్థ్యాన్ని చేర్చుకుంది. 2016లో ఇటల్ సిమెంటి కొనుగోలుతో కార్యకలాపాలను రెట్టింపునకు పెంచుకుంది. ప్రస్తుతం నాలుగు సమీకృత సిమెంట్ తయారీ, గ్రైండింగ్ యూనిట్లను కలిగి ఉంది. స్థాపిత సామర్థ్యం 14 మిలియన్ టన్నులకు ఎగసింది. మైసెమ్, జువారీ బ్రాండ్లతో 12 రాష్ట్రాలలో విస్తరించింది.

లుఫ్తాన్సా టెక్నిక్‌తో జీఎంఆర్ ఏరో టెక్నిక్ జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో ఇంజిన్ కోర్ వాష్ సర్వీస్‌కు సంబంధించి సరికొత్త ప్రమాణాలు నెలకొల్పేలా లుఫ్తాన్సా టెక్నిక్‌తో జట్టు కట్టినట్లు జీఎంఆర్ ఏరో టెక్నిక్ తెలిపింది. ఈ భాగస్వామ్య ఒప్పందం కింద లుఫ్తాన్సా అభివృద్ధి చేసిన టెక్నాలజీతో బెంగళూరులోని కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఇంజిన్ కోర్ వాష్ సర్వీసులను చేపట్టనున్నట్లు వివరించింది. ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో వీటిని ప్రారంభించనున్నట్లు సంస్థ తెలిపింది. ఈ విభాగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి లుఫ్తాన్సా టెక్నిక్‌తో భాగస్వామ్యం తోడ్పడగలదని జీఎంఆర్ ఏరో టెక్నిక్ తెలిపింది. మరోవైపు, తమ గ్లోబల్ నెట్‌వర్క్‌ను విస్తరించడానికి ఈ ఒప్పందం ఉపయోగపడగలదని లుఫ్తాన్సా టెక్నిక్ ఇంజిన్ లైఫ్ సైకిల్స్ సర్వీసెస్ హెడ్ ఫెలిక్స్ వాండ్ తెలిపారు. వినూత్న టెక్నాలజీ వల్ల సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే నీటి వినియోగం 50 శాతం తగ్గనుండగా, 45 నిమిషాల్లోనే వాష్ పూర్తవుతుంది.

రేటు తగ్గిద్దామా? వద్దా?

- ఆర్‌బీఐ కీలక పాలసీ సమావేశం ప్రారంభం
- 9వ తేదీన నిర్ణయాల ప్రకటన



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమావేశం సోమవారం ప్రారంభమైంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలుచేసే వడ్డీరేటు–రెపో (ప్రస్తుతం 6.5 శాతం)ను తగ్గించాలా? వద్దా అన్న నిర్ణయంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనుంది. కమిటీ తీసుకునే నిర్ణయాలను గవర్నర్ శక్తికాంతదాస్ ఈ నెల 9వ తేదీన వివరిస్తారు.

యథాతథ స్థితికే వోటు..!

అయితే కమిటీ రేటు యథాతథ స్థితికే వోటు చేయవచ్చన్నది నిపుణుల అంచనా. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం, దీనితో పొంచిఉన్న ద్రవ్యోల్బణం భయాలు దీనికి ప్రధాన కారణం. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంకులు సరళతర రేటు విధానాన్ని అనుసరిస్తున్నప్పటికీ దేశీయ ధోరణుల దృష్ట్యా ఆర్‌బీఐ ఆ తరహా నిర్ణయాలు తీసుకోకపోవచ్చని నిపుణుల అంచనా. 2023 ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ యథాతథ 6.5 శాతం రెపో రేటును కొనసాగిస్తోంది. పరిస్థితులు అనుకూలిస్తే, డిసెంబర్‌లో జరిగే ద్వైమాసిక సమావేశంలో రేటు తగ్గింపు ఉండవచ్చన్న విశ్లేషణ.

భేటీలో ముగ్గురు కొత్త సభ్యులు

ఆర్‌బీఐ తాజా ద్రవ్య పరపతి విధాన కమిటీని ప్రభుత్వం ఈ నెలారంభంలో పునర్వ్యవస్థీకరించిన సంగతి తెలిసిందే. ఎక్స్‌టర్నల్ సభ్యులుగా రామ్ సింగ్, సౌగత భట్టాచార్య, నగేష్ కుమార్‌లను కేంద్ర ఈ నెల ప్రారంభంలో నియమించింది. పదవీ కాలం ముగిసిన అషిమా గోయల్, శశాంక భిడే, జయంత్ ఆర్ వర్మ స్థానంలో వీరి నియామకం జరిగింది. గత ద్వైమాసిక సమావేశాల్లో అషిమా గోయల్, జయంత్ ఆర్ వర్మలు రేటు తగ్గింపునకు వోటు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా నియమితులయిన వారితో పాటు కమిటీలో అంతర్గత (ఆర్‌బీఐ తరఫున) సభ్యులుగా గవర్నర్ శక్తికాంతదాస్, డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్‌బీఐ పరపతి విధాన విభాగం) రాజీవ్ రంజన్‌లు ఉన్నారు.

ద్రవ్యోల్బణం భయాల తీరు ఇదీ..

రిటైల్ ద్రవ్యోల్బణం రెండు నెలలుగా పూర్తిగా అదుపులోనికి వచ్చినప్పటికీ, రేటు తగ్గింపునకు తొందరపడబోమని గవర్నర్ శక్తికాంతదాస్ ఇటీవలే పేర్కొన్నారు. ఈ దిశలో (రేటు తగ్గింపు) నిర్ణయానికి ఇంకా చాలా దూరం ఉందని ఆయన అన్నారు. ఇటీవల ద్రవ్యోల్బణ తగ్గుదల బేస్ ఎఫెక్ట్‌యే కారణమని విశ్లేషకుల అభిప్రాయం.

ఐపీవోకు హీరో మోటార్స్ నో

ప్రాస్పెక్టస్ ఉపసంహరణ



న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల సంస్థ హీరో మోటార్స్ కంపెనీ(హెచ్‌ఎంసీ) పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి దాఖలు చేసిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను తాజాగా ఉపసంహరించుకుంది. ఐపీవో ద్వారా రూ. 900 కోట్లు సమీకరించాలని తొలుత భావించింది. ఇందుకు అనుగుణంగా సెబీకి ఆగస్ట్‌లో ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయడంతోపాటు.. మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ చేసేందుకు ప్రమోటర్లు ఆసక్తి చూపారు. అయితే కారణం వెల్లడించకుండానే ప్రాస్పెక్టస్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు కంపెనీ తాజాగా తెలియజేసింది. ఐపీవోలో ఓపీ ముంజాల్ హోల్డింగ్స్ రూ. 250 కోట్లు, హీరో సైకిల్స్, భాగ్యోదయ్ ఇన్వెస్ట్‌మెంట్స్ రూ. 75 కోట్లు చొప్పున షేర్లను ఆఫర్ చేయాలని భావించాయి. కంపెనీ ప్రధానంగా ఆటోమోటివ్ దిగ్గజాలకు హైఇంజినీర్డ్ పవర్‌ట్రయిన్ సొల్యూషన్ల తయారీ, సరఫరాలో ఉంది.

సురక్షా డయాగ్నోస్టిక్ రెడీ

సమీకృత డయాగ్నోస్టిక్ సేవల కంపెనీ సురక్షా డయాగ్నోస్టిక్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు వీలుగా జులైలోనే ప్రాథమిక పత్రాలను సెబీకి దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా 1.92 కోట్ల ఈక్విటీ షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీ జులైలో చేపట్టేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ముసాయిదా ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవో నిధులు కంపెనీ ప్రమోటర్లు, వాటాదారులకు అందనున్నాయి. వెరసి కంపెనీకి ఐపీవో నిధులు లభించవు. కంపెనీ పాథాలజీ, రేడియాలజీ టెస్టింగ్, మెడికల్ కన్సల్టేషన్ సర్వీసులు అందిస్తోంది.

డీలర్ల వద్ద 7.9 లక్షల యూనిట్ల వాహనాలు

గరిష్ట స్థాయికి పేరుకున్న నిల్వలు

- వీటి విలువ రూ.79,000 కోట్లు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఎఫ్ఏడీఏ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డీలర్ల వద్ద ప్యాసింజర్ వాహన నిల్వలు సహజం. ప్రస్తుతం ఉన్న 80–85 రోజుల ఇన్వెంటరీ స్థాయి ఆందోళన కలిగిస్తోందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) చెబుతోంది. దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 7.9 లక్షల యూనిట్ల ప్యాసింజర్ వాహనాల నిల్వలు పేరుకుపోయాయంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అవగతమవుతోంది. వీటి విలువ ఏకంగా రూ.79,000 కోట్లు అని ఫెడరేషన్ వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే సెప్టెంబర్ నెలలో ప్యాసింజర్ వాహనాల రిటైల్ విక్రయాలు 19 శాతం క్షీణించి 2,75,681 యూనిట్లకు వచ్చి చేరాయి. టూవీలర్స్ అమ్మకాలు 8 శాతం తగ్గి 12,04,259 యూనిట్లుగా ఉంది. త్రిచక్ర వాహనాలు స్వల్పంగా పెరిగి 1,06,524 యూనిట్లు నమోదయ్యాయి. వాణిజ్య వాహనాల అమ్మకాలు 10 శాతం పడిపోయి 74,324 యూనిట్లకు వచ్చి చేరాయి. ట్రాక్టర్లు 15 శాతం దూసుకెళ్లి 74,324 యూనిట్లను తాకాయి. ఇక అన్ని విభాగాల్లో కలిపి రిజిస్ట్రేషన్స్ 18,99,192 నుంచి 9 శాతం క్షీణించి 17,23,330 యూనిట్లకు పడిపోయాయి.

ఇది చివరి అవకాశం..

'శ్రద్ధ, పితృపక్షం వంటి కాలానుగుణ కారకాలు, భారీ వర్షపాతం, మందగించిన ఆర్థిక వ్యవస్థ పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయి. గణేష్ చతుర్థి, ఓనం వంటి పండుగలు ప్రారంభమైనప్పటికీ పరిశ్రమ పనితీరు చాలా వరకు నిలిచిపోయిందని డీలర్లు పేర్కొన్నారు' అని ఫెడరేషన్ ప్రెసిడెంట్ సి.ఎస్. విఘ్నేశ్వర్ తెలిపారు. మరింత ఆలస్యం కాకముందే మార్కెట్ పునరుద్ధరణకు మద్దతు ఇవ్వడానికి తయారీ సంస్థలకు ఇది చివరి అవకాశం అని అన్నారు. అదనపు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కోకుండా నిరోధించడానికి డీలర్ నమ్మతి, వాస్తవ పూచీకత్తు ఆధారంగా మాత్రమే కఠినమైన ఛానల్ ఫండింగ్ విధానాలను తప్పనిసరి చేస్తూ బ్యాంకులకు సలహా జారీ చేయాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్‌ను ఫెడరేషన్ కోరిందన్నారు.

ఫలితం అనిశ్చితంగానే..

డీలర్లు, తయారీ సంస్థలు పండుగలకు బలమైన అమ్మకాలు ఉంటాయని భావిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ మార్కెట్లలో సానుకూల నగదు ప్రవాహం, మెరుగైన వ్యవసాయ పరిస్థితులు డిమాండ్‌ను పెంచుతాయని ఆశించినప్పటికీ ఫలితం అనిశ్చితంగానే ఉందని ఫెడరేషన్ తెలిపింది. అదనపు ఇన్వెంటరీని క్లియర్ చేయడానికి, 2024–25 ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలానికి సానుకూల వృద్ధి పథాన్ని నడపడానికి విజయవంతమైన అక్టోబర్ చాలా అవసరమని పేర్కొంది. ఊహించిన విక్రయాలు కార్యరూపం దాల్చకపోతే కొత్త సంవత్సరంలోకి వెళ్లే క్రమంలో డీలర్లతోపాటు తయారీ సంస్థలను కూడా కష్టతర స్థితిలో ఉంచి, నిరాశావాదానికి దారితీయవచ్చు అని వివరించింది.

30 కోట్లకు విమాన ప్రయాణికులు

- 2030 నాటికి కేంద్రం అంచనాలు
- ఎయిర్‌పోర్టుల అభివృద్ధిపై 11 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: ఈ దశాబ్దం ఆఖరు నాటికి (2030) దేశీయంగా విమాన ప్రయాణికుల సంఖ్య 30 కోట్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయాలను అభివృద్ధి చేసేందుకు సుమారు 11 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఫ్రెంచ్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (జీఐఎఫ్ఏఎస్) సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు. అత్యంత వేగంగా ఎదుగుతున్న సివిల్ ఏవియేషన్ మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, పెరుగుతున్న డిమాండ్‌కి అనుగుణంగా ఎయిర్‌లైన్స్ కూడా తమ విమానాల సంఖ్యను పెంచుకుంటున్నాయని తెలిపారు. ప్రస్తుతం దేశీయంగా 157 విమానాశ్రయాలు, హెలిపోర్ట్‌లు, వాటర్‌డ్రోమ్‌లు ఉన్నాయని చెప్పారు. వినియోగంలో ఉన్న ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్య 2025 ఆఖరు నాటికి 200కి పెరగవచ్చని పేర్కొన్నారు. వచ్చే 20–25 ఏళ్లలో మరో 200 విమానాశ్రయాలను అభివృద్ధి చేసే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పర్యావరణ అనుకూల విమాన ఇంధన సరఫరా వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దడంపై భారత్, ఫ్రాన్స్ కలిసి పని చేయొచ్చని ఆయన తెలిపారు.

భారత్ నుంచి మరింతగా కొనుగోళ్లు: ఎయిర్‌బస్

భారత మార్కెట్ నుంచి విడిభాగాల కొనుగోళ్లను మరింతగా పెంచుకోనున్నట్లు ఎయిర్‌బస్ సీఈవో గిలామీ ఫారీ తెలిపారు. 2019–2024 మధ్య కాలంలో భారత్ నుంచి సర్వీసులు, విడిభాగాల కొనుగోళ్లను రెట్టింపు స్థాయిలో 1 బిలియన్ యూరోలకు పెంచుకున్నట్లు వివరించారు. తమకు ఇక్కడ 100కు పైగా సరఫరాదారులు ఉన్నట్లు జీఐఎఫ్ఏఎస్‌లో పాల్గొన్న సందర్భంగా ఫారీ చెప్పారు. జీఐఎఫ్ఏఎస్‌లో భాగమైన కంపెనీలు భారత్ నుంచి ఏటా 2 బిలియన్ డాలర్ల పైగా కొనుగోళ్లు జరుపుతున్నాయని పేర్కొన్నారు. ఎయిర్‌బస్‌కు 8,600 విమానాల ఆర్డర్ బుక్ ఉండగా, ఈ ఏడాది 770 ప్లేన్లను ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. దేశీయంగా ఇండిగో, ఎయిరిండియా కలిసి 1,000కి పైగా విమానాల కోసం ఆర్డరు ఇచ్చాయి.

భారత్-యూఏఈ మధ్య 'ఫుడ్ కారిడార్'

- కేంద్ర మంత్రి గోయల్ ప్రకటన
- 2 బిలియన్ డాలర్ల పెట్టుబడి
- దేశ రైతులకు మెరుగైన ఆదాయానికి వెసులుబాటు
- ఉపాధి అవకాశాలకూ బూస్ట్



భారత్-యూఏఈ టాస్క్‌ఫోర్స్ 12వ సమావేశం అనంతరం మీడియాతో మంత్రి గోయల్ తదితరులు

ముంబై: భారత్-యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ (యూఏఈ) దాదాపు రెండు బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఫుడ్ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నాయి. ఈ క్యారిడార్ యూఏఈ ఆహార అవసరాలను తీర్చడంతోపాటు, అంతకు మించి భారతీయ రైతులకు అధిక ఆదాయాన్ని సంపాదించడానికి, దేశంలో మరిన్ని ఉద్యోగాలను సృష్టించడానికి సహాయపడుతుందని కేంద్ర మంత్రి పియుష్ గోయల్ తెలిపారు. పెట్టుబడులపై భారత్-యూఏఈ అత్యున్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ 12వ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా విలేకరులతో గోయల్ ఈ విషయాలు చెప్పారు. ఈ సమావేశానికి గోయల్‌తో పాటు అబుధాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ ఎండీ షేక్ హమీద్ బిన్ జాయెద్ అల్ నాహ్యాన్ కో–చెయిర్‌గా వ్యవహరించారు. స్థానిక కరెన్సీలో ద్వైపాక్షిక వాణిజ్యంతో పాటు వర్చువల్ ట్రేడ్ కారిడార్ పనులు, అహ్మదాబాద్‌లో ఫుడ్ పార్క్ ఏర్పాటు మొదలైన అంశాలపై ఇందులో చర్చించారు. ఈ సందర్భంగా గోయల్ ఏమి చెప్పారంటే...

- → రెండు దేశాల మధ్య ఫుడ్ కారిడార్ స్థాపనను ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు– యూఏఈతో కూడిన చిన్న వర్కింగ్ గ్రూప్ కూడా ఇప్పటికే ఏర్పాటయ్యింది.
- → భారతదేశంలో ఫుడ్ పార్కుల ఏర్పాటు గురించి చర్చించిన అంశాల్లో మరొకటి. ఇప్పటికే ఈ విషయంలో కొంత పురోగతి జరిగింది. రైతులకు అధిక ఆదాయంతోపాటు లక్షలాది మందికి ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఉద్యోగాలు కల్పించడానికి సహాయపడే అంశమిది. అలాగే యూఏఈ ఆహార భద్రతకు కూడా దోహదపడుతుంది.
- → ఫుడ్ క్యారిడార్ పెట్టుబడి వచ్చే రెండున్నరేళ్ల కాలంలో జరుగుతుందని అంచనా.
- → యూఏఈకి అనువైన అధిక నాణ్యతా ఉత్పత్తుల లభ్యత కోసం దేశంలో యూఏఈ భారీ పెట్టుబడులతో ఫుడ్ ప్రాసెసింగ్ సదుపాయాలను మెరుగుపరచాలన్నది గత ఎంతోకాలంగా చర్చిస్తున్న అంశం. ఇది ఇప్పుడు వాస్తవ రూపం దాల్చుతోంది.
- → తాజా పరిణామంతో దేశీయ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమతో ఇతర గల్ఫ్ మార్కెట్లూ అనుసంధానమయ్యే అవకాశం ఉంది.

దుబాయ్‌లో ఇన్వెస్ట్ ఇండియా కార్యాలయం

భారత్‌లో పెట్టుబడులు చేయదల్చుకునే మదుపర్లకు సహాయకరంగా ఉండేలా దుబాయ్‌లో ఇన్వెస్ట్ ఇండియా కార్యాలయాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు పియుష్ గోయల్ ఈ సందర్భంగా తెలిపారు. అలాగే, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్‌కి (ఐఐఎఫ్‌టీ) సంబంధించి విదేశాల్లో తొలి క్యాంపస్‌ను కూడా దుబాయ్‌లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో (యూఏఈ) నివసించే 35 లక్షల మంది భారతీయులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

100 కోట్ల స్పామ్ కాల్స్‌కు ఎయిర్‌టెల్ చెక్

- యాంటీ స్పామ్ టెక్నాలజీ సంచలనం
- 97 శాతం తగ్గిన స్పామ్ కాల్స్
- ఎస్ఎంఎస్‌లు 99.5 శాతం కట్టడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో తొలిసారిగా అందుబాటులోకి వచ్చిన యాంటీ స్పామ్ టెక్నాలజీ (ఏఎస్‌టీ) సంచలనం సృష్టిస్తోందని టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ తెలిపింది. ఏఎస్‌టీ వినియోగంలోకి వచ్చిన మొదటి 10 రోజుల్లో దేశవ్యాప్తంగా కంపెనీ 100 కోట్ల స్పామ్ కాల్స్‌ను గుర్తించి కస్టమర్లను హెచ్చరించింది. స్పామ్ కాల్, ఎస్ఎంఎస్‌ను విశ్లేషించి కస్టమర్‌ను అప్రమత్తం చేయడం ఈ టెక్నాలజీ ప్రత్యేకత. 2 మిల్లీ సెకన్లలో ఈ సొల్యూషన్ 150 కోట్ల సందేశాలను, 250 కోట్ల కాల్స్‌ను ప్రాసెస్ చేస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 12.2 కోట్ల స్పామ్ కాల్స్, 23 లక్షల స్పామ్ సందేశాలను గుర్తించినట్టు ఎయిర్‌టెల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ సర్కిల్ సీఈవో శివన్ భార్గవ సోమవారమిక్కడ మీడియాకు తెలిపారు. స్పామ్ కాల్స్ 97 శాతం, స్పామ్ ఎస్ఎంఎస్‌లు 99.5 శాతం తగ్గాయని వెల్లడించారు. దేశవ్యాప్తంగా 20 లక్షల స్పామర్స్‌ను గుర్తించినట్టు పేర్కొన్నారు. ఏఎస్‌టీ ఖచ్చితత్వం 97 శాతం ఉందన్నారు.


మీడియా సమావేశంలో శివన్ భార్గవ

నాల్గవ స్థానంలో భారత్..

స్పామ్ కాల్స్ సంఖ్య పరంగా భారత్ ప్రపంచంలో నాల్గవ స్థానంలో ఉందని శివన్ భార్గవ వెల్లడించారు. 'ప్రపంచవ్యాప్తంగా స్పామ్ కాల్స్ కారణంగా ఏడాదిలో 3 బిలియన్ డాలర్ల విలువైన బ్యాంకు మోసాలు నమోదయ్యాయి. 2024 ఏప్రిల్–జూలై మధ్య భారత్‌లో రూ.1,720 కోట్ల విలువైన మోసాలు జరిగాయి. సైబర్ సంబంధ మోసాలపై నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో (ఎన్‌సీఆర్‌పీ) ప్రతిరోజు సుమారు 7,000 ఫిర్యాదులు నమోదవుతున్నాయి. దేశంలో 60 శాతం మంది మొబైల్ యూజర్లకు రోజులో కనీసం మూడు స్పామ్ కాల్స్ వస్తున్నాయి. 87 శాతం మంది అవాంఛిత ఎస్ఎంఎస్‌లు అందుకుంటున్నారు. స్పామ్ ముప్పుకు పరిష్కారం కోసం ఏడాదిగా శ్రమించి ఏఎస్‌టీని సొంతంగా అభివృద్ధి చేశాం. 100 మందికిపైగా డేటా సైంటిస్టులు నిమగ్నమయ్యారు' అని వివరించారు.


నితీశ్ కుమార్ రెడ్డి

ఐపీఎల్‌లో విలువ పెరిగింది


మయాంక్ యాదవ్

‘అన్‌క్యాప్డ్’ నుంచి ‘క్యాప్డ్’గా మారిన నితీశ్ కుమార్ రెడ్డి, మయాంక్ యాదవ్

కొనసాగిస్తే కనీస విలువ రూ.11 కోట్లు ● ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకుంటాయో లేదో!

భారత క్రికెట్ జట్టు తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాలనేది ప్రతీ యువ క్రికెటర్ కల. ప్రతిభకు తోడు శ్రమ, పట్టుదల, పోరాటంతో సత్తా చాటి గుర్తింపు తెచ్చుకున్న ఇద్దరు కుర్రాళ్లకు ఆదివారం అలాంటి గొప్ప అవకాశం వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, ఢిల్లీ పేస్ బౌలర్ మయాంక్ యాదవ్ బంగ్లాదేశ్‌తో తొలి టి20 మ్యాచ్ ద్వారా అరంగేట్రం చేశారు. ఇప్పుడు ఈ ఇద్దరు ఆటగాళ్ల టీమిండియా తరఫున ‘బ్లూ జెర్సీ’లో ఆడటం మాత్రమే కాదు... వచ్చే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కూడా తమ విలువను అమాంతం పెంచుకున్నారు. వీరిద్దరిని వచ్చే సీజన్ కోసం భారీ మొత్తం చెల్లించి ఆయా ఫ్రాంచైజీలు కొనసాగిస్తాయా అనేది ఆసక్తికరం. – సాక్షి క్రీడా విభాగం

ఐపీఎల్–2025 వేలానికి ముందు ఫ్రాంచైజీలు తాము కొనసాగించే ఆటగాళ్ల పేర్లను వెల్లడించేందుకు ఈ నెల 31 వరకు గడువు విధించారు. ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో నితీశ్ కుమార్ రెడ్డి, మయాంక్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ సిరీస్‌కు ముందు వరకు వీరిద్దరు ‘అన్‌క్యాప్డ్’ ప్లేయర్లే. ఇప్పుడు భారత్‌కు ప్రాతినిధ్యం వహించడంతో ‘క్యాప్డ్’ ప్లేయర్లుగా మారిపోయారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం గత ఐపీఎల్‌లో ఆడి వచ్చే ఐపీఎల్ వేలానికి ముందు భారత్‌కు ఆడితే ‘క్యాప్డ్ ప్లేయర్’గా అతనికి సంబంధించిన వేలం నిబంధనలన్నీ మారిపోతాయి. 2024 సీజన్‌లో నితీశ్ రెడ్డి సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున, మయాంక్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడారు.

నిబంధనలు ఇలా...

ఐపీఎల్–2025 కోసం గరిష్ఠంగా ఆరుగురు ఆటగాళ్లను టీమ్‌కు కొనసాగించేందుకు అవకాశం ఉంది. ఇందులో కనీసం ఒకరైనా ‘అన్‌క్యాప్డ్’ ప్లేయర్ అయి ఉండాలి. కొనసాగించే తొలి ముగ్గురు ప్లేయర్లకు వరుసగా రూ.18 కోట్లు, రూ. 14 కోట్లు, రూ.11 కోట్లు చొప్పున ఫ్రాంచైజీలు చెల్లించాలి. ఆ తర్వాత నాలుగో, ఐదో ఆటగాడికి ఇదే వరస కొనసాగుతుంది. అంటే రూ. 18 కోట్లు, రూ.14 కోట్లు ఇవ్వాలి. ఈ ఐదుగురు అంతర్జాతీయ ప్లేయర్లు అయి ఉంటే ఆరో ఆటగాడు కచ్చితంగా ‘అన్‌క్యాప్డ్’ అవుతాడు. అతనికి కనీసం రూ.4 కోట్లు ఇవ్వాలి. ఐదుగురుని అట్టి పెట్టుకోకుండా ముగ్గురు చాలు అని భావించే ఫ్రాంచైజీలకు అవకాశం ఇచ్చేందుకు కూడా రెండు దశలుగా ఈ మొత్తాలను నిర్ణయించారు.

వీరికి అవకాశం ఉందా...

నితీశ్ రెడ్డి గత ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున మంచి ప్రదర్శనతో గుర్తింపు తెచ్చుకున్నాడు. 142.92 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు చేసిన అతను ఏకంగా 21 సిక్సర్లు బాదాడు. దీని ప్రకారం చూస్తే ‘అన్‌క్యాప్డ్’గా అతడిని కనీసం రూ. 4 కోట్లకు హైదరాబాద్ కొనసాగించే అవకాశం కనిపించింది. అయితే ఇప్పుడు క్యాప్డ్ కావడంతో తొలి ఐదుగురు ఆటగాళ్లలో ఒకరిగా ఎంచుకోవాలి. కమిన్స్, హెడ్, క్లాసెన్, అభిషేక్ శర్మవంటి ఆటగాళ్లు ఉన్న నేపథ్యంలో నితీశ్‌ను కనీసం ఐదో ఆటగాడిగా రూ. 11 కోట్లకు కొనసాగిస్తారా అనేది సందేహమే! అతడిని విడుదల చేసి వేలంలో ‘రైట్ టు మ్యాచ్’ ద్వారా సొంతం చేసుకునేందుకు సన్‌రైజర్స్‌కు మరో అవకాశం ఉంటుంది. మయాంక్ విషయంలో మాత్రం లక్నో సానుకూలంగా ఉండవచ్చు. గత సీజన్‌లో ఆడింది నాలుగు మ్యాచ్‌లే అయినా అతను తన వేగంతో ఎంతో ప్రభావం చూపించాడు. కేవలం 12.14 సగటుతో 7 వికెట్లు తీశాడు. ఇప్పుడు భారత్ తరఫున ఆడిన తర్వాత అలాంటి ఆటగాడిని వదులుకునేందుకు సూపర్ జెయింట్స్ ఇష్టపడకపోవచ్చు. లక్నో మెంటార్‌గా ఉన్న జహీర్ ఖాన్ కూడా మయాంక్‌పై ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. కాబట్టి కనీసం ఐదో ప్లేయర్‌గా రూ.11 కోట్లు చెల్లించి తమతో కొనసాగించవచ్చు. ఇద్దరిలో ఎవరినీ ఇరు జట్లు కొనసాగించకపోయినా...వేలంలోకి వెళితే భారీ మొత్తం లభించేందుకు కూడా ఆస్కారం ఉంది.

కల నిజమైంది: నితీశ్ రెడ్డి

గ్వాలియర్: భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన నితీశ్ కుమార్ రెడ్డి, మయాంక్ యాదవ్ సంతోషం వెలిబుచ్చారు. తమ కెరీర్‌లో ఇది అత్యుత్తమ క్షణంగా అభివర్ణించారు. తమపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎంతో ప్రోత్సహించినట్లు ఈ ఇద్దరు యువ ఆటగాళ్లు వెల్లడించారు. ‘భారత్‌లో క్రికెట్ ఆడే ఎవరికైనా ఇది అద్భుతంలాగే అనిపిస్తుంది. టీమిండియా తరఫున ఆడే అవకాశం రావడంతో నా కల నిజమైనట్లుగా భావించాను. సహజంగానే కొంత ఉత్కంఠ, ఆందోళన ఉన్నా ఆ తర్వాత మెల్లగా ఆటను ఆస్వాదించాను. నాకూ, నా కుటుంబానికి ఇది గర్వకారణమైన క్షణం. టీమ్‌లో చాలా మంది సీనియర్ ఆటగాళ్లతో పాటు కోచింగ్ బృందం నుంచి మంచి మద్దతు లభించింది. బౌలింగ్‌లోనూ నాకు మంచి సూచనలు లభించాయి. కెప్టెన్ సూర్య నాపై ఎలాంటి ఒత్తిడి దరి చేరకుండా ప్రశాంతంగా బౌలింగ్ చేసే అవకాశం కల్పించాడు. తొలి మ్యాచ్ అనిపించకుండా ‘స్వేచ్ఛగా ఆడమని చెప్పాడు’ అని నితీశ్ రెడ్డి వివరించాడు. తొలి మ్యాచ్‌లో మయాంక్ కూడా భావోద్వేగభరితమయ్యాడు. ‘నేను మ్యాచ్ ఆడుతున్నానని తెలియగానే గత నాలుగు నెలలు నా కళ్ల ముందు మెదిలాయి. పైగా గాయం నుంచి కోలుకొని వస్తున్నాను కాబట్టి అదనపు ఒత్తిడి నాపై ఉంది. అయితే కెప్టెన్ సూర్య నేను రనప్ తీసుకుంటున్న సమయంలో నా వద్దకు వచ్చి నువ్వు ఎలా బౌలింగ్ చేయగలనని భావిస్తావో అలాగే చేయి అతని ధైర్యం నింపాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌తో గతంలో పని చేసిన అనుభవం కూడా పనికొచ్చింది’ అని మయాంక్ చెప్పాడు.



క్వార్టర్ ఫైనల్లో భారత జట్లు

అస్తానా (కజకిస్తాన్): ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లకు నేరుగా క్వార్టర్ ఫైనల్లోకి ‘బై’ లభించింది. ఆసియా టీమ్ ర్యాంకింగ్స్‌లో టాప్–6లో ఉన్న జట్లకు నేరుగా క్వార్టర్ ఫైనల్లో చోటు కల్పించారు. ప్రస్తుతం ఆసియా ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల జట్టు ఐదో స్థానంలో, భారత మహిళల జట్టు ఆరో స్థానంలో ఉన్నాయి. నేడు జరిగే మహిళల టీమ్ క్వార్టర్ ఫైనల్లో పటిష్టమైన దక్షిణ కొరియాతో భారత జట్టు తలపడుతుంది. బుధవారం జరిగే పురుషుల టీమ్ క్వార్టర్ ఫైనల్లో భారత ప్రత్యర్థి ఇంకా ఖరారు కాలేదు. పురుషుల టీమ్ విభాగంలో భారత్‌తోపాటు చైనా, దక్షిణ కొరియా, జపాన్, చైనీస్ తైపీ, ఇరాన్ జట్లు... మహిళల టీమ్ విభాగంలో భారత్‌తోపాటు చైనా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు దక్కించుకున్నాయి. భారత్ తరఫున ఈ టోర్నీలో ఆచంట శరత్ కమల్, సత్యన్, మనుష్ షా, మానవ్ ఠక్కర్, హర్మీత్ దేశాయ్, ఆకుల శ్రీజ, మనిక బత్రా, దియా పరాగ్, ఐహిక ముఖర్జీ, సుతీర్థ ముఖర్జీ బరిలో ఉన్నారు. 74 ఏళ్ల చరిత్ర కలిగిన ఆసియా టీటీ చాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు టీమ్ విభాగంలో భారత పురుషుల జట్టు రెండు సార్లు (1957, 1960) రజత పతకం, భారత మహిళల జట్టు ఒకసారి కాంస్య పతకం (1960లో) గెలిచాయి.

నిశేష్ రెడ్డి ఖాతాలో తొలి ఏటీపీ టైటిల్

కాలిఫోర్నియా: భారత సంతతికి చెందిన అమెరికా **యువ టెన్నిస్ ప్లేయర్ నిశేష్** బసవ రెడ్డి తన కెరీర్‌లో తొలి అసోసియేషన్ ఆఫ్ **టెన్నిస్ ప్రొఫెషనల్స్** (ఏటీపీ) చాలెంజర్ సింగిల్స్ టైటిల్ సాధించాడు. **టిబురోన్ ఓపెన్** ఏటీపీ–75 చాలెంజర్ టోర్నీలో 19 ఏళ్ల నిశేష్ చాంపి**యన్‌గా అవ**తరించాడు. ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో నిశేష్ 6–1, **6–1తో** అమెరికాకే చెందిన ఇలియట్ స్పిజిరిపై గెలుపొం**దాడు.** విజేతగా నిలిచిన నిశేష్‌కు 11,200 డాలర్ల (రూ. 9 ల**క్షల** 40 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకిం**గ్** పాయింట్లు లభించాయి. ఈ టైటిల్‌తో నిశేష్ ఏడు స్థానాలు ఎగబాకి ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 192వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన నిశేష్ తల్లిదండ్రులు 1999లో అమెరికాకు వెళ్లి స్థిరపడ్డారు.



నిత్యా పాండ్యా సెంచరీ మిస్

కార్తికేయ, సోహమ్, నిఖిల్ అర్ధ సెంచరీలు

భారత అండర్–19 జట్టు 316/5


నిత్యా పాండ్యా

చెన్నై: **తొలి టెస్టులో సాధించిన విజయం స్ఫూర్తితో... ఆస్ట్రేలియా** అండర్–19 జట్టుతో సోమవారం మొదలైన రెండో టెస్టులోనూ భారత అండర్–19 జట్టు శుభారంభం చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 5 వికెట్లకు 316 పరుగులు సాధించింది. నిత్యా పాండ్యా (135 బంతుల్లో 94; 12 ఫోర్లు) ఆరు పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు. కేపీ కార్తికేయ (99 బంతుల్లో 71; 9 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ సోహమ్ పట్వర్ధన్ (120 బంతుల్లో 61 బ్యాటింగ్; 6 ఫోర్లు), నిఖిల్ కుమార్ (93 బంతుల్లో 61; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. సోహమ్‌తో కలిసి హర్‌వంశ్ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు భారత జట్టు రెండో ఓవర్‌లోనే ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (3) వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నిత్యా పాండ్యా మరో ఓపెనర్ విహాన్ మల్హోత్రా (10)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. రెండో వికెట్‌కు 56 పరుగులు జోడించాక విహాన్ అవుటయ్యాడు. విహాన్ పెవిలియన్ చేరుకున్నాక వచ్చిన కార్తికేయ, సోహమ్, నిఖిల్ సాధికారిక ఆటతో భారత ఇన్నింగ్స్‌ను పటిష్టం చేశారు. ఆస్ట్రేలియా బౌలర్లలో హ్యారీ హోక్‌స్ట్రా రెండు వికెట్లు పడగొట్టాడు.

సింధు పునరాగమనం



నేటి నుంచి ఆర్కిటిక్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

వాంటా (ఫిన్లాండ్): పారిస్ ఒలింపిక్స్ వైఫల్యం మరిచి తదుపరి టోర్నీలో టైటిల్స్ లక్ష్యంగా భారత షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్ తమ రాకెట్లకు పదును పెడుతున్నారు. ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను తాజాగా ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. పారిస్ మెగా ఈవెంట్ తర్వాత వీళ్లిద్దరు బరిలోకి దిగుతున్న తొలి టోర్నీ ఇదే కాగా... మహిళల సింగిల్స్‌లో సింధుకు ఆరో సీడింగ్ కేటాయించగా, పురుషుల ఈవెంట్‌లో లక్ష్య సేన్ అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ సింధు కెనడాకు చెంది మిచెల్లి లీతో తలపడుతుంది. ఇందులో శుభారంభం చేస్తే తదుపరి రౌండ్‌లో భారత టాప్ స్టార్‌కు 2022 జూనియర్ ప్రపంచ చాంపియన్, జపాన్ టీనేజ్ సంచలనం తొమకొ మియజాకి ఎదురవనుంది. పురుషుల సింగిల్స్ తొలిరౌండ్ మ్యాచ్‌ల్లో లక్ష్య సేన్... డెన్మార్క్‌కు చెందిన రస్మస్ గెమ్కేతో తలపడతాడు. గతేడాది ఇండియా ఓపెన్‌లో రస్మస్‌తో ఎదురైన పరాభవానికి ప్రతీకారం తీర్చుకునే అవకాశం లక్ష్య సేన్‌కు ఆరంభరౌండ్లోనే లభించింది. ఈ అడ్డంకిని అధిగమిస్తే భారత ఆటగాడు చైనీస్ తైపీకి చెందిన ఏడో సీడ్ చౌ తియెన్ చెన్‌తో పోటీపడే అవకాశముంటుంది.

షఫీఖ్, మసూద్ సెంచరీలు


షఫీఖ్

భారీ స్కోరు దిశగా పాక్ ● తొలి ఇన్నింగ్స్‌లో 328/4 ● ఇంగ్లండ్‌తో తొలి టెస్టు

ముల్తాన్: బంగ్లాదేశ్‌తో సొంతగడ్డపై వైట్‌వాష్ అయిన పాకిస్తాన్... ఇంగ్లండ్‌తో మొదలైన టెస్టు సిరీస్‌ను సాధికారికంగా ప్రారంభించింది. కెప్టెన్ షాన్ మసూద్ (177 బంతుల్లో 151; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఓపెనర్ అబ్దుల్లా షఫీఖ్ (184 బంతుల్లో 102; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. ఇంగ్లండ్ అనుభవజ్ఞులైన బౌలర్లు ఈ పర్యటనకు దూరంగా ఉండటంతో తొలిరోజు పూర్తిగా ఆతిథ్య జట్టుదే కావడం కూడా పాకిస్తాన్ భారీ స్కోరుకు బాటలు వేసింది. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ తొలిరోజు ఆట ముగిసే సమయానికి 86 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 328 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఆరంభమైన కాసేపటికే పాక్ ఓపెనర్ సయీమ్ అయూబ్ (4)ను అట్కిన్సన్ పెవిలియన్ చేర్చాడు. అయితే ఈ సంబరం ఆవిరయ్యేందుకు ఎంతోసేపు పట్టలేదు. ఇంకో ఓపెనర్ షఫీఖ్‌కు జతయిన కెప్టెన్ మసూద్ ఇంగ్లండ్ బౌలర్లకు మరో అవకాశం ఇవ్వలేదు. ఇద్దరు క్రీజులో పాతుకుపోవడంతో ఇంగ్లండ్ బౌలర్లకు సెషన్ సాగేకొద్దీ కష్టాలే ఎదురయ్యాయి. రెండో సెషన్‌లోనూ పరిస్థితిలో ఏమార్పు లేదు. ధాటిగా ఆడుతున్న మసూద్ 102 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేశాడు. నాలుగేళ్ల తర్వాత మసూద్ టెస్టుల్లో సెంచరీ చేయడం విశేషం. మరోవైపు కెప్టెన్ దూకుడును ప్రదర్శిస్తుంటే ఓపెనర్ షఫీఖ్ మాత్రం ఇన్నింగ్స్ అసాంతం నిలకడను కొనసాగించి సెంచరీ చేశాడు. షఫీఖ్ సెంచరీ సాధించిన కాసేపటికే అట్కిన్సన్ అతన్ని అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 253 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. స్వల్ప వ్యవధిలో కెప్టెన్ మసూద్... జాక్ లీచ్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తర్వాత బాబర్ ఆజమ్ (30; 5 ఫోర్లు), షకీల్ జట్టు స్కోరును 300 పరుగులు దాటించారు. చివర్లో బాబర్‌ను వోక్స్ అవుట్ చేశాడు. ఇంగ్లండ్ బౌలింగ్ దళంలో క్రిస్ వోక్స్, లీచ్‌లకు మాత్రమే పాక్‌లో ఆడిన అనుభవం ఉంది. అరంగేట్రం చేసిన కార్స్, బషీర్, అట్కిన్సన్‌లకు పాక్ పర్యటన కొత్త! పైగా అనుభవలేమి కూడా పాక్ బ్యాటర్లకు బాగా కలిసొచ్చింది.


మసూద్

సాక్షి ప్లస్
మంగళవారం। 8-10-2024





బస్సులోకి ఎక్కేందుకు చిరుత ప్రయత్నం

హఠాత్ పరిణామంతో షాకయిన పర్యాటకులు

బెంగళూరు: బన్నెర్‌ఘట్టలోని నేషనల్ పార్క్‌లో పర్యాటకులకు ఊహించని ఘటన ఎదురైంది. చిరుత ఒకటి సఫారీ బస్సు కిటికీ గుండా ఎక్కడానికి ప్రయత్నించడంతో పర్యాటకులంతా కేకలు వేశారు. మొదట భయపడ్డా.. తరువాత దాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. కొద్దిసేపు ప్రయత్నించిన చిరుత.. ఆ తరువాత ప్రయత్నాన్ని విరమించుకుని నెమ్మదిగా తన ఆవాసం వైపు నడుచుకుంటూ వెళ్లింది. ఆదివారం జరిగిన ఈ ఘటన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వన్యప్రాణులను దగ్గరగా చూసేందుకు సఫారీ డ్రైవర్ ముందుకు రావడంతో ఈ ఘటన చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. సఫారీ వాహనాలన్నింటికీ మెష్ విండోస్ ఉన్నాయని, ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని వెల్లడించారు.



గంటకు 9 కి.మీ.

బిజీ జీవితాన్ని పక్కనపెట్టి.. అత్యంత నెమ్మదిగా ప్రయాణం చేయాలని ఉందా? ప్రకృతిని ఆస్వాదిస్తూ కన్నుల పండుగ చేసుకోవాలనిపిస్తోందా? అయితే మీకు పర్ఫెక్ట్ ఛాయిస్ ఈ రైలు. ఇది గంటకు 9 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణిస్తుంది. ఇంత ఆలస్యంగా వెళ్లే రైలునెవరైనా ఎక్కుతారా? అని సందేహించకండి. పూర్తిగా తెలుసుకుంటే ఎప్పుడెప్పుడు వెళ్దామా అనుకుంటారు.

మనదేశంలో విస్తృతమైన రైల్వే నెట్‌వర్క్ గురించి తెలిసిందే. కానీ అత్యంత నెమ్మదిగా వెళ్లడానికి ప్రసిద్ధి పొందిన ఈ రైలు తమిళనాడులోని నీలగిరి మౌంటైన్ రైల్వేలో ఉంది. ఇది అంత నెమ్మదిగా నడిచినా మీకు ఏమాత్రం బోర్ కొట్టదు. ఎందుకంటే ఈ ప్రయాణాన్ని అత్యద్భుతంగా మలుస్తుంది అక్కడి ప్రకృతి. మెట్టుపాలెం నుంచి ఊటీ వరకు.. దట్టమైన అడవులు, పచ్చని తేయాకు తోటలు, ఎప్పుడూ నిలువెల్లా తడిసి మెరిసే రాతి కొండలు అబ్బురపరుస్తాయి. ఇదంతా ఓకే.. కానీ ఆలస్యానికి కారణం మాత్రం.. అక్కడ ఉన్న వంతెనలు, సొరంగాలు. 100కు పైగా వంతెనల మీదుగా, 16 సొరంగాలలోంచి వెళ్తుంది. అత్యంత తీవ్రమైన మలుపులు వందకు పైనే ఉన్నాయి. మధ్యలో ఐదు స్టేషన్లు కూడా ఉన్నాయి. అందుకే 46 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి ఐదు గంటలు పడుతుంది. ఇది మనదేశంలో అత్యంత వేగవంతమైన రైలు కంటే సుమారు 16 రెట్లు నెమ్మది. కానీ మీరు దారి పొడవునా నీలగిరి కొండల అందాలను ఆస్వాదించవచ్చు. ఊటీ నుంచి తిరిగి వెళ్లేటప్పుడు మాత్రం గంట తక్కువ సమయం తీసుకుంటుంది.

రైలు ప్రయాణానికే కాదు.. ఈ మార్గం నిర్మాణానికో చరిత్ర ఉంది. ఈ మార్గాన్ని 1854లో ప్రతిపాదించారు. కానీ ఎత్తైన పర్వతాలు ఉండటంతో ట్రాక్ నిర్మాణం చాలా కష్టమైంది. 1891లో మొదలుపెట్టి.. 1908లో పూర్తి చేశారు. ఇంతటి గొప్ప ట్రాక్‌మీద ప్రయాణించే రైలుకెంత ప్రత్యేకత ఉండాలో కదా! అందుకే ఈ రైలునూ అలాగే తయారు చేశారు. బోగీలన్నింటినీ కలపతో తయారు చేశారు. మేఘాలను ప్రతిబింబించే నీలి రంగు వేయడంతో వింటేజ్ భావన కలిగిస్తుంది. రైలులో నాలుగు బోగీలుంటాయి. ఫస్ట్ క్లాస్ బోగీలో 72 సీట్లు, సెకండ్ క్లాస్‌లో 100 సీట్లు ఉంటాయి. మొదట మూడు బోగీలే ఉండేవి. పర్యాటకులు పెరగడంతో అదనపు బోగీ ఏర్పాటు చేశారు. సెలవులు, వారాంతాల్లో బిజీగా ఉండే రైలులో ప్రయాణించాలంటే ముందే టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పిటిషన్‌పై సంతకం చేస్తే 47 డాలర్లు

ఓటర్లకు ఎలన్ మస్క్ ఆఫర్

వాషింగ్టన్: భావ ప్రకటనా స్వేచ్ఛకు, ఆయుధాలు ధరించే హక్కుకు మద్దతుగా పిటిషన్‌పై సంతకం చేస్తే 47 డాలర్లు ఇస్తానని టెస్లా అధినేత ఎలన్ మస్క్ ఆఫర్ చేశారు. ట్రంప్‌కు మద్దతుగా పలువురు టెక్ పారిశ్రామికవేత్తలతో ఏర్పాటైన పీఏసీ తమ వెబ్‌సైట్‌లో ఈ పిటిషన్‌ను ఉంచింది. అమెరికాలో తుపాకీ హక్కులకు మద్దతు ఇస్తున్న పీఏసీ.. స్వింగ్ స్టేట్ ఓటర్ల నుంచి 1 మిలియన్ సంతకాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, పెన్సిల్వేనియా, జార్జియా, నెవాడా, అరిజోనా, మిషిగాన్, విస్కాన్సిన్, నార్త్ కరోలినా రాష్ట్రాల్లోని ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఈ పిటిషన్ దాఖలైంది. యునైటెడ్ స్టేట్స్‌లో తుపాకీ హక్కులు ఒక విభజన సమస్యగా ఉన్నాయి. కొంతమంది తుపాకులను సులభంగా పొందడానికి మద్దతు ఇస్తుండగా, తుపాకులు భద్రతకు ముప్పుగా మరికొందరు వాదిస్తున్నారు.

48 ఏళ్లకు తిరిగొచ్చిన జాబ్ అప్లికేషన్

లండన్: లింకన్‌షైర్‌లోని గెడ్నీ హిల్‌కు చెందిన టీజీ హడ్సన్‌కు మోటార్‌సైకిల్ స్టంట్స్ అంటే చాలా ఇష్టం. 1976లో ఓ ప్రకటన చూసి స్టంట్ రైడర్ ఉద్యోగానికి అప్లై చేసింది. దానికి ఎప్పుడెప్పుడు సమాధానం వస్తుందా? అని ఎదురుచూసింది. ఆఫర్ లెటర్ అయితే రాలేదు కానీ.. ఆమె పెట్టిన అప్లికేషన్ మాత్రం 48 ఏళ్ల తరువాత తిరిగొచ్చింది. ఆ లేఖ పైభాగంలో "ఈ లేఖ స్టెయిన్స్ పోస్టాఫీస్‌లో ఓ డ్రా వెనుక కనబడింది. దాంతో దాదాపు 50 ఏళ్లు మాత్రమే ఆలస్యంగా డెలివరీ చేస్తున్నాం" అని చేతిరాతతో రాసిన నోట్ ఉంది. ఇప్పుడు హడ్సన్ వయసు 70 ఏళ్లు. తాను ఎన్నో ఏళ్లపాటు కలలుగన్న తన డ్రీమ్‌జాబ్ తనకు ఎందుకు రాలేదో ఇప్పుడు అర్థమైందని చెబుతోందామె. లండన్‌లోని తన ఫ్లాట్‌లో కూర్చుని లెటర్ టైప్ చేయడం ఇంకా స్పష్టంగా గుర్తుందని, లేఖ తిరిగి రావడం చూసి తన కళ్లను తానే నమ్మలేకపోయానని చెబుతోంది. ఇన్నేళ్లలో తాను ఎన్నోసార్లు ఇళ్లు మారానని, నాలుగైదు విదేశాలు కూడా తిరిగానని అయినా లేఖ తిరిగి తన దగ్గరకు రావడం ఆశ్చర్యం కలిగిస్తోందని చెప్పింది. ఆ ఉద్యోగం రాకపోయినా ఆమె కెరీర్‌కు ఏమాత్రం ఆటంకం కలగలేదు. ఆఫ్రికా వెళ్లి అనేక సాహసోపేత ఉద్యోగాలను చేసింది.

6,500 అడుగుల ఎత్తులో కనిపించిన నెమలి

డెహ్రాడూన్: సాధారణంగా నెమలి ఎత్తైన ప్రాంతాల్లో ఉండదు. అలాంటిది ఉత్తరాఖండ్‌లో 6,500 అడుగుల ఎత్తులో నెమలి కనిపించడం చర్చనీయాంశమైంది. రాష్ట్రంలోని అడవుల్లో రెండుసార్లు కనిపించిందని బాగేశ్వర్ అటవీ విభాగ అధికారి ధ్యాన్‌సింగ్ కరాయత్ తెలిపారు. కప్కోట్ అటవీ రేంజ్‌లో ఏప్రిల్‌లో, కథయత్బారా అడవుల్లో అక్టోబర్ 5న నెమలి కనిపించిందని ఆయన వెల్లడించారు. సాధారణంగా 1,600 అడుగుల ఎత్తులోనే నివసించే నెమలి 6,500 అడుగుల ఎత్తులో కనిపించడం అసాధారణమంటున్నారు వన్యప్రాణి నిపుణులు. హిమాలయ ప్రాంతంలో మానవ కార్యకలాపాలు పెరగడం, పర్యావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందంటున్నారు. పర్వత ప్రాంతాలు సైతం మునుపటిలా చల్లగా లేకపోవడంతో ఈ పక్షులు ఎగరడం సులభమవుతోందని, పర్యావరణ మార్పులు వన్యప్రాణుల వలసలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు.

నీట్-యూజీ లీకేజీ.. లబ్ధిదారులు 144 మంది: సీబీఐ

న్యూఢిల్లీ: నీట్-యూజీ పేపర్ లీకేజీ కోసం 144 మంది అభ్యర్థులు డబ్బులు చెల్లించినట్లు గుర్తించామని సీబీఐ పేర్కొంది. లీకేజీ దందా సూత్రధారులు వీరందరినీ వైద్య కళాశాలల ప్రవేశ పరీక్షకు కొన్ని గంటల ముందు వేర్వేరు ప్రాంతాలకు తరలించి, జవాబులు అందజేశారని తెలిపింది. ఈ మేరకు గత వారం కోర్టులో మూడో చార్జిషీటు వేసింది. జార్ఖండ్ రాష్ట్రం హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూలు ప్రిన్సిపాల్ అహసనుల్ హక్, డిప్యూటీ ప్రిన్సిపాల్ ఇంతియాజ్ ఆలమ్‌తో చేతులు కలిపి పంకజ్ కుమార్ అనే వ్యక్తి పరీక్షాపత్రాన్ని దొంగిలించాడని ఆరోపించింది. లబ్ధిదారులుగా గుర్తించిన మొత్తం 144 మంది అభ్యర్థులపై చర్యలు ప్రారంభించామని పేర్కొంది. ఈ కేసులో కీలక సూత్రధారులు సహా 49 మందిని అరెస్ట్ చేశామని, వీరిలో 40 మందిపై చార్జిషీట్లు వేశామని తెలిపింది.

ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసు.. లాలు, ఆయన కుమారులకు బెయిల్

న్యూఢిల్లీ: ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలెదుర్కొంటున్న ఆర్‌జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్, కుమారులు తేజస్వీ యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్‌లకు ఢిల్లీ హైకోర్టు బెయిలిచ్చింది. ప్రత్యేక కోర్టు జడ్జి విశాల్ గొగ్నె ముగ్గురికీ రూ.లక్ష చొప్పున వ్యక్తిగత పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేశారు. దర్యాప్తు సమయంలో వీరిని అరెస్ట్ చేయరాదని ఆదేశించారు. కోర్టు నుంచి సమన్లు రావడంతో ముగ్గురూ సోమవారం కోర్టులో హాజరయ్యారు. 2004-2009 సంవత్సరాల్లో లాలు రైల్వే శాఖ మంత్రిగా ఉన్న సమయంలో గ్రూప్-డి ఉద్యోగార్థుల నుంచి భూములు తీసుకుని, ఉద్యోగాలిచ్చినట్లు వీరిపై ఆరోపణలున్నాయి.

దుర్గామాతపై గర్బా పాట రాసి, పాడిన మోదీ

న్యూఢిల్లీ: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గా మాతను కీర్తిస్తూ ఓ పాట రాయడంతోపాటు ప్రధాని మోదీ స్వయంగా పాడారు. దీనిని ఆయన సోమవారం 'ఎక్స్'లో షేర్ చేశారు. 'నవరాత్రుల పవిత్ర సమయమిది. ప్రజలు ఆ దుర్గా మాతను భక్తితో వివిధ మార్గాల్లో కొలుస్తున్నారు. ఆ శక్తిమాతకు భక్తితో రాసిన 'ఆవతి కలే'అనే గర్బా పాట ఇది. అమ్మ ఆశీస్సులు మనపై ఎల్లవేళలా ఉండాలి'అని ఆయన పేర్కొన్నారు. పాటను మధురంగా ఆలపించిన వర్ధమాన గాయకురాలు పూర్వ మంత్రిని ఆయన ప్రశంసించారు. గుజరాతీ సంప్రదాయ నృత్యం గర్బా. నవరాత్రి ఉత్సవాల్లో గర్బా నృత్యం చేస్తారు.

మరణశిక్షను ఆపిన సుప్రీంకోర్టు

దోషిలో మార్పుకు అవకాశం ఇవ్వాలన్న కోర్టు

న్యూఢిల్లీ: పద్నాలుగు సంవత్సరాల క్రితంనాటి కిడ్నాప్, హత్య కేసులో దోషిగా తేలిన వ్యక్తికి మారే అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఆ దోషికి హైకోర్టు విధించిన మరణశిక్షను నిలుపుదలచేసింది. 2010లో ఏడేళ్ల పిల్లాడిని కిడ్నాప్‌చేసి చంపిన కేసులో సుఖ్జిందర్ సింగ్‌కు పంజాబ్, హరియాణా హైకోర్టు ఈఏడాది ఆగస్టులో మరణశిక్ష విధించింది. ఈ శిక్షను సవాల్ చేస్తూ దోషి తరఫున లాయర్ హర్వీందర్ సింగ్ మాన్ సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసును సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాల ప్రత్యేక ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ కేసుకు సంబంధించిన శిక్ష తగ్గింపు నివేదికను బెంచ్ పరిశీలించింది. హత్య జరిగిన కాలంలో 23ఏళ్ల వయసులో నిందితుడు విపరీతమైన మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాడని, ఆత్మహత్యకు ప్రయత్నించాడని ఆ రిపోర్ట్‌లో ఉంది. 'ఎంతో మారిపోయిన ఇతను ఇకపై సమాజానికి ఏరకంగానూ హానికరం కాదు. 37 ఏళ్ల వయసులో ఇప్పుడు ఇతనిలో సత్ప్రవర్తన వచ్చింది. ఏకంగా మరణశిక్ష విధించేముందు హైకోర్టు ఇతని మానసిక స్థితిపై తుది అవగాహనకు రాలేదు. రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపే అవకాశం ఇవ్వలేదు' అని నివేదిక పేర్కొంది. 'కుటుంబంలో ఒక్కగానొక్క కుమారుడిని చంపాడు. దీంతో ఆ సామాజిక వర్గంలో ఆగ్రహం పెల్లుబికిందన్న అంశాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. కిడ్నాపర్‌కు పిల్లాడి తండ్రి డబ్బిచ్చినా చంపాడని హైకోర్టు మరణశిక్ష వేసింది' అని నివేదిక వివరించింది. దీంతో కేసు విచారణను 16 వారాలు వాయిదావేసిన సుప్రీంకోర్టు ఈ విషయంలో ప్రొబేషన్ అధికారి నివేదిక ఇచ్చేలా చూడాలని పంజాబ్ సర్కార్‌ను ఆదేశించింది. అమృతసర్ కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా గడిపిన సమయంలో ఇతని మానసిక పరిస్థితి, తోటి ఖైదీలతో ప్రవర్తన గురించి నివేదించాలని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం దోషి మానసిక స్థితిని టెస్టులు చేసి ధృవీకరించాలని చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్‌ను కోర్టు కోరింది.



'సుప్రీం' క్యాంటీన్‌లో ఆహారం వివాదం

- మాంసాహారాన్ని పునఃప్రారంభించడంపై ఓ వర్గం న్యాయవాదుల నిరసన
- నవరాత్రుల సమయంలో తొలిసారిగా మంసాహారాన్ని నిషేధించిన క్యాంటీన్
- నిషేధాన్ని వ్యతిరేకిస్తూ ఓ వర్గం న్యాయవాదుల ఆందోళన, పునఃప్రారంభం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు క్యాంటీన్‌లో ఆహార వివాదం కొనసాగుతూనే ఉంది. మాంసాహార సేవలను పునఃప్రారంభించడం మరింత వివాదానికి దారి తీసింది. ఈ నిర్ణయంపై బార్ అసోసియేషన్‌లోని ఓ బృందం ఆందోళన వ్యక్తం చేసింది. నవరాత్రుల సందర్భంగా క్యాంటీన్‌లో మాంసాహారాన్ని పునఃప్రారంభించడాన్ని నిరసిస్తూ సీనియర్ న్యాయవాది రజత్ నాయర్ లేఖ రాశారు. ఈ నిర్ణయం బార్ బహుళత్వ సంప్రదాయాలకు అనుగుణంగా లేదని, ఒకరిపట్ల మరొకరికి ఉన్న అసహనాన్ని తెలుపుతోందని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ), సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ (ఎస్సీఏఓఆర్ఏ)లకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖను సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న 133 మంది న్యాయవాదులు సమర్థించారు. కాగా, ఇంతకుముందెన్నడూ లేని విధంగా నవరాత్రుల సందర్భంగా కేవలం శాఖాహారాన్ని మాత్రమే అందిస్తామని తొలిసారిగా సుప్రీంకోర్టు క్యాంటీన్ ప్రకటించింది. మాంసాహారాన్ని నిషేధించడాన్ని వ్యతిరేకిస్తూ మరో వర్గం న్యాయవాదులు అక్టోబర్ 1న నిరసన వ్యక్తం చేశారు. నవరాత్రి పండుగ ఈ నిర్ణయం భవిష్యత్‌కు తప్పుడు ఉదాహరణగా నిలుస్తుందని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్సీబీఏ) అధ్యక్షుడు కపిల్ సిబల్‌కు రాసిన లేఖలో న్యాయవాదులు పేర్కొన్నారు. న్యాయవాదుల వర్గం నుంచి తీవ్ర నిరసన రావడంతో సుప్రీంకోర్టు క్యాంటీన్‌లో మాంసాహారాన్ని తిరిగి ప్రారంభించారు. దీంతో వివాదం మళ్లీ మొదటికి వచ్చింది.

ప్రభుత్వం ఏర్పాటులో పీడీపీ మద్దతిస్తే తీసుకుంటాం: ఫరూక్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుండగా నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటులో మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ(పీడీపీ) మద్దతిచ్చేందుకు ముందుకు వస్తే స్వీకరిస్తామని చెప్పారు. తమ మధ్య శత్రుత్వం ఎన్నికల వరకే పరిమితమని వ్యాఖ్యానించారు. పీడీపీ మద్దతు విషయంలో మిత్రపక్షం కాంగ్రెస్ కూడా అభ్యంతరం చెప్పబోదని ఆశిస్తున్నామన్నారు. స్వతంత్రులు అంగీకరించిన పక్షంలో వారి మద్దతునూ స్వీకరిస్తామని వెల్లడించారు. అయితే, ఈ విషయంలో తాము ఎవరి సాయం కోరడం లేదన్నారు. అసెంబ్లీలో ఐదుగురు సభ్యులను లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ విషయంలో సుప్రీంకోర్టుకు వెళతామని ఫరూక్ అబ్దుల్లా స్పష్టం చేశారు. అధికారాలన్నీ లెఫ్టినెంట్ గవర్నర్‌కిస్తే ఇక ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. చక్రం తిప్పాలని చూసే బీజేపీ ప్రయత్నాలను తాము సాగనివ్వబోమని కుండబద్దలు కొట్టారు. ముఖ్యమంత్రి పదవికి రేసులో తాను ఉండబోనని స్పష్టం చేశారు. బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, ప్రజల ముందుంచిన అజెండాను నెరవేర్చడమే తన ఏకైక లక్ష్యమని చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు పూర్తిస్థాయిలో రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలి, ప్రజల సమస్యలను పరిష్కరించే అధికారంతో కొత్త ప్రభుత్వం ఏర్పడాలని ఆయన కోరారు.

గొంతెండిన నదులు

నదుల విషయంలో అత్యంత పొడి ఏడాదిగా నిలిచిన 2023 సంవత్సరం

జెనీవా: విశ్వవ్యాప్తంగా నదులు 2023 సంవత్సంలో అత్యంత పొడి వాతావరణాన్ని చవిచూశాయని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ ప్రకటించింది. ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) తన తాజా నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. చరిత్రలో అత్యంత వేడి సంవత్సరంగా 2023 ఏడాది నిలిచిన విషయం విదితమే. గత ఏడాది నెలకొన్న వేడి వాతావరణం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చాలా నదుల్లో కొన్ని చోట్ల నీటి ప్రవాహం పూర్తిగా కనుమరుగైంది. కొన్ని చోట్ల ఎక్కువ రోజులు నదీప్రవాహం గణనీయంగా తగ్గిపోయింది. "నీటి పరిస్థితి ప్రస్తుతం 'వాతావరణమార్పు' అనే బొగ్గుగనిలో చచ్చిపోతున్న పిచ్చుకలా తయారైంది. ఆకస్మికంగా కుండపోత వర్షాలు, వరదలు, వడగళ్లు, కరువుకాటకాలతో మనకు ప్రకృతి ప్రమాదఘంటికలు వినిపిస్తోంది. ఈ ధోరణి పర్యావరణం, ప్రాణాలు, ఆర్థిక వ్యవస్థల్ని అతలాకుతలం చేయనుంది" అని డబ్ల్యూఎంఓ మహిళా ప్రధాన కార్యదర్శి సెలిస్టే సావ్లో వ్యాఖ్యానించారు. ఎన్నో దేశాల నదులకు జీవధారలైన హిమానీనదాలు కరిగిపోతున్నాయి. గ్లేసియర్లు కరగడం గత యాభై ఏళ్లలో మరీ ఎక్కువైంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ప్రజల దీర్ఘకాల నీటి భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. 'నీటి' చక్ర భ్రమణాలను అనూహ్యంగా మార్చడంలో అధిక ఉష్ణోగ్రతలు పెద్ద పాత్ర పోషిస్తున్నాయి. దీంతో కుంభవృష్టి లేదా కరువు కాటకాలు సాధారణమవుతున్నాయి. ఈ కారణంగా ఏడాదిలో కనీసం నెలరోజులపాటు దాదాపు 360 కోట్ల మంది ప్రజలు నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. 2050 ఏడాదికల్లా ఇలాంటి బాధితుల సంఖ్య 500 కోట్లకు చేరుతుంది" అని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు.

ఉత్తరాఖండ్ జడ్జి వ్యాఖ్యలపై సుప్రీం అసంతృప్తి

న్యూఢిల్లీ: న్యాయవాదులపై అన్యాయంగా, అహేతుకంగా వ్యాఖ్యలు చేసిన ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. గతంలో 2021లో కూడా ఇదే న్యాయమూర్తి ఓ లాయర్ వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను ఖండించిన విషయాన్ని గుర్తు చేసింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం..'ఏ అవసరం లేకున్నా లాయర్లకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన హైకోర్టు జడ్జి తీరును ఖండిస్తున్నాం. 2021 నాటి నీరజ్ గర్గ్ కేసు తీర్పును బట్టి ఈ జడ్జి వైఖరిపై మాకు అవగాహన కలిగింది. అందుకే, తాజాగా మరోసారి ఆ న్యాయమూర్తి తీరుపై మళ్లీ పరిశీలన చేయాల్సిన అవసరం లేదు'అని పేర్కొంది. 2020, 2021లలో ఒక లాయర్ ప్రవర్తనపై ఆ జడ్జి ఇచ్చిన రెండు తీర్పులను పక్కనపెడుతున్నట్లు సెప్టెంబర్ 24వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ జడ్జి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించడంతోపాటు ఉత్తర్వులను పక్కనపెట్టాలంటూ బాధిత లాయర్ వేసిన పిటిషన్‌పై ఈ మేరకు తీర్పు వెలువరించింది.

సరిహద్దుల్లో చైనా డ్రోన్ల సంచారం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం కిన్నౌర్‌లో భారత్-చైనా సరిహద్దులకు సమీపంలో అనుమానాస్పద డ్రోన్లు సంచరిస్తున్నాయని ఆ రాష్ట్ర మంత్రి జగత్ సింగ్ నేగి తెలిపారు. నిఘా, గూఢచర్య కార్యకలాపాల కోసం చైనాయే వీటిని ప్రయోగించి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. పూ బ్లాక్ పరిధిలోని షిప్కి లా, రిషి డోగ్రి గ్రామాల వద్ద ఇవి గత వారం రోజులుగా కనిపిస్తున్నాయని గ్రామస్తులకు సమాచారమిచ్చారని కిన్నౌర్ ఎమ్మెల్యే కూడా అయిన మంత్రి నేగి వివరించారు. పోలీసులు, ఆర్మీ సిబ్బంది కూడా వీటిని గమనించారన్నారు. వాస్తవాధీన రేఖ వెంబడి(ఎల్ఏసీ) కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులపై నిఘా కోసమే వీటిని చైనా పంపి ఉంటుందని తెలిపారు. మన గగనతలం లోపలికి ప్రవేశించినందుకు తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

బెంగాల్ బొగ్గు గనిలో పేలుడు.. ఆరుగురు మృతి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాష్ట్రం బీర్భూమ్‌లోని బొగ్గు గనిలో పేలుడు సంభవించి ఆరుగురు ప్రాణాలు కోల్పోగా ముగ్గురు గాయపడ్డారు. ఉదయం 10.30 గంటల సమయంలో కోల్‌బ్లాక్‌లోని డంప్ యార్డులో జరిగిన ఈ ఘటన అనంతరం సహాయక చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గంగారాంచాక్, గంగారాం చాక్-భదులియా గనుల్లో పేలుళ్లు చేపట్టేందుకు డిటొనేటర్లను ట్రక్కులో తరలిస్తుండగా ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే అనూప్ సాహా తెలిపారు. ట్రక్కు నుంచి పేలుడు పదార్థాలను దించే సమయంలో ముందు జాగ్రత్తలను పాటించకపోవడమే ప్రమాదానికి కారణమన్నారు. బాధితులంతా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే ఏజెన్సీ సభ్యులని చెప్పారు.

గుజరాత్‌లో రూ.120 కోట్ల కొకైన్ పట్టివేత

గాంధీధామ్: గుజరాత్‌లోని కచ్ జిల్లా గాంధీధామ్‌లోని తీర ప్రాంతం వెంబడి ఆదివారం రాత్రి రూ.120 కోట్ల విలువైన 12 కిలోల కొకైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు 10 కొకైన్ ప్యాకెట్లను పట్టుకున్నారు. ఏడాది కాలంలో సరిగ్గా ఇదే ప్రాంతంలో డ్రగ్స్ దొరకడం మూడోసారని ఎస్పీ సాగర్ బగ్మార్ చెప్పారు. స్మగ్లర్లే వీటిని దాచి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్‌లో రూ.130 కోట్ల కొకైన్‌ను, గతేడాది సెప్టెంబర్‌లో 80 కిలోల బరువున్న రూ.800 కోట్ల విలువైన కొకైన్‌ను పట్టుకున్నట్లు ఆయన వివరించారు.

ఆప్ ఎంపీ నివాసాల్లో ఈడీ సోదాలు

జలంధర్: ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజీవ్ అరోరా తదితరుల ఇళ్లపై సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులు దాడులు చేపట్టారు. భూ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై మొత్తం 16 చోట్ల దాడులు చేశామని ఈడీ వర్గాలు తెలిపాయి. ఎంపీ అరోరాకు చెందిన పంజాబ్‌లోని లూధియానా, హరియాణాలోని గురుగ్రామ్‌లలో ఇళ్లలో సోదాలు చేసినట్లు పేర్కొన్నాయి. అదే విధంగా, రియల్ ఎస్టేట్ వ్యాపారి హేమంత్ సూద్‌తోపాటు జలంధర్‌లోని చంద్రశేఖర్ అగర్వాల్‌కు చెందిన ఇళ్లపైనా తనిఖీలు జరిగాయంది. అయితే, ఈడీ సోదాలు ఎందుకు జరిగాయనే విషయం తనకు తెలియదని అరోరా తెలిపారు. అధికారుల విచారణకు సహకరిస్తానన్నారు. తమ పార్టీని ముక్కలు చేసే ప్రయత్నంలో భాగంగానే ఈ దాడులు జరిగాయని ఆప్ నేత మనీశ్ సిసోడియా ఆరోపించారు. దర్యాప్తు విభాగాలను రాజకీయ ప్రయోజనాల కోసం మోదీ వాడుకుంటున్నారన్నారు. ఆప్‌ను ఎన్నికల్లో ఓడించలేకనే ప్రధాని మోదీ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై పిటిషన్

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు రెండు నెలల్లోగా రాష్ట్ర హోదా పునరుద్ధరించేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని కోరుతూ సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. రాష్ట్ర హోదా ఇవ్వడం ఆలస్యమయ్యేకొద్దీ ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వం స్థాయి తగ్గుతుందని పిటిషనర్లు జహూర్ అహ్మద్ భట్, ఖుర్షీద్ అహ్మద్ మాలిక్ పేర్కొన్నారు. సమాఖ్య స్ఫూర్తికి ఇది విరుద్ధమన్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయిన విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు. 2024 సెప్టెంబర్ కల్లా కశ్మీర్‌లో ఎన్నికలు జరపాలని, సాధ్యమైనంత త్వరగా రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు 2023 డిసెంబర్‌లో కేంద్రాన్ని ఆదేశించడం తెలిసిందే. కశ్మీర్‌కు చెందిన భట్ విద్యావేత్త కాగా, మాలిక్ సామాజిక కార్యకర్త.

వంటింట్లో రాహుల్..!

న్యూఢిల్లీ/పుణె: ఇటీవల మహారాష్ట్రలో ఓ దళితుని ఇంటికి వెళ్లినట్లు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. వారికి వంటలో సహకరించానని, కలిసి భోజనం చేశానని చెప్పారు. వారు చెప్పే విషయాలు ఎంతో ఆసక్తి కలిగించాయని తెలిపారు. దళితుని ఇంట్లో గడిపిన వీడియోను సోమవారం రాహుల్ 'ఎక్స్'లో షేర్ చేశారు. కొల్హాపూర్‌కు చెందిన అజయ్ తుకారాం సనాడే, అంజనా తుకారాం సనాడే దంపతుల ఆహ్వానం మేరకు రాహుల్ వారింటికి వెళ్లారు. ఒక మధ్యాహ్నం వారితో గడిపారు. వంటింట్లో వారితో కలిసి పచ్చి బఠాణీల కూర, వంకాయ కందిపప్పు కూర వండటంలో సాయ పడినట్లు చెప్పుకున్నారు. 'దళితులు ఏం తింటారు? ఎలా వండుకుంటారు? వాళ్ల వంటగది ఎలా ఉంటుంది? అనే విషయాలు ఇప్పటికీ చాలా మందికి తెలియదు. ఈ విషయాలకు సామాజిక, రాజకీయ ప్రాముఖ్యం ఎంతో ఉంది. నాకు ఎంతో ఆసక్తి కలిగించాయి'అని రాహుల్ పేర్కొన్నారు. దళితులుగా వారు ఎదుర్కొంటున్న కుల వివక్ష తాలూకా అనుభవాలను షాహు పటోలెతోపాటు, అజయ్ తుకారాం, అంజనా తుకారాం దంపతులు తనకు వివరించారన్నారు. మరాఠ్వాడా ప్రాంతంలో దళితుల వంటలపై షాహు పటోలె మరాఠాలో రాసిన పుస్తకం ఇంగ్లిష్‌లోకి కూడా అనువదించారని రాహుల్ తెలిపారు. ఆ పుస్తకంలోని వంటల గురించి పటోలె తనకు వివరించారన్నారు. అసలు దళితుల ఆహారంలో ఏం ఉంటాయనే విషయం ఇప్పటికీ కూడా చాలా మందికి తెలియదని పటోలె చెప్పారన్నారు.



వంటింట్లో అజయ్ తుకారాం సనాడేకు సాయపడుతున్న రాహుల్ గాంధీ

సాక్షి ప్లస్
మంగళవారం । 8-10-2024

వీరోచితంగా పోరాడిన సమ్మక్క



ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకర విధానం అమలైంది. ఇది ఒక రకమైన జాగిర్దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనాధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనేవారు. వీరు నిర్ణీత మొత్తంలో సైన్యాన్ని పోషించి, యుద్ధ సమయంలో చక్రవర్తికి తోడ్పడేవారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

చరిత్ర

కాకతీయుల సామంతులు

నతవాడి వంశం

నందిగామ, మధిర తాలూకాలు, మహబూబాబాద్, జనగామ తాలూకాలు నతవాడి రాజ్యపరిధిలో ఉండేవి. ఈ రాజ్యాన్ని నతవాడి వంశం పాలించింది. ఈ వంశీయులు మొదట కల్యాణీ చాళుక్యుల సామంతులుగా ఉండి తర్వాత కాకతీయుల సామంతులయ్యారు.

ఈ వంశానికి ఆద్యుడు బేతరాజు. ఇతడు కాకతీయ రెండో ప్రోలరాజుకు తన కూతురునిచ్చి వివాహం చేశాడు. ఇతడి కుమారుడైన దుర్గరాజు(1104-1157) కల్యాణీ చాళుక్య ఆరో విక్రమాదిత్యుడికి, మూడో సోమేశ్వరుడికి సామంతుడిగా పనిచేశాడు. దుర్గరాజు కుమారుడైన బుద్ధరాజును కాకతి రుద్రదేవుడు, మహాదేవుడు నతవాడి పాలకుడిగా నియమించారు. ఇతడి పెద్ద కుమారుడు రుద్రుడు. కాకతి మహాదేవుడు ఇతడికి తన కూతురునిచ్చి వివాహం చేశాడు. బుద్ధరాజు రెండో కుమారుడు వక్కడి మల్లరుద్రుడు. ఇతడు గణపతిదేవుడి సోదరి అయిన మైలాంబను వివాహం చేసుకున్నాడు. రుద్రమదేవి కాలం వరకు నతవాడి రాజులు కాకతీయ సామంతులుగా పనిచేశారు.

గోనవంశం

రుద్రదేవుడు కందూరి చోడులను పానుగల్లు, దేవరకొండ ప్రాంతాలకు పరిమితం చేసినందువల్ల వారు వర్ధమానపురాన్ని విడిచి వెళ్లారు. మళ్లీ రుద్రదేవుడే వర్ధమానపురం (కందూరినాటి) పాలకుడిగా గోన బుద్ధరాజు(రంగనాథ రామాయణ కర్త)ను నియమించి ఉంటాడని భావిస్తున్నారు. అతడి కుమారుడైన గోన గన్నారెడ్డి గణపతిదేవుడి వల్ల వర్ధమానపుర రాజ్యాన్ని తిరిగి పొందాడు. ఇతడి తమ్ముడు విఠల నరేంద్రుడు. వీరిద్దరూ యాదవ రాజులు ఆక్రమించిన ఆదవాని, తుంబుశాలను జయించి రాయచూరు దుర్గాన్ని ఆక్రమించారు. విఠలుడు హోళవ, మాణువ రాజ్యాలను జయించాడు. కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ప్రదేశాన్ని ఆక్రమించి దక్షిణాంధ్ర భూభాగాలను కాకతీయ సామ్రాజ్యంలో కలిపాడు. గోన గన్నారెడ్డి సోదరి కుప్పాంబిక. ఆమె భర్త మల్యాల గుండ దండాధీశుడు. గోన గన్నారెడ్డి తర్వాత ఇతడు వర్ధమానపుర పాలకుడయ్యాడు. ఇతడు 1245-46లో వర్ధమానపుర శాసనం వేయించాడు. 1259లో బూదపూర శాసనం, 1272లో మరో శాసనం వేయించాడు. ఇతడి మరణానంతరం భార్య కుప్పాంబిక తన భర్త పేరు మీద 1276లో గుండేశ్వరాలయం నిర్మించి శాసనం వేయించింది. ఇందులో ఆమె చిన్న తమ్ముడు గోనబుద్ధయ, గోన విఠయ కుమారుడు గుండయ గురించి పేర్కొన్నారు.

వావిలాల వంశం

వీరు రెడ్డి వంశస్థులు. రుద్రమదేవి కాలంలో ఆమనగల్లు, వంగూరు విషయాల (సీమ) పాలకులుగా ఉన్నారు. చెరకు రెడ్లతో వీరికి వివాహ సంబంధాలు ఉన్నాయి.

కాయస్థ వంశం (1239-1304)

మహారాష్ట్ర నుంచి వచ్చి స్థిరపడిన కాయస్థ వంశస్థుల్లో ఆద్యుడు గంగయ సాహిణి(1239-1257). ఇతడు కాకతి గణపతిదేవ చక్రవర్తికి సామంతుడు, ఆప్తుడు, అశ్వసైన్యాధిపతి. ఇతడి సువిశాల రాజ్యంలో మార్జవాడి, పలనాడు, కడప మొదలైన ప్రాంతాలతో పాటు, నల్లగొండ జిల్లాలోని పానగల్లు కూడా ఉండేవి. ఇతడి రాజధాని కడప జిల్లా వల్లూరు. దేవగిరి యాదవ రాజు ఆజ్ఞ మేరకు అతడి సామంతుడైన దామోదరుడు కాకతీయ భూభాగాలను ఆక్రమించాడు. గణపతిదేవుడి ఆజ్ఞతో గంగయ సాహిణి దామోదరుణ్ని ఓడించాడు. దీంతో గణపతిదేవుడు అతడికి మహామండలేశ్వర పదవిని ఇచ్చాడు.

గంగయ సాహిణి తర్వాత అతడి మేనల్లుడైన జన్నిగదేవుడు గణపతిదేవుడు, రుద్రమదేవి వద్ద సామంతుడిగా పనిచేశాడు. ఇతడి రాజ్యంలో నల్లగొండ మండలం అంతర్భాగంగా ఉండేది. ఇతడి సోదరుడు త్రిపురాంతకుడుకూడా సామంతుడే. తర్వాత ఇతడి సోదరుడు అంబదేవుడు(1275-1302) స్వతంత్రించి కాకతీయులకు శత్రువయ్యాడు. అంబదేవుడి రాజ్యంలో నల్లగొండ జిల్లాలోని కృష్ణానది ఉత్తర ప్రాంతాలు, దోర్నాల ఉండేవి. ఇతడి కుమారుడైన రెండో త్రిపురాంతకుడి కాలంలో ఈ రాజ్యం కాకతీయ రాజ్యంలో కలిసిపోయింది.

సమ్మక్క సారక్క

పగిడిద్దరాజు, సమ్మక్క-సారక్కల తిరుగుబాటు వృత్తాంతానికి చారిత్రక ఆధారాలు లేవు. కానీ శతాబ్దాల నుంచి వీరి గాథలు ప్రజల్లో ప్రచారంలో ఉన్నాయి. వాటి ప్రకారం..

గోదావరి తీర ప్రాంతమైన మేడారం పరగణాను కోయ తెగకు చెందిన పగిడిద్దరాజు పాలించేవాడు. ఇతడు ప్రతాపరుద్రుడి సామంతుడు. కరీంనగర్ రాజధానిగా పాలించే మరో కోయ రాజైన మేడరాజు తన కుమార్తె సమ్మక్కను పగిడిద్దరాజుకిచ్చి పెళ్లి చేశాడు. సారలమ్మ, నాగులమ్మ, జంపన్నలు వారి సంతానం. కొన్నాళ్లకు మేడారం పరగణాలో నాలుగేళ్లపాటు తీవ్రమైన కరువు వచ్చింది. ప్రజలు పన్నులు కట్టలేని దుస్థితి తలెత్తింది. దీంతో పగిడిద్దరాజు కూడా ప్రతాపరుద్రుడికి పన్నులు కట్టలేదు. దీన్ని ధిక్కారంగా భావించిన ప్రతాపరుద్రుడు మంత్రి యుగంధరుడి ఆధ్వర్యంలో అతడిపైకి పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపాడు. మేడారం సమీపంలోని సంపెంగవాగు వద్ద పగిడిద్దరాజు సైనికులు కాకతీయ సైన్యంతో వీరోచితంగా పోరాడారు. ఆయుధ బలం, సంఖ్యాబలం ఉన్న కాకతీయ సైన్యాన్ని నిలువరించలేక పగిడిద్దరాజుతో సహా ఆయన బిడ్డలు సారలమ్మ, నాగులమ్మ, అల్లుడు గోవిందరాజు వీరమరణం పొందారు. ఈ పరాజయాన్ని భరించలేక పగిడిద్దరాజు కుమారుడైన జంపన్న వాగులోకి దూకి చనిపోయాడు. అప్పటి నుంచి ఈ వాగుకు జంపన్నవాగు అని పేరొచ్చింది. పగిడిద్దరాజు భార్య సమ్మక్క కాకతీయ సేనతో పోరాడుతుండగా, ఒక సైనికుడు దొంగచాటుగా వచ్చి బల్లెంతో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన సమ్మక్క ప్రస్తుతం జాతర జరుగుతున్న స్థలంలో నేలకొరిగింది. లక్షలాది మంది పూజలందుకుంటున్న ఈ వీరుల గాథలు, కథనాల్లో చిన్న చిన్న తేడాలున్నాయి. కాకతీయులకు, ఆదివాసీలకు యుద్ధం జరగడానికి సహజవనరుల పంపకాల వివాదం కారణమని కొన్ని కథనాలు, కప్పం చెల్లించకపోవడం కారణమని ఇంకొన్ని కథనాలు చెబుతున్నాయి. వీరి నుంచి కాకతీయులు కప్పం వసూలు చేశారనడానికి ఆధారాల్లేవని చరిత్రకారులు తెలిపారు. కానీ ఎక్కువ కథలు అదే కారణమని చెబుతున్నాయి. కాకతీయులు రాష్ట్ర కూట వంశం వారు కాదని పులింద జాతికి చెందిన వారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఈ యుద్ధానికి పుళింద, కోయజాతి వైరం కారణమా? కప్పమే కారణమా? అన్నది పరిశోధించి తేల్చాల్సి ఉంది.

కాకతీయ యుగ విశేషాలు

పాలనా విధానం: కాకతీయుల ప్రభుత్వం సంప్రదాయ రాచరికం. సాధారణంగా రాజ్యం తండ్రి నుంచి కుమారుడికి వారసత్వంగా సంక్రమిస్తుంది. కుమార్తెకు కూడా ఆ హక్కు కల్పించడం కాకతీయ వంశంలోనే జరిగింది. సిద్ధాంత రీత్యా అధికారం అంతా రాజుదే. కానీ ఆచరణలో రాజ్యాధికారానికి కొన్ని పరిమితులు ఉండేవి. పాలనలో రాజుకు సహకరించేందుకు మంత్రి పరిషత్తు ఉండేది. వర్ణధర్మం, కులధర్మం, ఆచారం, సంప్రదాయం, శాస్త్ర నియమాలు రాజుకైనా అనుల్లంఘనీయాలు. నాటి శాసనాల్లో చాతుర్వర్ణ సముద్ధరణ అనే బిరుదు తరచుగా కనిపిస్తుంది. నిర్ణీత సమయంలో రాజు ప్రజలకు దర్శనం ఇవ్వాలని రుద్రదేవుడి నీతిసారం తెలుపుతోంది. కాకతీయులు ఆరోగ్యశాలలు, ప్రసూతి ఆసుపత్రులు, కళాశాలలు, మఠాలు, సత్రాలు, చలివేంద్రాలను నెలకొల్పారు.

కాకతీయుల మంత్రులలో అన్ని కులాల వారు ఉండేవారు. కాకతీయులు కులాన్ని బట్టికాక వ్యక్తుల అర్హతలను బట్టి మంత్రి పదవులు ఇచ్చారు. గణపతిదేవ చక్రవర్తికి రేచర్ల రుద్రారెడ్డి, మల్యాల హేమాద్రిరెడ్డి ప్రధానులు. ప్రతాపరుద్రుడికి ముప్పిడి నాయకుడు మహా ప్రధాని. ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకర విధానం అమలైంది. ఇది ఒక రకమైన జాగిర్దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనాధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనేవారు. నాయంకరులు దుర్గాధ్యక్షులు. వారి మండలంలో వచ్చే ఆదాయంతో నిర్ణీత సైన్యాన్ని పోషించి, యుద్ధ సమయంలో చక్రవర్తికి తోడ్పడేవారు. ప్రతాపరుద్రుడు తన రాజ్యంలో నాలుగో వంతు భూమిని నాయంకరుల ఆధీనంలో ఉంచాడు. ప్రతాపరుద్రుడి కాలంలో 75 మంది నాయంకరులున్నారు. కాకతీయరాజ్య పతనం తర్వాత విజయనగర రాజులు నాయంకర విధానాన్ని అనుసరించారు. ఆంగ్లేయులు పాలన చేపట్టే వరకూ ఈ విధానం కొనసాగింది. కాకతీయులకు పూర్వీకులైన చోళులు, చాళుక్యులు కేంద్రీకృత పాలనా విధానాన్ని అనుసరించారు. అందుకు భిన్నంగా కాకతీయులు వికేంద్రీకృత పాలనా వ్యవస్థను అమలు పరిచారు. అందుకే మాండలికులు, నాయంకరులకు సైనిక విషయాలు మినహా పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. వారిపై అధికారాన్ని రుద్దలేదు. అణచి ఉంచే పద్ధతిని విడిచిపెట్టారు. వీరు తమను మహామండలేశ్వరులుగానే భావించారు తప్ప, రాజాధిరాజుగా, చక్రవర్తిగా భావించలేదు. ఒక రకంగా ఇది ప్రజాస్వామిక భావన.

నాయంకరుల్లో తెలంగాణకు సంబంధించిన కొందరి వివరాలు:

యాదవ విశ్వనాథుడు గణపతిదేవుడి కాలంలో యుద్ధాల్లో పాల్గొన్నాడు. నల్లగొండ జిల్లాలో ఒక ప్రాంతాన్ని పరిపాలించాడు. అక్షయ చంద్రదేవుడు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించాడు. సారంగపాణి దేవుడనే యాదవరాజు పానగల్లును పాలించాడు. సింద కుటుంబానికి చెందిన భైరవుడు రుద్రమ కాలంలో బీదర్ ప్రాంతాన్ని పాలించాడు. పరిపాలనా సౌలభ్యం కోసం కాకతీయ సామ్రాజ్యాన్ని స్థలం, సీమ, వాడి, నాడు, పాడి, భూమి అనే ప్రాంతీయ విభాగాలుగా విభజించారు. 10 నుంచి 60 గ్రామాల సముదాయాన్ని స్థలంగా వ్యవహరించేవారు. కొన్ని స్థలాల సముదాయమే నాడు. ఉదాహరణ: అనుమకొండనాడు, కందూరునాడు, సబ్బినాడు, అయిజనాడు.

ఆయగార్లు

గ్రామపాలనను ఆయగార్లు నిర్వహించేవారు. గ్రామసేవ, రాజ్యసేవ చేసినందుకు పన్ను లేకుండా వీరు భూమిని పొందేవారు. ఆయం అంటే పొలం వైశాల్యం. సాధారణంగా ఆయగార్ల సంఖ్య పన్నెండు. వారు
1. కరణం, 2. రెడ్డి, 3. తలారి 4. పురోహితుడు, 5. కమ్మరి, 6. కంసాలి, 7. వడ్రంగి, 8. కుమ్మరి 9. చాకలి, 10. మంగలి, 11. వెట్టి, 12. చర్మకారుడు. వీరిలో మొదటి ముగ్గురు ప్రభుత్వ సేవకులు. మిగతా వారు గ్రామ సేవకులు. గ్రామ విస్తీర్ణం, ఆయకట్టు, పోరంబోకు భూమి, తోటభూమి, గడ్డి భూముల విస్తీర్ణం, వ్యక్తుల ఆస్తుల లెక్కలు, దేవాలయ ఆస్తుల లెక్కలు మొదలైన దస్తరం నిర్వహణ కరణం బాధ్యత. కరణం ఇచ్చే లెక్కల ఆధారంగా రాజ్యభాగం(పన్ను)ను వసూలు చేసి ప్రభుత్వానికి అందజేసే బాధ్యత రెడ్డి లేదా పెద కాపుది. గ్రామ రక్షణ బాధ్యత తలారిది. దొంగతనాలు జరిగినప్పుడు నేరస్థులను పట్టుకోవడం, అపహరించిన సొత్తుని తెచ్చి ఇవ్వడం అతడి విధి. అష్టాదశవర్ణాల వారికి సంఘాలుండేవి. వీటిని సమయాలనేవారు.

మాదిరి ప్రశ్నలు

1. రెండో బేతరాజు ఎవరి ద్వారా శైవమతాన్ని అవలంబించాడు?
   1) రామేశ్వర పండితుడు
   2) అప్పయాచార్యులు
   3) పాల్కురికి సోమన 4) బసవేశ్వరుడు
2. కాకతీయుల కాలంలో గ్రామరక్షణ బాధ్యత ఎవరిది?
   1) కరణం 2) పురోహితుడు
   3) రెడ్డి 4) తలారి
3. కాకతీయుల కాలంలో స్థూలంగా ఉన్న పన్నుల సంఖ్య?
   1) 5 2) 7 3) 6 4) 4
4. సెట్టి, కేసరి సముద్రాలను తవ్వించిన కాకతీయ రాజు?
   1) మొదటి బేతరాజు 2) రెండో బేతరాజు
   3) రుద్రదేవుడు 4) గణపతిదేవుడు
5. పాకాల చెరువును తవ్వించింది?
   1) రుద్రదేవుడు 2) జాయపసేనాని
   3) రేచర్ల రుద్రుడు 4) ప్రతాపరుద్రుడు
6. 'రామప్పచెరువు'ను తవ్వించింది?
   1) రేచర్ల రుద్రుడు 2) రుద్రదేవుడు
   3) జాయపసేనాని 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు: 1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 3; 6) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో వివిధ ఉద్యోగాలు

నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన పాన్యాపురంలోని శిశుగృహ, ఆళ్లగడ్డలోని బాలసదనంలో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
- » **పోస్టుల వివరాలు:** డాక్టర్-జనరల్(పార్ట్ టైమ్)-01, ఆయా(మహిళ)-05, ఎడ్యుకేటర్(పార్ట్ టైమ్)-01, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్(జనరల్)-01, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్(జనరల్)-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి ఏడో తరగతి, పదో తరగతి, డిప్లొమా, ఎంబీబీఎస్, డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **గరిష్ఠ వయో పరిమితి:** 42 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం:

- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, సంజీవ నగర్, నంద్యాల చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 11.10.2024.
- » **వెబ్‌సైట్:** https://nandyal.ap.gov.in/

నవోదయ విద్యాలయాల్లో తొమ్మిదో తరగతిలో ప్రవేశాలు

దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో(జేఎన్‌వీ)2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి తొమ్మిదో తరగతిలో లేటరల్ ఎంట్రీకి సంబంధించి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

- » **అర్హత:** విద్యార్థి తప్పనిసరిగా జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లాల్లో నివాసి అయి ఉండాలి. విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.
- » **వయసు:** 01.05.2010 నుంచి 31.07.2012 మధ్య జన్మించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా
- » **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నాపత్రంలో ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథమేటిక్స్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం 2.30 గంటలు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.10.2024.
- » **ప్రవేశ పరీక్ష తేది:** 08.02.2025.
- » **వెబ్‌సైట్:** www.navodaya.gov.in.

భారత పార్లమెంట్ సమావేశాలు

దేనితో ప్రారంభమవుతాయి?



భారత పార్లమెంట్

1. **లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో-ఇండియన్ల రిజర్వేషన్లను ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 2030 సంవత్సరం వరకు పొడిగించారు?**
   1) 101 2) 102 3) 103 4) 104

జ. 4;

వివరణ: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 330, 331, 332, 333 ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో ఇండియన్లకు రిజర్వేషన్లను కల్పిస్తూ, ఇవి 10 సంవత్సరాల పాటు అంటే 1960 వరకు ఉంటాయని ఆర్టికల్-334లో పేర్కొన్నారు. కానీ దీన్ని ఇప్పటికి 7సార్లు పొడిగించారు.

ఇటీవల మోదీ ప్రభుత్వం 126వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టగా పార్లమెంట్ ఆమోదం అనంతరం రాష్ట్రపతి సంతకంతో 2019 డిసెంబర్ 12న 104వ రాజ్యాంగ సవరణ చట్టంగా అమలులోకి వచ్చింది. ప్రస్తుతం ఆర్టికల్ 334 ప్రకారం ఈ రిజర్వేషన్లు 80 సంవత్సరాలపాటు (రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 సంవత్సరం నుంచి) అంటే 2030 వరకు అమలులో ఉంటాయి. ప్రస్తుతం లోక్‌సభలో ఎస్సీలకు 84 స్థానాలు, ఎస్టీలకు 47 స్థానాలు రిజర్వ్ చేశారు.

2. **భారత పార్లమెంట్ తొలిసారిగా ఎప్పుడు సమావేశం అయింది?**
   1) 1952 మార్చి 13 2) 1952 మే 13
   3) 1953 మార్చి 13 4) 1953 మే 13

జ. 2;

వివరణ: భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత రాజ్యసభ 1952 ఏప్రిల్ 3న ఏర్పడింది. లోక్‌సభ 1952 ఏప్రిల్ 17న ఏర్పడింది. ఈ రెండు సభలతో కూడిన భారత పార్లమెంట్ తొలిసారిగా 1952 మే 13న సమావేశం అయింది. భారత పార్లమెంట్ 2002 మే 13న స్వర్ణోత్సవాలు జరుపుకోగా, 2012 మే 13న వజ్రోత్సవ ఉత్సవాలు జరుపుకుంది.

3. **లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య ఎంత?**
   1) 545 2) 550 3) 552 4) 543

జ. 3;

వివరణ: లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 552. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి ఎన్నిక కాగా, 20 మంది కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నికవుతారు. మిగిలిన ఇద్దరు ఆంగ్లో-ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. కానీ ప్రస్తుతం లోక్‌సభలో 543 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి, 13 మంది కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యారు. ఆంగ్లో-ఇండియన్ సభ్యులను నియమించే పద్ధతిని ప్రస్తుతం రద్దు చేశారు.

4. **లోక్‌సభలో అతి తక్కువగా అంటే ఒక్కొక్క స్థానం ఉన్న రాష్ట్రాలు ఏవి?**
   1) సిక్కిం, నాగాలాండ్, గోవా
   2) సిక్కిం, గోవా, మణిపూర్
   3) సిక్కిం, నాగాలాండ్, మిజోరాం
   4) సిక్కిం, మిజోరాం, మణిపూర్

జ. 3;

వివరణ: సిక్కిం, నాగాలాండ్, మిజోరాం రాష్ట్రాల నుంచి లోక్‌సభలో ప్రాతినిధ్యం ఒక్క సీటు మాత్రమే ఉంది. అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల నుంచి ఇద్దరు సభ్యుల చొప్పున ఉన్నారు. లోక్‌సభలో ఎక్కువ సభ్యులు ఉన్న మొదటి మూడు రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్ (80), మహారాష్ట్ర (48), పశ్చిమ బెంగాల్ (42).

5. **రాజ్యసభకు 233 మంది ఎన్నిక ద్వారా వచ్చే సభ్యుల ఎన్నిక విధానం ఏ విధంగా ఉంటుంది?**
   1) సాధారణ మెజారిటీ పద్ధతి, రహస్య ఓటు పద్ధతి
   2) సాధారణ మెజారిటీ పద్ధతి, బహిరంగ ఓటు పద్ధతి
   3) నైష్పత్తిక ప్రాతినిధ్య, రహస్య ఓటు పద్ధతి
   4) నైష్పత్తిక ప్రాతినిధ్య, బహిరంగ ఓటు పద్ధతి

జ. 4;

వివరణ: రాజ్యసభలో 245 మంది సభ్యులు ఉండగా, 233 మందిని రాష్ట్రాల అసెంబ్లీ సభ్యులు ఎన్నుకోగా మిగిలిన 12 మంది సభ్యులను వివిధ రంగాల్లో ప్రముఖులను రాష్ట్రపతి నియమిస్తాడు. వీరి ఎన్నిక నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు బదిలీ పద్ధతిలో బహిరంగ ఓటు విధానం ద్వారా జరుగుతుంది. రాజ్యసభ ఎన్నికల్లో ఓటువేసే ఎం.ఎల్.ఎ. తాను వేసిన ఓటును పార్టీ నియమించిన ఏజెంట్‌కు చూపవలసి ఉంటుంది. క్రాస్ ఓటింగ్‌ను నిరోధించటానికి రాజ్యసభకు 2003 సంవత్సరం నుంచి బహిరంగ ఓటు విధానాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యసభ సభ్యుని ఎన్నిక విధానాన్ని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

6. **పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థి చెల్లించవలసిన డిపాజిట్ ఎంత?**
   1) 10,000 2) 15,000
   3) 20,000 4) 25,000

జ. 4;

వివరణ: లోక్‌సభ లేదా రాజ్యసభకు పోటీచేసే అభ్యర్థి రూ.25,000 డిపాజిట్ చెల్లించాలి. లోక్‌సభ విషయంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రం రూ.12,500 చెల్లిస్తే సరిపోతుంది. రాజ్యసభలో ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి డిపాజిట్ చెల్లింపులో ఎటువంటి మినహాయింపు ఉండదు. పోలై చెల్లిన ఓట్లలో 1/6వ వంతు ఓట్లు వస్తే డిపాజిట్ వాపస్ వస్తుంది. లేనిచో డిపాజిట్ గల్లంతు అవుతుంది.

7. **భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం ఎన్నిసార్లు సమావేశం కావాలి?**
   1) ఒకసారి
   2) రెండుసార్లు 3) మూడుసార్లు
   4) నిర్ణీత కనీస పరిమితి లేదు

జ. 2;

వివరణ: రాజ్యాంగం ప్రకారం భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం రెండుసార్లు సమావేశం కావాలి. ఒక సమావేశానికి మరొక సమావేశానికి మధ్య 6 నెలలకు మించి వ్యవధి ఉండరాదు. కానీ ప్రస్తుతం భారత పార్లమెంట్ సంవత్సరానికి మూడుసార్లు సమావేశం అవుతుంది. అవి
1) బడ్జెట్ సమావేశాలు (ఫిబ్రవరి నుంచి ఏప్రిల్)
2) వర్షాకాల సమావేశాలు (జూలై నుంచి సెప్టెంబర్)
3) శీతాకాల సమావేశాలు (నవంబర్ నుంచి డిసెంబర్)

అదే విధంగా భారత పార్లమెంట్ సంవత్సరానికి గరిష్ఠంగా ఎన్నిసార్లు అయినా సమావేశం కావచ్చు.

8. **కింది ఏ బిల్లుల విషయంలో పార్లమెంట్ ఉభయ సభలకు సమాన అధికారం ఉంది?**
   ఎ) సాధారణ బిల్లు
   బి) రాజ్యాంగ సవరణ బిల్లు
   సి) నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లు
   డి) ద్రవ్యబిల్లు
   1) ఎ, బి 2) ఎ, సి
   3) ఎ, బి,సి 4) ఎ, బి, సి, డి

జ. 3;

వివరణ: సాధారణ బిల్లు, రాజ్యాంగ సవరణ బిల్లు, నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లులను పార్లమెంట్ ఉభయసభల్లో దేనిలోనైనా ప్రవేశపెట్టవచ్చు. వీటి విషయంలో రెండు సభల ఆమోదం అవసరం. అదే విధంగా రెండు సభలకు సమాన అధికారాలు ఉన్నాయి. కానీ ద్రవ్యబిల్లు విషయంలో లోక్‌సభకే ఎక్కువ అధికారాలు ఉన్నాయి. స్పీకర్ ఒక బిల్లుని ద్రవ్యబిల్లు అని నిర్ణయించాక రాష్ట్రపతి అనుమతితో దానిని ముందుగా లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెట్టాలి. లోక్‌సభ ఆమోదించిన ద్రవ్యబిల్లుని రాజ్యసభ 14 రోజుల లోపు ఆమోదించాలి. లేనిచో అది ఆమోదించినట్లుగా భావించి రాష్ట్రపతి ఆమోదానికి పంపిస్తారు.

9. **సభలో సభ్యుడు కాకున్న సభకు అధ్యక్షతవహించే వ్యక్తి?**
   1) లోక్‌సభ స్పీకర్
   2) లోక్‌సభ డిప్యూటీ స్పీకర్
   3) రాజ్యసభ చైర్మన్ 4) పై ముగ్గురూ

జ. 3;

వివరణ: భారత ఉపరాష్ట్రపతి పదవీ రీత్యా రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. వాస్తవానికి ఇతను రాజ్యసభ సభ్యుడు కాకున్నప్పటికీ సభకు అధ్యక్షత వహించి బిల్లుల ఆమోదానికి, సభ సజావుగా సాగటానికి కృషి చేస్తాడు. ఇతనికి మాములు సందర్భంలో ఓటు హక్కు ఉండదు. కానీ ఒక బిల్లుకి అనుకూలంగా, వ్యతిరేకంగా సమాన ఓట్లు వచ్చినప్పుడు ఓటు హక్కు ఉంటుంది. దీనినే 'కాస్టింగ్ ఓటు' లేదా 'నిర్ణాయక ఓటు' అని అంటారు.

10. **లోక్‌సభలో అధికారికంగా గుర్తింపు పొందిన తొలి ప్రతిపక్ష నేత ఎవరు?**
    1) జె.బి. కృపలానీ 2) మొరార్జీ దేశాయ్
    3) చరణ్‌సింగ్ 4) వై.బి. చవాన్

జ. 4;

వివరణ: పార్లమెంట్‌లో ఒక పార్టీకి ప్రతిపక్ష హోదా లభించాలంటే ఆయా సభలో 10 శాతం సీట్లను గెలుచుకోవాలి. తొలిసారిగా 1977లో జనతాపార్టీ మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా 154 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ ప్రతిపక్షంగా గుర్తింపు పొందింది. కాంగ్రెస్ నేత వై.బి.చవాన్ అధికారికంగా ప్రతిపక్షనేతగా గుర్తింపు పొందాడు. అదే సంవత్సరం (1977)లో కమలాపాటి త్రిపాఠి రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాడు.

11. **లోక్‌సభకు తొలిసారిగా మధ్యంతర ఎన్నిక ఎప్పుడు జరిగింది?**
    1) 1967 2) 1971
    3) 1977 4) 1980

జ. 2;

వివరణ: సాధారణంగా లోక్‌సభ కాల పరిమితి 5 సంవత్సరాలు. కానీ ప్రధాని సలహా ప్రకారం దానిని ముందే రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఆ సందర్భంలో నిర్వహించే ఎన్నికను మధ్యంతర ఎన్నికలు అంటారు. 1967లో ఎన్నికలు జరిగిన నాలుగో లోక్‌సభను ఒక సంవత్సరం ముందు 1971లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ సలహాపై రాష్ట్రపతి వి.వి. గిరి రద్దు చేశాడు. ఈ విధంగా తొలిసారిగా 1971లో మధ్యంతర ఎన్నిక జరిగింది. అనంతరం 1980లో రెండోసారి మధ్యంతర ఎన్నిక జరిగింది. లోక్‌సభకు 18 సార్లు ఎన్నికలు జరిగితే ఇందులో 7 సార్లు మధ్యంతర ఎన్నికలు (1971, 1980, 1984, 1991, 1998, 1999, 2004) జరిగాయి.

12. **ఎంపీల్యాడ్స్ స్కీమ్ కింద ఒక్కొక్క ఎం.పి.కి సంవత్సరానికి నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని కోట్లు ఇస్తున్నారు?**
    1) 1 2) 3 3) 5 4) 10

జ. 3;

వివరణ: పీవీ నరసింహారావు భారత ప్రధానిగా ఉన్నప్పుడు 1993లో ఎంపీల్యాడ్స్ స్కీమ్‌ను ప్రారంభించారు. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్‌గా పిలిచే దీని కింద 1993లో ఒక్కొక్క ఎంపీకి నియోజవర్గ అభివృద్ధికి సంవత్సరానికి 5 లక్షలు కేటాయించారు. దీనిని 1994లో 1 కోటి, 1998లో 2 కోట్లు, 2011 నుంచి 5 కోట్లకు పెంచారు.

13. **ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందిన భారత ప్రధానులు ఎంతమంది ఉన్నారు?**
    1) 2 2) 3 3) 4 4) 5

జ. 2;

వివరణ: పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు పార్లమెంట్ విలువలను పెంపొందించిన వ్యక్తులకు మాజీ హోంశాఖ మంత్రి పండిత్ గోవింద్ వల్లభ్ పంత్ పేరు మీద ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును 1993 నుంచి ఇస్తున్నారు. ఈ అవార్డును 1993లో ఇంద్రజిత్ గుప్తా పొందగా చివరగా 2023 సంవత్సరానికి జాన్ బ్రిట్టాస్‌కు లభించింది. ఈ అవార్డును ముగ్గురు ప్రధానమంత్రులు పొందారు. వారు అటల్ బిహారీ వాజ్‌పాయ్ (1994), చంద్రశేఖర్ (1995), మన్మోహన్ సింగ్ (2002).

14. **ఇప్పటి వరకు లోక్‌సభకు 18 సార్లు ఎన్నికలు జరగ్గా అతి ఎక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ ఎన్నోది?**
    1) 3 2) 5 3) 7 4) 9

జ. 2;

వివరణ: ఐదో లోక్‌సభ 1971లో ఏర్పడింది. దీని పదవీ కాలం 1976 వరకు ఉంది. కానీ ఇందిరా గాంధీ ప్రభుత్వం 1975లో ఎమర్జెన్సీ విధించాక, 42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా 5వ లోక్‌సభ కాల పరిమితిని ఒక సంవత్సరం అంటే 1977 వరకు పొడిగించారు. అదే విధంగా అతి తక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ 12వ లోక్‌సభ. ఇది కేవలం 13 నెలలు (1998-99) మాత్రమే కొనసాగింది. లోక్‌సభ కాల పరిమితిని పెంచే అధికారం పార్లమెంట్‌కు ఉండగా, దానిని ముందే రద్దుచేసే అధికారం రాష్ట్రపతికి ఉంది.

15. **పార్లమెంట్ సభ్యులు ఎన్ని రోజుల పాటు పార్లమెంట్ సమావేశాలకు హాజరు కాకుంటే సభ్యత్వం రద్దు అవుతుంది?**
    1) 30 రోజులు 2) 60 రోజులు
    3) 3 నెలలు 4) 6 నెలలు

జ. 2;

వివరణ: పార్లమెంట్ సభ్యుడు 60 రోజుల పాటు సభాధ్యక్షుని అనుమతి లేకుండా సభకు గైర్హాజరు అయితే సభ్యత్వం కోల్పోతాడు. 1976-77లో తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్యస్వామి ఈ విధంగానే రాజ్యసభ సభ్యత్వం కోల్పోయాడు. అదే విధంగా పార్లమెంట్ సభ్యుడు పార్టీ ఫిరాయింపుకు పాల్పడితే సభాధ్యక్షుడు అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు. అతని ఎన్నిక చెల్లదు అని హైకోర్టు లేదా సుప్రీంకోర్టు తీర్పునిస్తే రాష్ట్రపతి అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
మంగళవారం। 8-10-2024

క్వీన్ ఆఫ్ హిల్ స్టేషన్స్ అని దేన్ని పిలుస్తారు?

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో 'ట్రిపియన్ నైసర్గిక స్వరూపం'గా దేన్ని అభివర్ణిస్తారు?
   1) దక్కన్ పీఠభూమి 2) ఉత్తర మైదానాలు
   3) పశ్చిమ కనుమలు 4) తూర్పు కనుమలు
2. హరిశ్చంద్ర కొండలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
   1) మహారాష్ట్ర 2) గుజరాత్
   3) ఛత్తీస్‌గఢ్ 4) అస్సాం
3. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) అజంతా గుహలు - మహారాష్ట్ర
   2) బాబు బుడాన్ కొండలు - అస్సాం
   3) ఫళని కొండలు - తమిళనాడు
   4) వావుల్ మలై శిఖరం - కర్ణాటక
4. నీలగిరి కొండల్లో ఎత్తైన శిఖరం ఏది?
   1) అనైముడి 2) ఉదక మండలం
   3) దొడబెట్ట 4) కల్సూబాయ్
5. పశ్చిమ కనుమలకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఇవి ఉత్తరాన తపతి నది నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్నాయి
   2) తూర్పు కనుమలతో పోలిస్తే వీటి ఎత్తు తక్కువ
   3) ఇవి పీఠభూమి వైపు కంటే అరేబియా సముద్రం వైపు అధికంగా వాలి ఉంటాయి
   4) ఇవి సుమారు 1600 కి.మీ. పొడవు విస్తరించి ఉన్నాయి
6. జీవ వైవిధ్య ప్రాంతమైన 'సైలెంట్ వ్యాలీ' ఏ రాష్ట్రంలో ఉంది?
   1) కేరళ 2) కర్ణాటక
   3) తమిళనాడు 4) పశ్చిమ బెంగాల్
7. దక్షిణ భారతదేశంలో అత్యంత ఎత్తైన రాష్ట్రం ఏది?
   1) మహారాష్ట్ర 2) తెలంగాణ
   3) గోవా 4) కర్ణాటక
8. 'దిల్వారా దేవాలయం' ఏ పర్వతాల్లో ఉంది?
   1) వింధ్య పర్వతాలు 2) సాత్పూర పర్వతాలు
   3) సహ్యాద్రి పర్వతాలు 4) ఆరావళి పర్వతాలు
9. పశ్చిమ కనుమల్లో, ద్వీపకల్ప పీఠభూమిలో అతి ఎత్తైన శిఖరం ఏది?
   1) గురుశికార్ 2) అనైముడి
   3) సారమతి 4) దూప్‌గఢ్
10. అనైముడి శిఖరం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) కర్ణాటక 2) కేరళ
    3) తమిళనాడు 4) మహారాష్ట్ర
11. పర్వతాలు, ఎత్తైన శిఖరాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    1) ఆరావళి పర్వతాలు - గురుశికార్
    2) అన్నామలై కొండలు - అనైముడి
    3) సాత్పూర శ్రేణులు - దూప్‌గఢ్
    4) రాజమహల్ కొండలు - సారమతి
12. సాత్పూర శ్రేణులు ఏయే నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
    1) నర్మద, సోన్ 2) నర్మద, తపతి
    3) నర్మద, చంబల్ 4) తపతి, చంబల్
13. 'గ్రానరీ ఆఫ్ కేరళ' అని పిలిచే కనుమ ఏది?
    1) బోర్ ఘాట్ 2) థాల్ ఘాట్
    3) బాల్ ఘాట్ 4) పాల్ ఘాట్
14. కొడైకెనాల్ వేసవి విడిది కేంద్రం ఏ కొండల్లో ఉంది?
    1) ఫళని కొండలు 2) నీలగిరి కొండలు
    3) అన్నామలై కొండలు
    4) ఇలైమలై కొండలు
15. వింధ్య పర్వతాలు, సాత్పూర పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
    1) తపతి 2) నర్మద
    3) సోన్ 4) చంబల్
16. సాత్పూర, అజంతా పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
    1) తపతి 2) నర్మద
    3) సబర్మతి 4) గోదావరి
17. మౌంట్ అబూ వేసవి విడిది కేంద్రం ఏ పర్వతాల్లో ఉంది?
    1) సాత్పూర పర్వతాలు 2) వింధ్య పర్వతాలు
    3) సహ్యాద్రి పర్వతాలు 4) ఆరావళి పర్వతాలు
18. 'రూఫ్ ఆఫ్ ది సౌత్' అని ఏ రాష్ట్రాన్ని పిలుస్తారు?
    1) తెలంగాణ 2) ఆంధ్రప్రదేశ్
    3) ఛత్తీస్‌గఢ్ 4) కర్ణాటక
19. భారతదేశాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించే పర్వత శ్రేణులు ఏవి?
    1) ఆరావళి పర్వతాలు
    2) పశ్చిమ కనుమలు
    3) వింధ్య, సాత్పూర పర్వతాలు
    4) సహ్యాద్రి పర్వతాలు
20. 'క్వీన్ ఆఫ్ హిల్ స్టేషన్స్' అని దేన్ని పిలుస్తారు?
    1) మౌంట్ అబూ 2) ఊటీ
    3) కొడైకెనాల్ 4) పచ్మరి
21. పచ్మరి వేసవి విడిది కేంద్రం ఏ కొండల్లో ఉంది?
    1) మహాదేవ్ కొండలు 2) కైమోర్ శ్రేణులు
    3) రాజమహల్ కొండలు 4) ఫళని కొండలు
22. పశ్చిమ కనుమలు, తూర్పు కనుమలు ఎక్కడ కలుసుకుంటాయి?
    1) కార్డయమ్ 2) షెవరాయ్
    3) ఫళని 4) నీలగిరి
23. మైకాల్ పర్వత శ్రేణి ఎక్కడ వ్యాపించి ఉంది?
    1) రాజస్థాన్ 2) తమిళనాడు
    3) హరియాణా 4) ఛత్తీస్‌గఢ్
24. భారత ద్వీపకల్పంలో 'సహ్యాద్రి పర్వత శ్రేణి' అని పిలిచే పర్వత శ్రేణి ఏది?
    1) పశ్చిమ కనుమలు 2) నీలగిరి పర్వతాలు
    3) తూర్పు కనుమలు 4) సాత్పూర పర్వతాలు
25. షెవరాయ్ పర్వతాలు ఏ రాష్ట్రంలో విస్తరించి ఉన్నాయి?
    1) కేరళ 2) కర్ణాటక
    3) తమిళనాడు 4) గుజరాత్
26. హిమాలయ పర్వత వ్యవస్థ ఏ యుగానికి చెందింది?
    1) పూర్వ కేంబ్రియన్
    2) పేలియోజోయిక్ 3) మీసోజోయిక్
    4) టెర్షియరీ
27. ఉత్కళ మైదానంలో ఉన్న ప్రముఖ డెల్టా ఏది?
    1) పెన్నా 2) కావేరి
    3) మహానది 4) గంగానది



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

28. జతపరచండి.

తీరం	రాష్ట్రం
i. సర్కార్ తీరం	a. పశ్చిమ బెంగాల్
ii. వంగ తీరం	b. ఒడిశా
iii. కోరమాండల్ తీరం	c.ఆంధ్రప్రదేశ్
vi. ఉత్కళ తీరం	d. తమిళనాడు

    1) 1-b, ii-c, iii-d, iv-a
    2) 1-c, ii-b, iii-d, iv-a
    3) 1-c, ii-a, iii-b, iv-d
    4) 1-c, ii-a, iii-d, iv-b
29. దివైర్, దేసూరి, పిప్లిఘాట్ తదితర కనుమలు ఏ పర్వత శ్రేణుల్లో ఉన్నాయి?
    1) పశ్చిమ కనుమలు 2) తూర్పు కనుమలు
    3) ఆరావళి పర్వతాలు
    4) వింధ్య, సాత్పూర పర్వతాలు
30. థాల్‌ఘాట్, బోర్‌ఘాట్, పాల్‌ఘాట్ తదితర కనుమలు ఏ పర్వతాల్లో ఉన్నాయి?
    1) వింధ్య పర్వతాలు 2) సాత్పూర శ్రేణులు
    3) పశ్చిమ కనుమలు 4) తూర్పు కనుమలు
31. కల్సూబాయ్ శిఖరం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మహారాష్ట్ర 2) కేరళ
    3) కర్ణాటక 4) తమిళనాడు
32. కేరళలో నీలగిరి కొండల తర్వాత విస్తరించి ఉన్న పశ్చిమ కనుమలను ఏమంటారు?
    1) బాబు బుడాన్ కొండలు
    2) ఇలైమలై పర్వతాలు
    3) పంచమలై కొండలు
    4) కైమూర్ పర్వత శ్రేణి
33. కింది వాటిలో అతి పురాతన ముడుత పర్వతాలు ఏవి?
    1) హిమాలయాలు 2) ఆరావళి పర్వతాలు
    3) పశ్చిమ కనుమలు 4) వింధ్య పర్వతాలు
34. 'గౌరీ శంకర్' శిఖరం ఏ పర్వతాల్లో ఉంది?
    1) హిమాలయాలు 2) సహ్యాద్రి పర్వతాలు
    3) తూర్పు కనుమలు 4) సాత్పూర పర్వతాలు
35. భారతదేశంలోనే ఎత్తైన జోగ్/జొరసొప్పా' జలపాతం ఏ నదిపై ఉంది?
    1) కావేరి నది 2) శివసముద్రం
    3) జోగ్ నది 4) శరావతి
36. తూర్పు కనుమలు ఏ శిలలతో ఏర్పడ్డాయి?
    1) బసాల్ట్, నీస్ 2) గ్రానైట్, బసాల్ట్
    3) ఖొండాలైట్, షిస్ట్
    4) ఖొండాలైట్, చార్నోకైట్
37. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) మెరీనా బీచ్ - తమిళనాడు
    2) కోవలం బీచ్ - కేరళ
    3) మైపాడు బీచ్ - ఆంధ్రప్రదేశ్
    4) గంగాసాగర్ బీచ్ - గుజరాత్
38. కింది వాటిలో తమిళనాడుకు చెందని కొండలు ఏవి?
    1) జువ్వాది కొండలు
    2) మైకాల పర్వతాలు
    3) గొండుమలై కొండలు
    4) పంచమలై కొండలు
39. కేరళలోని తీరాన్ని ఏమంటారు?
    1) కెనరా తీరం 2) కొంకణ్ తీరం
    3) మలబార్ తీరం 4) చోళ తీరం
40. అష్టముడి, వెంబనాడ్ సరస్సులు ఏ తీరంలో ఉన్నాయి?
    1) కోరమండల్ 2) కొంకణ్
    3) మలబార్ 4) వంగ
41. ఆటుపోటులకు ప్రసిద్ధి చెందిన మైదానం?
    1) ఉత్కళ మైదానం 2) గుజరాత్ మైదానం
    3) కొంకణ్ మైదానం 4) కేరళ మైదానం
42. మహారాష్ట్రలోని తీర మైదానాన్ని ఏమని పిలుస్తారు?
    1) మలబార్ మైదానం
    2) వంగ మైదానం 3) కొంకణ్ మైదానం
    4) రాణ్ ఆఫ్ కచ్ మైదానం
43. లూగూన్‌లు, కాయల్స్‌కు ప్రసిద్ధి చెందిన తీరం ఏది?
    1) మలబార్ తీరం 2) ఉత్కళ తీరం
    3) కొంకణ్ తీరం 4) వంగ తీరం
44. దక్కన్ పీఠభూమికి, కొంకణ్ మైదానానికి మధ్య ఉన్న ముఖ్యమైన దారులు ఏవి?
    1) థాల్‌ఘాట్, పాల్‌ఘాట్
    2) పాల్‌ఘాట్, సెన్‌కోట్టై ఖాళీ ప్రదేశం
    3) పాల్‌ఘాట్, బోర్‌ఘాట్
    4) బోర్‌ఘాట్, థాల్‌ఘాట్
45. మహారాష్ట్రలో అతి ఎత్తైన గిరి విహార స్థలం ఏది?
    1) పంచ్‌గని 2) మహాబలేశ్వర్
    3) మతేరాన్ 4) చికల్‌ధానా
46. మలబార్ తీరంలోని వెనక జలాలను ఏమని పిలుస్తారు?
    1) కొర్స్ 2) థరియన్
    3) కాయల్స్ 4) కోస్
47. కళింగ తీర మైదానం ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
    1) పశ్చిమ బెంగాల్ 2) ఆంధ్ర ప్రదేశ్
    3) ఒడిశా 4) కర్ణాటక
48. కింది వాటిలో తూర్పు కనుమలకు చెందని కొండలు ఏవి?
    1) పంచమలై కొండలు 2) షెవరాయ్ కొండలు
    3) పాల కొండలు 4) ఫళని కొండలు
49. 'నిమజ్జిత తీరం' అని దేన్ని పిలుస్తారు?
    1) రాణ్ ఆఫ్ కచ్ తీరం
    2) కోరమండల్ తీరం
    3) మలబార్ తీరం 4) కొంకణ్ తీరం
50. బసాల్ట్ నేలలకు ప్రసిద్ధి చెందిన తీర మైదానం ఏది?
    1) కొంకణ్ మైదానం 2) కెనరా మైదానం
    3) మలబార్ మైదానం 4) వంగ మైదానం
51. యాలకుల కొండలు ఏ రాష్ట్రంలో విస్తరించి ఉన్నాయి?
    1) కర్ణాటక 2) గోవా
    3) కేరళ 4) మహారాష్ట్ర
52. పశ్చిమ కనుమలు.. నీలగిరి కొండలను ఏ ప్రాంతంలో కలుస్తాయి?
    1) గూడూరు 2) గుడలూరు
    3) కొడైకెనాలు 4) కన్యాకుమారి
53. దక్కన్ పీఠభూమి ప్రాంతంలో లభించే ముఖ్యమైన మృత్తిక ఏది?
    1) జేగురు మృత్తికలు
    2) ఒండ్రు మృత్తికలు
    3) ఊబి మృత్తికలు
    4) నల్లరేగడి మృత్తికలు
54. ఎర్ర మృత్తికల్లో ఏ మూలకం ఉండటం వల్ల అవి ఎరుపు రంగులో కనిపిస్తాయి?
    1) పొటాషియం ఆక్సైడ్ 2) ఐరన్ ఆక్సైడ్
    3) మెగ్నీషియం ఆక్సైడ్ 4) నైట్రోజన్ ఆక్సైడ్
55. రూపాంతర ప్రాప్తి శిలలు శైథిల్యం చెందడం వల్ల ఏర్పడిన మృత్తికలు ఏవి?
    1) నల్లరేగడి మృత్తికలు 2) ఒండ్రు మృత్తికలు
    3) ఎర్ర మృత్తికలు 4) లాటరైట్ మృత్తికలు
56. నదీలోయకు దూరంగా ఉండే పురాతన సారవంతమైన నేలలను ఏమని పిలుస్తారు?
    1) టెరాయి 2) భంగర్
    3) భాబర్ 4) కంకర్
57. పత్తి పంటకు ప్రసిద్ధి చెందిన మృత్తికలు ఏవి?
    1) ఎర్ర మృత్తికలు 2) లాటరైట్ మృత్తికలు
    3) అటవీ మృత్తికలు 4) నల్లరేగడి మృత్తికలు
58. లాటరైట్ మృత్తికలకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
    1) వీటిని జేగురు నేలలు అని కూడా పిలుస్తారు
    2) ఇవి అధిక ఉష్ణోగ్రత, అత్యధిక వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో ఏర్పడతాయి
    3) ఈ మృత్తికలు అల్యూమినియం, బసాల్ట్‌లు ఉన్న శిలలు శైథిల్యం చెందడం వల్ల ఏర్పడతాయి
    4) పైవన్నీ సరైనవే
59. బసాల్ట్ శిల విచ్ఛిన్నం చెందడం వల్ల ఏర్పడిన నేలలు ఏవి?
    1) నల్లరేగడి నేలలు 2) లాటరైట్ నేలలు
    3) ఎర్ర నేలలు 4) శుష్క నేలలు
60. భారతదేశంలోని 'నల్ల రేగడి భూమి' ఏ సముదాయానికి చెందింది?
    1) ఒండలి 2) లాటరైట్
    3) పోడ్జల్ 4) చెర్నోజెమ్
61. 'భారతదేశ ధాన్యాగారాలు' అని ఏ నేలలను పిలుస్తారు?
    1) నల్లరేగడి నేలలు 2) ఒండ్రుమట్టి నేలలు
    3) జేగురు నేలలు 4) ఎర్ర నేలలు
62. ఎర్ర మృత్తికలకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలు ఏవి?
    ఎ) ఈ మృత్తికల్లో పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ ఆక్సైడ్‌లాంటి మూలకాలు అత్యధికంగా ఉంటాయి
    బి) ఇవి గాలి పారేటట్లుగా ఉంటాయి
    ఎ) ఈ మృత్తికల్లో నత్రజని, ఫాస్ఫారిక్ ఆమ్లం, సేంద్రియ పదార్థాలు తక్కువగా ఉంటాయి
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి

సమాధానాలు

1) 3 2) 1 3) 2 4) 3 5) 2
6) 1 7) 4 8) 4 9) 2 10) 2
11) 4 12) 2 13) 4 14) 1 15) 2
16) 1 17) 4 18) 4 19) 3 20) 2
21) 1 22) 4 23) 4 24) 1 25) 3
26) 4 27) 3 28) 4 29) 3 30) 3
31) 1 32) 2 33) 2 34) 1 35) 4
36) 4 37) 4 38) 2 39) 3 40) 3
41) 2 42) 3 43) 1 44) 4 45) 2
46) 3 47) 3 48) 4 49) 3 50) 1
51) 3 52) 2 53) 4 54) 2 55) 3
56) 2 57) 4 58) 4 59) 1 60) 4
61) 2 62) 4

Nilesh is from which country?

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Following are the criteria for selection of an officer in ITC.

The candidate must:

i) Have passed HSC examination in first class with at least 60% marks.
ii) Have passed graduation degree in any discipline with at least 55% marks.
iii) Have completed a certificate / diploma / degree course in Computer Science.
iv) Be not less than 21 years or more than 30 years of age as on 01.07.2014

If a candidate satisfies all the above mentioned criteria

except-


(a) At (ii) above but is a postgraduate, the case may be referred to the Executive Director (ED).
(b) At (iii) above but studied Computer Science as one of the subjects of curriculum, the case may be referred to the Vice President (VP).

In each of the following question below, information of one candidate is given. You have to take one of the following five decisions based on the information provided and the criteria and conditions given above. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 01.07.2014. You have to indicate your decision by making to each question as follows: Give answer

1) If the case is to be referred to ED.
2) If the case is to be referred to VP.
3) If the candidate is to be selected.
4) If the candidate is not selected.
5) If the information is inadequate to take a decision.

1. Ruhi is B.Com graduate passed in second class with 56% marks. She had passed HSC in second class with 59% marks. She has also completed a Computer diploma with 56% marks. Her date of birth is 11.05.1988.
2. Rohit is Bsc with Computer science passed in second class with 58% marks. He had passed HSC examination in first class with 76% marks. He completed 25 years of age in December 2013.
3. Joseph has passed BMS degree examination in second class with 58% marks and HSC in first class with 65% marks. He has completed a diploma in Computer Science. He completed 25 years of age in November 2013.
4. Karthik is a BA passed with 63% marks. He had passed HSC examination with 69% marks. He has also completed a certificate course in Computer Science with 'A' grade. His date of birth is 23.09.1990.
5. Osheen is a science graduate passed in 2012 with 47% at the age of 22 years. She has scored 64% marks in HSC. She has also passed MSC with 58% marks. She has done a certificate course in Computers.

Directions (Q. No. 6-10): Study the given information carefully to answer the given questions:



BANK EXAMS
Reasoning

Seven participants Amit, Arjun, Deepak, Hari, Gaurav, Nilesh and Pawan from seven different countries, viz. Algeria, Australia, Belize, Brazil, Bulgaria, Cuba and Fiji, but not necessary in the same order, participate in a dance competition. All of them perform seven different dance style, viz Chhau, Bush, Brukdown, Samba, Horo, Rumba and Gavotte.

The one who perform Brukdown does not belong to Bulgaria. Arjun is from Belize and does not perform Samba. The one who is from Brazil performs Chhau. The one who is from Australia performs neither Samba nor Horo. Amit is from Fiji. Gaurav is from Algeria and perform Rumba dance. Deepak performs Gavotte but he is neither from Cuba nor from Bulgaria. Hari perform Bush and Pawan performs Brukdown.

6. Who performs Samba?
   1) Nilesh 2) Pawan
   3) Gaurav 4) Amit
   5) Deepak
7. Which of the following combination is true?
   1) Algeria - Bush
   2) Bulgaria - Horo
   3) Cuba - Brukdown
   4) Cuba - Rumba
   5) Other than given options
8. Arjun performs which of the following dance?
   1) Samba 2) Chhau 3) Horo
   4) Rumba 5) Gavotte
9. Who is from Australia?
   1) Nilesh 2) Deepak 3) Amit
   4) Pawan 5) Hari
10. Nilesh is from which country?
    1) Algeria 2) Belize
    3) Fiji 4) Brazil
    5) Cannot be determined

Directions (Q. 11-16): Study the following information carefully and answer the question given below:

Eight people P, Q, R, S, T, U, V and W are sitting around a circular table, facing the centre. Each of them is drinking different beverages - Tea, Coffee, Juice, Mineral Water, Lemonade, Cola, Coconut Water and Milk, but not necessarily in the same order. Q is sitting second to the left of U. The person drinking milk is an immediate neighbour of U. Only one person sits between the person drinking mineral water and P. The person drinking coffee is on the immediate right of the person drinking mineral water. W is second to the right of U. S is drinking milk. R and T are immediate neighbours. Neither R nor T is drinking lemonade is on the immediate left of Q. The person drinking cola is second to the right of person drinking coffee. The person drinking coconut water is an immediate neighbour of the person drinking mineral water. R is second to the right of the person drinking tea.

11. Who is second to the right of P?
    1) Q 2) R 3) S 4) T 5) U
12. Who among the following is drinking coconut water?
    1) Q 2) V 3) W 4) U 5) T
13. What is the position of V with respect to the person drinking milk?
    1) Third to the left
    2) Second to the right
    3) Second to the left
    4) Third to the right
    5) Immediate right
14. Four of the following five are alike in a certain way based on the given arrangement and hence form a group. Which of the following does not belong to the group?
    1) Tea - S 2) Juice - W
    3) Mineral water - T
    4) Lemonade - V 5) Cola - U
15. Which of the following person is drinking tea?
    1) P 2) R 3) T 4) V 5) W
16. Which of the following statements is true according to the given arrangement?
    1) The person drinking cola is sitting second to the left of the person drinking Juice.
    2) P is an immediate neighbour of the person drinking Lemonade.
    3) S sits exactly between Q and R.
    4) Only four people sit between W and Q.
    5) All of the given statements are true.

Answers with Explanation:

(1-5)

Candidate	i	ii/a	iii/b	iv
Ruhi	×	√	√	√
Rohit	√	√	√	√
Joseph	√	√	√	√
Karthik	√	√	√	√
Osheen	√	(√)	√	√


1) 4; 2) 3; 3) 3; 4) 3; 5) 1.

(6-10)

Participant	Country	Dance Style
Hari	Bulgaria	Bush
Arjun	Belize	Horo
Nilesh	Brazil	Chhau
Gaurav	Algeria	Rumba
Pawan	Cuba	Brukdown
Amit	Fiji	Samba
Deepak	Australia	Gavotte

6) 4; 7) 3; 8) 3; 9) 2; 10) 4.

(11-16)



11) 2; 12) 4; 13) 2;
14) 3; 15) 1; 16) 1.

ప్రవేశాలు

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ, పీహెచ్‌డీ

సిద్ధిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీలో.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ (హార్టికల్చర్), పీహెచ్‌డీ(హార్టికల్చర్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు:

- ఎంఎస్సీ(హార్టికల్చర్): 30 సీట్లు.
- స్పెషలైజేషన్: ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్, ఏరోమాటిక్ క్రాప్స్.
- అర్హత: బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్/బీఎస్సీ (హార్టికల్చర్)తో పాటు ఐకార్-ఏఐఈఈఏ (పీజీ)-2024 స్కోరు సాధించి ఉండాలి.
- పీహెచ్‌డీ(హార్టికల్చర్): 06 సీట్లు.
- స్పెషలైజేషన్: ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్అండ్ ల్యాండ్ స్కేపింగ్, ప్లాంటేషన్, స్పైసెస్, మెడిసినల్, ఏరోమాటిక్ క్రాప్స్.
- అర్హత: సంబంధిత విభాగంలో ఎంఎస్సీ (హార్టికల్చర్)తో పాటు ఐకార్ ఏఐసీఈ-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)-2024 స్కోరు సాధించి ఉండాలి.
- వయసు: గరిష్ఠ వయోపరిమితి 31.12.2024 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం: విద్యార్హత మార్కులు, జాతీయ స్థాయి పరీక్షల్లో సాధించిన స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, ములుగు, సిద్ధిపేట జిల్లా చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరి తేది: 14.10.2024.
- వెబ్‌సైట్: https://www.skltshu.ac.in/